వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సంపుటి : 12 సంచిక : 10 హైదరాబాద్ 159 అక్టోబర్ 2014 పేజీలు : 68 రు. 20

- తెలంగాణలో ప్రజాస్వామిక హక్కులు
- ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ అణువిద్యుత్ ప్రమాదం
- ఉచిత విద్య అమలయ్యే హామీయేనా?
- మిథ్యగా మారుతున్న ఇంజనీరింగ్ విద్య
- శేషాచలం అడవుల్లో ఖాకీ రాజ్యం
- సంపన్నుల సేవలో మోడీ పాలన
- శ్రీలంక తమిళులపై దురాగతాలు

ఆర్ ఎస్ రావు స్మారకోపన్యాసం, సదస్సు

నవంబర్ 8-9, 2014 శని, ఆదివారాలు

హైదరాబాదులో ఉండడానికి తయారు కండి !

ఆర్.ఎస్. రావు స్మారకోపన్యాసం, సదస్సులకు హాజరు కండి !

అరుదైన మార్క్సిస్టు మేధావి, రాజకీయార్థిక శాస్త్రవేత్త, ప్రజాఉద్యమాల సహచరుడు ప్రొ. ఆర్.ఎస్. రావు (1937-2011) సంస్మరణలో ఆర్.ఎస్. రావు మిత్రులు, వీక్షణం సంయుక్తంగా గత మూడు సంవత్సరాలుగా ఏటేటా స్మారకోపన్యాసం, స్మారక సదస్సు జరుపుతున్న విషయం మీకు తెలిసిందే. ఆర్.ఎస్. రావుకు ఆసక్తి ఉండిన, ప్రజా ఉద్యమాలకూ, సామాజిక చలనానికీ కీలకమైన అంశాల మీద లోతైన విశ్లేషణలు చేసేందుకూ, పంచుకునేందుకూ, విస్తరించేందుకూ ఈ స్మారక కార్యక్రమం జరుగుతున్నది.

ఈ సంవత్సరం కార్యక్రమ ఇతివృత్తం - వ్యవసాయ రంగంలో పరివర్తన - కొత్త నిర్మాణాలు. వ్యవసాయ రంగంలో చాల మార్పులు జరిగిపోతున్నాయని అందరూ గుర్తిస్తున్నదే. కాని ఈ మార్పుల స్వరూప స్వభావాలేమిటి? ఇవి రూపపరమైన మార్పులా, సారంలో మార్పులా? పాత నిర్మాణాలు రద్దవుతూ, మారుతూ ఉన్నప్పుడు వాటి స్థానంలో ఏ కొత్త నిర్మాణాలు రూపొందు తున్నాయి? ఆ కొత్త నిర్మాణాల లక్షణాలేమిటి? ఇటువంటి ప్రశ్నలు అటు రాజకీయార్థిక శాస్త్రవేత్తలను, పరిశోధకులను, ఇటు సామాజిక ఉద్యమకారులను కూడ తీవ్రమైన ఆలోచనలకు గురి చేస్తున్నాయి. ఆర్.ఎస్. రావు ఈ విషయం మీద విస్తృతంగా ఆలోచించి ఎన్నో రచనలు చేశారు. అట్టడుగు గ్రామీణ ప్రాంత వ్యవసాయ రంగ అనుభవాల నేపథ్యం నుంచీ, సిద్ధాంతస్థాయి రాజకీయార్థిక శాస్త్ర అవగాహనల నుంచీ కూడ ఈ సమస్యపై అన్వేషించవలసిందీ, ఆలోచించవలసిందీ, సిద్ధాంతీకరించవలసిందీ, ఆచరణకు అన్వయించవలసిందీ ఎంతో ఉంది. ఆ దిశగా ఒక చిన్న ప్రయత్నం ఈ సంవత్సరం ఆర్ ఎస్ రావు స్మారకోపన్యాసం, సదస్సు కార్యక్రమాలు.

నవంబర్ 8 శనివారం సాయంత్రం ఆర్ ఎస్ రావు స్మారకోపన్యాసం ప్రొ. జి. హరగోపాల్ చేస్తారు.

నవంబర్ 9 ఆదివారం హర్యానా, పంజాబ్, బీహార్, బెంగాల్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అనుభవాల నేపథ్యంలో పరిశోధకులు పత్రాలు సమర్పిస్తారు, ఆలోచనలు పంచుకుంటారు.

అందరూ ఆహ్వానితులే.

ISSN 2231-6892

159

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

అక్టోబర్ 2014
సంపుటి : 12
సంచిక : 10

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

తెలంగాణ : ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; హైదరాబాద్ – డి. విజయభాస్కర్; కరీంనగర్ – జి.యాదగిరి; నల్గొండ – జి. వెంకటేశ్వర్లు; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ఎం. రాజేందర్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఇక్బాల్; నిజామాబాద్ – ఎం. నర్సయ్య; రంగారెడ్డి – వి. శంకరయ్య; వరంగల్ – ఎ.కుమార్. **ఆంధ్రప్రదేశ్ :** అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కడప – కొండ్రాయుడు; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; ప్రకాశం – కర్ణ సతీష్‌బాబు; విశాఖపట్నం – పి.వి. రమణ; శ్రీకాకుళం – ఆర్. శ్రీలత

ప్రింటర్స్
డక్కన్ ప్రెస్ /
చరితా ఇంప్రెషన్స్
ఆజామాబాద్, హైదరాబాద్
ఫోన్ : 040 - 27678411

డిస్ట్రిబ్యూటర్స్
ఆనంద్ ఏజన్సీస్
హైదరాబాద్
ఫోన్ : 98484 28516
92468 26191

‘వీక్షణం’ పేరిట ఎం.ఓ.లు, చెక్కులు, డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం
మైత్రీ రెసిడెన్సీ, 3-6-394,
స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029.
ఫాక్స్, ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు
విడి ప్రతి	రు. 20	రు. 20
సంవత్సరం	రు. 240	రు. 200
మూడు సంవత్సరాలు	రు. 600	రు. 540
ఐదు సంవత్సరాలు	రు. 1000	రు. 900
పది సంవత్సరాలు	రు. 2000	రు. 1700

ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపేవారు మాత్రమే బ్యాంక్ స్లిప్‌లపై ‘veekshanam’ అని రాసి వీక్షణం అకౌంట్ నెంబర్ – **01391101002175** ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్ పేరు మీద వేయాలి. ఇతర బ్యాంకులలో వేసేవారు **ANDB 000/0139** నెంబర్ రాసి వేయవచ్చు.

పాఠకుల వీక్షణం

గౌరవనీయమైన పాఠకులొకరు వీక్షణం పట్ల ఆదరాభిమానాలతో రాసిన లేఖకు మేం చలించిపోయాం. మా కంట తడి పెట్టించి, మా బాధ్యతను పెంచిన లేఖ అది. కాని, వారు అది ప్రచురించవద్దని కోరినందువల్ల పూర్తి పాఠం ప్రచురించలేకపోతున్నాం. అయితే సొంత ఆస్తి, ఆదాయ మార్గం లేని సామాజిక కార్యకర్తగా ఉన్న ఆ పాఠకులు, వారి సహచరులిద్దరు వీక్షణం ఆర్థిక స్థితి గురించిన విజ్ఞప్తి ప్రకటనలు చూసి తమకు వీలైన చోట పట్టు దారపు కకూన్‌లను సేకరించి, అలా సంపాదించిన కూలి డబ్బు రు.500 వీక్షణంకు విరాళంగా పంపించారు. వారి అభిమానానికి, ఔదార్యానికి కృతజ్ఞతలు. – సం.

సెప్టెంబర్ సంచిక వ్యాసాల్లో ప్రణాళికా సంఘాన్ని అంతమొందించడంలో మోడీ ఎత్తుగడలు, వాటి పునాది సవివరంగా వివరించారు సంపాదకీయ వ్యాసంలో. అలాగే... 'పెట్రోకెమికల్ కారిడార్' ఏవిధంగా జాతికి వినాశకరమో రఘురామ్ వ్యాసం సహేతుకంగా అద్దం పడుతుంది.

– విద్యాభూషణ్, హైదరాబాద్

వీక్షణం సెప్టెంబర్ సంచికలో రాసినట్టు ఏ పార్టీ అధికారంలో ఉన్నా, అక్షరసమరంతో ప్రజాపక్షపాతిగా వీక్షణం తన పాత్ర నిరంతరం కొనసాగిస్తున్నందుకు ధన్యవాదాలు. సంపాదకీయంలో పేర్కొన్నట్టు ప్రణాళికా సంఘం 1950 మార్చిలో ఏర్పడినప్పటికీ రాజ్యాంగంలో అందుకు సంబంధించి నిబంధనలేమీ ఏర్పాటు చేయలేదు. అది భారత ప్రభుత్వ కార్యనిర్వాహక తీర్మానం ద్వారా మాత్రమే ఏర్పడింది. పార్లమెంట్ చట్టం ద్వారా ఏర్పడలేదు. కావున దానిని చట్టబద్ధమైన సంస్థగా గుర్తించడానికీ వీలులేదు. (రాజ్యాంగంలోని 280 అధికరణ ఆర్థిక సంఘం గురించి తెలుపుతుంది.) దీన్నిబట్టి అప్పటి ప్రభుత్వాలకు కూడా ప్రణాళికా సంఘం ఏర్పాటులో ఎంత చిత్తశుద్ధి ఉందో శంకించాల్సి ఉంటుంది!

– పి. ముఖేశ్, హైదరాబాద్

వీక్షణం పత్రికలో రోజువారిగా జరుగుతున్న పరిణామాలను తెలిపే సమాచారపు వ్యాసాలే ఉంటున్నాయి. కాని దేశంలోని భూస్వామ్య సంబంధాల్లో వచ్చిన మార్పులను, దేశంలోకి వస్తున్న పెట్టుబడి స్వభావాన్ని, దేశంలోని అస్తిత్వ ఉద్యమాల తీరు తెన్నులపై విశ్లేషణతో కూడిన వ్యాసాలు రావాలి. ఇప్పుడున్న సమాజంలో రకరకాల ప్రభావాలకు లోనవుతున్న నాలాంటి విద్యార్థులకు స్పష్టత ఏర్పడడానికి తోడ్పడుతుందని నా అభిప్రాయం.

– యాదగిరి, కరీంనగర్

కోస్తా కారిడార్ మీద వ్యాసం (సెప్టెంబర్ 2014) చాలా బాగుంది. అవసరమైన విషయాలు తెలిసాయి. 'విద్య కాషాయీకరణ' వ్యాసం కూడా బాగుంది. కాని హిందూ మతోన్మాదం వంటి మాటలు అనవసరంగా వ్యతిరేకత కలిగిస్తాయి కద. అవి వాడకపోతే ఏం? అలాగే, భగవద్గీత చదివితే తప్పేమిటి? ఒక పుస్తకంగా నేను ఎప్పటి నుంచో చదువుతున్నాను. అది పాఠ్యపుస్తకాల్లో పెట్టడం తప్పు ఎలా అవుతుంది?

– కె. కృష్ణారెడ్డి, నెల్లూరు

వీక్షణం సెప్టెంబర్ 14 సంచికలో, రంగనాయకమ్మ వ్యాసం మీద సంపత్ కుమార్ వ్యక్తీకరించిన అభిప్రాయాలను మేము ఖండిస్తున్నాం. వీక్షణం పాఠకుల్లో కూడా కుల, మతాభిమానులు ఉంటారా? అని మాకు ఆశ్చర్యం వేసింది. చీడబట్టిన కుల, మతతత్వ (అది ఏ కులమైనా, ఏ మతమైనా) భావాలతో జీవించేవారికి రంగనాయకమ్మగారి అభిప్రాయాలు ఎప్పటికీ అర్థం కావు. ఇక ఇదే సంచికలో రంగనాయకమ్మవి మొరటు భావాలన్న వెంకటేశ్వర్లు, మనుషులు ఉత్పత్తిలో పాల్గొంటేనే సమాజం ముందుకు సాగుతుందని తెలుసుకోవాలి. కేవలం పొద్దు పోవడానికి కొండలు ఎక్కాలనుకుంటే, పనిపాట లేని వాళ్లు ఎవ్వరైనా ఎక్కచ్చు. కానీ ప్రజల సొమ్ముతో (ప్రభుత్వ సొమ్ము) ఇలాంటి పనులు చేయడం ఎంత వరకు కరెక్ట్? కొత్త మనుషులను కలవడం, కొత్త పుస్తకాలు చదవడం చేయవచ్చు. కొత్త అనుభూతుల కోసం, ఆసక్తుల కోసం ప్రభుత్వ సొమ్ము కావాల్సి వచ్చిందా? ప్రజల డబ్బు ఖర్చు పెట్టడానికి ఇంతకన్నా ముఖ్యమైన సమస్యలు లేవా? ఆ ఇచ్చే డబ్బు ఏదో ఆ ప్రాంతంలో కొండలు ఎక్కే వారి మూటలు మోసే కూలీ వారి సంక్షేమానికి కూడా ఖర్చు పెట్టచ్చు కదా? వీళ్లిద్దరూ రంగనాయకమ్మగారి వ్యాసం చివరి నాలుగు పారాగ్రాఫ్‌లు చదవలేదని మేం భావిస్తున్నాం.

– దశరథ్, నిర్మల్, **మారుతి,** అహ్మదాబాద్

వీక్షణం ఆగస్టు సంచికలో రంగనాయకమ్మ రాసిన 'ఎవరెస్టంత భావ కాలుష్యం' అనే శీర్షిక మీద సంపత్‌కుమార్, రంగనాయకమ్మ కుల మనస్తత్వంతో విషం కక్కింది అని అవహేళన చేశారు. విషం కక్కింది అసలు సంపత్‌కుమారే. ఎందుకంటే అంబేద్కర్ మిషన్ సెక్రటరీ, దళిత జన బాంధవుడు. ఏమాత్రం సామాజిక స్పృహ ఉన్నట్టు లేదు. ఆయనకు వర్గాలు తెలియవు. ఆవిడ ప్రముఖ మార్క్సిస్టు రచయిత. ఆవిడ అగ్రకులాల వాళ్ల బహుమతులకి కూడా వ్యతిరేకం. సాహసాలు చేస్తే, అది వాళ్ల శక్తి సామర్థ్యాల్ని నిరూపించుకుంటారు. గతంలో కరణం మల్లీశ్వరికి అనవసరం అన్నారు. అది గమనించి ఇలాంటి తప్పుడు ప్రకటనలకు పత్రిక సహకరించవద్దు.

– పి. కళావతి, హైదరాబాద్

వీక్షణం పత్రికను రెగ్యులర్‌గా చదువుతుంటాను. నర్సింహ పేరు మీద వచ్చే వ్యాసాలు బాగుంటున్నాయి విషయం చెప్పే విధానంలో. అయితే రచయితకు ఒక దృక్పథం అంటూ ఏమీ లేకుండానే అన్ని వ్యాసాలు అలానే రాస్తున్నారు. రచయితకు ఒక దృక్పథం ఉంటే ఆ దృక్పథం పాఠకులు అంగీకరించవచ్చు. అంగీకరించక పోవచ్చు. రచయిత దృక్పథంతో పాఠకునికి ఏకీభావం ఉంటే ఆ రచయిత దృక్పథాన్ని ప్రచారం చేస్తాడు. లేకుంటే వ్యతిరేకిస్తాడు. ఎందుకంటే సమాజంలో జరిగే సామాజిక మార్పులకు చాలా కారణాలున్నాయి. వాటికి పరిష్కారాలు కూడా ఉన్నాయి. ఇలాంటి విషయాలు చెప్పే వాళ్లు చాలా మంది ఉన్నారు. వాటికి పరిష్కారాలు చూపే వాళ్లు చాలా అరుదు. వినేవాళ్లుంటే చెప్పే వాళ్లు ఏమైనా చెపుతారు. అలాంటి వాళ్లు చాలా మందే ఉన్నారు మన సమాజంలో. రచయిత అక్కడ, ఇక్కడ చూసిన విషయాలతో ప్రారంభించి అలాగే ముగిస్తున్నారు. వాటికి కారణాలనూ, పరిష్కారాలనూ చెప్పడం లేదు. ఇలాంటి రచనలు కాలక్షేపం కోసం చదువుకునే వారికి మంచిగానే అనిపిస్తాయి. ఆచరించే వారికి అయోమయం కలిగిస్తాయి. విషయాలను చెప్పడం ఎంత ముఖ్యమో, వాటికి గల కారణాలను, పరిష్కారాలను చెప్పడం కూడా అంతే ముఖ్యం. అలాంటి రచనలే మంచి రచనలుగా నిలిచిపోతాయి. ప్రతి రచయితకు ఒక అభిప్రాయం, ఒక దృక్పథం ఉంటుంది. అవి ఆ రచయిత రచనలో వ్యక్తం అవుతాయి. ఈ రచయితకు ఇలాంటివి ఏమీ లేవని నాకు అనిపిస్తుంది ఆయన వ్యాసాలు చదువుతుంటే.

– శివాని, మహబూబ్‌నగర్

వీక్షణం సెప్టెంబర్ 2014లో రెండు లేఖలు రంగనాయకమ్మ పైనా అవి ప్రచురించిన ఎడిటర్‌పైనా విరుచుకపడ్డాయి. యథార్థవాదీ లోక విరోధి అన్నట్టు రంగనాయకమ్మ లేవనెత్తిన ప్రశ్నలకు జవాబునీయలేక కులతత్త్వం, బ్రాహ్మణ మనస్తత్వం మొరటు తర్కం అంటూ అదే మార్క్సిజం అయితే మాకు వద్దే వద్దు అంటూ భయపడిపోయారు.

వ్యక్తి సాహసకార్యాలకు రెండు ఉదాహరణలిచ్చి వివరించినా వాటిని పట్టించుకోకుండా, లంబాడి, దళిత కులాలకు చెందిన నిరుపేద తెలంగాణ తెలుగు తేజాన్ని దశదిశలా భారత కీర్తిని ప్రపంచానికి చాటినారని అదే నిజమైన సాహస కార్యమనీ, అడ్డంగా నరకడమనీ, బ్రాహ్మణ మనస్తత్వమనీ అధిక ప్రసంగాలు చేశారు. లోగడ కూడా 'రామాయణ విషవృక్షం' రాసినపుడు, 'గాంధీ, బుద్ధుడు, అంబేద్కరూ చాలరు' అనే పుస్తకాలు రాసినప్పుడు బ్రాహ్మణులూ, అంబేద్కరిస్టులూ ఆమెపై వ్యక్తిగతంగా విరుచుకుపడి, దూషణగా అసలు విషయాన్ని వదిలి పుస్తకాలపై పుస్తకాలు రాసి ప్రచురించారే గాని ఆమె లేవనెత్తిన ప్రశ్నలకు జవాబులు నేటికీ ఇవ్వలేక పోయారు. ఇప్పుడూ అంతే. ఏ స్వార్థ ప్రయోజనాలు ఆశించక చేసే శాస్త్ర ప్రయోగాలకీ, అన్వేషణలకీ ఈ పరుగుపందేల లాంటి వినోద కాలక్షేపాలు, స్వార్థ ప్రయోజనాలు ఆశించిచేసే తప్పుడు గారడీ విద్యలకీ ముడిపెట్టి పర్వతారోహణ పరిశోధన ప్రయోగాలుగా చూపెట్టారు. ప్రభుత్వ పన్నాగాల్ని, మోసాల్ని అర్థం చేసుకోలేక పోగా తేలికగా దోపిడిదారుల బుట్టలో పడ్డారు. యథార్థాన్ని చెప్పిన రచయిత్రినీ, దానిని ప్రచురించిన పత్రికా ఎడిటర్ కులాల్నీ, మతాల్ని ఎద్దేవా చేస్తూ తమ చెవుల్లో దూది పెట్టుకొని, అలాంటి మాటల్ని 'వినమూ, చదవమూ, చూడమూ' అంటూ మూడు కోతుల సామెతను నిజం చేశారు. అది వారి అమాయకత్వమో, అజ్ఞానమో, అహంకారమో నిజాన్ని తెలుసుకోలేని గుడ్డి తనమో కావాల్సిందే గానీ, పత్రికనూ, రచయితనూ దూషించడం తగదు. విషయాన్ని విశ్లేషించి ఖండించాలే గాని వ్యక్తిగత కుల, మత ప్రస్తావనలు చేయకూడదు. వేలం వెర్రిని తప్పుపట్టవచ్చునంటూనే, ఈనాడు చేస్తున్న గణపతి నిమజ్జన వేలం వెర్రినీ, వేలవేల

(మిగతా 47వ పేజీలో...)

వీక్షణం చేస్తున్న కృషి పదికాలాల పాటు కొనసాగాలనే ఆకాంక్షతో పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం నుంచి మిత్రులు గాడి నెహ్రూ స్వచ్ఛందంగా ఇరవై మూడు చందాలు చేర్పించారు. వి. వెంకటరావు, విజయనగరం రు. 100, ఆర్థిక సహాయం అందజేశారు. వారికి కృతజ్ఞతలు. – సం.

వంది మాగధుల భజనకే వంద రోజుల పాలన

రోజు రోజూ నడవడమే గండమైన సినిమాలు వందరోజుల పండుగ జరుపుకోవచ్చు గాని ఐదు సంవత్సరాల కోసం, పద్దెనిమిది వందల ఇరవై ఐదు రోజుల కోసం ఎన్నికైన ప్రభుత్వాలు వందరోజుల పండుగలు జరుపుకోవడం భారత రాజకీయాల దుస్థితికి అద్దం పడుతున్నది. భారత పార్లమెంటరీ రాజకీయాలు ప్రజలనుంచి ఎంత దూరమై పోయాయో, దీర్ఘకాలిక నమ్మకాలు లేక ఏ రోజుకారోజు గట్టెక్కితే చాలనుకుంటు న్నాయో ఈ ఉత్సవాలు చూపుతున్నాయి. వందరోజులలో ఎంత సాధించామో చూడండి అని ప్రభుత్వాధినేతలూ, వందిమాగధులూ ప్రగల్భాలు పలుకుతున్నారు. వారు ప్రకటిస్తున్న వందరోజుల విజయాలను ఒక్కసారి నిశితంగా పరిశీలిస్తే, ప్రజావ్యతిరేక కార్యక్రమాలు, దేశదేశాల సంపన్నులకు దేశ సంపదలను దోచిపెట్టడాలు, మధ్యతరగతిని భ్రమల్లో ముంచడానికి తప్ప మొత్తంగా సమాజ దుస్థితిని మార్చడానికి ఎంతమాత్రం పనికిరాని చిల్లరమల్లర పనులు, చేయని మంచి పనులు, చేసిన చెడ్డపనులు స్పష్టంగా కనబడతున్నాయి.

నరేంద్ర మోడీ ప్రధానిగా కేంద్రప్రభుత్వం వందరోజుల పాలనలో వంద విజయాలు సాధించిందని భారతీయ జనతా పార్టీ నాయకులు సాగిస్తున్న ప్రగల్భాల పొట్ట విప్పి చూస్తే ఎన్నో పురుగులున్నాయి. ఆడంబరమైన, పైపైన చూస్తే ప్రజానుకూలమైనవో, తటస్థమైనవో అనిపించే కార్యక్రమాలు, ప్రపంచీకరణ విధానాలను కొనసాగించే కార్యక్రమాలు, ప్రత్యక్షంగానే బహుళ జాతి సంస్థలకు, దళారీ పారిశ్రామిక, వ్యాపార సంస్థలకు ప్రయోజనాలు చేకూర్చే కార్యక్రమాలు, సామ్రాజ్యవాద ప్రభుత్వాలకు దాసోహం అనే కార్యక్రమాలు, భారత పాలకవర్గాల విస్తరణవాదాన్ని కొనసాగించే కార్యక్రమాలు, కార్మిక సంక్షేమ చట్టాలను రద్దు చేసే కార్యక్రమాలు, ప్రభుత్వరంగ సంస్థలను తెగనమ్మే కార్యక్రమాలు, న్యాయ వ్యవస్థను సంఘ పరివారానికి అనుకూలంగా మార్చుకునే కార్యక్రమాలు, హిందూ మతోన్మాదాన్ని విస్తరించే విద్యా, చరిత్ర, సాంస్కృతిక కార్యక్రమాలు, కుహనా దేశభక్తిని రెచ్చగొట్టే కార్యక్రమాలు, గుజరాత్ మారణకాండ సమయంలో తన ఆదేశాలను యథాతథంగా పాటించిన హంతకులకూ, దొమ్మీదార్లకూ, నేరస్తులకూ ఉన్నత స్థానాలు కల్పించడం – మొత్తంగా వందరోజుల్లో నరేంద్ర మోడీ అమలు చేసిన కార్యక్రమాలు ఇవి. పనిలో పనిగా వ్యక్తిగత ప్రతిష్ఠను పెంచుకుంటూ, సహ మంత్రివర్గ సభ్యులను చిన్నచూపు చూస్తూ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ నేర్పిన సమష్టి క్రమశిక్షణను కూడ భంగపరుస్తున్నాడని సంఘ పరివార్ శక్తులే అనే పరిస్థితి మొదలయింది.

ఆర్థిక వ్యవస్థలో గత రెండు దశాబ్దాలుగా కొనసాగుతున్న ప్రపంచీకరణ విధానాలనే, 'జీ హుజూర్ జో హుకుం' విధానాలనే కొనసాగిస్తున్న ఈ 'వీర దేశభక్తుడి' 'స్వదేశీ' ప్రభుత్వం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విషయంలో సామ్రాజ్యవాద బహుళ జాతి సంస్థలు కోరినట్టుగానే ఆంక్షలను తగ్గించింది. చివరికి సంఘ పరివారం తామే కాపాడుతామని గొప్పగా చెప్పుకునే రక్షణ రంగాన్ని కూడ విదేశీ సంస్థల చేతుల్లో పెట్టిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుంది. బుల్లెట్ రైళ్లు, స్మార్ట్ నగరాలు, జనధన్ యోజన, బ్రిక్స్ బ్యాంకులో భాగస్వామ్యం, రహదారుల నిర్మాణంలో వేగం, పెట్టుబడుల రాకకు అనుగుణంగా చట్టాల మార్పు, జాతీయోత్పత్తి పెరుగుదల, ద్రవ్యోల్బణం తగ్గుదల వంటి అన్ని కార్యక్రమాలలోను ఏవైనా ఒకటి రెండు ప్రజానుకూల అంశాలు రూపంలో కనిపించినా, అవన్నీ సారంలో కచ్చితంగా దేశ ప్రజల ప్రయోజనాల కోసం కాదు. వాటి అసలు లక్ష్యం దేశదేశాల సంపన్నులకు, బహుళ జాతి సంస్థలకు, సామ్రాజ్యవాద ప్రభుత్వాలకు ప్రయోజనాలు కల్పించడమే. ఎక్కడైనా ఒకచోట ఉప ఉత్పత్తిగా, అప్రధాన పర్యవసానంగా ప్రజలకు ఏదో చిన్న మేలు జరగవచ్చు. కాని పాలకవర్గాలకు గత ప్రభుత్వాల కన్న తానే ఎక్కువ సేవ చేయగలనని చూపుకోవడానికి మోడీ ప్రభుత్వం తహతహలాడుతున్నదనేది ఈ వందరోజులలో తేటతెల్లమవుతున్నది.

విదేశీ ప్రత్యక్ష నిధులపై ఆంక్షలు తొలగించడం మాత్రమే కాదు, దేశీయ పారిశ్రామిక రంగాన్ని బలహీనం చేయడానికి కూడ తాను సిద్ధమేనని పెట్టుబడుల ఉపసంహరణలో దూకుడు ద్వారా మోడీ ప్రభుత్వం ప్రకటిస్తున్నది. అలాగే కాలం చెల్లిన చట్టాలను రద్దు చేయడమో, సవరించడమో చేయాలనే ఆమోదయోగ్యమైన మాట చెపుతూ, ఆ మాట చాటున కార్మిక సంక్షేమ చట్టాలను రద్దుచేసే చర్యలు చేపట్టింది. అంటే భారత పారిశ్రామిక రంగం ఇటు కార్మికులకూ అటు ప్రభుత్వానికీ దేశీయ పారిశ్రామికవేత్తలకూ కూడ చెందకుండా, సంపూర్ణంగా దళారీ పెట్టుబడిదారులకూ, బహుళజాతి సంస్థలకూ చెందబోతున్నదన్నమాట. గుజరాత్ అభివృద్ధి నమూనా అని ఊదరగొట్టిన నమూనా ఈ దళారీ వ్యాపారవేత్తల స్వర్గమే. ఈ ప్రజా వ్యతిరేక విధానాలకు సామాజిక మద్దతు ఎట్లాగూ సాధ్యం కాదు గనుక, త్వరలోనో, ఆలస్యంగానో ప్రజలలో వ్యతిరేకత పెల్లుబికే అవకాశం ఉంది గనుక ఈ విధానాలకు మద్దతు తెలిపే తన సొంత ప్రైవేటు సైన్యాన్ని నిర్మించుకోవడానికి కూడ సంఘ పరివారం ప్రయత్నాలు చేస్తున్నది. ప్రాథమిక విద్య దశ నుంచే విద్యార్థుల మెదళ్లను విషపూరితం చేయడానికి, మొత్తంగా విద్యారంగంలో, చరిత్ర రచనలో, సంస్కృతిలో మతోన్మాద భావజాలాన్ని నింపి, గుడ్డిగా తమ రాజకీయార్థిక విధానాలను సమర్థించే శక్తులను తయారు చేసుకోవడానికి ప్రయత్నాలు ప్రారంభించింది. ఈ విధానాలకూ, కార్యక్రమాలకూ ఎక్కడైనా, ఎప్పుడైనా న్యాయవ్యవస్థ అడ్డు చెపుతుందేమో అనే అనుమానంతో న్యాయవ్యవస్థను బెదిరించి లొంగదీసుకోవడానికి కూడ ప్రయత్నాలు ప్రారంభించింది. గుజరాత్ మారణకాండలో తమ నేరాన్ని నిర్మొహమాటంగా చెప్పిన సీనియర్ న్యాయవాదిని న్యాయమూర్తి కాకుండా అడ్డుకోవడం మాత్రమే కాదు, అసలు న్యాయమూర్తుల ఎంపిక విధానాన్నే మార్చివేస్తున్నది. నిరంతర జాగరూకతే ప్రజాస్వామ్యానికి మూల్యం అని గుర్తించడం, జాగరూకతతో ఆగకుండా నిరంతర పోరాటాల ద్వారా ఈ ప్రభుత్వపు మెడలు వంచడం తప్ప ప్రజలకు మరొక మార్గం లేదు. వీ

భావ ప్రకటనా స్వేచ్ఛా, స్వయంనిర్ణయాధికారమా?

తెలంగాణ ప్రజలు స్వయం నిర్ణయాధికారం కోరుకోవడం, దశాబ్దాల విస్తృత పోరాటంతో విజయం సాధించడం కళ్లముందర జరిగిన చరిత్ర. కాని తెలంగాణ ఏర్పడిన కొద్దిరోజుల లోపలే ఒక విచిత్రమైన, విషాదకరమైన సవాలు మొదలయింది. స్వయం నిర్ణయాధికార వాంఛ ఒక ప్రజాస్వామిక హక్కుగదా, దానికీ ఇతర ప్రజాస్వామిక హక్కులకూ పోటీ వస్తుందా, మరీ ముఖ్యంగా రాజ్యాంగం హామీ ఇచ్చిన వాక్సభాస్వాతంత్ర్యాలకూ తెలంగాణ అస్తిత్వానికీ పోటీ వస్తుందా, అలా వస్తే తెలంగాణ కోసం ప్రజాస్వామిక హక్కులను కాలరాయవచ్చునా అనే చర్చ జరుగుతున్నది. తెలంగాణలో ఇంటింటికీ కేబుల్ ద్వారా టెలివిజన్ ప్రసారాలను అందించే మల్టీ సిస్టం ఆపరేటర్లు (ఎంఎస్ఒలు) రెండు ఛానళ్ల ప్రసారాలను ఆపివేయడంతో మొదలైన ఈ చర్చ తెలంగాణ ప్రభుత్వం ఇతర వర్గాల ప్రజాస్వామిక హక్కులను కూడ భగ్నం చేయడానికి ప్రయత్నించడంతో మరింత వేడెక్కింది. తెలంగాణ సమాజం పోరాడినదే తన ప్రజాస్వామిక హక్కుల ఉల్లంఘనకు వ్యతిరేకంగా. కనుక మరెక్కడైనా ప్రజాస్వామిక హక్కుల ఉల్లంఘనను తెలంగాణ సమాజం ఆమోదించజాలదు. అయితే ప్రజాస్వామిక హక్కు పేరుతో తెలంగాణ అస్తిత్వాన్నే కించపరిచే చర్యలను సహించవచ్చునా అనే ప్రశ్న వస్తుంది. అటువంటి పోటీ రాగూడదు గాని తెలుగు మీడియా చరిత్ర ప్రత్యేకత వల్ల, మీడియా యాజమాన్యాల వర్గ, ప్రాంతీయ, కుల స్వభావం వల్ల, అసలు మొత్తంగానే మీడియాలో మితిమీరిన అరాచక, సంచలనాత్మక ధోరణులవల్ల ఈ ప్రశ్న చర్చనీయమవుతున్నది. అప్పుడు కూడ అటువంటి దోషుల చర్యలను సమాజం ముందర పెట్టి, సమాజాన్ని చైతన్యవంతం చేసి, సామాజిక ప్రతిచర్య చూపడమే ప్రజాస్వామికమవుతుంది గాని, అధికారిక ప్రతిచర్యో, అధికారపు ప్రోత్సాహంతో జరిగే ప్రతిచర్యో ప్రజాస్వామికం కాదు. భావప్రకటనా స్వేచ్ఛ పేరు మీద తెలంగాణ అస్తిత్వాన్ని అవమానించిన ఈ అసాధారణ ఘటనలను చూపి, మొత్తంగా భావప్రకటనాస్వేచ్ఛను అడ్డుకోవడానికి కూడ ప్రయత్నాలు జరుగుతున్నాయి. తెలంగాణలో అధికారిక స్వరం తప్ప మరే స్వరం వినిపించగూడదన్నంత వరకు, మిగిలిన స్వరాలన్నీ తెలంగాణ వ్యతిరేకమే అన్నంతవరకు అతిశయోక్తులు వెలువడుతున్నాయి. ఇది తెలంగాణకైనా, ప్రజాస్వామ్యానికైనా ఎంతమాత్రం మంచిది కాదు. భిన్నస్వరాల, వైవిధ్య భరితమైన ఇంద్రధనుస్సు వంటి ఆలోచనల సమాహారమే ప్రజాస్వామ్యానికి చిహ్నం. తెలంగాణ అటువంటి ప్రజాస్వామిక వాతావరణం కొరకే ఎన్నో దశాబ్దాలుగా పోరాడుతున్నది. అటువంటి ప్రజాస్వామ్యాన్ని ఇవ్వనందువల్లనే నిజాం రాచరికం నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాకా తెలంగాణ వ్యతిరేకతను చవిచూసి, ప్రజాశక్తి ఎదుట పతనమయ్యాయి. ఆ పోరాటాల, త్యాగాల పునాది మీద రూపొందిన తెలంగాణ ప్రభుత్వం ఈ అసహజ పోటీని నివారించవలసి ఉంది. పోలీసు బలగాల మీద, బలప్రయోగం మీద ఆధారపడడం మానుకుని తెలంగాణ, ప్రజాస్వామ్యం పర్యాయపదాలని రుజువు చేసుకోవలసి ఉంది. వీ


ఆదివాసుల, మత్స్యకారుల, రైతుల త్యాగాలతో అభివృద్ధి!

పది సంవత్సరాల పాటు అధికారానికి దూరంగా ఉన్నప్పటికీ తనను అధికారం నుంచి దూరం చేసిన అంశాలేవో చంద్రబాబు నాయుడుకు తెలిసివచ్చినట్టు లేదు. అవిభక్త ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఎటువంటి ఆలోచనలను ప్రకటించారో, ఏ విధానాలను అమలు చేశారో, విభక్త ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా కూడ అవే ఆలోచనలను ప్రకటిస్తున్నారు, అమలు చేస్తున్నారు. ప్రపంచ బ్యాంకు, బహుళ జాతి సంస్థలు నిర్దేశించే అభివృద్ధి నమూనా అంటే, దాని హైటెక్ ప్రచారమంటే ఆయనకు అభిమానమని గతంలో రుజువైన విషయమే. ప్రస్తుతం కూడ అదే అభివృద్ధి నమూనాను అమలు చేయడానికి అంతే దీక్షతో ఆయన ప్రయత్నిస్తున్నారు. మంత్రివర్గ సమావేశాన్ని కాగితాలతో సంబంధం లేని ఈ-మంత్రివర్గ సమావేశంగా మార్చాలని అనుకోవడం ప్రచారార్భాటానికి తప్ప మరెందుకూ పనికి రాదు. కాని అంతకన్న ముఖ్యంగా, పోలవరంను నిర్మించే ప్రయత్నాలు ముమ్మరం చేయడం, మళ్లీ బాక్సైట్ తవ్వకాల ప్రతిపాదనను ముందుకు తేవడం ఆదివాసుల పట్ల దారుణమైన నిర్లక్ష్యాన్ని, నిరాదరణను ప్రదర్శించడమే. అలాగే ఇదివరకు ఎన్నోసార్లు వెనక్కి పోయిన అణువిద్యుత్ కేంద్ర ప్రతిపాదనలను మళ్లీ ఒకసారి ముందుకు తేవడం, చర్యలు కూడ ప్రారంభించడం ప్రజా సంక్షేమం పట్ల, ప్రజా భద్రత పట్ల ఏ మాత్రం గౌరవం లేదని చూపుకోవడమే. గుజరాత్ తో సమానమని చూపుకోవడానికీ, బహుళ జాతి సంస్థలకూ వారి తాబేదార్లకూ సముద్రతీరాన్ని అప్పగించడానికీ ప్రయత్నిస్తూ కొత్తగా పదమూడు ఓడరేవులను ప్రతిపాదించడం మత్స్యకారుల జీవితాలను ఛిద్రం చేయడానికే. విశాఖపట్నం-చెన్నై పారిశ్రామిక కారిడార్ ప్రతిపాదన అయినా, విశాఖపట్నం-కాకినాడ చమురుసీమ ప్రతిపాదన అయినా లక్షలాది మంది రైతుల జీవితాలను ధ్వంసం చేయడానికే. అటు రాయలసీమ హక్కులను కాలరాసి, ఇటు కృష్ణాజిల్లా సంపన్న మాగాణి భూములను రియల్ ఎస్టేట్ గా మార్చి తేదలచుకున్న రాజధాని ప్రతిపాదన కూడ ప్రజాస్వామిక హక్కుల ఉల్లంఘన గానూ, పంటపొలాల భూములను ధ్వంసం చేసి, కాంక్రీట్ అరణ్యంగా మార్చేది గానూ చరిత్రలో నిలిచిపోతుంది. ఒకటి రెండు సంవత్సరాలలో రియల్ ఎస్టేట్ ఏజెంట్లు కోట్లకు పడగెత్తవచ్చు. కాని, లక్షలాది ఎకరాల పంటపొలాలు ధ్వంసమైపోయి, అన్నపూర్ణగా పేరొందిన రాష్ట్రం బిచ్చం ఎత్తవలసిన స్థితి వస్తుంది. ఈ పరిణామాల పర్యవసానాలన్నీ పాలకులకు తెలియనివేమీ కావు. అవి ఈ అభివృద్ధి నమూనాకు అనివార్య ఫలితాలని ప్రపంచవ్యాప్తంగా రుజువై ఉంది. కాని అభివృద్ధి మంత్ర జపంతో మధ్యతరగతిని భ్రమల్లో ముంచి, ప్రచార సాధనాలలో హోరెత్తించి, ఆదివాసులనూ, మత్స్యకారులనూ, రైతులనూ, కూలీలనూ బలిపెట్టి పిడికెడు మందికి అభివృద్ధి సాధించిపెట్టడమే ఈ నమూనా అసలు లక్ష్యం. ఆ నమూనాకు స్థిరంగా నిబద్ధుడైన రాజకీయ నాయకుడిగా చంద్రబాబు నాయుడి నుంచి మరొక పద్ధతి ఆశించడం అసాధ్యం. సమరశీల చైతన్యం గల ఆంధ్రప్రదేశ్ ప్రజానీకం ఈ నమూనా దుష్పరిణామాలను ఎప్పటికప్పుడు ఖండిస్తూ, అడ్డుకుంటూ పోరాటపథం చేపట్టకపోతే ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు అంధకారమయమే. వీ

స్కాట్లండ్ - గెలిచిందెవరు, ఓడిందెవరు?


స్కాట్లండ్‌కు స్వాతంత్ర్యం కావాలా వద్దా అనే ప్రశ్నపై సెప్టెంబర్ 18న జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో మొత్తం జనాభాలోని 42 లక్షల వోటర్లలో 84.6 శాతం మంది పాల్గొనగా, 55.3 శాతం వద్దని, 44.7 శాతం కావాలని కోరారు. ఈ ఫలితం జాతుల స్వయం నిర్ణయాధికార వాంఛకు ఎదురుదెబ్బ అనీ, ఐక్యతా వాంఛకు సూచిక అనీ కొందరు వ్యాఖ్యానిస్తుండగా, మరికొందరు ఇది బూటకపు ప్రజాభిప్రాయ సేకరణ అంటున్నారు. ఔను, కాదు అనే ఏకైక ప్రశ్నకన్న లోతైన సమస్యలు ఇందులో ఉన్నాయి. మూడు వందల సంవత్సరాలుగా యునైటెడ్ కింగ్‌డంలో భాగంగా ఉన్న స్కాట్లండ్ ప్రజలలో గణనీయమైన భాగానికి విడిపోయి, స్వతంత్రదేశంగా ఆవిర్భవించాలనే ఆకాంక్షలున్నాయి. ఒక శతాబ్ది కిందనే 1920లో బ్రిటిష్ లేబర్ పార్టీ స్కాట్లండ్‌కు స్వాతంత్ర్యం ఇవ్వాలని ప్రతిపాదించింది. 1934లో ఏర్పడిన స్కాటిష్ నేషనల్ పార్టీ వేరువేరు రూపాలలో స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్నది. 1940లలోనే అప్పటి 50 లక్షల జనాభాలో 20 లక్షల మంది స్వపరిపాలనను కోరుతూ మహజరు సమర్పించారు. స్కాట్లండ్‌కు అధికారాల బదిలీ విషయమై 1979లోనూ, 1997లోనూ ప్రజాభిప్రాయ సేకరణలు జరిగాయి. తత్ఫలితంగా 1999లో పరిమిత అధికారాలతోనైనా స్కాట్లండ్ పార్లమెంట్ ఏర్పడింది. 2011లో నాలుగో స్కాటిష్ పార్లమెంట్‌లో అత్యధిక స్థానాలు సంపాదించి అధికారానికి వచ్చిన స్కాట్లండ్ నేషనల్ పార్టీ తన ఎన్నికల ప్రణాళిక మేరకు ఈ ప్రజాభిప్రాయ సేకరణ జరిపింది. ఈ ప్రజాభిప్రాయ సేకరణలో స్కాట్లండ్ స్వాతంత్ర్యాన్ని వ్యతిరేకించే పక్షానికే ఆధిక్యత వచ్చినప్పటికీ, ఆలోచించవలసిన అంశాలెన్నో ఉన్నాయని పరిశీలకులు అంటున్నారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణ స్కాట్లండ్ ప్రజల రాజకీయ చైతన్యాన్నీ, చొరవనూ పెంచిందనీ, అంతవరకూ రాజకీయ విషయాల పట్ల నిరాసక్తంగా ఉన్న ప్రజలెందరో రాజకీయాలలో తమ పాత్రను గుర్తించారనీ, అంతిమ ఫలితం ఏమైనప్పటికీ ఈ చైతన్యం దానికదిగానే మౌలిక మార్పు అని బ్రిటిష్ ట్రాట్స్కీయైట్ సిద్ధాంతవేత్త అలన్‌వుడ్స్ రాస్తున్నారు. అలాగే ఈ చైతన్యానికి కారణం కేవలం జాతి సమస్య మాత్రమే కాదనీ, ఇది మరింత లోతైన అంతర్జాతీయ పరిణామానికి ప్రతీక అనీ, యథాస్థితి మీద విమర్శ అనీ ఆయన అంటున్నారు. శాంతియుతంగా, నిశ్శబ్దంగా కనిపించే ప్రతి సమాజంలోనూ యథాస్థితి పట్ల ఆగ్రహం, అసంతృప్తి, నిరాశా నిస్పృహలు ఉన్నాయనీ, వాటి ప్రతిఫలనమే ఈ రాజకీయ చైతన్యం అనీ ఆయన అన్నారు. స్కాట్లండ్‌లో ఆరు సంవత్సరాల ఆర్థిక సంక్షోభం తర్వాత పెద్ద ఎత్తున నిరుద్యోగం, జీవనప్రమాణాల పతనం, సంక్షేమ రాజ్య భావనపై, ప్రజాస్వామిక హక్కులపై దాడులు, ఆర్థిక కుంభకోణాలు, రాజకీయ నాయకుల అక్రమాలు, తీవ్రమైన అసమానతలు వంటి కారణాలే ఈ రాజకీయ వెల్లువకు కారణమయ్యాయని, దాన్ని వర్గ రాజకీయాలతో ముడిపెట్టగలిగినప్పుడే నిజమైన ప్రజా విముక్తి సాధ్యమవుతుందనీ ఆయన అన్నారు. ఈ విశ్లేషణాసత్యాలు స్కాట్లండ్‌కు వర్తించేవి మాత్రమే కావు, అన్ని సమాజాలకూ వర్తిస్తాయి.

వీ




మీడియా ఏం చూపెడుతుంది?

కత్తి పట్టుకుని చంపడానికి వెంటాడుతున్న వ్యక్తీ,
భయంతో పారిపోతూ నిస్సహాయంగా కాలితో
తంతున్న వ్యక్తీ ఉంటే మీడియా కెమెరా సరిగ్గా
వృత్తంలో చూపెట్టిన దృశ్యం మీద కేంద్రీకరిస్తుంది.
అంటే బాధితులడు దాడి చేస్తున్నవాడిగా,
దాడి చేస్తున్నవాడు బాధితుడిగా
మన టెలివిజన్ తెర మీద కనబడుతుంది!



❖ **భారత విప్లవ పంథాను చూపిన తెలంగాణ సాయుధ పోరాటం** – కా. దేవులపల్లి వెంకటేశ్వర రావు రచనలు – 2 – పోరునేల ప్రచురణ – 171 పేజీలు, 1/8 డెమీ, రు. 100



❖ **భారత జనతా ప్రజాతంత్ర విప్లవం** – కార్యక్రమం – ఒక వివరణ – కా. దేవులపల్లి వెంకటేశ్వర రావు రచనలు – 6 – పోరునేల ప్రచురణ – 420 పేజీలు, 1/8 డెమీ, రు. 150


పై రెండు ప్రతులకు: రాష్ట్రంలోని ప్రముఖ పుస్తక కేంద్రాలు




❖ **గతాన్ని సమీక్షించుకుందాం** – సాయుధ పోరాటానికి పునరంకితమవుదాం – ఆత్మవిమర్శ రిపోర్ట్ – సిపిఐ (ఎం.ఎల్) 1977 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ, దిక్సూచి ప్రచురణలు – 81 పేజీలు, 1/8 డెమీ, రు. 50, ప్రతులకు: దిక్సూచి, జింకిభద్ర గ్రా., సోంపేట మం., శ్రీకాకుళం; రాష్ట్రంలోని ప్రముఖ పుస్తకాల షాపుల్లో




❖ **మానుకోట ముచ్చట్లు** – సీతారాం – రవళి సాహితి – 140 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: సీతారాం, 6–2–46/ఎచ్, జమ్మిబండ, చెరువు బజారు, ఖమ్మం, సెల్: 9866563519; ప్రముఖ పుస్తక కేంద్రాలు




❖ **సొనకాలువల అపూర్వ పురాగాథ** – గతమూ – వర్తమానమూ – భవిష్యత్తు – వొక వాయు ఆధునిక వ్యక్తీకరణ – డా. లెనిన్ ధనిశెట్టి – అనంతుడు ఫౌండేషన్ ప్రచురణ – 33 పేజీలు, 1/8 డెమీ, రు. 20, ప్రతులకు: అనంతుడు ఫౌండేషన్, కొండగడప గ్రా, మోత్కూల్ మం, నల్లగొండ; సెల్: 9866061350



❖ **ఎగరాల్సి సమయం** – కవిత్వం – బాలసుధాకర్ మౌళి – చంపావతి ప్రచురణలు – 159 పేజీలు, 1/8 డెమీ, రు. 80,ప్రతులకు: ఎస్. బాలసుధాకర్ మౌళి, ఎస్‌బిఐ దగ్గర, బోయ వీధి, నెల్లిమర్ల (ఎస్ఒ), విజయనగరం – 535217, సెల్: 9676493680; champaavathi@gmail.com



❖ **కొల్లేటి జాడలు** – నవల – అక్కినేని కుటుంబరావు – స్వేచ్ఛ ప్రచురణ – 221 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్; విశాలాంధ్ర; ప్రజాశక్తి; www.kinege.com




❖ **శిఖరం** – రెక్కలు కావ్యం – యువతకు స్వామి వివేకానంద సందేశం – ఎం.కె. సుగమ్‌బాబు – 111 పేజీలు, 1/8 డెమీ, రు. 60, ప్రతులకు: ఎం.కె. సుగమ్‌బాబు, 502, సాయితేజ ఎన్‌క్లేవ్, సూరారం క్రాస్ రోడ్స్, హైదరాబాద్ – 500 055; సెల్: 8096615202




❖ **నదీ మూలం లాంటి ఆ ఇల్లు** – యాకూబ్ కవిత్వం – కవి సంగమం ప్రచురణ – 153 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: పెన్నేటి పబ్లికేషన్స్, 39/435–14–12, వివేకానందనగర్, కడప – 516 001;
సెల్: 89851 14299; www.kinege.com




❖ **మహామంత్రి మాదన్న** – (చరిత్ర ఆధారిత నవల) – ఎస్.ఎం. ప్రాణ్‌రావ్ – 236 పేజీలు, 1/8 డెమీ, రు. 120, ప్రతులకు: ఎస్.ఎం. ప్రాణ్‌రావ్, 9–14/1, రవీంద్ర నగర్ కాలనీ, హబ్సీగూడ, హైదరాబాద్ – 500 007; విశాలాంధ్ర; ప్రజాశక్తి; నవదోయ; దిశ




❖ **తారాతోరణం యుగ(ర)ళ గీతం** – చల్లపల్లి నందగోపాల్, డి. నటరాజ్ – బోధిసత్త్వ పుస్తకమాల ప్రచురణ – 45 పేజీలు, 1/8 డెమీ, రు. 20, ప్రతులకు: సెక్యులర్ పబ్లికేషన్స్, అడవివరం, సింహాచలం, విశాఖపట్నం–28; సెల్ : 77023 55076




❖ **మావో రచనలు** – మొదటి సంపుటి – విరసం ప్రచురణ – 448 పేజీలు, 1/8 డెమీ, రు. 170



❖ **రివిజనిస్టు వ్యతిరేక చారిత్రక ఎనిమిది డాక్యుమెంట్లు** (1965–1967) – చారుమజుందార్ – విరసం ప్రచురణ – 63 పేజీలు, 1/8 డెమీ, రు. 50,
ఈ రెండు పుస్తకాలు ప్రతులకు: వరవరరావు, ఫ్లాట్ నెం. 419, హిమసాయి హైట్స్, ఆంధ్రా కేఫ్ రోడ్, జవహర్‌నగర్, ఆర్‌టిసి క్రాస్ రోడ్ దగ్గర, హైదరాబాద్ – 500 020



❖ **రాజకీయ కృషి: మన కృషి అంతటికీ జీవనాడి** – హాంకీ (ఎర్రజెండా వ్యాసాలు) – విరసం ప్రచురణ – 56 పేజీలు, 1/8 డెమీ, రు. 35



❖ **మార్క్సిజం – లెనినిజం – మావోయిజం** – 18 మార్చ్, 1871 – స్టడీ నోట్స్ – విరసం ప్రచురణ – 245 పేజీలు, 1/8 డెమీ, రు. 125
ఈ రెండు పుస్తకాలు ప్రతులకు: పాణి, ఇ.నెం. 50–348/2–19బి2, అరోర నగర్, బి–క్యాంప్, కర్నూల్ – 518002



❖ **సామ్రాజ్యవాద సంస్కృతి** – జేమ్స్ పెట్రాస్ వ్యాసాలు – విరసం ప్రచురణ – 231 పేజీలు, 1/8 డెమీ, రు. 125, ప్రతులకు: పి. వరలక్ష్మి, 5–1820, గీతాశ్రమం వీధి, ప్రొద్దుటూరు, కడప – 516 360

వర్తమాన చరిత్ర - రాజకీయార్థిక దృష్టి

ప్రభుత్వ రంగ సంస్థల పెట్టుబడుల ఉపసంహరణ

భారతీయ జనతా పార్టీ నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వందరోజులు గడవకముందే భారీ పెట్టుబడుల ఉపసంహరణ కార్యక్రమాన్ని చేపట్టింది. కోల్ ఇండియాలో పది శాతం, ఆయిల్ అండ్ నాచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఒఎన్‌జిసి) లో ఐదు శాతం, నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌ఎచ్‌పిసి) లో 11.38 శాతం ప్రభుత్వ వాటాను అమ్మి, రు. 43,425 కోట్లు సంపాదించాలని సెప్టెంబర్ 10 న జరిగిన ఆర్థిక వ్యవహారాల కేంద్ర మంత్రివర్గ ఉపసంఘం సమావేశం నిర్ణయించింది. ఈ వాటా శాతాల, నిధుల సేకరణల అంకెల మాయాజాలాన్ని అలా ఉంచి అసలు ఈ పెట్టుబడుల ఉపసంహరణ విధానం ఏమిటో, అది దేశ ఆర్థిక వ్యవస్థకు ఉపయోగ పడుతున్నదో లేదో పరిశీలించవలసి ఉంది.

భారత ఆర్థిక వ్యవస్థలో 1947 తర్వాత ప్రభుత్వ రంగం అనే భావన తలెత్తి బలోపేతం కావడానికి కనీసం నాలుగు ప్రధాన కారణాలున్నాయి: అవి ఒకటి, సోవియట్ యూనియన్ ప్రభావం వల్ల, సంక్షేమ రాజ్య భావన ప్రభావం వల్ల భారత జాతీయోద్యమ నాయకులలో కలిగిన ప్రభుత్వరంగపు అవగాహనలు. రెండు, శతాబ్దాలుగా భారత ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిన బ్రిటిష్ వలసవాద వారసత్వాన్ని రద్దు చేసి, దేశీయ ఆర్థిక వ్యవస్థను నిర్మించుకోవాలని ప్రజలలో ఉండిన ఆకాంక్షలు. మూడు, రెండో ప్రపంచయుద్ధ కాలంలో ప్రైవేటు పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు లాభాపేక్షతో అమలు చేసిన అత్యంత దుర్మార్గమైన చీకటిబజారు కార్యక్రమాల పట్ల ప్రజల వ్యతిరేకత. నాలుగు, తాము ఇంకా శక్తిమంతులం కాలేదని, కనుక తమకు అవసరమైన ఏర్పాట్లను ప్రభుత్వమే ప్రజాధనంతో సమకూర్చి పెట్టాలని ప్రైవేటు పెట్టుబడిదార్లు వ్యక్తం చేసిన కోరికలు.

ఒకటి, రెండు ప్రపంచ యుద్ధాల మధ్య కాలంలో సోవియట్ యూనియన్ సాధించిన మహత్తర విజయాలను చూసి ప్రపంచ వ్యాప్తంగా ఎందరో మేధావులు, ఆలోచనాపరులు సోషలిజం వైపు ఆకర్షితు లయ్యారు. ఉత్పత్తిసాధనాలు జాతి మొత్తానికీ చెంది ఉండాలనీ, జాతికి ప్రతినిధిగా ప్రభుత్వం ఆ ఉత్పత్తి సాధనాలను నిర్వహించినప్పుడే సమసమాజ ఆదర్శాలు సాధ్యమవుతాయనీ వారు భావించారు. అదే సమయంలో పెట్టుబడిదారీ విధానం కూడ తన సంక్షోభం నుంచి బయట పడడానికి సంక్షేమ రాజ్యం అనే భావనను ప్రవేశపెట్టి, ప్రభుత్వానికి హెచ్చు బాధ్యతలు ఉండాలని సూచించింది. భారత జాతీయోద్యమ నాయకత్వం ఈ రెండు ఆలోచనా ధోరణుల నుంచీ కొంత కొంత స్వీకరించి మిశ్రమ ఆర్థిక విధానాన్ని ప్రకటించింది. దేశాభివృద్ధికి అవసరమైన కీలకరంగాలన్నిటినీ ప్రభుత్వ రంగమే నిర్వహిస్తుందని ప్రకటించింది. తక్షణ లాభాలు రాని, సామాజిక శ్రేయస్సు మాత్రమే లక్ష్యంగా గల రంగాలలోకి ప్రైవేటు పెట్టుబడులు రావని, అందువల్ల ప్రభుత్వమే పూనుకుని ప్రజాధనాన్ని వెచ్చించి, ఆదర్శవంతమైన ఉన్నత శిఖరాలను ఏర్పాటు చేయాలని అప్పటి నాయకులు చాల గంభీరమైన ఆకర్షణీయమైన ప్రవచనాలు వినిపించారు. కార్మిక కర్షక రాజ్యంగా ఉండిన సోవియట్ యూనియన్‌లో జాతీయకరణకూ, దోపిడీ పాలకవర్గాల గుప్పిట్లో ఉండిన భారత రాజ్యపు ప్రభుత్వ రంగానికీ తేడా లేదన్నట్టు నటించారు. పెట్టుబడుల విషయంలో మాత్రమే గాక, సామాజిక అవసరమైన ఉద్యోగకల్పనకూ, స్థానిక వనరుల వినియోగంతో స్థానిక మార్కెట్ అవసరాలు ప్రణాళికా బద్ధంగా తీర్చడానికీ ప్రభుత్వ రంగం అవసరమన్నారు.

రెండు, బ్రిటిష్ వలసవాదం భారత ఆర్థికవ్యవస్థను పారిశ్రామి కాభివృద్ధి నుంచి వైదొలిగేలా చేసిందని (డి ఇండస్ట్రియలైజేషన్), కేవలం ప్రైవేటు లాభాపేక్ష మాత్రమే పారిశ్రామికీకరణకు ప్రేరణ అయిందని, అందువల్ల 'స్వతంత్ర' భారతం ఆ అవ్యవస్థను మార్చి, దేశీయ పారిశ్రామికాభివృద్ధిని సాధించాలంటే ప్రభుత్వ రంగం తప్పనిసరి అనే వాదన కూడ బలంగా ఉండింది.

మూడు, రెండో ప్రపంచ యుద్ధకాలంలో ప్రజల అవసరాలను తీర్చే ఉత్పత్తులు కాక, విపరీతంగా లాభాలు సంపాదించే ఉత్పత్తులకే పారిశ్రామికవేత్తలు ప్రాధాన్యత ఇచ్చారు. వ్యాపారవేత్తలు ప్రజావసరమైన సరుకులను అక్రమంగా నిలువచేసి, కృత్రిమ కొరత సృష్టించి, ఇబ్బడి ముబ్బడిగా ధరలు పెంచారు. అందువల్ల మొత్తంగా సమాజంలో ప్రైవేటు పారిశ్రామిక, వ్యాపారవేత్తల పట్ల పెద్ద ఎత్తున అసహ్యం, ఆగ్రహం పెరిగాయి. ఆ అసహ్యానికి, ఆగ్రహానికి ఒక వ్యక్తీకరణగానే స్వయంగా జవహర్ లాల్ నెహ్రూ, 'స్వాతంత్ర్యం రాగానే ఈ అక్రమ నిలువదారు లను, చీకటిబజారు వ్యాపారులను సమీపంలోని దీపస్తంభాలకు ఉరితీస్తాం' అని జూన్ 1945లో అన్నాడు.

నాలుగు, అన్నిటికన్న ముఖ్యంగా, ప్రభుత్వ జోక్యమూ, ప్రభుత్వ నియంత్రణా తప్పకుండా ఉండాలని, ప్రభుత్వమే పదివేల కోట్ల రూపాయల నిధులతో పదిహేను సంవత్సరాల ప్రణాళికతో వ్యవసాయ, పారిశ్రామికాభివృద్ధి పథకాలను ప్రకటించాలని ప్రైవేటు పెట్టుబడిదారుల బృందం ప్రభుత్వానికి సూచించింది. జహంగీర్ రతన్‌జీ దాదాభాయ్ టాటా, ఘనశ్యామ్ దాస్ బిర్లా, అర్దశిర్ దలాల్, శ్రీరామ్, కస్తూర్ భాయ్ లాల్భాయ్, అర్దశిర్ దోరబ్జా ష్రాఫ్, సర్ పురుషోత్తమ దాస్ ఠాకూర్ దాస్, జాన్ మత్తయి అనే ఎనిమిది మంది అప్పటి ప్రముఖ పారిశ్రామిక, వ్యాపార వేత్తలు 1944లో ప్రకటించిన 'బొంబాయి ప్లాన్' లో ప్రభుత్వానికి ఈ సూచనలు చేశారు. ఇలా ప్రజాధనంతో ప్రభుత్వ రంగంలో వ్యవసాయ, పారిశ్రామికాభివృద్ధి జరిగితే తమకు కావలసిన మౌలిక సౌకర్యాలు, మార్కెట్లు ఏర్పడతాయని వాళ్లు ఆశించారు.

అలా దేశంలో ప్రభుత్వ రంగం ఏర్పడింది. (నిజానికి దాని ఇంగ్లిష్ పేరు పబ్లిక్ సెక్టర్. అంటే ప్రజా రంగం, సామాజిక రంగం అని ఉండవలసింది. కాని అది ప్రజలకూ, సమాజానికీ సంబంధం లేని, నియంత్రణ లేని 'ప్రభుత్వ రంగం' అయిపోయింది!) ఒక్క కేంద్ర ప్రభుత్వ అధీనంలోనే 1956 నాటికి రు. 29 కోట్ల పెట్టుబడితో ఐదు ప్రభుత్వ రంగ సంస్థలు ఉండగా, 2012 నాటికి అవి రు. 7,30,000 కోట్ల రూపాయల విలువ గల 260 సంస్థలుగా మారాయి. వివిధ రాష్ట్ర ప్రభుత్వాల కింద ఉన్న వేలాది ప్రభుత్వ రంగ సంస్థల లెక్క, గత ఇరవై

మూడు సంవత్సరాలలో అమ్మివేసిన, మూసివేసిన సంస్థల లెక్క ఇందులో చేరనేలేదు. వాటిని కూడ కలిపితే ఈ అంకె కనీసం రెట్టింపు అవుతుంది. అంటే భారత ప్రజానీకం చెల్లించిన పన్నులతో, ఆయా సంస్థల కార్మికులు, ఉద్యోగులు నెత్తుటిని చెమట చేసుకుని పోగుచేసిన సంపదతో ఇవాళ ప్రభుత్వరంగ సంస్థలలో కనీసం పదిహేను లక్షల కోట్ల రూపాయల ప్రజాధనం ఉన్నదన్న మాట. ఇది ఏ ఒక్క రాజకీయ నాయకుడి, రాజకీయ పార్టీ సొంత ఆస్తికాదు. కాని ఏదో ఒకరకంగా ప్రభుత్వాధికారానికి వచ్చినవారు ఈ సంపదంతా తమ సొంతమన్నట్టు, తమ ఇష్టారాజ్యంగా తమ ఆశ్రితులకు, సంపన్నులకు అమ్మకం పేరుమీద కట్టబెడుతున్నారు. ఆ లావాదేవీలలో ముడుపులు సంపాదించుకుంటున్నారు.

నాలుగు దశాబ్దాల పాటు సాగిన ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటు, 1956 బీమా రంగ జాతీయకరణతో, 1969 బ్యాంకుల జాతీయకరణతో, దిగుమతుల ప్రత్యామ్నాయాల విధానంతో బలోపేతమయింది. కాని పి వి నరసింహారావు ప్రధాన మంత్రిగా, డా. మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రిగా కేంద్ర ప్రభుత్వం 1991లో ప్రకటించిన నూతన ఆర్థిక విధానాలు, నూతన పారిశ్రామిక విధానం, నూతన వాణిజ్య విధానాలతో పెట్టుబడుల ఉపసంహరణ చరిత్ర ప్రారంభమయింది. కొన్ని ప్రభుత్వ రంగ సంస్థలను నష్టదాయకమైనవిగా, అనవసరమైనవిగా, నిర్వహణ అసాధ్యమైనవిగా ప్రకటించి మూసివేయడమో, పూర్తిగా అమ్మివేయడమో, వాటిలో ప్రభుత్వ వాటాను తగ్గించడమో ఈ విధానం లక్ష్యం. పెట్టుబడుల ఉపసంహరణ జరిపినప్పటికీ, 51 శాతం వాటా ప్రభుత్వం దగ్గరే ఉండేట్టు చూస్తామని, తద్వారా నిర్ణయాధికారం ప్రభుత్వం దగ్గర ఉన్నట్టేనని ఆనాటి పాలకులు నమ్మబలికారు. కాని ఇది ఎంత పచ్చి అబద్ధమంటే, ఏ సంయుక్త భాగస్వామ్య కంపెనీలోనైనా పది శాతానికి తక్కువ వాటా ఉండేవాళ్లు కూడ మిగిలిన 90 శాతం వాటాదార్ల కన్న ఎక్కువ నిర్ణయాధికారాన్ని అనుభవిస్తున్నారు. 51 శాతం ఉన్నంత మాత్రాన ప్రభుత్వానికి నిర్ణయాధికారం ఉంటుందన్న హామీ ఏమీ లేదు.

మొదటిసారిగా 1991 జూలై 24న ప్రకటించిన పెట్టుబడుల ఉపసంహరణ ప్రకారం 1991-92 ఆర్థిక సంవత్సరంలో 31 ప్రభుత్వ రంగసంస్థలలో ప్రభుత్వ వాటాలు అమ్మి రు. 3,038 కోట్లు సంపాదించారు. మొదటి పది సంవత్సరాలలో, అంటే 1991-92 నుంచి 2000-01 వరకు ప్రభుత్వ రంగ వాటాలను ఉపసంహరించి రు. 54,300 కోట్లు సంపాదించాలని లక్ష్యం పెట్టుకున్నారు గాని రు. 20,078 కోట్లు మాత్రమే సంపాదించగలిగారు. తాము పెట్టుకున్న లక్ష్యాలను సాధించడం లేదని, 1996లో డిజిన్వెస్ట్ మెంట్ కమిషన్ అనే నియంత్రణాధికార సంస్థను కూడ ఏర్పాటు చేసి, పెట్టుబడుల ఉపసంహరణ విధానాన్ని మరింత విశాలం చేశారు. ఆ తర్వాత 1999లో పెట్టుబడుల ఉపసంహరణకు అరుణ్ శౌరి మంత్రిగా ఒక కేంద్ర మంత్రిత్వ శాఖనే ఏర్పాటు చేసి పెట్టుబడుల ఉపసంహరణను మరింత వేగవంతం చేశారు. 2004 తర్వాత కేంద్ర మంత్రివర్గంలో ఆర్థిక శాఖ కింద పెట్టుబడుల ఉపసంహరణ శాఖ, వాటాల అమ్మకాలు యథాతథంగా కొనసాగినప్పటికీ పెట్టుబడుల ఉపసంహరణ వేగం కొద్దిగా మందగించింది. 2010 నుంచి మళ్లీ వేగం పుంజుకున్న పెట్టుబడుల ఉపసంహరణ 2014లో ఒకేసారి రు. 44,000 కోట్ల లక్ష్యాన్ని పెట్టుకుని ఉధృతమయింది.

ఇక్కడ ఒక్కక్షణం ఆగి, ఈ చరిత్రను మరొకవైపు నుంచి పరిశీలిస్తే, మొదట ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినది కాంగ్రెస్ నాయకత్వంలోని మైనారిటీ ప్రభుత్వం. డిజిన్వెస్ట్ మెంట్ కమిషన్ వేసినది యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వ హయాంలో. ఆ యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వానికి సిపిఐ, సిపిఎం లతో సహా వామపక్షపార్టీలు, కాంగ్రెస్ కూడ మద్దతు ఇచ్చాయి. పెట్టుబడుల ఉపసంహరణకు ఒక మంత్రిత్వ శాఖనే ఏర్పరచినది భారతీయ జనతా పార్టీ నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వ హయాంలో. ఆ తర్వాత పది సంవత్సరాలు సాగిన యుపిఎ ప్రభుత్వ కాలంలో ఆ విధానం మందకొడిగా సాగింది గాని ఆగిపోలేదు. మళ్లీ వచ్చిన ఎన్‌డిఎ హయాంలో ఆ విధానం ఉధృతమయింది. అంటే భారత రాజకీయ రంగస్థలం మీద ఉన్న అన్ని పార్లమెంటరీ రాజకీయ పక్షాలకూ పెట్టుబడుల ఉపసంహరణ విధానంతో ఏకీభావం ఉన్నదన్నమాట. దాదాపుగా ఈ రాజకీయ పక్షాలకు చెందిన కార్మిక సంఘాలన్నీ పెట్టుబడుల ఉపసంహరణను వ్యతిరేకిస్తూ నిరసన సాగిస్తుండడం మరొక విచిత్రం.

అనవసరమైన రంగాలలో ప్రభుత్వ నిధులు చిక్కుబడి పోకుండా విడుదల చేయడానికీ, ప్రభుత్వానికి నిధుల కొరతను తీర్చడానికీ, ప్రభుత్వం ముఖ్యమైన రంగాలలో మరింత సమర్థంగా పనిచేయడానికీ ఈ పెట్టుబడుల ఉపసంహరణ విధానాన్ని పాటిస్తున్నదని అన్ని రంగుల పాలకులూ, వారి సమర్థకులూ చెపుతున్నారు. కాని ఈ ప్రకటిత ఉద్దేశాలన్నీ పచ్చి అబద్ధాలని ఎందరో పరిశోధకుల నిశిత పరిశీలనలు తెలియజేశాయి. ఉపసంహరణకు గురైనవి అనవసరమైన రంగాలూ కావు, ఆ నిధులు ప్రభుత్వానికి పెద్దగా ఉపయోగపడినదీ లేదు, ఆ నిధులను ఇతరంగా ప్రజోపయోగ కార్యక్రమాలకు వెచ్చించినదీ లేదు.

నిజానికి ఈ పెట్టుబడుల ఉపసంహరణ కార్యక్రమానికి ఆర్థిక ప్రయోజనాల కన్న భావజాల, సామాజిక, రాజకీయార్థిక ప్రయోజనాలు ఎక్కువ. ఈ విధానం ద్వారా ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేయడం జరుగుతుంది. తద్వారా ఉత్పత్తిసాధనాల ఉమ్మడి యాజమాన్యం, ప్రజా యాజమాన్యం అనే అవగాహన దెబ్బతింటుంది. దశాబ్దాలుగా ప్రజాధనంతో నిర్మాణమైన ప్రభుత్వరంగాన్ని ప్రైవేటు రంగానికి అప్పగించడం, ప్రైవేటు రంగపు లాభాపేక్షకు బలిచేయడం జరిగిపోతుంది. ఆ ప్రైవేటు రంగం తమ ఆశ్రితులదో, బహుళ జాతి సంస్థలదో అయినప్పుడు ఈ నిర్ణయం తీసుకున్నవారికి ఆర్థికలబ్ధి కూడ చేకూరుతుంది. ప్రభుత్వ రంగానికి ఇంతకాలం ఉండిన సామాజిక బాధ్యతలను ఇప్పుడు సులభంగా రద్దు చేసుకోవడం వీలవుతుంది. అంటే ప్రజా అవసరాలు తీర్చే పనిని ప్రభుత్వం తన బాధ్యతగా భావించనక్కర లేదు. సామాజిక శ్రేయస్సునే తప్ప లాభనష్టాలను ప్రధానంగా చూడగూడదని వాదించేవారిని పక్కనపెట్టడానికి వీలవుతుంది. ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగకల్పన బాధ్యత రద్దయిపోతుంది. ప్రభుత్వరంగంలో దళిత, ఆదివాసి, వెనుకబడిన వర్గాలకు ఉద్యోగకల్పనకు తప్పనిసరిగా రిజర్వేషన్లు పాటించవలసి ఉండగా, పెట్టుబడుల ఉపసంహరణతో ఆ బాధ్యత పోతుంది. ప్రభుత్వ రంగంలో బలంగా ఉన్న కార్మిక ఉద్యమాన్ని పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా బలహీనపరచవచ్చు. అంటే ప్రభుత్వ రంగ సంస్థల పెట్టుబడుల ఉపసంహరణ అనే ఒక్క విధానం ద్వారా పాలకవర్గాలు తమ రాజకీయార్థిక, సామాజిక, పాలనా లక్ష్యాలెన్నిటినో సాధించుకుంటున్నాయి.

ఇంతకూ తరతరాలుగా ప్రజలు, ఆయా సంస్థల కార్మికులు పోగుచేసిన ఈ ప్రభుత్వరంగ సంస్థల సామాజిక సంపదను ఇలా దుర్వినియోగం చేసే అధికారం ఈ ప్రభుత్వానికి ఉందా అని ప్రశ్నించవలసి ఉంది. ఐదు సంవత్సరాల నిర్వహణ కోసం అధికారానికి వచ్చినవారు దశాబ్దాలుగా పోగుపడిన సంపదను ఇలా తరిగించవచ్చునా? వీ

ఉచిత విద్య అమలయ్యే హామీయేనా?

విద్యారంగాన్ని వ్యాపార వస్తువుగా మార్చిన పెట్టుబడిదారులను కట్టడి చేయకుండా, కెజి నుంచి పిజి వరకు ఉచిత విద్యను అందించడం సాధ్యమవుతుందా అని ప్రశ్నిస్తున్నారు **బి. రామకృష్ణ**

స్వాతంత్ర్య పోరాట సమయంలో, తదనంతరం, గత ఐదారు దశాబ్దాలుగా ఉచిత నిర్బంధ విద్య అమలు కోసం ప్రజల ఆకాంక్షలు వివిధ రూపాల్లో వ్యక్తమవుతూనే ఉన్నాయి. కాని దీనికి విరుద్ధంగా నేడు విద్య వ్యాపారమయం అయిపోయింది. జ్యోతిరావు పూలే, అంబేద్కర్, గాంధీ తదితరులు ఎందరో కాంక్షించిన సార్వత్రిక ఉచిత నిర్బంధ విద్య నేడు అభాసుపాలు అవుతోంది. పున్నయ్య, బిర్లా, అంబాని, శ్యాంపిట్రోడా, యశ్‌పాల్, నారాయణమూర్తి కమిటీలు విద్య ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తూ అది అనివార్యమని చెప్పాయి. ఈ సిఫారసులు స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని, రాజ్యాంగ స్ఫూర్తిని, విలువలను, ప్రజాస్వామిక ఆచరణను ధ్వంసం చేస్తున్నాయి. నేడు వేలు, లక్షలు పోసి కొనుక్కునే సరుకుగా విద్య తయారయింది. సీమాంధ్ర పెట్టుబడిదారుల గుప్పిట్లో పాఠశాల, కాలేజీ విద్య బందీ అయి కార్పొరేటీకరణకు లోనయింది. వీరే కాకుండా తెలంగాణలోని ధనిక వర్గం విద్యా వ్యాపారంలో భాగమయ్యారనేది వాస్తవం. ఈ సందర్భంలో కెజి నుండి పిజి వరకు ఉచిత నిర్బంధ విద్యను అమలు చేస్తామని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించడం సాహసమే. ఈ సాహసం ఎలా సాకారం అవుతుందన్నదే తెలంగాణ సమాజం ముందున్న ప్రశ్న.

కెసిఆర్ ముఖ్యమంత్రి అయ్యాక గజ్వేల్‌లో జరిగిన మొట్టమొదటి సభలో కెజి నుండి పిజి వరకు ప్రతి ఒక్కరికి ఉచిత నిర్బంధ విద్య అందించడానికి తన ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని, ఇది తన స్వప్నం అని ఘంటాపథంగా ప్రకటించారు. అలాగే, జూలై 26న ఉపాధ్యాయ సంఘాలతో సమావేశమైనప్పుడు కామన్ స్కూల్ విధానాన్ని తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తామని, కుల, మత ప్రసక్తి లేకుండా అందరికి ప్రత్యేక గురుకుల పాఠశాలల్లో విద్యను అందిస్తామని ప్రకటించారు. దీన్ని ఎలా అమలు చేస్తారన్న దానిపట్ల ఇంకా స్పష్టత రావల్సి ఉంది. ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు పూర్తయ్యాయి. ఇప్పుడిప్పుడే ఐఎఎస్ అధికారుల కేటాయింపులు జరుగుతున్నాయి. విధి విధానాల రూపకల్పనలో, ఎన్నికల ప్రణాళికలో చెప్పిన వాగ్దానాలను అమల్లోకి తేవడానికి ఈ సమయం సరిపోదన్నది అర్థం చేసుకోదగ్గదే. అయితే ఇది ఒక ఆకర్షణీయమైన నినాదంగా కాకుండా, దీనికి అవశ్యకమైన, ఆచరణీయ కార్యాచరణను ఇంకా ప్రకటించవల్సే ఉంది.

ప్రైవేట్ పాఠశాలలను, కాలేజీలను, యూనివర్సిటీలను నియంత్రిస్తామనీ, ప్రస్తుతమున్న ప్రభుత్వ పాఠశాలలను, కాలేజీలను, యూనివర్సిటీలను గుణాత్మక దిశలో నడిపించడానికి చర్యలను చేపడతామనీ ఎక్కడా తెలుపడం లేదు. అయితే గ్రామీణ ప్రాంతంలో నియోజకవర్గానికి ఒక గురుకుల పాఠశాలను నెలకొల్పుతామని, అందులో ప్రతి సంవత్సరం ఒక తరగతి చొప్పున రానున్న 12 సంవత్సరాలలో 12 తరగతులను ప్రారంభిస్తామని చెపుతున్నారు. ఈ గురుకుల పాఠశాలలు ఇప్పటికే నడుస్తున్న ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలకు అదనంగా ఉంటాయని ప్రకటించారు. దీనివలన ఇప్పటికే అనేక రకాలుగా ఉన్న పాఠశాల విద్యా వ్యవస్థలో (ప్రైవేట్ పాఠశాలలు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలు, ఐటిడిఎ కిందనడిచే ఆశ్రమ పాఠశాలలు, నవోదయ, మామూలుగా నడిచే ప్రభుత్వ పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలలు, మోడల్ స్కూల్‌లు మొదలైనవి) అదనంగా, మరొక దొంతరగా ఈ గురుకుల పాఠశాల రానున్నదని చెప్పకనే చెప్పినట్లయింది. ఈ దొంతర వల్ల ఉచిత విద్య సాధ్యం కాదు. ఫలితంగా కెజి నుండి పిజి వరకు ఉచిత విద్య అనే కెసిఆర్ కలలు ప్రజల పాలిట కల్లలుగా మారే ప్రమాదమున్నది. దీని గురించి తెలంగాణ ప్రజలు ఉద్యమ బాట పట్టాలేమో ఆలోచించాల్సి ఉంది.

పాఠశాల విద్య గురించి ఈ మాత్రమైనా మాట్లాడారు. కాని ఆపై ఉన్నత చదువులు, డిగ్రీ, పిజి, ఇతర ప్రొఫెషనల్ చదువుల గురించి ఏమాత్రం ప్రస్తావించడం లేదనేది గమనించదగ్గ విషయం. శ్రీ చైతన్య, నారాయణ వంటి కార్పొరేట్ కళాశాలల కబంధహస్తాల నుండి ఇంటర్మీడియట్ విద్యను విముక్తం చేయడం, ప్రైవేట్ బిఇడి, డిఇడి కళాశాలల నుండి ఉపాధ్యాయ శిక్షణా విద్యను, మెడికల్, ఇంజనీరింగ్ విద్యలను ప్రభుత్వపరంగానే అందించడం గురించి ఎక్కడా మాట్లాడడం లేదు. దీని గురించి ప్రజలు, ప్రజా సంఘాలు స్పందించాల్సి ఉంది. ప్రభుత్వంపై ఒత్తిడితెచ్చి అమలు చేయించడానికి సన్నద్ధం కావాలి.

కెజి నుండి పిజి వరకు ఉచిత విద్య కామన్ స్కూల్ విధానం గురించి ఎంతోకాలం నుండి విద్యార్థి, ఉపాధ్యాయ ఉద్యమాలు డిమాండ్ చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ కమిటీ (ఎపిఎస్ఇసి) తాను ఏర్పడ్డనాటి (1986) నుండి దీనికొరకు ఏదో ఒక స్థాయిలో చర్చను సజీవంగా ఉంచుతూ వచ్చింది. అఖిల భారత విద్యా హక్కు వేదిక (ఎఐఎఫ్-ఆర్‌టిఎఫ్) 2009లో ఏర్పడ్డ తర్వాత దేశ వ్యాప్తంగా ఈ చర్చ విస్తృతమయింది. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ప్రధానమైన ఆకాంక్షగా ఈ విషయం వచ్చిందనేది మరిచిపోలేనిది. ఈ నేపథ్యంలో దేశంలో ఎక్కడా కూడా ఏ ప్రభుత్వం మాట్లాడని అతి ప్రధానమైన ఈ విషయాన్ని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ ముందుకు తేవడం అనేది ఉచిత విద్య, కామన్ స్కూల్ వ్యవస్థ కొరకు నడుస్తున్న ఉద్యమాల కృషి వట్టిపోలేదని అనిపిస్తుంది.

అయితే ఇది ఎలా అమల్లోకి వస్తుందన్నది ప్రధానమైన విషయం. రాజ్యాంగంలో 14 ఏళ్లలోపు పిల్లలందరికి ఉచిత నిర్బంధ విద్య అందించాలని ఆదేశిక సూత్రాల్లో తెలిపారు. జీవించే హక్కులో భాగంగా విద్యను గుర్తిస్తూ రాజ్యాంగంలో సవరణ తెచ్చారు. విద్యా హక్కు చట్టం ఆర్‌టిఇ-2009 ప్రకారం 6-14 సంవత్సరాల లోపు పిల్లలకు ఉచిత నిర్బంధ విద్య అందించాలని పేర్కొంది. ఈ చట్టం అమల్లోకి వచ్చి నాలుగేళ్లు కావస్తున్నా చెప్పుకోదగ్గ మార్పేమి రాలేదు, సరికదా ఈ చట్టమే ప్రైవేట్ విద్యను ప్రోత్సహించేదిగా మిగలడం విషాదకరం. తరగతికో టీచర్ అని కాకుండా ఎన్ని తరగతులున్నా సరే విద్యార్థుల సంఖ్యను బట్టి టీచర్ల సంఖ్యను నిర్ణయించింది. పాఠశాలల్లో వసతుల గురించి ప్రస్తావించినప్పటికీ అవేవి అమల్లోకి రావడం లేదు. ఆర్‌టిఇ-2009 చట్టం విద్యా వ్యాపారీకరణను రద్దు పరిచే దిశగా లేదా కనీసం నియంత్రించే దిశలో ఎలాంటి ప్రతిపాదన చేయలేదు. అంతరాల దొంతరలుగా ఉన్న రకరకాల విద్యా వ్యవస్థలను రద్దుచేసి భారత రాజ్యాంగ స్ఫూర్తిలో భాగంగా కామన్ స్కూల్ విధానాన్ని ఆర్‌టిఇ-2009లో అసలుకే ప్రస్తావించక పోవడం అనేది భారత ప్రజలకు చేదు అనుభవాన్ని మిగిల్చింది. ఈ క్రమంలో కెసిఆర్ చెపుతున్న కెజి నుండి పిజి వరకు ఉచిత నిర్బంధ విద్య అనేది గొప్ప ముందడుగుగానే కనిపిస్తున్నది. ఆర్‌టిఇ-2009, 6-14 సంవత్సరాల పిల్లలకు అంటే, పిజి వరకు ఉచిత విద్య అదీ కూడా నిర్బంధంగా అనే నిర్ణయం ఆహ్వానించదగ్గది, హర్షించదగ్గది. ఇదే సందర్భంలో ప్రజలు, మేధావులు తెలంగాణ ప్రభుత్వంచే ఈ విధానాన్ని సక్రమంగా అమలు చేయించుకునేందుకు ఆచరణీయ ప్రణాళికలను సూచించాల్సి ఉంది. ఈ క్రమంలో కెజి నుండి పిజి వరకు ఉచిత విద్యను ఎలా ఆచరణలో పెట్టవచ్చో చూద్దాం.

ఉచితం అంటున్నప్పుడు ఇక విద్యా వ్యవస్థలో ప్రైవేట్ యాజమాన్యాలు ఉండకూడదు. ప్రైవేట్ యాజమాన్యాలు కొనసాగితే గత ప్రభుత్వాలు అమలు చేసిన ఆరోగ్యశ్రీ, ఫీజు రియింబర్స్‌మెంట్ పథకాల్లాగా విద్యా వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా విజృంభిస్తుంది. కెజి నుండి పిజి వరకు మొత్తం విద్యా వ్యవస్థ ప్రభుత్వ అధీనంలోనే కొనసాగాలి. ఇందుకొరకు మొదటి మెట్టుగా ప్రైవేట్ పాఠశాలలకు, ఇతర విద్యా సంస్థలకు వేటికీ కూడా అనుమతులు ఇవ్వకూడదు. రెండవ మెట్టుగా ఇప్పటికే నడుస్తున్న వాటిని క్రమేపీ స్వాధీన పరుచుకోవాలి. దీనికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు సిద్ధం చేసి ప్రైవేట్ యాజమాన్యాలకు స్పష్టమైన నిర్దేశకాలు జారీ చేయాలి.

రకరకాల దొంతరలుగా నడుస్తున్న పాఠశాల వ్యవస్థలను అన్నింటిని ఒకే గొడుగు కిందకు తీసుకురావడానికి తగు కార్యాచరణను చేపట్టాలి. ఒకే క్యాచ్‌మెంట్ ఏరియాలో ఉన్న అన్ని రకాల పాఠశాలలను కలుపుతూ పూర్వ ప్రాథమిక విద్యతో పాటు 1 నుండి 12 తరగతుల వరకు ఒకే పాఠశాలగా మార్చి అన్ని రకాల వసతులను ఏర్పాటు చేయాలి. ఆటస్థలం, నీటి వసతి, చాలినన్ని పరిశుభ్రమైన మరుగుదొడ్లు, విశాలమైన వెంటిలేటెడ్ గదులు, లైబ్రరీ, లాబొరేటరీ, ప్రతి తరగతికి ఒక గది, ఒక టీచర్ ఉండేలా చూడాలి. అదనంగా ఆటలు వ్యాయామ విద్య, పని, కంప్యూటర్ విద్య, విలువలు, జీవన నైపుణ్యాలు, కళలు, సాంస్కృతిక విద్యలకు సంబంధించిన టీచర్‌లను నియమించాలి. ఇప్పటి వరకు ఈ టీచర్ పోస్టులే లేవు. ఈ టీచర్లకు సంబంధించి ఉపాధ్యాయ శిక్షణా సంస్థల్లో సిలబస్ గాని శిక్షణా కార్యక్రమం గాని లేనేలేవు. (ఆటలు వ్యాయామ విద్యలు తప్పించి) ఉన్నత పాఠశాలల్లో ఆటలు వ్యాయామ విద్య టీచర్ పోస్టులున్నాయి.

విద్యార్థులు కేవలం మార్కులు సాధించే యంత్రాలుగా కాకుండా వారిని బాధ్యతాయుతమైన పౌరులుగా, వారి వ్యక్తిత్వం పరిణతి చెందేలా చదువుతో పాటు క్రీడలు, కళలు తదితర అంశాల్లో అభిరుచి, ప్రావీణ్యతలు పొందే పాఠశాల నిర్వహణ గురించి టిఆర్‌ఎస్ ఎన్నికల ప్రణాళిక-2014లో వాగ్దానం చేసింది. దీన్ని ఆచరణలో రుజువు చేయాల్సి ఉంది.

టిఆర్‌ఎస్ ఎన్నికల ప్రణాళికలో చెప్పినట్లుగా 15 ఎకరాల విశాల ప్రాంతంలో పాఠశాలను ఏర్పాటు చేయాలి.

ప్రతి తరగతిలో విద్యార్థుల సంఖ్య 20 మించకుండా చూడాలి. తద్వారా గుణాత్మక విద్యతో పాటు ఉపాధ్యాయుల్లో జవాబుదారీ తనంను డిమాండ్ చేసే పరిస్థితి వస్తుంది. ప్రాథమిక స్థాయి నుండి భాషా బోధనలకు ప్రత్యేక శిక్షణ పొందిన టీచర్లను నియమించాలి. అందుకోసం డిఇడి శిక్షణా సంస్థల్లో మార్పులు అవసరం అవుతాయి.

డ్రాప్ అవుట్ కొరకు వయస్సు వారిగా తగు తరగతుల్లో చేర్చుకోవ డానికి ఆయా తరగతులకు తగ్గ సామర్థ్యాలను పెంపొందించడం కొరకు ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు ప్రత్యేక టీచర్లను నియమించాలి. అలా తరగతికి తగ్గ సామర్థ్యాలను పొందిన వారిని రెగ్యులర్ తరగతుల్లోకి ప్రవేశం కల్పించాలి.

పేదరికం లేదా మరే ఇతర కారణాల రీత్యా బడి మానేసే పిల్లలను దృష్టిలో పెట్టుకుని 6వ తరగతి నుండి రెసిడెన్షియల్ బడులను అవసరాన్ని బట్టి మండలాల్లో నెలకొల్పాలి. రెసిడెన్షియల్ పద్ధతిని నిర్బంధం చేయరాదు. అది ఐచ్చికంగానే ఉండాలి.

ఆంగ్ల మాధ్యమంలో బోధన కాకుండా ఆంగ్ల సబ్జెక్టును గుణాత్మకంగా బోధించేలా పాఠశాల విద్య పూర్తయ్యేలోపు ఆంగ్లంలో ధారాళంగా మాట్లాడగల, రాయగల సామర్థ్యం వచ్చేలా తగు చర్యలు తీసుకోగలిగితే చాలు. ఇందు కొరకు ఉపాధ్యాయ శిక్షణా సంస్థలను సంస్కరించాల్సి ఉంటుంది. ప్రాథమిక స్థాయి నుండి ఆంగ్ల సబ్జెక్టును బోధించడానికి ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయులను నియమించాల్సి ఉంటుంది. ఆంగ్ల మాధ్యమంలో బోధనాభ్యసన అంటే గణితం, సాంఘిక శాస్త్రం, సైన్స్ సబ్జెక్టులను, అలాగే ఈ మధ్యలో కొత్తగా ప్రవేశపెట్టిన పని కంప్యూటర్ విద్య, కళలు సాంస్కృతిక విద్య, విలువలు, జీవనైపుణ్యాలు వంటి వాటితో పాటు ఆటలు వ్యాయామ విద్యలను ఆంగ్లంలో అర్థం చేయించడం, ఆంగ్లంలో వ్యక్తీకరించమనడం, ఆంగ్లంలోనే అర్థం చేసుకోమనడం అన్నట్లే కదా!

జ్ఞాన నిర్మాణం, జ్ఞాన సముపార్జన అనేది తాను పుట్టి పెరిగిన భాషా వాతావరణంలో సక్రమంగా జరుగుతుంది. తప్పిస్తే పరాయి భాష ద్వారా ఇది సాధించాలనుకోవడం కష్టమైన పని. పాఠశాల విద్యను గుణాత్మకంగా అందించాక ఆపై ఉన్నత చదువులను విద్యార్థుల

ఆసక్తులను, సామర్థ్యాలను, అవసరాలను అనుసరించి ఆంగ్ల మాధ్యమం గురించి ఆలోచించవచ్చు. వాస్తవానికి మొత్తం విద్యా వ్యాసంగం పరిశోధనా స్థాయి వరకు మాతృ భాషలోనే జరగాలి.

సిబిఎస్‌ఇ సిలబస్ అని కాకుండా దేశవ్యాప్త సిలబస్‌ను దృష్టిలో పెట్టుకుని దానిలోని శాస్త్రీయ అంశాలను, పరిగణనలోకి తీసుకుంటూ రాష్ట్ర పరిసరాల అవసరాలకు అనుగుణంగా సిలబస్ గాని బోధనా పద్ధతులు గాని డిజైన్ చేసుకోవాలి.

ప్రత్యేక అవసరాలు గల (గుడ్డి, మూగ, చెవిటి, మానసిక వెనుకబాటుతనం, మాటలు, వినికిడి లోపం) పిల్లలకు రెగ్యులర్ పాఠశాలలోనే ప్రత్యేక శిక్షణ పొందిన టీచర్లతో ప్రత్యేక తరగతుల ద్వారా విద్యను అందించాలి. వీరి అవసరాలను, సంఖ్యను బట్టి జిల్లాలో, మండలాల్లో ఒకటో రెండో పాఠశాలల్లో తగు ఏర్పాట్లు చేయాలి.

తరగతి గదిలో మొత్తంగా పాఠశాలలో బోధనాభ్యసన ప్రక్రియ అర్థవంతంగా గుణాత్మకంగా ఉండేందుకు తగు చర్యలు తీసుకోవాలి. దీని కోసం క్షేత్రస్థాయి పరిశోధనలు నిర్వహించాలి. ఇందులో ఉపాధ్యాయుల, విద్యార్థుల, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల, ఉపాధ్యాయ శిక్షణా సంస్థల, విద్యా పరిశోధనా సంస్థల భాగస్వామ్యాన్ని పెంచాలి. శాశ్వత ప్రాతిపదికన ప్రతి సబ్జెక్టుకు సంబంధించి నిరంతరం టీచర్ ఫ్రెండ్లీ పర్యవేక్షణా యంత్రాంగం లేదా రిసోర్స్ గ్రూప్‌ను ఏర్పరచాలి. నెలలో కనీసం రెండుసార్లు ప్రతి పాఠశాలను సందర్శించి బోధనాభ్యసన ప్రక్రియలో తలెత్తే క్షేత్రస్థాయి సమస్యలను పరిష్కరించేదిగా ఉండాలి. ఈ యంత్రాంగం రిసోర్స్ గ్రూప్ ఎప్పటికప్పుడు జాతీయ, అంతర్జాతీయ అనుభవాలను, పరిశోధనలను, ప్రత్యామ్నాయ పద్ధతులను అవగాహన చేసుకుంటూ పరిశోధన దృక్పథాన్ని కలిగి ఉండి పరిశోధనలు చేసేదిగా ఉండాలి. పాఠశాలలో సిబ్బంది జవాబుదారీ తనాన్ని పెంచి ప్రతి విద్యార్థి పురోభివృద్ధిని సాధింప చేయడంలో, మొత్తంగా పాఠశాలలను గుణాత్మక దిశలో నడిపించడానికి ఈ పర్యవేక్షక యంత్రాంగం సహకరిస్తుంది. టీచర్ ఎద్యుకేటర్స్, ఎస్‌సిఇఆర్‌టి అధ్యాపక సిబ్బంది, ఎంఇఒ, డివైఇఒ, డిఇఒలు నెలకు రెండు, మూడు రోజులు తప్పనిసరిగా పాఠశాలలో తరగతి గది బోధన చేసేలా చూడాలి. తద్వారా క్షేత్రస్థాయిలో వచ్చే సమస్యల పరిష్కారాలవైపు నడవడానికి ఇది దోహదపడుతుంది.

బిఇడి, డిఇడి శిక్షణా సంస్థలల్లో గుణాత్మకమైన మార్పు తీసుకు రావాలి. పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాల్సి ఉంది. ప్రైవేట్ శిక్షణా సంస్థలను రద్దు చేయాలి. పూర్తిగా ప్రభుత్వ అధీనంలోనే అవి నడవాలి.

ప్రతి సంవత్సరం లేదా రెండేళ్లకోసారి టీచర్ నియామక పరీక్షలు నిర్వహించి ఎంపిక లిస్ట్ తయారు చేసుకోవాలి. పాఠశాలలో ఖాళీలు ఏర్పడిన రోజునే వీరిని నియామకం చేసేలా చూడడం ద్వారా పాఠశాలలో సిబ్బంది కొరత అనేది ఉండనే ఉండదు. పిల్లలకు నిరంతరాయంగా బోధన జరుగుతుంది. ఇదే పద్ధతిని ఉన్నత విద్యా సంస్థల్లో కూడా అమలు చేయాలి.

విద్యార్థుల జనాభాను అనుసరించి మండలాల్లో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలి. వీలైనంత మేరకు ఉన్నత విద్య అలాగే పరిశోధనలు కూడా మాతృ భాషలో ఉండాలి.

అవసరమైనంత మేరకే ప్రొఫెషనల్ (మెడిసిన్, అగ్రికల్చరల్, వెటర్నరీ, ఇంజనీరింగ్, లా, బిజినెస్ మేనేజ్‌మెంట్, మైనింగ్, టెక్స్‌టైల్స్, అక్వాకల్చర్, మెరైన్, ఏవియేషన్, ఉపాధ్యాయ తదితర) కాలేజీలను నెలకొల్పాలి. ఇప్పటివలె అవసరం లేకున్నా పెద్ద మొత్తంలో ఇంజనీరింగ్ కాలేజీలు నెలకొల్పడం కాదు. దీనిపై ఎప్పటికప్పుడు పరిశోధనలు జరుగుతుండాలి. తద్వారా ఏయే కోర్సుల్లో ఎంతమంది అవసరముందో శాస్త్రీయంగా తెలుసుకోవచ్చు. ఆ మేరకు ఆయా కోర్సుల్లో ప్రవేశాలు కల్పించవచ్చు. ఉన్నత చదువులందించే విద్యా సంస్థలన్నింటికీ అనుబంధంగా హాస్టల్ వసతి కల్పించాలి. కుటుంబ పరిస్థితులను అనుసరించి అవసరమైన విద్యార్థులకు ఈ హాస్టల్‌లు ఉపయోగ పడతాయి. ప్రతి ఉన్నత విద్యా సంస్థలో లైబ్రరీ, లాబోరెటరీ, ఆటస్థలాలు, స్విమ్మింగ్ పూల్, పచ్చటి ప్రకృతి వాతావరణం తదితర అన్ని రకాల వసతులు ఏర్పాటు చేయాలి.

జిల్లాకో యూనివర్సిటీ స్థాపించి ఉన్నత విద్యను వికేంద్రీకరించాలి. వీటిని సమన్వయ పరిచేలా రాష్ట్ర స్థాయిలో యుజిసి వంటి దానిని ఏర్పాటు చేయాలి. ప్రతి యూనివర్సిటీ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో స్థానిక, రాష్ట్రీయ, జాతీయ, అంతర్జాతీయ సంబంధిత అంశాలపై ఆచరణాత్మక పరిశోధనలు, అధ్యయనాలు జరిగేలా చర్యలు తీసుకోవాలి. ఈ అధ్యయనాల, పరిశోధనల ఫలితాలను వెంట వెంటనే సమాజం అందుకునేలా విధానాలుండాలి. కాని వ్యక్తులకు డిగ్రీలు ప్రదానం చేసేవిగానో, లైబ్రరీ ర్యాక్‌లలో మగ్గిపోవడానికో ఉండకూడదు.

డిగ్రీ స్థాయి విద్య పూర్తయ్యాక అవసరమైన విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు గ్యారంటీ చేయబడాలి. ఇంకా పై చదువులు కొనసాగిస్తూ సామాజిక అవసరాలు తీర్చడానికి కావాల్సిన అధ్యయనాలు, పరిశోధనలు చేసేందుకు పూర్తిస్థాయి అవకాశాలు ఉండేలా తగు చర్యలు తీసుకోవాలి. చదువు అనేది వ్యక్తిగతం కాదని అది సామాజికం అని అంతిమంగా అది సమాజాభివృద్ధికి, సాటి మనుషుల కష్ట సుఖాల్లో పాలు పంచుకోవడానికే అనే సామాజిక, మానవీయ సంవేదనలు కలిగించేదిగా విద్యా వ్యవస్థ ఎదగాలి. ఈ నేపథ్యంలో కెజి నుండి పిజి వరకు ఉచిత నిర్బంధ విద్య అనేది ఇక ఎంతమాత్రం ప్రైవేట్ శక్తుల చేతుల్లో ఉండకూడదు. విద్య అనేది కొనుక్కునే వస్తువుగా మిగల కూడదు.

(రచయిత ఉపాధ్యాయులు)

వీ

రచయితలకు సూచన : *తక్షణ, సమకాలీన అంశాలపై రచనలు చేసి ఆ సంచికలోనే రావాలనుకొనే రచయితలు 20వ తేదీ లోగా పంపగలిగితేనే మరుసటి నెల సంచిక కోసం పరిశీలించడం సాధ్యమవుతుంది. ఆ తరువాత వచ్చిన రచన, అంశం ఎంత ముఖ్యమైనదైనా పరిశీలించడం, ముద్రణకు సిద్ధం చేయడం అసాధ్యమవుతుంది. రచయితలు గుర్తించగలరు. - సం.*

మిథ్యగా మారుతున్న ఇంజనీరింగ్ విద్య

విద్యను ప్రైవేట్ రంగానికి అప్పగించి ఫీజు రియింబర్స్‌మెంట్ విధానాన్ని అమలు చేస్తున్న ప్రభుత్వాలు ఆ మోసపూరిత విధానాలను మానుకోవాలనీ, విద్యారంగాన్ని ప్రభుత్వరంగంలో నిర్వహించినప్పుడే విద్య అందరికి అందుబాటులో ఉంటుందనీ అంటున్నారు ఎ. నర్సింహారెడ్డి

ఆధునిక సాంకేతిక యుగంలో ఉన్నత విద్య సృజన శక్తులను అభివృద్ధి పరిచి దేశ ప్రగతికి తోడ్పడవల్సిన ఇంజనీరింగ్ చదువుల తీరు మన రాష్ట్రంలో మేడిపండు చందంగా మారిన వైనం తెలంగాణ సమాజాన్ని నిశ్చేష్టపరుస్తున్నది. దేశం మొత్తం మీద ఇంజనీరింగ్ సీట్లు 75 వేలకు మించరాదని ఆచార్య యు.ఆర్.రావు సారథ్యంలోని నిపుణుల సంఘం 2003లోనే నిర్ధారించింది. అయినా మన రాష్ట్రం (ఉమ్మడి) లోనే నాలుగింతలకు పైగా సీట్లు ఉన్నాయి. అడగడమే పాపమన్నట్లుగా అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఎఐసిటిఇ) అనుమతులతో పుట్టుకొచ్చిన వందలాది ఇంజనీరింగ్ కళాశాలల్లో బోధన ప్రమాణాలు పరమ అధ్వాన్నమని ప్రభుత్వ టాస్క్‌ఫోర్స్ అధ్యయనాలు వెలుగులోకి తెచ్చాయి. ఏటా మూడు లక్షలకు పైగా ఇంజనీరింగ్ పట్టభద్రుల తయారీ సామర్థ్యంగల ఏడొందల కళాశాలల్లో 654 అన్‌ఎయిడెడ్ కళాశాలల్ని పరిశీలించి బయటపెట్టిన వివరాలు సమాజ భవిష్యత్తుకు, విద్యార్థుల భవిష్యత్తుకు అవి ఎలా గోరీ కడుతున్నాయో వెల్లడిస్తున్నాయి.

దేశీయంగా ఇంజనీరింగ్ చదువులపై మషేల్కర్ (1998), యు.ఆర్. రావు (2003), పి. రామారావు (2004), బెనర్జీ మూలే (2007), విజ్ఞాన సంఘం (శ్యాం పిట్రోడా 2006) – అర్హులైన అధ్యాపక శ్రేణులే ప్రమాణాల ఉన్నతీకరణకు ప్రాణాధారమని స్పష్టీకరించాయి. ఇంజినీరింగ్ కాలేజీల బోధన అవసరాలకు 2008 నాటికే 26 వేలమంది డాక్టరేట్లు, 30 వేలమంది పోస్ట్ గ్రాడ్యుయేట్ల కొరత ఉందని విజ్ఞాన సంఘమే స్పష్టీకరించింది. ప్రపంచంలో ఏ పురోగామి దేశంతో పోల్చినా పరిశోధన పత్రాల సమర్పణలో తీసికట్టు అయిన ఇండియాలో డాక్టరేట్ అధ్యాపకుల కొరత తీరేదెట్లా? ఐఐటీల్లాంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లోనే 40శాతం దాకా అధ్యాపక పోస్టుల ఖాళీలు సమస్య తీవ్రతను కళ్లకు కడుతున్నాయి. మరోవంక వానకాలం చదువులకు నకళ్లుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ఇంజనీరింగ్ కాలేజీలు భ్రష్టుపట్టి పోతున్నాయి. చేతిలో ఇంజినీరింగ్ పట్టా పట్టుకొని, కడుపు నింపుకొనే దారిలేక మూటలు మోయడానికి కూడా సిద్ధపడుతున్న బిడ్డల్ని చూసి, తల్లిదండ్రుల కంట రక్తాశ్రువులు రాలుతున్నాయి. ఉద్యోగాల్ని సృష్టించే మెరికల్ని రూపొందించడమే లక్ష్యంగా పటిష్ఠ ప్రణాళికలతో అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడా దేశాల్లో ఉన్నత విద్యారంగం ధీమాగా ముందడుగేస్తుంటే, ఏటా ఆరు లక్షల మంది నిరుద్యోగ ఇంజనీరింగ్ పట్టభద్రుల నిట్టూర్పులతో ఇండియా వేసారి పోతోంది. దేశంలోనే అత్యధిక ఇంజినీరింగ్ కాలేజీలకు నెలవైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు ప్రమాణాల మెరుగుదలపై చూపిన నిర్లక్ష్యం వలన రేపటితరం భవిష్యత్తుకు భరోసా లేకుండా పోయింది.

దేశాన్ని జ్ఞాన సమాజంగా, జ్ఞాన ఆర్థిక వ్యవస్థగా రూపొందించడానికి 11వ పంచవర్ష ప్రణాళిక (2007–12) లో విద్యావంతులు, నిపుణులు, సృజనశీలుర జాతిగా రూపొందిస్తామని ప్రకటించిన యుపిఎ ప్రభుత్వం విద్యా వ్యాపారంలోని డొల్లతనాన్ని, ఉన్నత విద్యా సంస్థల యాజమాన్యాల అక్రమాలను నియంత్రించలేక పోయింది. ఉన్నత విద్యావ్యాప్తికి ఇచ్చిన ప్రాధాన్యత విద్యా ప్రమాణాల పట్ల చూపలేక పోయింది. విద్యా సంబంధిత అన్ని స్థాయిల్లో అధికారుల అవినీతి అక్రమాల పట్ల ఉదాసీనంగా వ్యవహరించిన తీరు దిగనాసి చదువుల జాతరలో స్పష్టంగా ప్రతిఫలిస్తున్నది. మన రాష్ట్రంలో 1994–95 విద్యా సంవత్సరంలో 32 ఇంజనీరింగ్ కళాశాలలు మాత్రమే ఉండేవి. వాటిలో 9335 సీట్లు అందుబాటులో ఉండేవి. చంద్రబాబు ప్రపంచబ్యాంక్ నిర్దేశాల మేరకు (1995–2004) ఉన్నత విద్యను ప్రైవేటీకరించి రెవెన్యూ డివిజన్‌కొక ఇంజనీరింగ్ కాలేజీ లక్ష్యాన్ని ప్రకటించాక ఉమ్మడి రాష్ట్రంలో దాదాపు 300 కాలేజీలు ఏర్పడ్డాయి. వై.ఎస్. రాజశేఖరరెడ్డి పాలన (2004–2010) లో మరో 400 కాలేజీలు ఏర్పడ్డాయి. మొత్తంగా 700 కాలేజీలు మూడు లక్షల విద్యార్థులను ఏటా చేర్చుకుంటున్నాయి. మొదట్లో విద్య సామాజిక మార్పుకు దోహదపడే అంశంగా భావించిన కొందరు ప్రైవేట్‌రంగంలో ఇంజనీరింగ్ విద్యకు శ్రీకారం చుట్టారు. కళాశాలల స్థాపనకు అనుమతులు ఇచ్చే అఖిల భారత సాంకేతిక విద్యా మండలి అవినీతి, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ప్రేక్షక పాత్ర, అనుబంధ విశ్వవిద్యాలయాల నిష్క్రియాపరత్వం వెరసి రాష్ట్రంలో ఇంజనీరింగ్ విద్య విషవృక్షంలా పెరిగింది. ఈ స్థితిలో రియల్‌ఎస్టేట్ వ్యాపారులు, రాజకీయ నాయకులు, విద్యా వ్యాపారులు ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాల అవతారం ఎత్తారు.

2008 జనవరిలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైన ఫీ రియింబర్స్‌మెంట్ పథకం తల్లిదండ్రుల వార్షిక ఆదాయం 2 లక్షల రూపాయలలోపు ఉన్న ఎస్.సి, ఎస్.టి విద్యార్థులకు, లక్ష రూపాయల ఆదాయం కలిగిన బి.సి, ఇబిసి, ఇతర విద్యార్థులకు లబ్ధిచేకూరేలా శ్రీకారం చుట్టారు. ఫీ రియింబర్స్‌మెంట్ పథకం ప్రవేశ పెట్టాక బోధన రుసుము బొక్కేందుకే అడ్డదిడ్డంగా ఆవిర్భవించిన కాలేజీలలో కనీస బోధనా ప్రమాణాలు ఉన్నాయో లేవో పరిశీలించే తీరిక ఎవరికీ లేకపోయింది. చేతులు తడిపితే చాలు అవసరమైన అనుమతులు వచ్చాయి. పర్యవసానంగా విద్యార్థుల భవిష్యత్తు అంధకారంగా మారింది. సాంకేతిక విద్యామండలి నియమించిన త్రిసభ్య కమిటీ దేశవ్యాప్తంగా ఇంజనీరింగ్ పట్టభద్రుల్లో ఉద్యోగార్హులు 23 శాతం కాగా ఉమ్మడి రాష్ట్రంలో 16 శాతమేనని 2011లోనే నిగ్గుతేల్చింది. విద్యా సామ్రాజ్యాన్ని

విస్తరించుకోవడం ద్వారా లాభాలు దండుకోవచ్చన్న ప్రైవేట్ విద్యాసంస్థల ముందుచూపు ప్రభుత్వానికి బోధపడలేదు. అనేక అక్రమాల ద్వారా ప్రభుత్వధనాన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు కొల్లగొట్టాయన్న ఆరోపణలు ఉన్నా అధికార ప్రతిపక్ష పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులు విద్యావ్యాపారుల అవతారం ఎత్తడంతో దీనిపై పెద్దగా చర్చ జరగలేదు. ఫీ రియింబర్స్‌మెంట్ పథకం ద్వారా మంజూరైన మొత్తంలో 75 శాతం వృత్తి విద్యా కళాశాలల వాటాగా వెలుతుంది.

ఈ క్రమంలోనే యాజమాన్యాల దృష్టి ఫీజుల పెంపు, ఏకీకృత ఫీజుల అమలు, బకాయిల చెల్లింపు వంటి అంశాలపై పడింది. కార్పొరేట్ శక్తులు, రాజకీయ నాయకులు కలిసి ఒక కృత్రిమ ఉద్యమాన్ని లేవదీశారు. కొన్ని విద్యార్థి సంఘాలను ప్రోత్సహించి ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీ క్రమబద్ధీకరణ గురించి ఆందోళన చేయించారు. ఏకీకృత ఫీజులు అమలు పరచాలని కోరుతూ రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. 2011 అక్టోబర్ 29న హైకోర్టు ధర్మాసనం కామన్ ఫీజుల విధానాన్ని అమలుపరచాలని తీర్పు వెలువరించింది. నాటి ప్రభుత్వం సుప్రీంకోర్టు ద్వారా స్టే ఉత్తర్వులు పొందినా సుప్రీంకోర్టు తుదితీర్పుతో 2012-13 విద్యా సంవత్సరానికి కామన్ ఫీజులు చెల్లించాలని నిర్ణయించింది. సుప్రీంకోర్టులో కామన్ ఫీజుల కేసు విచారణ సందర్భంగా జస్టిస్ సుధాంశ్ జ్యోతి ముఖోపాధ్యాయ ఆసక్తికర వాఖ్యలు చేశారు. 'ఏ చట్ట ప్రకారం ప్రైవేట్ కళాశాలలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తుంది? దక్షిణాదిలో కాలేజీలు పెరగడం వల్లనే ఈ సమస్య వచ్చింది. ఫీజుల పెంపు సమస్యకు కారణం కాదు. అసలు మీరెందుకు ప్రైవేట్ కాలేజీలకు డబ్బు చెల్లిస్తున్నారు? ప్రభుత్వ కళాశాలలను ఏర్పరచి ఉచితంగా ప్రవేశాలు కల్పించండి!' అని పేర్కొన్నారు. గత ప్రభుత్వాల ఉదాసీన వైఖరి, ఫీజు రియింబర్స్‌మెంట్ పథకం, ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్య కోటా, సీట్ల అమ్మకాలు, అక్రమంగా మైనారిటీ హోదా, నాసిరకమైన విద్యా బోధన, విద్యాసంస్థల విస్తరణ మొత్తంగా విద్యావ్యాపార మాఫియాను ప్రభుత్వం పోషించింది.

ప్రైవేట్ కళాశాలలు డొనేషన్లు, అధికఫీజులు వసూలు చేస్తున్నాయన్న సాకుతో ఫీజులను నిర్ణయించే పని ప్రభుత్వం చేపట్టింది. రెండేళ్లకొకసారి ఫీజులు నిర్ణయించేందుకు ఒక కమిటీ(ఎఎఫ్‌ఆర్‌సి)ని నియమించింది. పూర్తిగా ప్రైవేట్ కాలేజీల యాజమాన్య సభ్యులతో నిండిన ఈ కమిటీ అనూహ్య రీతిలో ఫీ పెంచడానికి సిఫార్స్ చేసింది. ప్రైవేట్ కళాశాలలు సమర్పించిన ఖర్చులను పరిశీలించి ఎంత ఫీజు వసూలు చేయాలో ప్రభుత్వం నిర్ణయిస్తుంది. ఈ ఖర్చుల లెక్కలను చూసినప్పుడు, ఫీజు రియింబర్స్‌మెంట్‌కు ఇంతవరకూ ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఖర్చుతో ప్రభుత్వమే ఇంజనీరింగ్ కాలేజీలను స్థాపించగలిగేది, అందరికీ ఉచిత నాణ్యమైన విద్యను అందించగలిగేదని స్పష్టమైంది. మరో మాటలో చెప్పాలంటే, ప్రైవేట్ కళాశాలలకు నష్టాలు రాకుండా చూసేందుకే ప్రభుత్వం ఫీ రియింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఫీ నిర్ణయించే బాధ్యతను చేపట్టింది. ఇందులో కూడ పారదర్శకత లోపించింది. ఆరోగ్యశ్రీ పథకంతో కార్పొరేటు ఆసుపత్రులకు నిధులు కట్టబెట్టి ప్రభుత్వ ఆసుపత్రులను కునారిల్ల చేసినట్లుగానే, ఫీజు రియింబర్స్‌మెంట్ పథకం ప్రైవేట్ కళాశాలలను నష్టాలబారిన పడకుండా ప్రభుత్వమే రక్షించింది.

ఈ పథకం ద్వారా 2008-09 విద్యా సంవత్సరంలో రు. 1463 కోట్లు, 2009-10లో రు. 1567 కోట్లు, 2010-11లో రు. 2949 కోట్లు, 2011-12లో రు. 3569 కోట్లు, 2012-13లో రు. 4295 కోట్లు చెల్లించారు. ఇక 2013-14 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రు. 2238 కోట్లు, తెలంగాణ రాష్ట్రం రు. 2091 కోట్లు బకాయిలు చెల్లించవలసి ఉంది.

ఇంజనీరింగ్ విద్యా వ్యాపారం పట్ల విద్యార్థుల ఆందోళనలు, కొరవడుతున్న ప్రమాణాలు, యాజమాన్యాల అక్రమాలపై అనేక కమిటీల నివేదికలు వెలుగులోకి రావడంతో ప్రభుత్వం 2010 జూలైలో కళాశాలల ప్రమాణాలు, యాజమాన్యాలు వ్యవహరించిన తీరు, దిగజారుతున్న విద్యా ప్రమాణాల అధ్యయానికి ఉన్నత స్థాయి కమిటీని నియమించింది. ఈ కమిటీ సిఫారసుల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్‌ల ద్వారా (4,5) ఆంధ్రప్రదేశ్ విద్యా చట్టం 1982కు, 2008కి సవరణలు చేపట్టింది. దీంతో సంక్రమించిన అధికారాలతో, రాష్ట్ర ప్రభుత్వం ఇంజనీరింగ్ కళాశాలల అక్రమ భాగోతాలను వెలికి తీసేందుకు జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయిలో టాస్క్‌ఫోర్స్‌లను నియమించింది. సాంకేతిక విద్యా కమిషనర్ అజయ్ జైన్ కన్వీనర్‌గా ఉన్న రాష్ట్ర స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీలో సభ్యులుగా సీనియర్ ఐఎఎస్ అధికారి ఎస్.కె.సిన్హా, ఐ.పి.ఎస్. అధికారి ఉమేశ్ షరాఫ్, రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యదర్శులు ఉన్నారు. ప్రైవేట్‌రంగంలో కొలువుదీరిన 685 కళాశాలల తనిఖీలకు ప్రభుత్వం నిర్ణయిస్తే, వాటిలో 31 కళాశాలలు తమ కళాశాలలను నడపలేమని చేతులెత్తేశాయి. టాస్క్‌ఫోర్స్ కమిటీ తనిఖీల్లో వెలుగు చూసిన అంశాలతో ఓ నివేదిక తయారైంది. ఈ నివేదికను సమైక్య రాష్ట్రంలోని ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉన్నప్పటికీ ఓ ఉన్నతాధికారి అభీష్టం మేరకు అది వెలుగు చూడలేదు. టాస్క్‌ఫోర్స్ 654 కాలేజీలను తనిఖీ చేసి సమర్పించిన నివేదికలోని అంశాలు దిగ్భ్రాంతి గొలిపేవిగా ఉన్నాయి. ఇంజనీరింగ్ కళాశాలల్లోని డొల్లతనం బహిర్గతమైంది. అనేక ఆసక్తికరమైన విషయాలు వెలుగుచూశాయి.

ఇంజనీరింగ్ కళాశాలలు విద్యా ప్రమాణాలను గాలికి వదిలేసి, విద్యార్థి లోకానికి చుక్కలు చూపిస్తున్నాయి. నియంత్రణ సంస్థలిచ్చిన నిబంధనలను మచ్చుకైనా అమలు చేయడంలేదు. సేవా దృక్పథం మచ్చుకైనా కనిపించదు. వ్యాపారాత్మక ధోరణి పెరిగిపోయింది. ప్రచారార్భాటంతో పబ్బం గడుపుకుంటున్నాయి. దేశంలో మరెక్కడా లేని విధంగా రాష్ట్రంలో ప్రైవేట్‌రంగంలో 654 ఇంజనీరింగ్ కళాశాలలు నడుస్తుండగా.. వాటిలో సింహభాగం కళాశాలల్లో రూల్స్ ఫార్స్‌గా మారాయి. 164 కళాశాలల్లో మాత్రమే పేస్కేళ్లు అమలవుతున్నాయి. చట్టబద్ధంగా పాటించాల్సిన నిబంధనలకు దూరంగా 622 కళాశాలల్లో 1:15 నిష్పత్తిలో ఫ్యాకల్టీ లేదు. ఎఐసిటిఇ నిబంధనల ప్రకారం ఒక ప్రొఫెసర్, ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్స్, ఆరుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్స్. అంటే 1:2:6 నిష్పత్తుల్లో ప్రొఫెసర్ల నియామకం జరగాలి. ప్రతి 15 మందికి ఒక ప్రొఫెసర్ ఉండాలన్న నిబంధనలు 96 శాతం కళాశాలల్లో అసలు అమలు కావడం లేదు. 8398 మంది పి.హెచ్.డి. అర్హత గల ప్రొఫెసర్స్ ఉండాల్సిన కాలేజీల్లో 2183 మంది ఉన్నారు.

16796 మంది అసోసియేట్ ప్రొఫెసర్స్ అవసరముండగా 4789 మంది మాత్రమే ఉన్నారు. 50391 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లకు గాను 32833 మంది మాత్రమే ఉన్నారు. 565 కళాశాలల్లో ల్యాబ్ ఎక్విప్‌మెంట్ లేదు. 449 కాలేజీల్లో ల్యాబ్ ఏరియా తగినంత లేదు. 319 కళాశాలల్లో విద్యార్థులకు అవసరమైన బిల్టప్ ఏరియా లేదు. 393 కాలేజీల్లో కంప్యూటర్ టెర్మినల్స్‌లో లోపాలు, 146 కాలేజీల్లో లైబ్రరీ సౌకర్యం సరిగ్గా లేదు. 50-75 శాతం కళాశాలల్లో లైబ్రరీల్లో జర్నల్స్ కనిపించవు అని 2012 సెప్టెంబర్, 2013 మార్చి నెలల్లో జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిల్లో నిర్వహించిన తనిఖీల్లో టాస్క్ ఫోర్స్ కమిటీలు తేల్చి చెప్పాయి.

తొలుత జిల్లా స్థాయిలో తనిఖీలు నిర్వహించినప్పుడు సింహభాగం ఇంజనీరింగ్ కళాశాలల్లో ఫ్యాకల్టీ చాలా తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. అయితే ప్రాంతీయ స్థాయి కమిటీలు తనిఖీలు చేపట్టినప్పుడు ఆయా కళాశాలలు తమ ఫ్యాకల్టీని అమాంతంగా పెంచేశాయి. ఫ్యాకల్టీ సంఖ్య అయితే పెంచారు కానీ అర్హత కలిగిన వారు మాత్రం పనిచేయటం లేదని దాదాపు అందరూ బిటెక్ వారేనని తేలింది. అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసిటిఇ) నిబంధనల ప్రకారం ప్రతి 15 మంది విద్యార్థులకు ఒక అధ్యాపకుడు ఉండాలి. కానీ రాష్ట్రంలోని 622 ఇంజనీరింగ్ కాలేజీల్లో 1:15 నిష్పత్తిలో ఫ్యాకల్టీ లేదు. ఉన్న ఫ్యాకల్టీలోనూ 70 శాతం మంది బిటెక్‌లే కావడం గమనార్హం. ఫ్యాకల్టీగా బీటెక్‌లను నియమించకూడదు. టీచింగ్ ఫ్యాకల్టీలో అందరూ ఎంటెక్, పిహెచ్‌డి లే ఉండాలి. అయితే దేశంలో ఫ్యాకల్టీ కొరతను దృష్టిలో ఉంచుకుని 2015 వరకు అవసరమైతే బిటెక్ ఫస్ట్ క్లాస్ ఉన్న వారిని నియమించుకుని, వారికి నెలకు కనీసం రు. 30 వేల వేతనం ఇవ్వాలంటూ ఏఐసిటిఇ ఇచ్చిన వెసులుబాటును కూడా కళాశాలల యాజమాన్యాలు దుర్వినియోగం చేసినట్లు టాస్క్ ఫోర్స్ తనిఖీలలో వెలుగు చూసింది. ఇలా బిటెక్‌లతో బోధన చేయిస్తున్న ఇంజనీరింగ్ కళాశాలలు వారికి నెలకు రు. 6 వేల నుంచి రు. 10 వేల వరకే చెల్లిస్తున్నట్లు సమాచారం.

రాష్ట్రంలోని 654 ఇంజనీరింగ్ కళాశాలలకు గాను కేవలం 164 కళాశాలలో మాత్రమే ఏఐసిటిఇ నిర్దేశిత ఐదో, ఆరో వేతన స్కేళ్లు అమలుకు నోచుకుంటున్నాయి. వీటికి మాత్రమే ట్యూషన్ ఫీజును పెంచారు. మిగిలిన 490 కళాశాలల్లో వేతన స్కేళ్లు అమలుకు నోచుకోవడం లేదు. ఇక మౌలిక సదుపాయాల విషయానికి వస్తే 565 కళాశాలల్లో నిబంధనలకు అనుగుణంగా ల్యాబ్స్, ఎక్విప్‌మెంట్స్ లేవు. వర్క్‌షాపులు, హీట్‌ఇంజిన్ ల్యాబ్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ ల్యాబ్, ఎలక్ట్రానిక్స్ సర్క్యూట్ ల్యాబ్, క్యాడ్ ల్యాబ్‌లు కనిపించవు. 50-75 శాతం కళాశాలల్లో విద్యార్థులకు అవసరమైన జర్నల్స్‌కు సంబంధించి చందా కట్టడం లేదని, భౌతికంగా కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తున్నప్పటికీ 75 శాతం కళాశాలల్లో ఇంటర్నెట్ కనెక్టివిటీ లేదని తేలింది. ఏటేటా అదనపు కోర్సులను, సీట్లను మంజూరు చేయించుకుంటున్న కళాశాలలు విద్యార్థుల సంఖ్యకు సరిపోను బిల్టప్ ఏరియాను పెంచుకోవడం లేదని టాస్క్‌ఫోర్స్ తనిఖీల్లో తేలింది.

ఇక ఫీజు రియింబర్స్‌మెంట్ కోసం ప్రభుత్వాన్ని దగాచేసే పద్ధతులు బహువిధాలు. మేనేజ్‌మెంట్ కోటాలో చేర్చుకున్న వారిని పేదలుగా చూపడం, ఎస్‌సి, ఎస్‌టి, బిసి విద్యార్థులకు ప్రభుత్వం ఫీజు చెల్లిస్తున్నందున బ్రోకర్లు వారి వెంటపడి కాలేజీలో చేర్చుకోవడం, కాలేజీకి రాకపోయినా అటెండెన్స్ ఇవ్వడం జరుగుతుంది. ఇటువంటి దగాకోరు పద్ధతుల వల్ల ప్రభుత్వ ఖజానాకు ఏటా వేలకోట్లు తూట్లు పొడుస్తున్నారు. నాసిరకం విద్య బోధిస్తూ, లక్షల మంది విద్యార్థుల భవిష్యత్‌ను నాశనం చేయడమేగాక, ఉత్తీర్ణుల్లో సైతం అత్యధికులు నైపుణ్య లోపంతో ఉపాధికి నోచుకోని స్థితి కల్పిస్తున్నారు. ఇంత అధ్వాన్నంగా, మోసపూరితంగా సాగుతున్న ఇంజినీరింగ్ విద్యతో పాలకులు చెప్పుకునే 'జ్ఞాన సమాజాన్ని' నిర్మించడం ఎంత మాత్రం సాధ్యం కాదు. రెండోవైపున, ప్రజల నుండి పన్నుల రూపంలో పిండిన సొమ్మును ఏటా వేల కోట్లు పిండారీల పాలు చేయడమే అవుతుంది. ఎందుకింత అధ్వాన్న పరిస్థితి నెలకొంది అని ఆలోచిస్తే ప్రైవేటీకరణ తర్వాత విద్య బహు లాభసాటి వ్యాపారంగా మారింది. విద్య పట్ల ఏ మాత్రం మక్కువ లేనివారు కూడా ఇతర రంగాల్లో ఆర్జించిన సొమ్మును, నల్లధనాన్ని ఈ రంగంలోకి తెచ్చారు. అంతకుమించిన జబ్బు అవినీతి, రాజకీయ ప్రాబల్యం. అనుమతులిచ్చే ఏఐసిటిఇ మొదలు ఫీజు రియింబర్స్‌మెంట్ వరకు అంతటా అవినీతి తాండవమాడుతున్నది.

జెఎన్‌టియుహెచ్ గుర్తింపు నిరాకరించిన ఇంజనీరింగ్ కళాశాలల్లో మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలతో పాటు వివిధ పార్టీల నేతలకు చెందిన కళాశాలలున్నాయి. రాష్ట్ర రవాణామంత్రి మహేందర్‌రెడ్డికి చెందిన ఇంద్రారెడ్డి మెమోరియల్ కళాశాల (చేవెళ్ల), రాజమహేంద్ర కళాశాల (ఇబ్రహీంపట్నం) ఉన్నాయి. వీటితో పాటు టిడిపి ఎంపి మల్లారెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాల (గుండ్లపోచంపల్లి) తో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారి, బిజెపికి చెందిన బండారు శ్రీనివాస్‌కు చెందిన చేవెళ్లలోని రెండు కళాశాలల గుర్తింపును జెఎన్‌టియు అధికారులు రద్దు చేశారు. మెదక్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి బంధువు, మాజీ పిసిసి అధ్యక్షుల సోదరుని కళాశాలలు రద్దు చేసిన వాటిలో ఉన్నాయి. నిజామాబాద్ నగరానికి చెందిన వ్యాపారవేత్త నరేందర్ రెడ్డికి చెందిన మూడు కళాశాలలు గుర్తింపునకు నోచుకోలేదు. నిజామాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థలంలో నిర్మించిన అరోరా ఇంజనీరింగ్ కళాశాల (ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాల సంఘం నేత రమేష్‌కు చెందినది) గుర్తింపు రద్దు కావడం గమనార్హం.

ఇంజనీరింగ్ విభాగంలో రెండు రాష్ట్రాల్లో కలిపి 2,66,820 (94.37 శాతం) మంది ప్రవేశ పరీక్షకు హాజరుకాగా, 2,15,336 మంది అర్హత సాధించారు. ఇంజనీరింగ్ విభాగంలో తెలంగాణ నుంచి 1,16,858 మంది ప్రవేశ పరీక్షకు హాజరుకాగా, 80,479 (68,86 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి 1,45,412 మంది ప్రవేశ పరీక్ష రాయగా, 1,05,556 (72.59 శాతం) మంది పాసయ్యారు. గత సంవత్సరం తెలంగాణలో 315 కాలేజీల్లో 1,84,575 ఇంజనీరింగ్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. 174 కాలేజీలకు అనుబంధ గుర్తింపు నిరాకరించడంతో ప్రస్తుతం 141 కాలేజీల్లో 85,455 సీట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. తెలంగాణలో లక్ష సీట్లకు కోత పడింది. దీంతో తెలంగాణలో ప్రవేశ పరీక్షకు హాజరైన 1.16 లక్షల విద్యార్థులకు 85,455 సీట్లు ఉన్నాయి. అందులోనూ

యాజమాన్య కోటా కింద 30 శాతం 25,636 సీట్లు పోతాయి. ఇక కన్వీనర్ కోటాలో మిగిలిన 59,819 సీట్లలోనూ 15 శాతం అంటే 8,973 సీట్లు స్థానికేతరులకు వెళ్తాయి. తెలంగాణ విద్యార్థులకు ఇక మిగిలేది 50,846 సీట్లు మాత్రమే. దీంతో ఇంజనీరింగ్ సీటు గతంలోలాగా ఈసారి అంత సులువుగా తెలంగాణ బిడ్డలకు దక్కడంలేదు. దీంతో యాజమాన్య కోటా సీట్లకు భారీగా డిమాండ్ పెరిగింది. అనుబంధ గుర్తింపు వచ్చిన కాలేజీలు ఇదే అదనుగా భావించి లక్షలాది రూపాయలను విద్యార్థుల నుంచి గుంజుతున్నాయి.

తెలంగాణలో 315 ఇంజనీరింగ్ కాలేజీలకు అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసిటిఇ) అనుమతి ఇచ్చింది. టాస్క్‌ఫోర్స్ తనిఖీల ఆధారంగా 141 ఇంజనీరింగ్ కాలేజీలకు మాత్రమే జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్శిటీ హైదరాబాద్ (జెఎన్‌టియుహెచ్) అనుబంధ గుర్తింపు ఇచ్చింది. 174 ఇంజనీరింగ్ కాలేజీలకు అనుబంధ గుర్తింపు నిరాకరించింది. ప్రమాణాలు పాటించకపోతే 315 ఇంజనీరింగ్ కాలేజీలకు ఏఐసిటిఇ ఎందుకు అనుమతి ఇస్తుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇందులో తప్పెవరిది? అన్న ప్రశ్న అందరి మదిలో మెదులుతోంది. ప్రమాణాలు పాటించక పోయినా అనుమతి ఇచ్చిన ఏఐసిటిఇ దా, ఏదో విధంగా పలుకుబడి ఉపయోగించి అనుమతి తెచ్చుకున్న ఇంజనీరింగ్ కాలేజీలదా? ప్రజాధనాన్ని లూటీకి అనుమతించిన ప్రభుత్వానిదా? విచ్చలవిడిగా వెలసిన కళాశాలల్లో ప్రమాణాలు లేకున్నా కొనసాగడానికి అండదండలు అందిస్తున్నది ఎవరు? దీని మూలంగా నష్టాలు ఎవరికి... లాభాలు ఎవరికి... అనేది మన ముందున్న ప్రశ్న. విద్యారంగంలోకి బడా పెట్టుబడిదారులు, వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు రంగప్రవేశం చేయడంతో విద్యాసంస్థలు వ్యాపార సంస్థలుగా మారాయి. అవినీతి లాలూచీల భాగోతం పెచ్చరిల్లి పోయింది. యాజమాన్య కోటా ద్వారా సీట్లు అమ్మి కోట్లు గడించడం, ఒకే యాజమాన్యం కింద అనేక కళాశాలలు స్థాపించడం ద్వారా కళాశాలల సంఖ్య పెరిగిపోయింది. కళాశాల మంజూరులో అవలంబించాల్సిన మార్గదర్శకాలైన భూమి, భవనాలు, ప్రయోగశాలలు, అర్హత ఉన్న అధ్యాపకులు వంటి అంశాలను గాలికి వదిలేసి అవినీతి అశ్రిత పక్షపాతం రాజకీయ ఒత్తిళ్లు కళాశాలల మంజూరులో ప్రధాన భూమికను పోషించాయి. తద్వారా ఎలాంటి అర్హతలు లేని కళాశాలలు కోకొల్లలుగా కొలువుదీరాయి. ఇదంతా వ్యాపారం రాజకీయంగా, రాజకీయం వ్యాపారంగా కలగలసి పోవడం వల్ల ఏర్పడిన దుష్పరిణామం. దీనిని తక్షణ క్షాళన చేయకపోతే భవిష్యత్ సమాజానికి నష్టం.

174 ఇంజనీరింగ్ కాలేజీలకు జెఎన్‌టియుహెచ్ అనుబంధ గుర్తింపు నిరాకరించడంతో అందులో ద్వితీయ, తృతీయ, నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు సమిధలుగా మారుతున్నారు. అనుబంధ గుర్తింపు రద్దు మూలంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ఆగమ్యగోచరంగా మారింది. దీంతో ఆయా కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులు ఆందోళనలో పడ్డారు. పాలకులకు, జెఎన్‌టియుహెచ్ అధికారులకు, ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలకూ ఇబ్బంది లేదు. వారికి ఎలాంటి ఆందోళన అవసరం లేదు. కానీ విద్యార్థులు మానసికంగా వేదనకు గురవుతున్నారు. ఆయా కాలేజీల్లో చదివిన తమకు ఇంజనీరింగ్ పూర్తి చేసిన తర్వాత భవిష్యత్తు ఉంటుందా? జెఎన్‌టియుహెచ్ గుర్తింపునకు నోచుకోని కాలేజీల సర్టిఫికెట్లకు జాబ్ మార్కెట్‌లో విలువ ఉంటుందా? ఐటి, ఇతర కార్పొరేట్ సంస్థలు పరిగణనలోకి తీసుకుంటాయా? ఉపాధి అవకాశాలు లభిస్తాయా? అంటూ అనేక కోణాల్లో ఆలోచించి విద్యార్థులు మానసిక ఆందోళనకు గురవుతున్నారు. ప్రమాణాలు లేని కాలేజీలపై చర్యలు తీసుకోవాల్సిందే కానీ... దశలవారీగా అమలు చేస్తే విద్యార్థులకు తక్కువ నష్టం కలిగి ఉండేదని విద్యావేత్తలు సూచిస్తున్నారు.

టాస్క్‌ఫోర్స్ తనిఖీలు ప్రవేశ పరీక్షల ముందు హడావుడిగా జరవడంపట్ల అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జెఎన్‌టియుహెచ్‌కు కాలేజీ యాజమాన్యాలకు మధ్య ఒప్పందం కుదరకపోవడం వల్లే అనుబంధ గుర్తింపు నిరాకరించిందని ఒక వాదన. మరోవైపు ఫీజులను తగ్గించుకోవడంలో భాగంగానే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పథకం ప్రకారమే ఇలాంటి చర్యలకు పూనుకుందన్న అరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏది ఏమైనా ప్రమాణాలు పాటించని కాలేజీల గుర్తింపు రద్దు సమంజసంగానే ఉంది. ఇటువంటి దగాకోరు పద్ధతుల వల్ల ప్రభుత్వ ఖజానాకు ఏటా వేలకోట్ల రూపాయలకు తూట్లు పొడుస్తున్నారు. నాసిరకం విద్య బోధిస్తూ విద్యార్థుల భవిష్యత్‌ను నాశనం చేస్తున్నారు. అందువల్ల ఫీ రియింబర్స్‌మెంట్ బదులు అదే డబ్బుతో ప్రభుత్వమే ఇంజనీరింగ్ కళాశాలలను ప్రభుత్వ యాజమాన్యంలో స్థాపించి, విద్యార్థులకు, సమాజానికి ప్రయోజనం చేకూర్చాలి. అందుకు ప్రభుత్వం బాధ్యతను తక్షణం స్వీకరించాలి.

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమనాయకులు, రాజనీతిశాస్త్ర విద్యార్థి) వీ

రాబోయే సంచికలలో...

- **ఒడిశాలో పర్యావరణ మార్పు - దాని ప్రభావం - చక్రాబిసోయి**
- **ఆర్థిక అభివృద్ధిలో సహజ వనరుల పాత్ర - తడికమళ్ల శేఖర్**
- **ప్రపంచీకరణలో భారతీయ వ్యవసాయ రంగం - పోలం సైదులు**
- **మిశ్రమ ప్రణాళికా సంఘం - పి.ఎస్.వి. ప్రసాద్‌బాబు**
- **పరాధీనులు - ఎస్. ఆర్కే**
- **భారతదేశానికి చరిత్ర లేదా? - డా. పట్టా వెంకటేశ్వర్లు**

తెలంగాణలో ప్రజాస్వామిక హక్కులు

***ప్రజల హక్కులను గౌరవించే విషయంలో మిగిలిన రాజకీయ పక్షాలకూ తనకూ ఏమీ తేడా లేదని తెలంగాణ రాష్ట్ర సమితి ప్రభుత్వం మూడు నెలలు కూడ నిండకముందే రుజువు చేసుకున్నదంటున్నారు* ఎన్. వేణుగోపాల్**

తెలంగాణ రాష్ట్రం ఒక న్యాయమైన ప్రజాస్వామిక ఆకాంక్షతో, విశాలమైన ప్రజా భాగస్వామ్యంతో, సుదీర్ఘ పోరాటంతో ఏర్పడింది గనుక, ఆ ఉద్యమ క్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేతిలో హక్కుల ఉల్లంఘనకూ, నిర్బంధాలకూ, అక్రమ కేసులకూ, ఆంక్షలకూ స్వయంగా గురైన తెలంగాణ రాష్ట్ర సమితి అధికారాన్ని చేపట్టింది గనుక, కొత్త రాష్ట్ర పాలనా విధానాలలో ప్రజా పోరాటాల పట్ల ఎంతో కొంత గౌరవం ఉంటుందని, ప్రజాస్వామిక హక్కులను, కనీసం రాజ్యాంగంలో పొందుపరచిన హక్కులనైనా అమలు చేయడం జరుగుతుందని ఆ పోరాటంలో పాల్గొన్నవారు, దాన్ని పరిశీలించినవారు ఆశించారు. 'సుఖశాంతుల తెలంగాణ' అనీ, 'ఎన్‌కౌంటర్లు లేని తెలంగాణ' అనీ, 'ఆంధ్ర పోలీసుల వల్లనే నిర్బంధం' అనీ వ్యాఖ్యలు మామూలు కార్యకర్తల నుంచి మాత్రమే కాదు, తెరాస నాయకుల నుంచి కూడ వెలువడ్డాయి. ఇప్పటి ముఖ్యమంత్రి, అప్పటి తెలంగాణ ఉద్యమ నాయకుడు కె. చంద్రశేఖర రావు తాను మావోయిస్టు ఎజెండాను అమలు చేస్తానని అనేకసార్లు ప్రకటించారు. పౌరహక్కుల సంఘం ఏర్పాటు చేసిన ఒక సభలో పాల్గొని తనకు తెలంగాణలో పౌరహక్కుల సంఘం అధ్యక్షుడిగా పనిచేయాలని ఉందని కూడ అన్నారు. ప్రజాస్వామిక హక్కు అయిన ఆమరణ నిరాహార దీక్ష సాగించాలని ఆయన అనుకుంటే అప్పటి ప్రభుత్వం ఆయన ఆ దీక్షాస్థలానికి వెళ్లకుండానే అడ్డగించి అరెస్టు చేసి రెండు జిల్లాలు దాటించి నిర్బంధంలో పెట్టింది. ఆయన నాయకత్వంలోని పార్టీ కార్యకర్తలు, ఇతర తెలంగాణ ఉద్యమకారులు అరెస్టులను, చిత్రహింసలను, తప్పుడు కేసులను, సభలకు ఆటంకాలను అనుభవించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే ఇటువంటి పోలీసు రాజ్యం కొనసాగబోదని అప్పుడు ప్రతి ఒక్కరూ ఆశించారు. ఆనాటి ఉద్యమ వాతావరణం వల్ల ఇటువంటి విషయాల మీద చర్చ జరగవలసినంత లోతుగా జరగలేదు. తెలంగాణ రాష్ట్ర సమితి కూడ మిగిలిన పాలకవర్గాల తానులోని ముక్కేనని, దానికి కూడ ప్రజల హక్కులను గౌరవించే స్వభావం ఉండదనీ హెచ్చరిస్తూ వచ్చినవారు అప్పటికే ఉన్నప్పటికీ వారి గొంతు బలహీనంగానే ఉండింది.

తెలంగాణ రాష్ట్ర సమితి అధికారం చేపట్టిన తర్వాత పాత ప్రభుత్వాల సమయంలో లాగనే పోలీసులకు విశేష అధికారాలు ఇవ్వడం మొదలయింది. ప్రభుత్వ నిర్బంధకాండ రూపంలో మారినట్టు కనబడింది గాని సారంలో మారలేదు. అప్పుడు ప్రజల హక్కులను అణచివేసిన పోలీసులు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకే అలా చేస్తున్నారనే సాకు అయినా ఉండేది గాని ఇప్పుడు తెలంగాణ పోలీసులే తెలంగాణ ప్రజల మీద అదే హింసను యథాతథంగా అమలు చేయడం సాగించారు. కొత్త ప్రభుత్వ పాలనలో ఇప్పటికి ప్రజాస్వామిక హక్కుల మీద ఆంక్షలు మూడు రకాలుగా వ్యక్తమయ్యాయి. ఒకటి, తెలంగాణలో ఏదైనా ప్రజా సమూహం తన సమస్యలను ప్రకటిస్తే, హక్కులు కోరితే, నిరసన ప్రకటిస్తే, వారితో సామరస్య పూర్వకంగా చర్చలు జరిపి, వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించడం కాకుండా పోలీసులను ఉసిగొల్పడం ప్రారంభమయింది. పోలీసులు తమకు తెలిసిన ఏకైక పద్ధతిలో బలప్రయోగం, హింస, లాఠీచార్జీలు వంటివి సాగిస్తున్నారు. రెండు, తెలంగాణనూ, తెలంగాణ ఉద్యమాన్నీ, తెలంగాణ రాష్ట్ర సమితినీ, వ్యక్తిగతంగా తెరాస నాయకులనూ వ్యతిరేకించిన శక్తులలో కొందరిమీద ఎంచుకుని కక్ష సాధింపు చర్యలు మొదలయ్యాయి. మూడు, తెలంగాణ ఉద్యమంలో భాగస్వాములైనప్పటికీ, తెరాస వైఖరికి భిన్నమైన వైఖరిని ప్రకటించిన శక్తుల మీద ఆంక్షలు క్రమక్రమంగా పెరుగుతున్నాయి.

మొదటి రకం నిర్బంధానికి గురైన వారు విద్యార్థులు, రైతులు. వారిలో విద్యార్థుల వెనుక తెలంగాణ వ్యతిరేక రాజకీయ శక్తుల ప్రోద్బలం ఉన్నదనే మాట నిజమే కావచ్చు. కాని కాంట్రాక్టు పద్ధతిని గంపగుత్తగా క్రమబద్ధీకరిస్తే తమ ప్రయోజనాలకు దెబ్బ తగులుతుందని వారు భావించారు, ఆ సమస్య మీద నిజానిజాలను వారికి వివరించవచ్చు. చర్చలు జరపవచ్చు. వారు పొరపడి ఉంటే ఆ పొరపాటు సరిదిద్దవచ్చు. అవేమీ చేయకుండా పోలీసుల ద్వారా ఆ సమస్య పరిష్కరిద్దామని ప్రయత్నించడం ఉద్యమ నేపథ్యంలో అధికారానికి వచ్చిన పార్టీకి తగదు. చివరికి ముఖ్యమంత్రితో సహా ఏ ఒక్క అధికారపార్టీ నాయకులు ఉస్మానియా విశ్వవిద్యాలయంలోకి వెళ్లలేని స్థితి వచ్చింది. అలాగే, విత్తనాల కోసమో, ఎరువుల కోసమో ఆందోళనలు జరగడం ప్రతి పంటల కాలం ప్రారంభంలోనూ సర్వసాధారణమే. ఆగని ఆత్మహత్యలు కూడ ఈ సారి ఆ ఆందోళనకు తోడై ఉండవచ్చు. ఆ సమస్యకు కూడ పరిష్కారం పోలీసుల దగ్గర ఉండదు. రాజకీయపక్షాల దగ్గరా, ప్రజాసంఘాల దగ్గరా ఉంటుంది. చర్చద్వారా, సామరస్యపూర్వకంగా ప్రజాస్వామిక పరిష్కారం కనిపెట్టాలి. కాని ఆ సమస్యను కూడ పోలీసులకు అప్పగించి, రైతులను రక్తాలు కారేట్టు కొట్టించడం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి భావ్యం కాదు. ఇటువంటి ప్రజాసమస్యలు ఇంకా పెరిగే అవకాశం ఉంది గనుక ఇప్పటికైనా పోలీసు హింస ద్వారా కాక ప్రజాస్వామిక మార్గాల ద్వారా ఈ సమస్యలను పరిష్కరించవచ్చునా ఆలోచించాలి. అలాగే నేరస్తుల కోసం వెతకడం అనే పేరు మీద హైదరాబాదులో నిఘా, సోదాలు, వేధింపులు పెంచి, నగరాన్ని పోలీసుల గుప్పెట్లో పెట్టడం ప్రజాస్వామిక హక్కుల ఉల్లంఘనే.

రెండో రకం నిర్బంధం అప్రజాస్వామికమైనదే అయినా దానికి కొంతవరకు తెలంగాణ సమాజపు ఆమోదం దొరికింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర వాంఛ ఒక ప్రాంతపు విస్తృత ప్రజా ఆకాంక్ష గనుక, ఆ

ఆకాంక్షలకు వ్యతిరేకమైన భావాలను ఎవరు ప్రచారం చేసినా వారిమీద ప్రజలలో ఆగ్రహం ఉంది. వారి మీద ఆంక్షలు విధించడం సమంజసమే అనే అభిప్రాయం ఉంది. నిజానికి తెలంగాణ పట్ల వ్యతిరేకత, తెలంగాణ ఉద్యమం పట్ల వ్యతిరేకత, తెలంగాణ రాష్ట్ర సమితి పట్ల వ్యతిరేకత, తెరాస నాయకుల పట్ల వ్యతిరేకత అనే నాలుగు స్థాయిల వ్యతిరేకతలనూ ఒకే గాటన కట్టడం సరికాదు. ఒక అధికార రాజకీయపక్షంగా తెరాస పట్ల, దాని నాయకుల పట్ల ఎవరికైనా వ్యతిరేకత, భిన్నాభిప్రాయం ఉండవచ్చు. అటువంటి వారిమీదనైనా కక్ష సాధింపు చర్యలు తీసుకోవడం అప్రజాస్వామికం, నిరంకుశం. ఇక తెలంగాణ వ్యతిరేక శక్తులు, తమ స్వార్థప్రయోజనాలను సమైక్యాంధ్ర నినాదం కింద చలామణీ చేసిన వ్యక్తులు తెలంగాణ పట్ల దశాబ్దాల పాటు చిన్నచూపు, వ్యతిరేకత, ద్వేషం ప్రకటించారు. తెలంగాణ ఉద్యమం పట్ల పచ్చి అబద్ధాలతో, వెటకారాలతో దుష్ప్రచారాలు చేశారు. ప్రచార సాధనాలన్నిటికీ ఈ పాపంలో తలా పిడికెడు భాగస్వామ్యం ఉంది. నిజానికి ప్రచార సాధనాలలో ఏ ఒక్కటీ ఇందుకు మినహాయింపు కాదు. కాని తెరాస ప్రభుత్వం రెండు ఛానళ్లను మాత్రం ఎంచుకుని కక్ష సాధింపు ప్రారంభించింది. ఆ రెండు ఛానళ్ల తెలంగాణ వ్యతిరేక దుష్ప్రచారాన్ని ఎంతో కాలం భరించిన తెలంగాణ సమాజం ఆ నిర్బంధాన్ని కూడ ఆమోదిస్తున్నది. ఆ మాటకొస్తే వాటితో సమానంగా దుష్ప్రచారం చేసిన, ఇప్పటికీ చేస్తున్న పత్రికలు, ఛానళ్లు ఎన్నో ఉన్నాయి. వాటితోనూ, ఇప్పుడు ఆంక్షలు ఎదుర్కొంటున్న ఛానళ్లతోనూ, పత్రికలతోనూ కూడ తెరాస నాయకులు ఉద్యమ కాలమంతా సుహృద్భావ సంబంధాలే నెరిపారు. బహుశా అందువల్లనే ప్రజల పట్ల తమ దుష్ప్రచారం, వ్యతిరేకత సాగిస్తూనే నాయకత్వంతో సఖ్యత నెరపవచ్చునని ఆ యాజమాన్యాలు భావించినట్టున్నాయి. తెరాస అధికారానికి వచ్చిన తర్వాత ఒక ఛానల్ ప్రసారం చేసిన రెండు కథనాలు కొట్టవచ్చినట్టుగా తెలంగాణను అవమానించడంతో ఆ సంబంధాలు బెడిసిపోయాయి. ఆ కథనాలలో కేవలం ప్రాంతీయ వ్యతిరేకత మాత్రమే కాదు, వర్గ, కుల, లింగ వ్యతిరేకత కూడ ఉంది.

ఇప్పుడు ఆ ఛానళ్ల మీద ప్రతీకారం తీర్చుకోవడానికి ఉపయోగించిన సాధనం కూడ తెలంగాణ అనుకూలమైనదేమీ కాదు. వ్యాపార ప్రయోజనాల మీద మాత్రమే దృష్టి ఉండే, ఆ ప్రయోజనాలు నెరవేర్చుకునే క్రమంలో దాదాపు నేరప్రపంచానికి సమానంగా ప్రవర్తించే ఎం ఎస్ ఓ (మల్టీ సిస్టం ఆపరేటర్) అనే కేబుల్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం ఈ పనికి పూనుకుంది. నిజానికి ఆ ఛానళ్లు తెలంగాణ పట్ల చేసిన దుష్ప్రచారాన్ని, అన్యాయాన్ని ప్రజలు ఎట్లాగూ వ్యతిరేకిస్తున్నారు గనుక ఈ చర్య ప్రజాస్వామిక, చట్టబద్ధ పద్ధతులలో జరిగితే బాగుండేది. ఒక అక్రమ చర్యకు మరొక అక్రమ ప్రతిచర్య ద్వారా జవాబు చెప్పాలని తెరాస ప్రభుత్వం నిర్ణయించుకుంది. తెలంగాణలో ఉన్న వాతావరణంలో, తెలంగాణ వ్యతిరేకుల పనుల మీద ఉన్న ఆగ్రహావేశాలలో తెలంగాణ సమాజం కూడ ఈ ప్రతిచర్య జరిగిన తీరులోని తప్పొప్పులను చర్చించలేదు. ఎలా జరిగినా సరే, మంచి పని జరిగింది అని భావించారు. నిజానికి ఈ రెండు ఛానళ్ల యాజమాన్యం కన్న మరింత తీవ్రంగా తెలంగాణను వ్యతిరేకించే ఇతర ఛానళ్లకూ, సంపన్న వ్యాపార, రాజకీయ వర్గాలకూ తెరాస ప్రభుత్వం ఈ మూడు నెలలలో కూడ ఇబ్బడి ముబ్బడిగా సహకారం అందిస్తూనే ఉంది. తెలంగాణను అందరికన్న ఎక్కువ వ్యతిరేకించిన వారెందరికో ఈ మూడు నెలల పాలనా కాలంలో కూడ ప్రయోజనాలకు దెబ్బ తగలలేదు సరిగదా, ఎక్కువ లాభాలు సమకూరాయి.

మొత్తం మీద ఈ మొదటి తరహా నిర్బంధం సంక్లిష్టమైనది. ఇందులో నిర్బంధానికి గురవుతున్న వారి తెలంగాణ వ్యతిరేకత ఒక ప్రధానాంశం కాగా, నిర్బంధం అమలు చేస్తున్నవారు వ్యక్తిగత కక్షను సాధించుకుంటూ, తెలంగాణ సమాజపు మద్దతు కూడగట్టుకోగలుగుతున్నారు.

ఇక మూడో తరహా నిర్బంధం అటువంటిది కాదు. ఈ నిర్బంధానికి గురవుతున్నవారు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నవారు, తెలంగాణ సమాజంలో భాగమైనవారు, తెలంగాణ ప్రజలు. కేవలం పాలకులకు భిన్నమైన ఆలోచనలు కలిగి ఉన్నారనే కారణంతో వారిమీద నిర్బంధ కాండ మొదలయింది. ఇది నేరుగా పోలీసు హింసకూ, చట్ట వ్యతిరేక నిర్బంధానికీ మాత్రమే పరిమితం కాదు, తెలంగాణ ఉద్యమ క్రమంలో ప్రభావశీల స్థానాల్లో ఉన్నవారిని ఆ స్థానాల నుంచి దిగలాగడం, వారిని తెలంగాణ పునర్నిర్మాణంలో భాగం చేయకపోవడం, వారికి వ్యతిరేక ప్రచారం చేయడం, వారి ప్రతిష్ఠను భంగపరచడానికి ప్రయత్నించడం దగ్గర ప్రారంభించి అరెస్టులు, గృహనిర్బంధాలు, సమావేశాలకు ఆటంకాలు కల్పించడం, నిషేధాలు, కూంబింగులు, ఎదురుకాల్పుల దాకా అన్ని చర్యలూ పాత ప్రభుత్వాలలో లాగనే సాగుతున్నాయి.

సెప్టెంబర్ 21న హైదరాబాద్‌లో తలపెట్టిన ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక కార్యక్రమాల పట్ల ప్రభుత్వం ప్రదర్శించిన అసహనం, దాడి ఇప్పుడిప్పుడే కోరలు చాస్తున్న ఈ నిర్బంధకాండకు అతిపెద్ద నిదర్శనం. దేశంలో మావోయిస్టు పార్టీ ఏర్పడి పది సంవత్సరాలయిన సందర్భంగా ఈ దశాబ్దిలో విప్లవోద్యమ పురోగమనం గురించి చర్చించడానికి ప్రపంచవ్యాప్తంగా ఎన్నోచోట్ల సభలు, సమావేశాలు జరుగుతున్నాయి. ఇటలీలోని మిలాన్ లో సెప్టెంబర్ 27-28ల్లో జరగనున్న అంతర్జాతీయ సదస్సు నుంచి దండకారణ్యంలో ఆదివాసి గూడాలలో జరుగుతున్న సభల దాకా ఈ దశాబ్ది ఉత్సవాలు జరుగుతున్న సందర్భంగా కొందరు మేధావులు, కొన్ని ప్రజాసంఘాలు ఏర్పాటు చేసిన 'ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక' హైదరాబాదులో సెప్టెంబర్ 21న ఈ దశాబ్ది విప్లవ రాజకీయాలపై ఒక సదస్సును, ఊరేగింపును, బహిరంగ సభను నిర్వహించాలని నిర్ణయించుకుంది. నిజానికి మావోయిస్టు పార్టీ ఏర్పడిందనే ప్రకటన మొట్టమొదటిసారి హైదరాబాద్ లోనే వెలువడింది. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు లెనినిస్టు) (పీపుల్స్ వార్), మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ ఆఫ్ ఇండియాలు 2004 సెప్టెంబర్ 21న విలీనమై భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఏర్పడిందని, 2004 అక్టోబర్ 14న హైదరాబాదులోని మంజీర అతిథి గృహంలో పత్రికా సమావేశంలో అప్పుడు పార్టీ తరఫున చర్చలలో పాల్గొనడానికి వచ్చిన రాష్ట్ర కమిటీ కార్యదర్శి రామకృష్ణ మొదటిసారిగా ప్రపంచానికి తెలియజేశారు. ఆ తర్వాత గడిచిన పది సంవత్సరాలలో విప్లవోద్యమం కొన్ని అపజయాలతో సహా గణనీయమైన విజయాలు సాధించింది. అసలు అంతకుముందరి నక్సలైట్, పీపుల్స్ వార్, రాడికల్ అనే మాటలు తగ్గిపోయి మావోయిస్టు ఉద్యమం అనే కొత్త గుర్తింపు పెరిగింది. ఈ నేపథ్యంలో మావోయిస్టు ఉద్యమం గురించి చర్చించడం సందర్భోచితమైనదే.

మామూలుగానే చట్టప్రకారం ఊరేగింపుకూ, బహిరంగసభకూ అనుమతి ఇమ్మని పోలీసులకు దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. ఈ కార్యక్రమంలో కూడ అలా అనుమతి కోరడమూ, పోలీసులు

నిరాకరించడమూ జరిగింది. సదస్సు జరగడానికి ముందు రోజున నగర పోలీస్ కమిషనర్ నుంచి సదస్సు కూడ జరుపుకోవడానికి వీలు లేదని నిర్వాహకులకు ఒక లేఖ అందింది. అసలు హాలు లోపల జరిగే సదస్సుకు అనుమతి కోరవలసిన అవసరమూ లేదు, నిర్వాహకులు కూడ కోరలేదు. అటువంటి స్థితిలో ఆ పోలీసు లేఖ చట్టవ్యతిరేకమైనదనీ, అసాధారణమైనదనీ, గతంలో దారుణ దమననీతిని అమలు చేసిన పాలనలలో కూడ ఈ పద్ధతి లేదనీ నిర్వాహకులు ప్రభుత్వం దృష్టికీ, పాలకపక్ష నాయకుల దృష్టికీ తీసుకువచ్చారు. సదస్సు జరగడానికి అభ్యంతరం ఉండవలసిన అవసరం లేదనీ, సదస్సు యథావిధిగా జరుపుకోవచ్చుననీ వారు జవాబిచ్చారు.

కాని ఆ వాగ్దానం వెలువడిన గంటలోపలే నగరంలో అరెస్టులు మొదలయ్యాయి. కార్యక్రమం పనులు చూడడానికి, కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన కార్యకర్తలు, నాయకులు ఉన్న వసతిగృహం మీద అర్ధరాత్రి దాడి చేసిన పోలీసులు నలభై మందిని అరెస్టు చేసి బొల్లారం పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఆ రాత్రే, ఒక మహిళా సంఘం కార్యదర్శి ఇంటి మీద దాడి చేసి అక్కడ ఉన్న ఐదుగురు మహిళా కార్యకర్తలను నిర్బంధించారు. రాత్రిపూట మహిళలను నిర్బంధించగూడదని, ఒకవేళ నిర్బంధించినా మహిళా పోలీసులు వెంట ఉండాలని చట్ట నిబంధనలను కొత్త రాష్ట్ర పోలీసులు నిర్లజ్జగా ఉల్లంఘించారు. హైదరాబాదుకు వచ్చే దారులన్నిటినీ మూసివేసి రైళ్లలో, బస్సులలో, ప్రైవేట్ వాహనాలలో వస్తున్న వారిని ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. సరిగ్గా పాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాలనలో విప్లవోద్యమం మీద, తెలంగాణ ఉద్యమం మీద జరిగినటువంటి నిర్బంధకాండే పునరావృతమయింది. అంతమాత్రమే కాదు, ఎప్పుడూ వ్యతిరేకించుకుంటున్నట్టు, కీచులాడుకుంటున్నట్టు కనిపించే కొత్త ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, కొత్త తెలంగాణ ప్రభుత్వం నిర్బంధం విషయంలో మాత్రం చాల సమన్వయంతో, స్నేహ సంబంధాలతో ప్రవర్తించాయి. సదస్సుకు అధ్యక్షత వహించడానికి వస్తున్న జి. కళ్యాణరావును, సదస్సులో పాల్గొనడానికి వస్తున్న న్యాయవాదులను, ప్రజాసంఘాల నాయకులను ఆంధ్రప్రదేశ్ పోలీసులు గుంటూరు జిల్లాలో మార్గమధ్యంలో అరెస్టు చేశారు. సదస్సులో వక్త, ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక కన్వీనర్ వరవరరావును సదస్సుకు కొద్ది గంటల ముందు అరెస్టు చేసి మూడు నాలుగు గంటల పాటు ఎక్కడ ఉంచారో తెలియని స్థితి కల్పించారు.

ఈ అరెస్టులన్నీ ఒక ఎత్తయితే, సదస్సు జరగవలసిన సుందరయ్య విజ్ఞాన కేంద్రానికి చేరే దారులన్నీ పెద్దపెద్ద బారికేడ్లతో మూసేశారు. బాగ్ లింగంపల్లి అడుగడుగునా పోలీసుల పహరా ఏర్పాటు చేశారు. కొన్ని వేల మంది పోలీసులు, డజన్ల కొద్దీ వాహనాలు, వాటర్ కానన్లు, ముళ్ల కంచెలతో ఆ ప్రాంతం యుద్ధ బీభత్సాన్ని తలపించింది. సదస్సులో పాల్గొనడానికి, వినడానికి రెండు రాష్ట్రాల నలుమూలల నుంచి వస్తున్న వ్యక్తులను స్టేషన్లలో, బస్సు స్టాండ్లలో అరెస్టు చేయడంతో పాటు, హాలు దగ్గర కూడ అరెస్టులు సాగించారు. సదస్సులో వక్తలుగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన అతిథులపై వారున్న చోట గృహ నిర్బంధం విధించారు. మొత్తంమీద కనీసం ఐదువందల మందిని అరెస్టు చేసి నగరంలోని ఐదారు పోలీసు స్టేషన్లలో నిర్బంధించారు. ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక సభ్యుడు, పౌరహక్కుల నేత ప్రొ. జి. హరగోపాల్ ముఖ్యమంత్రిని కలిసి ఈ నిర్బంధం తప్పని చెప్పడానికి వెళ్తుండగా దారిలో అడ్డగించి, పోలీసులతో వెనక్కి పంపించి గృహనిర్బంధంలో ఉంచారు. ఈ నిర్బంధకాండను ఖండిస్తూ పౌరహక్కుల సంఘం, తదితర సంఘాల కార్యకర్తలు టాంక్‌బండ్ మీద అంబేడ్కర్ విగ్రహం దగ్గర నిరసన తెలపడానికి ప్రయత్నిస్తే వారిని కూడ అరెస్టు చేశారు. గత ఐదు సంవత్సరాలలో తెలంగాణ ఉద్యమ సమయంలో సమైక్యాంధ్ర ప్రభుత్వం పాటించిన పద్ధతులతో పాటు ఒక ఆకు ఎక్కువే చదువుకున్నామని తెలంగాణ ప్రభుత్వ పోలీసులు చూపారు.

మావోయిస్టు ఎజెండాను అమలు చేస్తాను అన్న వ్యక్తి పాలనలో, అమలు చేయడం మాట అలా ఉంచి దాని గురించి మాట్లాడుకోవడమే నేరమైపోయింది! పౌరహక్కుల సంఘానికి అధ్యక్షత వహిస్తానని అన్న వ్యక్తి పాలనలో పౌరహక్కుల గొంతు నులమడం ఎన్నడూ లేని విధంగా జరిగింది!

ఇంత నిర్బంధం ఎందుకు అమలు చేయవలసి వచ్చిందో అధికారికంగా ప్రభుత్వం గాని, పాలకపక్షం గాని, ప్రభుత్వాన్ని సమర్థిస్తున్న మేధావులు గాని ఇంతవరకూ పెదవి విప్పి చెప్పలేదు. ప్రభుత్వంలో ఒకానొక శాఖ అయిన పోలీసులు మాత్రం రెండు మూడు కారణాలు చెప్పారు. పోలీసులే ప్రభుత్వం కాదని తెలంగాణ రాష్ట్ర సమితి ఉద్యమ క్రమంలో ఎన్నోసార్లు అని ఉంది. కుక్క తోకను నడుపుతున్నదా, తోక కుక్కను నడుపుతున్నదా అనే సామెత కూడ ఇదివరకు విన్నదే. ఉమ్మడి రాష్ట్రంలో విప్లవోద్యమాన్ని బూచిగా చూపి, ప్రభుత్వాలను, ఎన్నికైన 'ప్రజాప్రతినిధులను' బెదిరించి, బ్లాక్ మెయిల్ చేసి పోలీసు వ్యవస్థ అపరిమిత అధికారాలు సంపాదించుకుంది. లెక్క చెప్పనక్కరలేని వందల కోట్ల రూపాయల నిధులు, వాహనాలు, పెట్రోలు, మితిమీరిన అధికారం సమకూరి, ఉద్యమకారుల మీద మాత్రమే కాక, మొత్తం సమాజం మీద పోలీసు రాజ్యం పెరిగి అదే ఒక స్వార్థప్రయోజనంగా మారిపోయింది. ఒకవైపు ఉద్యమం లేదనీ, చల్లారిపోయిందనీ ప్రకటనలు ఇస్తూనే, మరొకవైపు మంత్రులను, ప్రజాప్రతినిధులను బెదిరించి వారి చుట్టూ భద్రతావలయాలు బిగించడం, నానాటికీ ఎక్కువ నిధులు, అధికారాలు పొందడం పోలీసులు ఒక కళగా అభివృద్ధి చేశారు. కనీసం 1970ల నుంచీ ఆంధ్రప్రదేశ్ లో కొనసాగుతున్న ఈ అక్రమ దమననీతి తెలంగాణ రాష్ట్రంలో ఉండనవసరం లేదు. ప్రభుత్వాధికారానికి వచ్చినవారు పాలకవర్గాలలో భాగమే అయినప్పటికీ నిన్నటివరకూ ప్రజలమధ్య ఉద్యమంలో ఉన్నారు. వారు ప్రజలకు భయపడనవసరం లేదు. పోలీసుల బెదిరింపులకు లొంగి వారి రక్షణతోనే బతకనవసరం లేదు. తాము అధికారం నెరపుతున్న ప్రభుత్వంలో పోలీసు శాఖ మిగిలిన అన్ని శాఖల వంటిదేనని, అది ఒకానొక శాఖ మత్రమేనని పోలీసు శాఖకు స్పష్టం చేయవచ్చు. కాని నవతెలంగాణ పాలకుల వర్గ స్వభావం పాత విధానాలనే యథాతథంగా కొనసాగించ దలచుకున్నట్టు స్పష్టమవుతున్నది.

రాజ్యం పాత్రను, ప్రభుత్వం పాత్రను, అధికారపక్షం పాత్రను కూడ తామే నిర్వహిస్తున్న పోలీసులు సదస్సుకు అనుమతి ఇవ్వకపోవడానికి కొన్ని కారణాలు చెప్పారు. అవి ఒకటి, ఈ కార్యక్రమం నిషిద్ధ పార్టీకి ప్రచారం చేస్తున్నదని, అలా చేయడం చట్టప్రకారం నేరమని. రెండు, ఈ కార్యక్రమానికి నిర్వాహకుడు రెవల్యూషనరీ డెమొక్రటిక్ ఫ్రంట్ అనే నిషిద్ధ సంస్థ నాయకుడైన వరవరరావు గనుక దీన్ని అనుమతించ లేమని. మూడు, ఈ కార్యక్రమంలో పాల్గొనేవారు దండకారణ్యం నుంచి, చత్తీస్‌గడ్, జార్ఖండ్‌ల నుంచి వచ్చే తీవ్రవాదులు గనుక వారివల్ల ప్రభుత్వానికి ప్రమాదం ఉందని.

ఈ మూడు కారణాలూ అత్యంత హాస్యాస్పదమైనవి, అర్థరహిత మైనవి. అసలు ప్రజాస్వామ్యంలో ఒక రాజకీయ పార్టీని నిషేధించ వచ్చునా అనే తాత్విక, రాజనీతిశాస్త్ర చర్చ కూడ అవసరం లేదు. సంస్థకు, ఆయుధధారణకు, పనికి నిషేధం ఉండవచ్చు గాని భావాలకు నిషేధం ఉంటుందా? ఒక హాలులో ఐదారు వందల మంది కూచుని కొన్ని భావాలు పంచుకోవడం ఎలా నిషిద్ధం అవుతుంది? వారు చర్చించే విషయాలు నిషిద్ధపార్టీకి సంబంధించినవి గనుక అవి కూడ నిషిద్ధమే అనదలచుకున్నట్టయితే, స్వయంగా ఈ రాష్ట్ర ముఖ్యమంత్రే ఆ భావాలను చర్చించడం మాత్రమే కాదు, అమలు చేస్తానని కూడ అని ఉన్నారు గదా? ప్రతి రోజూ ఏదో ఒక పత్రికలో, ఛానల్ లో ఆ నిషిద్ధ పార్టీ ఆచరణ గురించీ, భావాల గురించీ వార్తలూ వ్యాసాలూ ప్రశంసలూ విమర్శలూ వస్తున్నాయి గదా? ఈ పది సంవత్సరాలలో అరుంధతీ రాయ్, యాన్ మిర్డాల్, సత్నామ్ వంటి ప్రముఖ రచయితలతో సహా కనీసం డజను మంది ఆ రాజకీయాల మీద, ఆ ఆచరణ మీద పుస్తకాలు రాసి, ప్రసిద్ధ పుస్తక ప్రచురణ సంస్థల చేత ప్రచురించారు గదా? దేన్ని నిషేధించగలరు? సభ జరగనివ్వకపోయినంత మాత్రాన ఆ సభకు రాదలచినవారి మనసులో భావాలను అడ్డుకోగలరా? తెలంగాణ అనే మాట వినబడగూడదు అని శాసించిన నిరంకుశత్వానికి ఏమయిందో కళ్లారా చూసిన వాళ్లే ప్రజా ఉద్యమం, ప్రత్యామ్నాయ రాజకీయాలు అనే మాటలు వినబడగూడదని శాసిస్తే ఏమవుతుందో ఊహించలేరా?

ఈ కార్యక్రమ నిర్వాహకుడు వరవరరావు గనుక, ఆయన ఒక నిషిద్ధ సంస్థ అధ్యక్షుడు గనుక అనుమతి ఇవ్వబోమని పోలీసుల ప్రకటన తెలిపింది. ఇక్కడ ఆ పోలీసులకు చరిత్రలో జరిగిన విషయం గుర్తు చేయవలసి ఉంది. వరవరరావు ఆర్ డి ఎఫ్ అధ్యక్షుడు మాత్రమే కాదు, 2004లో మావోయిస్టు పార్టీకీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికీ మధ్య జరిగిన చర్చలలో మావోయిస్టు పార్టీ ప్రతినిధి వర్గంలో సభ్యుడు. 2005లో తిరిగి నిషేధం విధించగానే ఆ ప్రతినిధివర్గ సభ్యులైనందుకు వరవరరావునూ, జి. కళ్యాణరావునూ అరెస్టు చేసి చంచల్ గూడ జైలులో నిర్బంధించారు. ఇప్పటి ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర రావు అప్పుడు కేంద్ర ప్రభుత్వంలో కార్మిక శాఖ మంత్రి. ఆయన హైదరాబాదు వచ్చి జైలుకు వెళ్లి మరీ వరవరరావును కలిశారు. ఒక కేంద్ర మంత్రి, ఒక మావోయిస్టు ప్రతినిధిని జైలులో కలవవచ్చునా అని అప్పుడు ప్రతిపక్షాలు పెద్ద ఎత్తున రభస చేశాయి. కేంద్ర మంత్రి గానే జైలులో మావోయిస్టు ప్రతినిధిని కలిసిన వ్యక్తి పాలనలో, ఆ మావోయిస్టు ప్రతినిధి నిర్వహణలో ఒక సభ జరగడమే నిషిద్ధం కావడం ఎంత హాస్యాస్పదం! నిజానికి మావోయిస్టు సానుభూతిపరులు, మావోయిస్టు భావజాలం ఉన్నవారెందరో తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో పాల్గొన్నారు, తమ మౌలిక భావాలు మార్చుకోకుండానే తెలంగాణ రాష్ట్ర సమితిలో చేరారు, సమర్థించారు. మావోయిస్టు పద్ధతులమీద విమర్శ ఉన్నప్పటికీ వారి రాజకీయాలు సరైనవేనని అంటున్నవాళ్లు తెలంగాణ రాష్ట్ర సమితిలో కూడ ముఖ్యమంత్రితో సహా ఎందరో ఉన్నారు.

ఇక దండకారణ్యం నుంచి మావోయిస్టులు ఈ సదస్సులో పాల్గొనబోతున్నారనేది బట్టకాల్చి మీద వేసేలాంటి ఆరోపణ. నిర్దిష్టంగా నేరారోపణలకు గురై, పోలీసుల నుంచి తప్పించుకుని తిరుగుతున్న వ్యక్తులెవరైనా ఈ సదస్సుకే కాదు, ఎక్కడికి వచ్చినా పోలీసులు అరెస్టు చేయవచ్చు. ఒకవేళ పోలీసు వాదన నిజమే అనుకున్నా, సదస్సు జరిగితే, ఆ హాలు సామర్థ్యం ఐదారు వందల మంది అనుకుంటే, అందులో ఇటువంటి వారు ఎంతమంది ఉండే అవకాశం ఉంది? ఆ కొందరి కోసం మిగిలినవారి ప్రజాస్వామిక హక్కును ఎలా భగ్నం చేస్తారు? అటువంటి వాళ్లు రానున్నారని కారణం చూపి మొత్తంగా ఒక చర్చను, సదస్సును భగ్నం చేయడమంటే అది మనుషులు ఆలోచనాపరులుగా ఉండగూడదని కోరుకోవడమే. తెలంగాణ ప్రజలు అలా ఆలోచనాపరులుగా ఉండగూడదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుదీర్ఘకాలం ప్రయత్నించి విఫలమయిందనే చరిత్ర తెలంగాణ ప్రభుత్వం మళ్లీ ఒకసారి చదువుకోవలసి ఉంది.

ఈ నిర్బంధకాండకు ప్రతిస్పందనలలో చాల విచిత్రంగా సమైక్యవాదులు, తెలంగాణవాదులలో కొందరు ఏకమయ్యారు. తెలంగాణ ఏర్పాటే తప్పని, తెలంగాణ నాయకులు ఇటువంటి అప్రజాస్వామికవాదులని, నిరంకుశులని తాము ముందే చెప్పామని, ఇవాళ నిర్బంధానికి గురైనవారందరూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడాలని కోరుకున్నారు గనుక వారికి ఇటువంటి శాస్తి జరగవలసిందేనని సమైక్యవాదులు చంకలు గుద్దుకున్నారు. ఈ ప్రతిస్పందనలలో ఇంకా సంస్కారహీనమైనవీ, నీచమైనవీ, అసభ్యమైనవీ ఉన్నాయి గాని వాటిని పక్కనపెట్టవచ్చు. తెలంగాణ అకాంక్ష ఒక న్యాయమైన ఆకాంక్ష గనుకనే దాన్ని సమర్థించడం జరిగింది గాని, ఆ ఆకాంక్షకూ ప్రస్తుత ప్రభుత్వ విధానానికీ ఏమీ సంబంధం లేదు. అది ప్రజల ఆకాంక్ష. ఇవాళ అమలు జరుగుతున్నది అధికార కాంక్ష. ఈ రెండిటికీ హస్తిమశకాంతరం ఉన్నది. నిజానికి ఇవాల్టి ప్రభుత్వ దమనకాండ ఆ తెలంగాణ ప్రజా ఆకాంక్షకు కూడ విద్రోహం. అనాటి ప్రత్యర్థి అయిన ఆంధ్ర వలస పాలకవర్గాల విధానాలకు అనుకరణ మాత్రమే. ఇవాళ తెలంగాణ పాలకులు ఇలా ప్రవర్తిస్తున్నందువల్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షలు తప్పుడువైపోవు.

ఇక తమను తాము తెలంగాణవాదులుగా భావించుకునే కొందరు ప్రభుత్వం మీద గుడ్డి అభిమానంతో న్యాయాన్యాయ విచక్షణ కోల్పోయి మాట్లాడుతున్నారు. ఆరు దశాబ్దాల పాటు తెలంగాణ సమాజం ఏ స్వేచ్ఛాస్వాతంత్ర్యాల కోసం పరితపించి, పోరాడి, స్వరాష్ట్రం సాధించుకున్నదో ఆ స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు లేకపోయినా ఫరవాలేదని వాదిస్తున్నారు. నిర్వాహకుల కులం, కీర్తి, 'తెలంగాణ వ్యతిరేకత', 'ఆంధ్ర అనుకూలత' వంటి అర్థరహితమైన ఆరోపణలు కూడ చేస్తున్నారు. ఈ సదస్సు–సభ కార్యక్రమం వల్ల తెలంగాణ, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బ తింటుందనీ, అందువల్ల హైదరాబాదుకు విశ్వనగరంగా ఎదగడానికి ఆసరమైన పెట్టుబడులు రావనీ, కనుక సదస్సును అడ్డుకోవడం సరైనదేనని వీళ్లు వాదిస్తున్నారు. అసలు పెట్టుబడులు రావడం వల్ల తెలంగాణ ప్రజలకు ఏమి ఒరుగుతుందనీ, ఈ మాటలే చంద్రబాబునాయుడు కూడ అన్నాడు గదా అనీ, తెలంగాణ సమాజం కోరుకున్నది స్వేచ్ఛ లేని, హక్కులు లేని తెలంగాణానా అనీ ప్రతివాదన చేయవచ్చు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే మావోయిస్టుల అడ్డాగా మారుతుందని ఇంతకాలం వ్యతిరేకులు చేసిన ప్రచారం నిజం చేసినట్టవుతుంది గనుక సదస్సును అడ్డుకోవడం సరైనదేనని మరి కొందరు వాదిస్తున్నారు. మావోయిస్టు ఆలోచనలు చేసేవారున్నారనేది నేరమా, అటువంటివాళ్లు అన్ని రాష్ట్రాలలోనూ ఉన్నారు గదా. అసలు తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర డిమాండును 1969 నుంచీ నిరంతరాయంగా సమర్థిస్తున్న, తెలంగాణ ఉద్యమంలో పాల్గొంటున్న ఏకైక పార్టీ మావోయిస్టు పార్టీ మాత్రమే కదా, అది తెలంగాణలో ఉందని చెప్పుకోవడానికి భయమెందుకు? మరికొందరైతే సదస్సు నిర్వాహక

సంపన్నుల సేవలో మోడీ పాలన

మోడీ స్వదేశీ, విదేశీ కార్పొరేట్ బహుళ జాతి సంస్థలకూ, ప్రపంచ బ్యాంక్‌కూ మాత్రమే సేవకుడనీ, ప్రజలకు మాత్రం కాదనీ అంటున్నారు **షేక్ కరీముల్లా**

దేశ 68వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని చారిత్రక ఎర్రకోటపై నుండి మోడీ 'నేను ప్రధానమంత్రిని కాను, ప్రధాన సేవకుడిగా మీ మధ్యకు వచ్చాను. పాలకునిగా కాకుండా సేవకునిగా ప్రభుత్వాన్ని నడుపుతాను' అని మాట్లాడినాడు. అంతర్జాతీయంగా మారిన ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికా సంఘాన్ని రద్దుచేసి దాని స్థానంలో కొత్త సంస్థను నెలకొల్పుతామనీ, కొత్త ఆత్మతో కూడిన కొత్త వ్యవస్థ మనకు అవసరం అనీ, ప్రభుత్వ - ప్రైవేట్ భాగస్వామ్యాన్ని, యువశక్తిని పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా భారతదేశాన్ని ముందుకు తీసుకు వెళుతున్నదనీ ప్రసంగించాడు.

దేశ ఆర్థిక గతి దిశా నిర్దేశం చేసిన ప్రణాళికా సంఘం

ప్రపంచంలో ప్రణాళికలు రూపొందించుకుని సత్వర ఆర్థికాభివృద్ధిని సాధించిన మొదటి దేశం రష్యా. స్టాలిన్ నాయకత్వంలో కొద్దికాలంలోనే ఆ దేశం ప్రణాళికల ద్వారా గణనీయమైన వృద్ధిని సాధించింది. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో దాదాపు ప్రపంచం ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నా రష్యాని మాత్రం ఆ సంక్షోభం ఏమీ చేయలేక పోయింది. పైపెచ్చు రష్యా రెండవ ప్రపంచ యుద్ధంలో పాల్గొని తీవ్ర నష్టానికి గురైంది. అయినప్పటికీ ఆర్థిక వృద్ధిని సాధించింది. దీనికి కారణం సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ, ప్రణాళికలు. ఇది గమనించిన మన ప్రఖ్యాత ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య 1934లో భారతదేశానికి ప్రణాళికా బద్ధమైన వృద్ధి అవసరమని తన గ్రంథం 'ప్లాన్డ్ ఎకానమీ ఫర్ ఇండియా'లో తెలిపారు. నెహ్రూ ఈ సోషలిస్టు ప్రణాళికా విధానాన్ని మెచ్చుకుని సామ్యవాద రీతి సమాజ స్థాపన లక్ష్యంగా 1950 మార్చ్‌లో కేంద్ర కేబినేట్ తీర్మానంతో ప్రధాని అధ్యక్షతన ప్రణాళికా సంఘాన్ని స్థాపించారు. 1950-80 మధ్యకాలంలో ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ రంగానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చిన కాలంలో ప్రణాళికా సంఘానికి ఎంతో ప్రతిష్ఠ ఉండేది. ఆయా రంగాల వారిగా అభివృద్ధి లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు వనరులను కేటాయించడం, తద్వారా ప్రణాళికా లక్ష్యాలను సాధించడం ఈ సంఘం ప్రధాన విధి. దేశం ప్రపంచ బ్యాంకు కబంధహస్తాలలోకి వెళ్లక ముందు ప్రణాళికా సంఘం మన ఆర్థిక గతిని దిశానిర్దేశం చేసింది. 1991 నుండి ప్రారంభమైన ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ లాంటి ఆర్థిక విధానాల బాటలో దేశం పయనించడం మొదలయ్యాక ప్రణాళికా సంఘం ప్రాధాన్యత తగ్గుతూ వచ్చింది. నేడు గత చరిత్రగా మోడీ దీనిని మార్చనున్నాడు. ఈ మాత్రం స్వదేశీ వాసన కూడా మోడీకి గిట్టడం లేదు. ఇతని మూడు నెలల పాలన విధానాలను పరిశీలిస్తే మాటలలో స్వదేశీయత, కానీ చేతలలో, ఆచరణలో విదేశీయతకు గులాం (బానిస) అని తేలిపోయింది.

మోడీ పాలనలో అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు చూస్తే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఉంది. మొదటి బడ్జెట్ మొత్తం అన్ని రంగాలలో విదేశీ ప్రైవేట్ ప్రత్యక్ష పెట్టుబడులకు (ఎఫ్‌డిఐ) ఎర్ర తివాచి పరిచి ఎఫ్‌డిఐల వెల్లువ తారక మంత్రంగా ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ పదేపదే ప్రకటించడం సిగ్గుచేటు. ప్రభుత్వరంగ బ్యాంకుల్లో ప్రభుత్వ మూలధనాన్ని రు. రెండు లక్షల 48 వేల కోట్లకు తగ్గించుకునే విధంగా డిజిన్వెస్ట్‌మెంట్ ఉండాలని, బీమా రంగంలో కూడా ఎఫ్‌డిఐని 26 శాతం నుండి 49 శాతానికి పెంచింది. ఈ తాజా నిర్ణయంతో ఈ రంగంలోకి మూడు బిలియన్ డాలర్ల ఎఫ్‌డిఐ రానున్నదని అంచనా. స్కాట్‌లాండ్, స్టాండర్డ్ లైఫ్, ఫ్రాన్స్ ఆక్సా, లాంబార్డ్, అలియంజ్, ఇటలీకి చెందిన జనరల్లీ బీమా కంపెనీలు భారత్‌లో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నాయి.

స్వదేశీకరణ పేరుతో దేశ సార్వభౌమాధికారాన్నే తాకట్టు పెట్టే చర్య రక్షణరంగంలో కూడా ఎఫ్‌డిఐని 49 శాతానికి పెంచడం. ప్రస్తుతం

సంస్థ ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక అనే పేరు చూసి ప్రత్యామ్నాయం అప్పుడేనా అనీ, వందరోజులు కూడ ఆగలేకపోయారా అని ప్రశ్నిస్తున్నారు. అది తెరాసకో, మరో రాజకీయ పార్టీకో ప్రత్యామ్నాయం అని కాదు, నక్సల్బరీ రాజకీయాలు వ్యవస్థకే ప్రత్యామ్నాయాన్ని ప్రకటిస్తున్నాయి. ఈ వందరోజులు కాదు, తెరాస పుట్టిన ఈ పద్నాలుగేళ్లు కాదు, అంతకు ముందు మూడు దశాబ్దాలుగా ఈ ప్రత్యామ్నాయ రాజకీయ ప్రచారం, ఆచరణ ఉన్నాయి. ఇప్పుడే పుట్టిన శిశువు మీద మీ ప్రతాపం ప్రయోగిస్తారా, మరోచోట పెట్టకపోయారా, విజయవాడలో పెట్టకపోయారా అని కూడ ప్రశ్నలు వచ్చాయి. ఇంతకు ముందే చెప్పినట్టు ఇటలీలోని మిలాన్ నుంచి ప్రపంచవ్యాప్తంగా ఎన్నోచోట్ల ఈ సందర్భంగా సదస్సులు సమావేశాలు జరుగుతున్నాయి. విశాఖపట్నంలో పత్రికా సమావేశం జరిగింది. విజయవాడలో సదస్సు జరిగింది. ఆ తర్వాతనే హైదరాబాదులో సదస్సు ఏర్పాట్లు జరిగాయి.

ఈ వాద ప్రతివాదనలు ఎలా ఉన్నా, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో పాల్గొన్న ప్రజల స్వేచ్ఛాస్వాతంత్ర్య ఆకాంక్షలను, హక్కుల స్ఫూర్తిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అతి త్వరలోనే కాలరాయడం ప్రారంభించిందన్నది విషాదకరమైన వాస్తవం. ప్రజాఉద్యమాల వెల్లువల మీద అధికారానికి వచ్చే ప్రభుత్వాలు కూడ ఎంత ప్రజావ్యతిరేకమైన చర్యలు తీసుకుంటాయో చూపే ఉదాహరణ.

(రచయిత వీక్షణం సంపాదకులు) వీ

ఉన్న 26 శాతం ఎఫ్‌డిఐని కూడా 2001లో వాజ్‌పేయి నేతృత్వంలో ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయమే. ఈ పెట్టుబడులు దేశ ప్రయోజనాలను శాసిస్తాయనేది గత చరిత్ర అనుభవం, వాస్తవం. జాతీయత, స్వదేశీయత, దేశభక్తి నినాదాలతో పదేపదే ఊదరగొట్టే బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ భజన బూటకం. ఆచరణలో స్వదేశీ, విదేశీ కార్పొరేట్ శక్తులకు సేవ చేయడమే తమ విధానం. అందుకు ఈ దివాళాకోరు ఆర్థిక విధానాలే ప్రబల నిదర్శనం. రైల్వేరంగంలో కూడా ఎఫ్‌డిఐలకు పెద్దపీట వేయడం ద్వారా అతిపెద్ద ప్రభుత్వరంగ సంస్థ రైల్వేను బలహీనం చేసి సామాన్యులకు రైలు ప్రయాణం భారం చేయడమే. వచ్చీరాగానే రైలు ఛార్జీలు పెంచడం దీనికి సంకేతం. కోల్ ఇండియా పునర్ వ్యవస్థీకరణ పేరుతో ఆ సంస్థ పరపతిని తగ్గించడానికి ఈ రంగంలో ప్రైవేట్ కంపెనీలకు ప్రోత్సాహకాలను ప్రకటించింది. ఇకపై అన్ని బొగ్గు గనులలో ప్రైవేట్ ఎఫ్‌డిఐ లకు పెద్దపీట వేయనున్నది. స్టాక్ మార్కెట్‌లో భారీ మార్పులను తీసుకురానున్నది. ముఖ్యంగా ప్రభుత్వరంగ కంపెనీల లోని వాటాలను విక్రయించడానికి పెద్ద ప్రణాళికనే ప్రకటించింది. వివిధ పిఎస్‌యుల్లోని సుమారు రు. 51,925 కోట్ల విలువ చేసే వాటాలను మార్కెట్ శక్తులకు కట్టబెట్టడానికి ముందుకొచ్చింది. రిటైల్ రంగంలో కూడా ఎఫ్‌డిఐని ప్రవేశపెట్టింది. వాల్‌మార్ట్, రిలయన్స్ రిటైల్, ఆదిత్య బిర్లా గ్రూప్, ఫ్యూచర్ గ్రూపు లాంటి గుత్త పెట్టుబడి సంస్థల ప్రవేశంతో సన్నకారు వ్యాపారాల బతుకు బజారున పడనున్నది. చివరికి టెక్స్‌టైల్, టెలికాం రంగాలలో కూడా ఎఫ్‌డిఐల ప్రవేశం భారత ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేయనున్నది.

అత్యంత కీలకరంగాలైన వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, సామాజిక రంగాలను మోడీ ప్రభుత్వం చిన్నచూపు చూసింది. వ్యవసాయానికి గత బడ్జెట్‌లో రు. 18,781 కోట్లు కేటాయించగా ప్రస్తుత బడ్జెట్‌లో రు. 11,531 కోట్లు మాత్రమే కేటాయించి చేయి దులుపుకుంది. గ్రామీణాభివృద్ధి బడ్జెట్‌ను నమ్మడానికి వీలులేనంతగా రు. 56,438 కోట్ల రూపాయల నుండి 3,082 కోట్లకు కుదించారు. సామాజిక రంగాలకు కేటాయింపులను రు. 1,93,043 కోట్ల రూపాయల నుండి రు. 1,13,633 కోట్లకు తగ్గించారు. మొత్తంగా కీలకరంగాలకు రెండు లక్షల కోట్ల రూపాయల మేర కోత విధించి తన ప్రజా వ్యతిరేకతను చాటుకుంది. ఈ రంగాలకు ప్రభుత్వ నిధులు తగ్గితే ఉపాధి తగ్గి ప్రజల కొనుగోలు శక్తి తగ్గి దేశీయ డిమాండ్ క్షీణిస్తుంది. అలాగే ఈ కీలక రంగాలకు సబ్సిడీలను కూడా కుదించడం 'మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా' ఉంది. ఈ మోడీ మార్క్ విధానాలు ఈ రంగాలను మరింత సంక్షోభంలోకి నెట్టనున్నాయి. ఈ బడ్జెట్‌లో సంపన్నులపై వేసే ప్రత్యక్ష పన్నులను రు. 22 వేల కోట్ల రూపాయల మేర తగ్గించి పేదలపై భారాలు మోపే పరోక్ష పన్నులను ఏడున్నర వేల కోట్ల రూపాయల మేర పెంచి పేదలపై భారం మోపింది. సార్వత్రిక ఎన్నికలలో కార్పొరేట్ శక్తులు చేసిన సహకారానికి ఈ రూపంలో మోడీ రుణం తీర్చుకున్నాడు. ఈ కార్పొరేటీకరణ విధానాలను చూసి కార్పొరేట్ శక్తులు కేరింతలు కొడుతున్నాయి.

విద్యారంగం కూడా పూర్తిగా విస్మరించబడింది. ప్రభుత్వ విద్యను ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలకు గుత్తసొత్తుగా అప్పగించడం కోసం బడ్జెట్ దోహద పడుతున్నది. 'పొమ్మనలేక పొగ పెట్టినట్లుగా' బడ్జెట్‌లో పాఠశాల విద్యకు 3.03 శాతం, మధ్యాహ్న భోజన పథకానికి 0.73 శాతం కేటాయించింది. అందరికి విద్య కల్పిస్తామని విద్యాహక్కు చట్టం-2009 చేసి, ఐదు సంవత్సరాలైనా విద్యాహక్కును సమర్థవంతంగా అమలు చేయడానికి ఈ కేటాయింపులు ఏ మాత్రం సరిపోవు. ప్రత్యేక ఆర్థిక మండళ్లను (సెజ్) పునరుద్ధరిస్తామని ప్రకటించింది.

మొత్తంగా పేదలను పూర్తిగా విస్మరించి ప్రైవేట్ రంగానికి భారీ మార్కెట్‌గా భారతదేశంను నిలిపి స్వావలంబనకు సలాం! విదేశీయతకు గులాం! అంది. ఈ చర్యలతో ధనికులు మరింత ధనికులుగా, పేదలు మరింత పేదలుగా మారి సామాన్యుని బతుకు మరింత భారం కానున్నది. ఇంకా 'మేక్ ఇండియా' 'మేడిన్ ఇండియా' అంటూ బాహాటంగా విదేశీ ఇన్వెస్టర్లను ఆహ్వానిస్తున్నాడు. ఇది కచ్చితంగా ప్రపంచ బ్యాంకు అభివృద్ధి నమూనా. 1990 దశకం నుండి వస్తున్న ప్రపంచీకరణ విధానాల ఒరవడిలోనే ఈ బడ్జెట్‌ను చూడక తప్పదు. భిన్నంగా ఏమిలేదు. ఒక్క మాటలో చెప్పాలంటే యుపిఎ మూడవ ప్రభుత్వమే మోడీ ప్రభుత్వం. కాంగ్రెస్, బిజెపిల జెండాలు వేరైనా ఆర్థిక ఎజెండా ఒకటేననేది నగ్న సత్యం.

1991 ప్రపంచీకరణ విధానాల అమలు నుంచి పి.వి. నరసింహా రావు, వాజ్‌పేయి, మన్మోహన్‌సింగ్, మోడీ, రేపు ఇంకొకరు ఎవరైనా పైకి ఏమి చెప్పినా ఈ రెండు పార్టీలు అనుసరిస్తున్నది ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ. ఈ విధానాల మూలంగానే దేశం ఆర్థికంగా చితికి పోయింది. అధిక ధరలు, పేదరికం, వైద్యం, విద్య, కూడు, గూడు లాంటి సమస్యలు మరింత జటిలమై ఆకలి చావులు, పస్తులతో, మురికి వాడలతో దేశం కునారిల్లుతోంది. ఈ ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్, బిజెపిలు పూర్తిగా విఫలమైనాయి. రెవెన్యూ లోటు రు. 3,78,348 కోట్లు, ద్రవ్యలోటు రు. 5,31,177 కోట్లు. అంటే ఆదాయం తక్కువ, ఖర్చు ఎక్కువ. అప్పుచేసి ఈ లోటును పూడ్చడం ప్రభుత్వాల మామూలు ప్రక్రియగా మారి, రుణాల మీదే ప్రభుత్వాలు నడుస్తున్నాయి. అప్పు ఇస్తే వాయిదాలలో రుణం, వడ్డీ చెల్లించాలి. వాయిదా చెల్లింపుల కంటే వడ్డీ చెల్లింపులే అధికంగా ఉన్నాయి. ఇలా వాయిదా, వడ్డీ చెల్లింపులు 2013-14 ఆర్థిక సంవత్సరంలో రు. 5,43,267 కోట్లు. 2014-15కు మోడీ ప్రభుత్వం రు. 6,43,301 కోట్లు కేటాయించింది. ఇది సంక్లిష్టంగా దేశ ఆర్థిక చిత్రపటం. ఈ స్థితికి ప్రణాళికా సంఘం కారణమా? 'జబ్బు ఒకటైతే మందు మరొకటిలా' ఉంది మోడీ వైఖరి. ప్రస్తుత ప్రణాళికా సంఘం స్థానంలో మోడీకి అన్ని విషయాలలోను వెన్నుదన్నుగా ఉండే స్వేచ్ఛా మార్కెట్ ఆర్థికవేత్తలు అరవింద్ పణగారియా, వివేక్ దేవరాయలు, సంఘ పరివార్‌తో మంచి సంబంధ బాంధవ్యాలు కలిగిన వ్యక్తులతో నూతన సంఘాన్ని ఏర్పాటు చేయనున్నారని వార్తలు వస్తున్నాయి. ఈ చర్యతో అడ్డుగా ఉన్న ప్రణాళికా సంఘాన్ని తొలగించుకొని నూతన సంఘంతో పూర్తిగా కార్పొరేట్ శక్తులకు సేవ చేయడానికి పూనుకొన్నాడు. ఇప్పుడు చెప్పండి. మోడీ ఎవరికి సేవకుడు? స్వదేశీ సంపన్నులకు, విదేశీ బహుళజాతి సంస్థలకు మొత్తంగా ప్రపంచ బ్యాంకుకు సేవకుడనేది జగమెరిగిన సత్యం కాదా! ఈ పాలకులు ఏమి చేయరని చరిత్ర రుజువు చేసింది. భ్రమలుమాని మౌలిక సామాజిక, ఆర్థిక మార్పు కోసం మరో నూతన స్వాతంత్ర్య పోరాటానికి భగత్‌సింగ్ ఆశయ సాధన కోసం నడుంకట్టడమే కర్తవ్యం.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

సమస్యలమయం కౌలు రైతుల జీవితం

***కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి గానీ, బ్యాంక్‌ల నుంచి గానీ ఎలాంటి రుణాలూ, సబ్సిడీలూ అందడం లేదనీ, పంట నష్టపోయినప్పుడు భూమి యజమానికే నష్టపరిహారం దక్కుతోందనీ, ఇలా అన్ని విధాలుగా కౌలురైతులే నష్టపోతున్నారనీ అంటున్నారు* డి. రవీందర్**

మన రాష్ట్రం వ్యవసాయ ప్రధానమైన రాష్ట్రం. మొత్తం జనాభాలో మూడింట రెండొంతుల మంది, గ్రామీణ జనాభాలో సుమారు 73శాతం మంది వ్యవసాయం మీదనే ఆధారపడి జీవిస్తున్నారు. దీంతో వ్యవసాయం కీలకంగా మారింది. రాష్ట్రానికి రైతే వెన్నెముకగా మారాడు. అన్నపూర్ణగా ప్రసిద్ధిగాంచిన మన రాష్ట్రంలో రైతులు అనేక సమస్యలతో సతమతమవుతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కొద్దోగొప్పో సొంత పొలం కలిగి ఉన్న రైతులే అనేక అష్టకష్టాలు పడుతుండగా, అసలు పొలం లేకుండా ఇతరుల వద్ద కౌలుకు తీసుకొని వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న కౌలు రైతుల బాధలు వర్ణనాతీతం. వీరికి ఇప్పటి వరకు కనీసం గుర్తింపు కూడా లేదు. రాష్ట్ర ప్రభుత్వం 26 లక్షల మంది కౌలు రైతులను గుర్తించి, వారికి రుణ అర్హత కార్డులు (ఎల్ఇసి) ఇవ్వాలని, తద్వారా వారికి సాధారణ రైతులు మాదిరిగానే బ్యాంకుల ద్వారా పరపతి సౌకర్యం కల్పించాలని నిర్ణయించింది. ఇది వారికి ఎంతో మేలు చేసే చర్య అయినప్పటికీ ఇప్పటి వరకు కౌలు రైతులకు ఎటువంటి గుర్తింపు, ప్రభుత్వం నుండి అధికారిక సహకారం లేకపోవడంతో వ్యవసాయం గిట్టుబాటుకాక ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద చేసిన అప్పులు పేరుకుపోయి, వాటిని తీర్చలేక పలువురు కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

రాష్ట్రంలో కౌలు రైతులు 40 లక్షల మంది వరకు ఉంటారని ఒక అంచనా. రాష్ట్రంలో మొత్తం 120 లక్షల వ్యవసాయ కమతాలు ఉండగా, 40 శాతం కమతాలను కౌలు రైతులే సాగు చేస్తున్నారు. వరి అధికంగా సాగు చేస్తున్న తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లోనే అత్యధిక శాతం మంది కౌలు రైతులు ఉన్నారు. ప్రస్తుతం రాయలసీమ, తెలంగాణ జిల్లాల్లో కూడా వీరి సంఖ్య పెరుగుతోంది. కోనేరు రంగారావు కమిటీ పరిశీలన ప్రకారం కొన్ని గ్రామాల్లో కౌలు రైతులు 55 శాతం నుండి 60 శాతం వరకు ఉన్నారు. అయినప్పటికి వీరికి గుర్తింపు లేదు. వీరు రెవెన్యూ రికార్డుల్లో నమోదు కారు. అందువల్ల వీరి సమస్యలు ప్రభుత్వ దృష్టికి రావు.

వరదలు, తుఫానులు, కరువులు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు ప్రభుత్వం అందించే సహకారం పొలాల యజమానులకే దక్కుతుంది కానీ, వాస్తవంగా భూమిని సాగు చేసే కౌలు రైతులకు ఎటువంటి సహకారం అందదు. కానీ, వ్యవసాయం మీద పెట్టుబడి పెట్టి, కౌలు చెల్లించి, పూర్తిగా నష్టపోయేది మాత్రం కౌలు రైతులే. 2010 డిసెంబర్‌లో, 2013 ఆగస్టులో వచ్చిన వరదల వల్ల ఒక్కొక్క ఎకరానికి రు. 15,000 పంట నష్టం సంభవించింది. దీనివల్ల కోలుకోలేని దెబ్బతిన్నది మాత్రం కౌలు రైతులే. ఒక్కొక్క ప్రాంతంలో ప్రాంతాన్ని బట్టి ఎకరానికి రు. 10వేల నుంచి రు. 30వేల వరకు కూడా కౌలు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం నుండి ఎటువంటి గుర్తింపు లేకపోవడం వల్ల వీరికి బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదు. దీంతో పూర్తిగా ప్రైవేట్ వడ్డీ వ్యాపారస్తుల మీదనే ఆధారపడాల్సి వస్తోంది.

కౌలు రైతుల్లో అత్యధిక శాతం మంది సొంత భూమి లేని వారు లేదా చిన్న కమతాలు కలిగిన బలహీన వర్గాలకు చెందినవారు ఉంటారు. అందువల్ల వారికి ప్రైవేట్ వడ్డీ లభించడం కూడా కష్టమే అవుతుంది. దీనికి తోడు వారికి వ్యవసాయం మీద లాభాలు దక్కేది కూడా అనుమానమే. ప్రకృతి దయతలచి కరువులు, వరదలు, తుఫాన్లు వంటివి రాకుండా, చీడ పీడల తాకిడి లేకుండా వ్యవసాయం సజావుగా సాగినప్పుడు మాత్రమే వారికి లాభాలు వస్తాయి. ఇది చాలా అరుదుగా జరుగుతుంది. పెరుగుతున్న వ్యవసాయ ఖర్చులు వారికి మరింత భారంగా పరిణమిస్తున్నాయి. ఒక వైపు పంట నష్టాలు, మరోవైపు వడ్డీల తాకిడి, గిట్టుబాటుకాని ధరల వంటి చక్రబంధంలో ఇరుక్కుంటున్న కౌలు రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం గత కొద్ది సంవత్సరాలుగా కొన్ని చర్యలు చేపడుతోంది.

రోజురోజుకు పెరుగుతున్న వ్యవసాయ ఖర్చులతో పోల్చుకుంటే పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం చెల్లిస్తున్న పరిహారం, బీమా పూర్తిగా సరిపోవు. అవి కూడా పంట చేస్తున్న కౌలు రైతులకు ఏమాత్రం అందేవి కావు. పొలం సొంతదారులకే వెళ్తాయి. దీంతో కౌలు రైతులు అధిక వడ్డీలకు ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అప్పు చేయాల్సి వస్తుంది. ఈ అప్పులను సాధారణంగా తమ పంటను కొనుగోలు చేసే వ్యాపారుల, ఎరువుల, పురుగుమందుల దుకాణదారుల నుంచి తీసుకుంటారు. వ్యవసాయ ఖర్చులు పెరుగుతుండడంతో పాటు పండించిన పంటల ధరలు ఒడిదుడుకులకు లోనై గిట్టుబాటు కాకుండా పోతున్నాయి. దీంతో చిన్న, సన్నకారు రైతులతో పాటు కౌలు రైతులు కూడా అప్పుల బాధలు తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2004లో ఒక ప్రకటన చేసింది. ఇక నుంచి కౌలు రైతులకు కూడా బ్యాంకులు, కో ఆపరేటివ్ సొసైటీల వంటి వాటి ద్వారా పంట రుణాలు ఇప్పించేందుకు చర్యలు చేపట్టనున్నట్టు పేర్కొంది. 2004 నుంచి కౌలు రైతులతో పాటు చిన్న, సన్నకారు రైతులకు కూడా ఆర్ఎంజి (రైతు మిత్ర బృందాలు)ల ద్వారా సంస్థాగత రుణాలు కల్పించడానికి అంతకు ముందు 2003 జూన్ 25న జిఒ 167ను విడుదల చేసింది. దీంతో రెండు లక్షల రైతు మిత్ర బృందాలు ఏర్పడ్డాయి. 2005 డిసెంబర్ 12న ప్రభుత్వం మరో లక్ష రైతు మిత్ర బృందాల ఏర్పాటుకు జీవో విడుదల చేసింది. ఈ బృందాల్లో

చేరడానికి కౌలు రైతులు, చిన్న, సన్నకారు రైతులు మాత్రమే అర్హులని స్పష్టం చేసింది. 2009 జూలై నాటికి 35 వేల బృందాలు మాత్రమే నమోదయ్యాయి.

ఎటువంటి తనఖా లేకుండా కౌలు రైతులకు సెల్ఫ్ డిక్లరేషన్ ద్వారా రు. 50 వేల వరకు రుణాలు ఇవ్వొచ్చని 2008 ఆగస్టులో రిజర్వుబ్యాంకు ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని వాణిజ్య బ్యాంకులకు సర్క్యులర్లు పంపింది. 2009 జూలైలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన బ్యాంకర్ల సమావేశంలో రాష్ట్రంలోని 20 లక్షల మంది కౌలు రైతులకు రైతుమిత్ర బృందాలు, జెఎల్‌జిల ద్వారా పంట రుణాలు ఇవ్వాలని నిర్ణయించారు. అయితే 2010 నాటికి కేవలం 1.25 లక్షల మంది కౌలు రైతులకు మాత్రమే పంట రుణాలు పంపిణీ చేయగలిగారు. ఎనిమిది సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి దృష్టి సారిస్తోంది. రైతులందరితో పాటు కౌలు రైతులకు కూడా పంట రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీలు, కరువు, వరదలు, చీడపీడలు వచ్చి పంట నష్టపోయినపుడు నష్ట పరిహారం అందుకోవడానికి వీలుగా అధికారిక గుర్తింపు కార్డులు ఇవ్వనున్నట్టు కూడా ప్రకటించింది. అయితే ప్రభుత్వం వైపు నుంచి చొరవ ఉన్నప్పటికీ బ్యాంకుల నుంచి అందుకు తగ్గట్టు స్పందన ఉండడం లేదు. 2009-10లో ప్రభుత్వ బ్యాంకులు రాష్ట్రంలో రు. 16,650 కోట్ల పంట రుణాలు పంపిణీ చేయగా, అందులో కౌలు రైతులకు ఇచ్చింది కేవలం రు. 130 కోట్లు మాత్రమే కావడం గమనార్హం. (మొత్తం పంట రుణాల పంపిణీలో ఇది 0.78 శాతం మాత్రమే) అయితే 2005లో కేవలం 27,119 మంది కౌలు రైతులకు మాత్రమే రుణాలు ఇవ్వగా 2006 నాటికి ఆ సంఖ్య 75 వేలు పెరిగింది. కౌలు రైతుల సమస్యలను పరిశీలించి, సిఫారసులు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2004 మే 31న ఒక మంత్రుల కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ 2004 జూలైలో నివేదిక సమర్పించింది. అందులో కొన్ని ముఖ్యమైన సిఫారసులు చేసింది.

1. కౌలు రైతులు భూస్వాములకు అసాధారణ కౌలు రేట్లు చెల్లిస్తున్నారు. సంస్థాగత రుణాలు అందుబాటులో లేకపోవడంతో వడ్డీ వ్యాపారస్తుల నుంచి అధిక వడ్డీరేట్లకు అప్పులు తెచ్చుకుంటున్నారు. సబ్సిడీలు సైతం అందక పోవడంతో విత్తనాలను కూడా ఎక్కువ రేట్లకు కొనుగోలు చేయాల్సి వస్తోంది.

2. రిజర్వు బ్యాంకు నిర్దేశం ప్రకారం కౌలు రైతులు ఎటువంటి తనఖా లేకుండా రు. 50 వేల వరకు బ్యాంకు రుణం పొందవచ్చు. కానీ, అది అమలు కావడం లేదు. కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వడానికి రైతుమిత్ర బృందాలను ప్రోత్సహించాలి.

మంత్రుల బృందం సిఫారసు మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఒక నిపుణుల బృందాన్ని నియమించింది. ఆ కమిటీ 2004 డిసెంబర్ నివేదిక సమర్పిస్తూ చేసిన మరికొన్ని సిఫారసులు :

1. రైతులందరితో పాటు కౌలు రైతులను కూడా సంస్థాగత రుణాల పరిధిలోకి తీసుకురావాలి. అందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలి. ఇందుకోసం కౌలు రైతులందరినీ నమోదు చేసి, వారికి కూడా పాస్‌బుక్ సరఫరా చేయాలి. ఈ నమోదు ప్రక్రియ అమలును ప్రతి మూడు నెలలకు ఒకసారి అధికారులు సమీక్షించాలి.

2. వ్యవసాయ పనిముట్లను సబ్సిడీపై అందజేయాలి. ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా రైతులకు అందజేస్తున్న ప్రయోజనాలనూ, పరిహారాలనూ కౌలు రైతులకు కూడా ఇవ్వాలి.

3. కౌలు రైతులను నమోదు చేయడానికి పొలం సొంతదారులు అంగీకరించరు. కనుక కౌలుదారులను సైతం నమోదు చేసేందుకు చట్టాలను సవరించాలి.

దీని అనంతరం 2006లో రాష్ట్ర ప్రభుత్వం భూమికి సంబంధించిన సమస్యలపై అధ్యయనం చేసేందుకు అప్పటి రాష్ట్ర మంత్రి కోనేరు రంగారావు అధ్యక్షతన ఒక కమిటీ వేసింది. ఆ కమిటీ కూడా కౌలు రైతుల సమస్యలపై పలు సిఫారసులు చేసింది. వాటిలో ముఖ్యమైనవి.

1. కౌలు రైతులు రెవెన్యూ రికార్డుల్లో నమోదు కావడం లేదు. వరి సాగు చేస్తున్న ప్రాంతాల్లో ఒక్కో గ్రామంలో 55 నుంచి 60 శాతం వరకు అంతకుమించి కూడా కౌలు రైతులు ఉంటున్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు ఇచ్చే పరిహారం 90 శాతం మంది కౌలు రైతులకు చేరడం లేదు.

2. కాబట్టి పొలం సొంతదారుల నుంచి ఎటువంటి అడ్డంకులు ఎదురుకాకుండా, ప్రభుత్వం నుంచి అన్ని రకాల సహకారం అందించేందుకు కౌలు రైతులకు అధికారిక గుర్తింపు కార్డులు ఇవ్వాలి.

కోనేరు రంగారావు కమిటీ సిఫారసులను అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం 2007 జూలై 28న జి.ఒ.నెం. 1049 విడుదల చేసి కౌలు రైతులకు క్రెడిట్ కార్డులు జారీ చేయవలసినదిగా కోరింది. కానీ, ఇది ఇంత వరకు అమలు కాలేదు. ఈ కమిటీకి ముందు జయతీఘోష్, డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్ కమిటీలు కూడా కౌలు రైతుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని పలు సిఫారసులు చేశాయి.

సాగు రైతు రక్షణ హస్తం

వీటన్నింటి నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం 2011 జూలై 10న కౌలు రైతుల సంక్షేమం కోసం 'సాగురైతు రక్షణ హస్తం' అనే పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం కింద కౌలు రైతులకు రుణార్హత, బహుళ ప్రయోజనార్థక కార్డులను పంపిణి చేస్తున్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 26 లక్షల మంది కౌలు రైతులు లబ్ధిపొందుతారని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించారు. ఇటువంటి వినూత్న పథకాన్ని ప్రారంభించడం దేశంలో ఇదే మొదటిసారి. అయితే మొదటి సంవత్సరంలో ఆరు నుంచి ఏడు లక్షల మంది కౌలు రైతులకు ఈ కార్డులు జారీ చేస్తారు. ఈ పథకం కింద:

1. బ్యాంకుల ద్వారా లక్ష రూపాయల వరకు పంట రుణాల సౌకర్యం కల్పిస్తారు.
2. ప్రభుత్వం అందజేసే రాయితీపై విత్తనాలు, ఎరువులు, ఇతర ఉత్పాదకాలు కౌలు రైతులకు కూడా లభ్యమవుతాయి.
3. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగితే నష్ట పరిహారం ప్రభుత్వం అందజేసే ఇన్‌పుట్ సబ్సిడీ కూడా లభ్యమవుతుంది.
4. పంటల బీమా సౌకర్యం అమలవుతుంది.
5. భూమి లైసెన్సు పొందిన లక్షలాది మంది నిరుపేద కౌలు రైతులకు ప్రయోజనం చేకూరుతుంది.

(నోట్ : ఈ వ్యాసం ఆంధ్రప్రదేశ్ విభజనకు ముందు రాసినది)

(రచయిత రీసెర్చ్ స్కాలర్, కాకతీయ యూనివర్సిటీ) వీ

కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణ సరైనదేనా?

***ఎలాంటి పరీక్షలూ, ప్రమాణాలూ లేకుండా కాంట్రాక్ట్ లెక్చరర్లను నియమించి వారిని నేడు అదే పద్ధతిలో క్రమబద్ధీకరిస్తే అటు విద్యా వ్యవస్థకూ, ఇటు నిరుద్యోగులకూ తీరని అన్యాయం జరుగుతుందని అంటున్నారు* సురేష్**

రమణ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం తరగతికి వెళ్లాడు. పాఠం చెప్పడం మొదలుపెట్టాడు. విద్యార్థినీ, విద్యార్థులూ ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు. చెపుతున్న పాఠం వారికేమి అర్థం కాలేదు. అది సైన్స్ సబెక్టు. చెప్పేది తెలుగులోనే అయినా అర్థం కావడం లేదు. కొంతమంది ధైర్యం చేసి 'సార్! పాఠం మాకు అర్థం కావడం లేద'న్నారు. ఆ లెక్చరర్ వివరించి చెప్పడం వదిలి తిట్ల వర్షం కురిపించాడు. పిల్లలు బిక్కు ముఖం వేసుకొని నోరు మూసుకొని కూర్చున్నారు. అంతే మరుసటి రోజు నుండి క్లాసుకు రావడం మానేశారు. అర్థంకాని పాఠం వినడం ఎందుకనుకున్నారు. చదువుపై ఆసక్తి ఉన్న ఇంకొంత మంది విద్యార్థులు పాఠాన్ని అర్థం చేసుకోవడానికింకా ప్రయత్నిస్తూనే ఉన్నారు.

ఒక రోజు ప్రిన్సిపాల్ క్లాసుకు వచ్చిప్పుడు పాఠాలు అర్థమవుతున్నాయా అని అడిగారు. వెనుకటి అనుభవం భయపెడుతున్నా ఒకరిద్దరు ధైర్యం చేసి కొన్ని పాఠ్యాంశాలు అర్థం కాలేదనీ, ఆ వ్యక్తులు అధ్యాపకులుగా పనికి రారనీ ముద్ర వేశారు. రాత పూర్వకంగా కూడా రాసి ఇచ్చారు. ఈ సంఘటన జరిగినది ఆ అధ్యాపకులు చేరిన మొదటి సంవత్సరంలో కాదు. దాదాపు 5, 6 ఏళ్ల అనుభవం సంపాదించుకున్న ఒప్పంద అధ్యాపకులది. వీరిని ప్రిన్సిపాల్ ఆర్‌జెడికి సరెండర్ చేస్తే, వారిచ్చే శిక్షగా ఆ అధ్యాపకులను వేరే కళాశాలకు పంపించారు. ఇక్కడ గమనించాల్సినదేమిటంటే విద్యార్థులు బలిపీఠం నుండి మారారు. వేరే విద్యార్థులు బలిపశువులయ్యారు. అంతే తప్ప అధ్యాపకులలో ఏ మార్పు రాలేదు. ఇలాంటి వారిని కూడా తొలగించకుండా కొనసాగిస్తున్నారు. వీరిని తొలగించడమా లేక క్రమబద్ధీకరించడమా?

ఒక్కసారి గతంలోకి వెళితే దాదాపు పదేళ్ల కిందటి మాట. ఇది అన్ని జూనియర్ కళాశాలల్లో జరిగిన సంఘటనే. కళాశాల ప్రిన్సిపాల్, పక్క కళాశాల పాఠ్యాంశాల నిష్ణాతులు, ఒకరిద్దరు సీనియర్ అధ్యాపకులతో ఒక కమిటీ ఏర్పడి ఒప్పంద అధ్యాపకులను ఎన్నిక చేసుకున్నారు. అయితే అసలు విషయమేమిటంటే వచ్చిన అభ్యర్థులలో ఆ ఉద్యోగం ఎవరికివ్వాలో ముందే నిర్ణయం జరిగిపోయింది. కనీసం వారిని పరీక్షించకుండానే నిర్ణయం తీసుకున్నారు. నామమాత్రపు ఇంటర్వ్యూలు చేసి లెక్చరర్లగా తీసుకున్నారు. ఇవన్నీ ఉత్తర దక్షిణలతో నడిచినవే. నిజంగా టాలెంట్ ఉండి ఏ రికమెండేషన్ లేనివాళ్లు ఏడ్చుకుంటూ వెళ్లిన సందర్భాలున్నాయి. ఏ నాణ్యత ప్రమాణాలు లేకుండా కేవలం సిఫారసులతో వచ్చిన వీరిని తప్పకుండా క్రమబద్ధీకరించాల్సిందేనా? వీరు మొదటి పద్ధతిలో వచ్చిన ఒప్పంద అధ్యాపకులు.

ఇక రెండవది, మధ్య దళారీ వ్యవస్థను కాదని నేరుగా ఆర్‌జెడి ఆఫీసు నుండి ఒప్పంద అధ్యాపకుల ఉద్యోగాలు ఇవ్వబడ్డాయి. ఇక్కడ తీరు మారింది కాని తంతు అదే. అయితే లాభపడిన వ్యక్తులు మారారు. దీనికి సాక్ష్యం చెవులారా విన్నాం. దినపత్రికలలో అందరూ చదివారు. అయినా ఆఫీసు వారు ఎవరికి జంకలేదు. ఆర్‌జెడి సిబ్బందితో చనువుగా మెదిలిన వ్యక్తి (ప్రభుత్వ ఉద్యోగి కాదు) ఇటీవల తన గత వైభవాన్ని తలచుకుంటూ తన పలుకుబడితో కొంతమందికి ఒప్పంద అధ్యాపకులుగా ఉద్యోగాలలో పెట్టించినట్లు చెప్పినాడు. ఇది నూరు శాతం నిజం. ఇక్కడ కూడా అభ్యర్థుల విషయంలో ఏ పోటీ జరగలేదు. ఇలా వచ్చిన వాళ్లు కూడా స్థిరీకరింపబడతారా?

ఇది కాదు పద్ధతి అని, మెరిట్ ప్రకారం ఒప్పంద అధ్యాపకులుగా నియమిస్తామని మొదలుపెట్టారు. ఇక్కడ మరో మోసం. మెరిట్ అంటే పి.జి.లో ఎక్కువ మార్కులు సంపాదించడం. సంపాదనలోనే ఉంది అసలు విషయం. ఇతర ప్రాంతాల యూనివర్సిటీలు 'నామమాత్రంగా' నిర్వహించే పరీక్షలలో ఎక్కువ మార్కులు సంపాదించుకొని లిస్టులో మొదట నిలిచి ఉద్యోగాలు సంపాదించుకున్నారు. యూనివర్సిటీలో రెండేళ్లు కష్టపడి చదివినా పిసినారితనంతో మార్కులివ్వని మన యూనివర్సిటీలు మరికొంత మంది ఉద్యోగ అవకాశాన్ని పోగొట్టాయి. ఈ కోవకు చెందినవారు కొందరున్నారు. వీరిని కూడా స్థిరీకరిస్తారా?

అందరూ ఇలాంటి వారే అని కాదు. ఇలా కూడా ఉద్యోగాలు సంపాదించి, ఏళ్లు గడిచినా పాఠాలు చెప్పడం నేర్చుకోని వారి గురించి మాత్రమే. ఎవరైతే అక్రమ మార్గాలలో కాంట్రాక్టు ఉద్యోగాలు సంపాదించుకున్నారో వారి గురించి మాత్రమే. ఇలాంటి వారంతా రెగ్యులర్ అయితే ఇప్పుడు పాఠాలు చెప్పనివారు అప్పుడు చెపుతారా?

కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని ప్రభుత్వం ప్రకటించడం కొంతమందికి ఊపిరినియ్యవచ్చు. కాని కొంతమంది ఉసురుపోసుకోక తప్పదు. ఏ పరీక్ష లేకుండా, ఎలాంటి ఇంటర్వ్యూలు ఎదుర్కోకుండా ఉన్న వారిని ప్రభుత్వం రెడ్‌కార్పెట్ పరచి స్వాగతించడం జీర్ణించుకోలేని విధంగా ఉంది. ఒప్పంద ఉద్యోగాలు సంపాదించుకునే మార్గం తెలియక చాలా మంది నష్టపోయినట్లే కదా! ఒక శాసనమండలి సభ్యుడు మాట్లాడుతూ 'ఎంత మంది ఉన్నారు కాంట్రాక్టు లెక్చరర్లు, కొంతమందే కదా!' అని అన్నారు. ఒక పోస్టుకు నోటిఫికేషన్ వస్తే వందమందికి పైగా పోటీపడే కాలంలో అంత సులభంగా ఎలా మాట్లాడగలుగుతున్నారు? ఇంకా కొంతమంది సమర్థిస్తూ ఇన్నేళ్లు తక్కువ జీతంతో పని చేశారు కదా అంటున్నారు. ఆ కొంత డబ్బు లేక ఇబ్బందులు పడేవాళ్లు మన కళ్ల ముందు కనిపిస్తున్న సజీవ సాక్ష్యాలు. ఇంకా ఒక మేధావి వర్గం వీరిని సమర్థిస్తూ ఉన్నది. ఇవన్నీ జూనియర్ కళాశాలలలో జరిగిన యథార్థ సంఘటనలు. ఇవి క్షేత్రస్థాయిలో జరిగిన విషయాలు.

ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ అణు విద్యుత్ ప్రమాదం

***ప్రజల ప్రాణాలను సైతం పణంగా పెట్టి, సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ వర్గాలకు లాభం చేకూర్చడానికే అణు విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు పాలకులు పూనుకుంటున్నారని అంటున్నారు* పి.వి. రమణ**

ఉత్తరాంధ్ర ప్రజల వ్యతిరేకతనూ, నిపుణుల హెచ్చరికలనూ ఖాతరు చేయకుండా ఉత్తరాంధ్రని అణుకుంపటిగా మార్చే కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. శ్రీకాకుళం జిల్లా కొవ్వాడ వద్ద అణు విద్యుత్తు కేంద్రాన్ని నిర్మించి తీరాలన్న పట్టుదలతో కేంద్ర ప్రభుత్వం ఉంది. దీనికి సంబంధించిన భూసేకరణ కార్యక్రమాన్ని చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకొంటున్నది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2014, సెప్టెంబర్ 6న కొవ్వాడ అణు విద్యుత్ ప్లాంట్ కొరకు జి.ఒ. నెం. 186 విడుదల చేసింది. ప్లాంట్ నిర్మాణం కోసం అవసరమైన భూమిని సేకరించడానికి, ప్రభావిత ప్రాంతా లన్నింటినీ ప్రాజెక్ట్ ప్రాంతాలుగా ప్రకటిస్తూ, వాటిని 'ప్రత్యేకించబడిన', 'శుద్ధి చేయబడిన', 'అత్యవసర నిర్ణయ' ప్రాంతాలుగా విభజించారు. ప్లాంటుకు 1 కిలోమీటరు లోపున ఉన్న ప్రాంతాన్ని 'ప్రత్యేకించబడిన ప్రాంతం'గా నిర్ధారిస్తారు. దీని చుట్టూ ఇనుప కంచె నిర్మించి లోపల ఎటువంటి ప్రజా జీవన కార్యక్రమాలు కొనసాగనివ్వరు. ఈ పరిధిలో రామచంద్రాపురం, టెక్కలి, గూడెం గ్రామాలు వస్తాయి. ప్లాంటు నుండి 5 కిలోమీటర్ల వరకూ 'శుద్ధి చేయబడిన ప్రాంతం'గా నిర్ణయిస్తారు. ఈ ప్రాంతంలో ప్రస్తుతమున్న జనాభా పెరగకుండా నియంత్రిస్తారు. కొత్త నిర్మాణ కార్యక్రమాలు ఇక్కడ నిషిద్ధం. ఈ జోనులో అక్కయ్యపాలెం, చిల్లపేటరాజం, దెరసం, కోటపాలెం, జీరుకొవ్వాడ, మరువాడ, మెంటాడ, ఎన్.గజపతిరాజపురం, పాపారావుపేట, పాతర్లపల్లె, పాతసుందరపాలెం, సీతారామపురం, సూరంపేట, తెప్పలవలస లాంటి 14 గ్రామాలున్నాయి.

ప్లాంటుకు 16 కిలోమీటర్ల లోపున ఉన్న ప్రాంతాన్ని 'అత్యవసర నిర్ణయ కేంద్ర ప్రాంతం'గా వ్యవహరిస్తారు. ఏదైనా ప్రమాదం జరిగిన వెంటనే నిర్ణయం తీసుకోవడానికి ఈ ప్రాంతాన్ని ఉపయోగిస్తారు. ఈ ప్రాంతంలో ఉద్యోగుల క్వార్టర్స్, పర్యావరణ పరిస్థితిని పరీక్షించే పరిశోధన శాల, స్కూళ్లు, హాస్పిటల్స్ నిర్మిస్తారు. 30 కిలోమీటర్ల లోపు ప్రాంతాన్ని ప్రమాద ప్రభావ ప్రాంతంగా వ్యవహరిస్తారు.

శుద్ధి చేయబడిన ప్రాంతంలో జనాభా పెరగకుండా చూడవలసిన బాధ్యతతోపాటు, ప్రత్యేక హాస్పిటళ్లు, పరిశ్రమలు, విద్యాసంస్థలు లాంటి నిర్మాణాలు జరగకుండా చూసే బాధ్యత ఛీఫ్ ప్రాజెక్ట్ ఇంజనీర్ వహించాలి. వ్యవసాయ భూమిని ప్రాజెక్ట్ భూమిగా మార్చడం, అవసరమైన తవ్వకాలలకు ప్రణాళికలు తయారు చేయడం, 'కొవ్వాడ ప్రాజెక్ట్ లోకల్ కమిటీ'ని ఏర్పాటు చేసే బాధ్యత జిల్లా కలెక్టర్‌కు అప్పగించారు. ఈ కమిటీలో ఒక సభ్యుడిని ఛీఫ్ ప్రాజెక్ట్ ఇంజనీర్ నియమిస్తారు. ఇతర సభ్యులను తరువాత నిర్ణయిస్తారు.

ఈ ప్రభుత్వ ఉత్తర్వులో అన్నిటికన్నా పెద్ద హాస్యాస్పదమైన విషయం ఏమిటంటే 5 కిలోమీటర్ల లోపల ఉన్న శుద్ధి చేయబడిన ప్రాంతంలో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయరాదని నొక్కి చెప్పడం. ఎందుకంటే ఒకవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశమంతా అణువణువునా అభివృద్ధి కార్యక్రమాలతో ముంచేస్తూ, కేవలం ప్లాంట్‌కు 5 కిలోమీటర్ల ప్రాంతం లోపున అభివృద్ధి కార్యమ్రాలు వద్దనడం.

ఈ విషయాలు పైన ఉన్న వారికి తెలిసి ఉండవచ్చు లేదా తెలియక పోయి కూడా ఉండవచ్చు.

తెలంగాణలో మొదట దృష్టి పెట్టాల్సిన వ్యవస్థ విద్యారంగం. ఎందుకంటే ఇతర రాష్ట్రాల కంటే తెలుగులో విద్యాభ్యాసం ఆలస్యంగా మొదలైంది. కాబట్టి ఈ రంగాన్ని ప్రక్షాళన చేసి బాగు చేసుకోవలసిన సమయంలో అందరినీ క్రమబద్ధీకరించాలనే ఆలోచన విద్యా వ్యవస్థనే దెబ్బతీసేటట్లున్నది. ఒక క్లర్క్ తప్పు చేస్తే ఆఫీసులోని కొంతమందికి నష్టం రావచ్చు. ఇంజనీర్ తప్పు చేస్తే కొంతమందికి నష్టం కలగవచ్చు. డాక్టర్ తప్పు చేస్తే కొంతమంది ప్రాణాలు పోవచ్చు. కాని బాధ్యతా యుతమైన బోధనావృత్తిలో ఉన్నవారే తప్పుచేస్తే వ్యవస్థనే చెడిపోతుంది.

చదువు చెప్పకుండా పరీక్షలప్పుడు పాస్ కావడానికి సహాయం చేసి విద్యా వ్యవస్థను చిన్న చూపు చూసే వాళ్లు విద్యార్థులలో చదువు కోవాలనే కోరికను చంపేశారు. ఇలాంటి వారి విషయంలో ప్రభుత్వం మరొకసారి ఆలోచించవలసి ఉంది. వీరిని క్రమబద్ధీకరించాలంటే కొన్ని షరతులు కఠినంగా విధించాల్సి ఉంటుంది. వీరిని పరీక్షించాలి. ఎవరి పొట్ట మీద కొట్టడం కాదు.

విద్యా వ్యవస్థను చక్కదిద్దుకోవాల్సిన అవసరం ప్రభుత్వానికి చాలా ఉంది. విద్యా రంగాన్ని పటిష్ఠం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇది కేవలం జూనియర్ కళాశాలలకు సంబంధించినది మాత్రమే. ఇతర శాఖలలో ఏ ప్రమాణాలు పాటించి ఉద్యోగాలను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసినారో, ఇందులో ఎంత వరకు పారదర్శకత పాటించారో, వీటిని భర్తీ చేసే క్రమంలో ఆశ్రిత పక్షపాతం, అవినీతి జరగలేదని ప్రభుత్వం చెప్పగలదా? నూటికి నూరు శాతం కాంట్రాక్టు ఉద్యోగాలు అక్రమ మార్గంలో వచ్చినవి అనడం లేదు. కొందరు అర్హులు కూడా ఉన్నారు. ఈ సందర్భంలో అర్హులైనవారు స్థిరీకరింపబడుతున్నందుకు సంతోషించాలో, వీరితో పాటు అక్రమ మార్గాలలో వచ్చిన అనర్హులు కూడా స్థిరీకరింపబడుతున్నందుకు బాధపడాలో తెలియడం లేదు.

(రచయిత పాత్రికేయులు) వీ

అణు విద్యుత్ కేంద్రానికి 16 కిలోమీటర్ల పరిధిలో 113 గ్రామాలున్నాయి. వీటిలో దాదాపు 1 లక్ష మంది ప్రజలు జీవిస్తున్నారు. ఆ ప్రాంతమంతా మంచి వ్యవసాయం సాగుతుంది. అనేక రకాల పంటలు పండిస్తున్నారు. 12 మత్స్యకార గ్రామాలున్నాయి. ప్లాంటు నిర్మాణం కారణంగా వీరందరూ నిర్వాసితులవుతారు. 1992లోనే ఈ ప్లాంట్ ప్రతిపాదన వచ్చినప్పుడు, ప్రజల తీవ్ర వ్యతిరేకత కారణంగా ఆనాడు దాన్ని వెనక్కి పెట్టారు.

భారత ప్రభుత్వం 6×1000 మెగావాట్ల లైట్ వాటర్ రియాక్టర్లతో కూడిన అణు విద్యుత్ ప్లాంటును ఆంధ్రప్రదేశ్, శ్రీకాకుళం జిల్లా, రణస్థలం మండలంలోని కొవ్వాడ గ్రామంలో ఏర్పర్చడానికి అనుమతిని జారీ చేసింది. అమెరికా సంస్థలైన హిటాచి, జనరల్ ఎలక్ట్రిక్‌లు సాంకేతిక సహాయాన్ని అందిస్తాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భూసేకరణ నిమిత్తం ఒక బృందాన్ని నియమించడానికి జి.ఒ. నెం. 42 తేదీ1-1-2012 ద్వారా అనుమతినిచ్చింది. ఈ బృందం శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలంలోని కొవ్వాడ గ్రామం వద్ద అణు విద్యుత్ ప్లాంటును స్థాపించ డానికి అవసరమయిన భూమిని సేకరిస్తుంది. శ్రీకాకుళం జిల్లా, రణస్థలం మండలంలోని రామచంద్రాపురం, గూడెం, కోటపాలెం, టెక్కలి, జీరు కొవ్వాడ గ్రామాల్లో 2436.77 ఎకరాల భూమి సేకరణకై సూచించారు.

అగ్రరాజ్యాలకే ప్రమాదాలను ఎదుర్కొనే శక్తి లేదు

రష్యాలో చెర్నోబిల్, జపాన్‌లో ఫుకుషిమాలలో జరిగిన భారీ అణు విద్యుత్ ప్లాంట్ల ప్రమాదాల ఫలితాలను ఆ దేశ ప్రజలు నేటికీ అనుభవిస్తూనే ఉన్నారు. అణు వ్యర్థాలను బలహీనం చేయడంలో, భద్ర పరచడంలో అమెరికాతో సహా అన్ని దేశాలూ నేటికీ పరిష్కార మార్గాన్ని కనుగొనలేకపోయాయి. 1986, ఏప్రిల్ 26న రష్యాలో ఉక్రేన్ ప్రిప్యాత్ పట్నం దగ్గరలో ఉన్న చెర్నోబిల్ అణు విద్యుత్ ప్లాంట్ రియాక్టర్-4లో ప్రమాదం జరిగి అణు ప్రమాద స్థాయి నెం.7 కింద వర్గీకరించబడింది. అదే స్థాయి ప్రమాదం జపాన్ ఫుకుషిమాలో కూడా జరిగింది. చెర్నో బిల్ ప్లాంట్ నుండి విడుదలైన రేడియేషన్ గాలి ద్వారా రష్యా, ఉక్రెయిన్, బెలారస్ ప్రాంతాలన్నింటా విస్తరించింది. యూరప్‌లో చాలా దేశాలలో కూడా ప్రాకింది. 1986 నుండి 2000 వరకూ అక్కడి నుండి 3,50,000 మంది ప్రజలను వేరేచోట్లకు తరలించారు. దుర్ఘటన కారణంగా 30 మంది అణుప్లాంట్ ఆపరేటర్లు ఫైర్‌మెన్‌లు మరణించారు.

'రష్యన్ అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్', 2006 నాటికి చెర్నోబిల్ దుర్ఘటనలో 2,12,000 మంది చనిపోయారని ప్రకటించింది. 2009లో 'న్యూయార్క్ ఎకాడమీ ఆఫ్ సైన్సెస్' ఆధ్వర్యాన రష్యా, బెలారస్‌కు చెందిన ముగ్గురు శాస్త్రవేత్తల నాయకత్వంలో జరిపిన పరిశోధన అనంతరం 'చెర్నోబిల్ దుర్ఘటన – ప్రజలు, వాతావరణంపై ప్రభావం' అన్న రిపోర్టు విడుదల చేశారు. అలెగ్జీ యాబ్లోకోవ్, వాసిలీ నెస్తారెంకో, అలెగ్జీ నెస్తారెంకోలు ఐదు వేల పరిశోధనా పత్రాలను పరిశీలించి 1986 నుండి 2004 వరకూ చెర్నోబిల్ ప్రమాదం వలన ప్రపంచవ్యాప్తంగా 9,85,000 మంది చనిపోయినట్లు ప్రకటించారు. పై శాస్త్రవేత్తల్లో డాక్టర్ యాబ్లోకోవ్ గతంలో రష్యన్ ప్రెసిడెంట్ గోర్బచేవ్‌కు పర్యావరణ సలహాదారుగా పని చేశారు. వాసిలీ నెస్తారెంకో బెలోరష్యా అణుశక్తి సెంటర్ డైరెక్టర్‌గా పనిచేసి చెర్నోబిల్ సంఘటన తర్వాత ఉద్యోగాన్ని వదిలేసి మొత్తం జీవితమంతా అణు ప్రమాదం గురించిన పరిశోధనల్లోనే గడిపారు. చివరకు రేడియేషన్‌కే గురై 2008లో మరణించారు. ఆయన కొడుకే అలెగ్జీ నెస్తారెంకో.

ఏప్రిల్ 26, 2011న ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ బాన్‌కీ మూన్ సంఘటన జరిగి 25 సంవత్సరాలు గడిచిన సందర్భంగా చెర్నోబిల్‌ను సందర్శించి అక్కడ మాట్లాడుతూ '3 లక్షల మంది ప్రజలను వారి నివాసాల నుండి తరలించవలసి వచ్చింది. దాదాపు 6 లక్షల మంది దీనివలన బాధితులయ్యారు. ఇటలీలో సగభాగం లేదా కొరియాలాంటి దేశాలకు సమానమైన భూభాగం మొత్తం కాలుష్య మయమైపోయింది. అణుశక్తి ప్రమాదాలు ఎటువంటి సరిహద్దులనూ గౌరవించవు. అవి సూటిగా మానవాళి ఆరోగ్యం, పర్యావరణాలకు పెద్ద ప్రమాదంగా ఉంటూ, వ్యవసాయం నుండి ప్రపంచ వ్యాపారం వరకూ అన్నింటిలోనూ సంక్షోభాలు తెస్తాయి. ఈ విషయంపై లోతుగా ఆలోచించుకోవడానికి ఇది సమయం' అన్నారు.

2011 మార్చ్ 11న జపాన్, ఫుకుషిమాలో జరిగిన అణు ప్రమాదంపై జపాన్ పార్లమెంట్ ఏర్పాటు చేసిన స్వతంత్ర పరిశోధనా సంఘం ప్రకారం ఫుకుషిమా ప్రమాదం జపాన్ ప్రభుత్వం, ప్రాజెక్ట్ నియంత్రణా సంస్థ టోక్యో ఎలక్ట్రిక్ పవర్ కంపెనీ (టెప్కో) భద్రతా చర్యల విషయాలలో కుమ్మక్కవడం వల్ల జరిగింది. ప్లాంట్‌లో యూనిట్-1 సునామీ వల్లే కాదు, భూకంపం వల్ల కూడా నాశనం అయ్యింది. కానీ ఈ విషయాన్ని టెప్కో అధికారులు ఒప్పుకోలేదు. యూనిట్‌ను మూసినా కూడా పెద్ద భూకంప తరంగం ఢీకొంది. దాంతో వినాశనం జరిగింది. ఫుకుషిమాకి విద్యుత్తును సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్ సామాన్యమైనది. భూకంపానికి నిలదొక్కుకునే శక్తి దీనికి లేదు.

కనీసం ప్రమాద సమయంలో అణు విద్యుత్కేంద్ర పరిసరాలలో ఉన్న ప్రజలను పూర్తిగా ఖాళీ చేయించాలనే స్పృహ కూడా అక్కడ అధికారులకు లేదు. దేశ ప్రధానమంత్రిని తప్పుదోవ పట్టించి ఖాళీ చేయడానికి ఆదేశాలను ఇవ్వనివ్వకుండా నిరుత్సాహపరిచారు.

కేంద్ర ప్రభుత్వ సంస్థలు, నగరపాలక సంస్థలు ప్రజలకు ప్రమాద స్థాయిని తెలపకుండా దాచాయి. ఖాళీ చేయమని చెప్పలేదు. అసలు వాళ్లకు నిజంగా ప్రమాదం ఏ స్థాయిలో ఉందో తెలియలేదు. మార్చ్ 11 రాత్రి 9 గంటల 23 నిమిషాలకు 3 కిలోమీటర్ల పరిధిలో ఉన్న వారిని ఖాళీ చేయమన్నారు. 10 కిలోమీటర్ల లోపు వారికి ప్రమాదమని తెలిసినా వాళ్లని తర్వాత రోజు 5 గంటల 44 నిమిషాలకు ఖాళీ చేయమని ఆదేశించారు. ఈలోపల ప్రజలు తీవ్రమైన అణు ధార్మికతకు గురయ్యారు. అంతా అయోమయం. ఎంత దూరం ఖాళీ చేయాలో ఎవరికీ తెలియలేదు. సరైన సమాచారం లేక ఆగి ఆగి ప్రజలు తరలి వెళ్లారు. ఈలోపల తీవ్రమైన అణుధార్మికతకు గురయ్యారు. రేడియోధార్మిక విస్తృతిని, వ్యాప్తిని, దాని స్థాయిని తీవ్రతను టెప్కోగానీ ప్రభుత్వం గానీ గుర్తించలేదు. టెప్కో ఒక ప్రైవేటు సంస్థగా తన బాధ్యతలు ఏమాత్రం నిర్వర్తించలేదు. తప్పించుకుంది.

ప్రమాదం తరువాత ఆనాటి జపాన్ ప్రధాని నాటోకాన్ మే 28, 2011న పార్లమెంట్‌లో ప్రసంగిస్తూ 'టెప్కోతో పాటు ఇతర ఎలక్ట్రిక్ పవర్ కంపెనీలు గత 40 సంవత్సరాలుగా అణుశక్తి పరిశ్రమలపై గుత్తాధిపత్యం చెలాయిస్తున్నాయి. వీరిని విమర్శిస్తున్న పరిశ్రమ నిపుణుల్ని, రాజకీయ నాయకుల్ని, ప్రభుత్వోద్యోగులను ఈ కుట్రదారులు తయారు చేసిన నియమాలు ద్వారా అణగదొక్కుతున్నారు. మిగిలిన వారంతా తమను తాము రక్షించుకోవడానికి జరుగుతున్న అక్రమాలను చూస్తూ తప్పించుకుంటున్నారు. నాకు కూడా ఈ పాపంలో భాగం ఉంది'.

'కనుకనే ఈ విషయం చెపుతున్నాను. స్వార్థ ప్రయోజనాలు ఇటువంటి కుట్రదారులను సృష్టించాయి. దాన్ని ధ్వంసం చేయాలి. ప్రజానీకంపై వారి ప్రభావాన్ని తొలగించాలి. మొత్తం అణు పరిశ్రమను సంస్కరించడంలో ఇది మొదటి మెట్టుగా చేయాలి. అనేక మంది శాస్త్రజ్ఞులు టెప్కోకు అనుకూలంగా ఉన్నారు. ఎందుకంటే ఆ కంపెనీ కోట్లాది డాలర్లు యూనివర్సిటీలకు విరాళాలిచ్చి వారిని పోషిస్తున్నది. కనుక టెప్కో అక్రమాల గురించి ప్రచురించిన అనేక మంది ప్రముఖులు, పత్రికా రచయితల నోరుమూయించడానికి అనేక ప్రయత్నాలు జరిగాయి. చివరిగా అణు విద్యుత్ కార్యక్రమాలను మొత్తంగా రద్దు చేయాలని పార్లమెంటుని కోరుతున్నాను' అని అన్నారు. దీనిని బట్టి అణు పరిశ్రమలు ఎంతటి అవినీతికైనా, అక్రమాలకైనా దిగజారుతాయని తెలుస్తోంది. ప్రమాదం జరిగినప్పుడు 30 కిలోమీటర్ల లోపున ప్రత్యేకించబడిన ప్రాంతంలో నివసించే 1 లక్ష 25 వేల మంది ప్రజలను సుదూర ప్రాంతాలకు తరలించారు. మూడున్నర సంవత్సరాలు గడచినా వారు స్వస్థలాలకు వెళ్లలేని దుర్భర పరిస్థితులలో నేటికీ గడుపుతున్నారు.

అణువ్యర్థాలను భద్రపరచడంలో విఫలమైన అమెరికా

అణుశక్తి విషయంలో అన్నిటికన్నా ప్రమాదకరమైనది, వివాదాస్పద మైనది అణుధార్మిక వ్యర్థపదార్థాలను నాశనం చేయడం. ఎందుకంటే అవి వేల సంవత్సరాలు నిరంతరంగా రేడియేషన్ వెదజల్లుతూ ప్రమాద కరమైన ఫలితాలను ఇస్తూనే ఉంటాయి. అమెరికాలో నిర్వహిస్తున్న ప్రతి అణు రియాక్టర్ నుండి సంవత్సరానికి 20 మెట్రిక్ టన్నుల అత్యంత ఉన్నతస్థాయి రేడియేషన్ వెదజల్లే అణుధార్మిక వ్యర్థ పదార్థాలు చేరతాయి. ఇది దేశవ్యాప్తంగా సంవత్సరానికి 2 వేల మెట్రిక్ టన్నులకు చేరుతుంది. సంవత్సరానికి 40 వేల క్యూబిక్ మీటర్ల తక్కువ స్థాయి అణుధార్మిక వ్యర్థాలు విడుదల అవుతాయి. 'అమెరికా న్యూక్లియర్ వేస్ట్ పాలసీ యాక్ట్' (ఎన్‌డబ్ల్యూపిఎ) ప్రకారం ఈ వ్యర్థాలను భూగర్భంలో భద్రపరచాలి. వాటిని వేలాది సంవత్సరాలు కొండరాళ్లతో నిర్మించిన సొరంగాలలో భద్రపరచాలి. ప్రపంచంలోనే మొట్టమొదటి శాశ్వతమైన అత్యంత ఉన్నతస్థాయి అణుధార్మిక వ్యర్థాలను భద్రపరిచే స్థలాన్ని అమెరికాలోని నెవాడాలో యూకామౌంటెన్‌లో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. 45 రాష్ట్రాల నుంచి ఈ అణు వ్యర్థాలను ఇక్కడకు తీసుకువస్తారు.

యూకామౌంటెన్ ప్రాంతం భూకంపాల జోన్‌లో ఉంది. అందుకే ఆ ప్రాంత ప్రజలతో పాటు 50 జాతీయ, 700 ప్రాంతీయ సంఘాలు ఈ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ పోరాటం చేశారు. ఈ ప్రాజెక్ట్‌కు ఇంత వరకూ 7.7 బిలియన్ డాలర్ల ఖర్చు అయింది. 2009లో బారక్ ఒబామా యంత్రాంగం ప్రజల ఒత్తిడికి తలొగ్గి ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు. అణువ్యర్థాల డంప్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న సెనేట్ మెజారిటీ లీడర్ హారీ రీడ్ ఈ నిర్ణయాన్ని 'నెవాడాను రక్షించడానికి చేసిన యుద్ధంలో గొప్ప విజయమిది. లక్షలాది మంది నెవాడా ప్రజలతోపాటు మొత్తం అమెరికన్ ప్రజలకు ప్రమాదం కలిగించే ప్రాజెక్ట్ రద్దయింది' అన్నారు.

ఇప్పటికీ 100 తాత్కాలిక స్థలాల్లో భద్రపరచిన అణువ్యర్థాలు 57,700 టన్నులు ఉన్నాయి. దీనికి అదనంగా ప్రతీ సంవత్సరం రెండు వేల టన్నుల వ్యర్థాలు తయారవుతుంటాయి. ఎంతో ప్రమాదకరమైన అణు వ్యర్థాలను ఎక్కడ భద్రపరచాలో తెలియక అమెరికా లాంటి సామ్రాజ్యవాద దేశమే తలకొట్టుకుంటుంటే మనలాంటి దేశాలతో సహా, ప్రపంచ దేశాలలో ఎవరి దగ్గరా ఈ సమస్యకు పరిష్కారం లేదు. కాని ప్రజల్ని బలిపశువుల్ని చేయడానికి సిద్ధపడుతున్నారు.

అణుశక్తి రెగ్యులేటరీ బోర్డు కార్యక్రమాల నిర్వహణపై కాగ్

అంతర్జాతీయ ప్రమాణాలున్నా, అంతర్జాతీయ అణుసంస్థల సిఫారసులు, సూచనలు ఉన్నా అటామిక్ ఎనర్జీ రెగ్యులేటరీ బోర్డ్ (ఎఇఆర్‌బి) నేటికీ స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థగా కాకుండా కేంద్ర ప్రభుత్వ అధీనంలోనే పని చేస్తుంది. తను స్వంతంగా అణుశక్తి గురించీ, రేడియేషన్ గురించీ అవసరమైన సూత్రాలనూ, నిబంధనలనూ చేసే అధికారం కలిగిలేదు. ఆస్ట్రేలియా, కెనడా, ఫ్రాన్స్, పాకిస్థాన్, అమెరికా లలో స్వయం ప్రతిపత్తిగల చట్టపరమైన రెగ్యులేటరీ సంస్థలు ఉన్నాయి.

1) నిబంధనలను పాటించని సంస్థలని, ప్రమాదాలకు కారణమైన వారిని శిక్షించే అధికారం లేకపోవడం.

2) 1983లో రేడియేషన్ భద్రతపై రాజ్యాంగపరమైన ఆదేశాలు ఉన్నప్పటికీ మొత్తం దేశానికి అవసరమైన భద్రతా పాలసీని నేటివరకూ తయారు చేయకపోవడం.

3) అణు విద్యుత్ సంస్థల్లో రేడియేషన్ ప్రమాదాల గురించి పర్యవేక్షించడం, భద్రతా చర్యల బాధ్యత ప్లాంట్ నిర్వాహకులకే ఉంది. దాంట్లో భారతదేశ అణుశక్తి సంస్థలను రెగ్యులేట్ చేసే ఎఇఆర్‌బికి అణు విద్యుత్ ప్లాంట్లలో ప్రత్యక్షంగా ఎటువంటి పాత్ర లేదు. రేడియేషన్‌కు మూలమైన వాటి గురించి ఎటువంటి వివరాలు ఎఇఆర్‌బి దగ్గర లేవు.

4) ఉపయోగించిన తరువాత అణువ్యర్థాలను చాలా భద్రంగా తొలగించాలి. రేడియేషన్ వెలువడే పరికరాలను రవాణా చేస్తున్నప్పుడు వాటిని భద్రంగా తొలగించారా లేదా, రవాణా చేస్తున్న లేదా తొలగించిన పరికరాలు నిర్దేశించిన స్థలాలకు చేరుతున్నాయా లేదా అనే అంశాలపై ఎఇఆర్‌బి దగ్గర ఎటువంటి కార్యక్రమాలూ లేవు.

5) అణు ప్రమాదం ఏర్పడితే అత్యవసరమైన చర్యలు తీసుకోమని చెప్పే విధానాలు గానీ, అధికారం గానీ ఎఇఆర్‌బి దగ్గరలేవు.

6) దేశంలో అణు విద్యుత్ ప్లాంట్ల జీవితకాలం ముగిశాక వాటిని తొలగించడానికి అవసరమైన చట్టపరమైన రక్షణలేమీ లేవు. ఎఇఆర్‌బికి వాటి గురించి చెప్పే అధికారంలేదు. ఎఇఆర్‌బి 13 సంవత్సరాల క్రితం విడుదల చేసిన భద్రతా మాన్యూల్ ప్రకారం 30 సంవత్సరాల నుంచీ నడుస్తున్న అణు విద్యుత్ ప్లాంట్లతో సహా ఎవరి దగ్గరా ఈ అణుపదార్థాల తొలగింపు కార్యక్రమాల గురించి ప్లాన్లు లేవు.

7) 1962లో విడుదలయిన అటామిక్ ఎనర్జీ చట్టం, తరువాత విడుదలైన రూల్స్‌లో గానీ, ఈ తొలగింపు కార్యక్రమం గురించి ఎటువంటి నిబంధనలూ లేవు.

8) అంతర్జాతీయ అణుసంస్థలతో సంబంధాలు నడుపుతున్నా వారిచ్చే సూచనలు, అవసరమైన పద్ధతులను పాటించడంలో చాలా ఆలస్యం జరుగుతోంది.

ప్రమాదాలు జరగవనీ, జరిగినా కాపాడగలమనీ, హామీలిస్తున్న అణుశక్తి రెగ్యులేటరీ బోర్డు నిజానికి ఎంత అశక్తతతో ఉందో దీన్ని బట్టి తెలుస్తుంది.

అణు విద్యుత్ చవకనేది పెద్ద అబద్ధం

అణు విద్యుత్ రంగం మిగతా విద్యుత్ రంగాలకంటే ఎక్కువ మూల ధనం పెట్టుబడి అవుతున్న రంగం. అణు విద్యుత్ ఉత్పత్తికి పెట్టే పెట్టుబడి

మెగావాటు ఒక్కింటికీ సుమారు 30 నుండి 40 కోట్ల రూపాయల వరకు కావచ్చును. అమెరికాలోని ప్రసిద్ధ అధ్యయన సంస్థ, మసాచూసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి 2009లో జరిపిన అధ్యయనం ప్రకారం అణు విద్యుత్ రంగపు మూల ధన పెట్టుబడి ఇతర అంటే బొగ్గు, గ్యాస్ ఆధారిత విద్యుత్ ఉత్పత్తి రంగాల కంటే 30 శాతం ఎక్కువ. ప్రస్తుత అంచనాల ప్రకారం ఇప్పుడది కొన్ని రెట్లయింది. అణు విద్యుత్ కర్మాగారాల నిర్మాణ కాలం 7నుండి 15 సంవత్సరాల పైన అవుతుంది కనుక మూల ధన పెట్టుబడులు ఇంకా ఎక్కువయ్యే అవకాశాలే ఉంటాయి. కాని తక్కువ ఏమాత్రం కాజాలదు. ఇటీవల కాలంలో అమెరికాలోని డ్యూక్ యూనివర్సిటీ అధ్యయనం ప్రకారం అణు విద్యుత్ కంటే ప్రత్యామ్నాయ విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియలైన సూర్యరశ్మి, పవన విద్యుత్తులు చవకైనవని తేలుతున్నది. ఇక ప్రమాదాలు సంభవించినప్పుడు వాటిని శుభ్రం చేయడానికి అయ్యే ఖర్చుల సంగతి చెప్పనవసరంలేదు. అమెరికాలోని త్రీమైల్ ద్వీపంలో 1979లో జరిగిన ప్రమాద స్థలాన్ని శుభ్రపరచడానికి 14 సంవత్సరాల కాలమూ, అప్పటి రేట్ల ప్రకారం ఒక బిలియన్ (100 కోట్లు) డాలర్లూ ఖర్చయినాయి. ప్రస్తుత ఉక్రెయిన్‌లోని చెర్నోబిల్‌లో 1986లో జరిగిన ప్రమాద శుభ్రతకు అప్పటి రేట్ల ప్రకారం 300 బిలియన్ డాలర్లు వెచ్చించి సంవత్సరాలు కష్టించాల్సి వచ్చింది. జపాన్ ఫుకుషిమాలో 2011 జరిగిన ప్రమాద శుభ్రత కార్యక్రమాలకు 30 ఏళ్లపాటు 15 నుండి 30 బిలియన్ డాలర్లు ఖర్చు అవుతుందని అంచనా. ఈ ఖర్చులన్నీ ప్రజలే భరించాల్సి ఉంటుంది.

కొవ్వాడలో అణు విద్యుత్తు కేంద్ర స్థలఎంపికలో ప్రభుత్వం కనీస భద్రతా ప్రమాణాలను కూడా పరిగణనలోకి తీసుకోలేదు. అణు విద్యుత్తు కేంద్రాలను ఏర్పాటు చేయడానికి రూపొందించిన ప్రమాణాలను స్థల ఎంపిక నుంచి పాటించాల్సి ఉంటుంది.

ఈ కేంద్రాలకు నిర్దేశించిన స్థలసేకరణ ప్రమాణాల ప్రకారం ప్రతిపాదిత కేంద్రానికి 16 కిలోమీటర్ల లోపులో ఉన్న ప్రాంతాలలో పదివేలకు మించిన జనావాసాలు ఉండరాదు. అదేవిధంగా, లక్షకు మించి జనాభా ఉన్న ప్రాంతాలు ప్రతిపాదిత కేంద్రానికి 40 కిలోమీటర్ల దూరంలో ఉండకూడదు. అయితే, అధికారులు ఈ ప్రమాణాలను పాటించకుండా అణు విద్యుత్తు కేంద్ర స్థాపనకు కొవ్వాడను ఎంపిక చేశారని పర్యావరణ శాస్త్రవేత్త ప్రొఫెసర్. టి. శివాజీరావు ప్రకటించారు. కొవ్వాడలో అణు విద్యుత్తు కేంద్రాన్ని నెలకొల్పడం వల్ల విజయనగరం, శ్రీకాకుళం జిల్లా కేంద్రాలు కూడా ప్రమాదానికి లోనయ్యే ప్రాంతాల పరిధిలోకి చేరుతాయి.

ప్రమాద తీవ్రత, ఆ సమయంలో నెలకొన్న వాతావరణ పరిస్థితులను బట్టి అణుధార్మిక శక్తి గొల్లప్రోలు, కాకినాడ, పిఠాపురం, సామర్లకోట, పెద్దాపురం ప్రాంతాలకు కూడా వ్యాపించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ప్రమాదం జరిగిన తరువాత సాధారణ పరిస్థితులు నెలకొనడానికి సమయం పడుతుందని అంతవరకు ప్రజలు సురక్షిత ప్రాంతాలల్లో ఉండాల్సిందేనని వీరు స్పష్టంగా చెపుతున్నారు. ప్రమాదం జరిగిన అణు విద్యుత్తు కేంద్రానికి 77 కిలోమీటర్ల లోపు ఉన్న ప్రాంతాలకు చెందిన ప్రజలు 20 సంత్సరాల తరువాత గాని తిరిగి రావడానికి అవకాశం ఉండదు. 98 కిలోమీటర్ల దూరంలో నివసించిన వారు 10 సంవత్సరాల తరువాత, 115 కిలోమీటర్ల దూరంలో నివసించినవారు అయిదు సంవత్సరాల తరువాత, 140 కిలోమీటర్ల దూరంలో జీవించిన వారు ఏడాది తరువాత తమ తమ ప్రాంతాలకు తిరిగి రావడానికి అవకాశం ఉంటుంది. అణు ధార్మికశక్తి ప్రభావం పూర్తిగా తొలగిపోయిందని అధికారులు నిర్ధారించిన తరువాత ఈ ప్రాంతాలు నివాసయోగ్యాలుగా మారతాయి. అంతవరకు ఈ ప్రాంతాలలో జనజీవనం గాని పశుసంచారం గాని కనిపించదు.

ప్రమాదాలు జరిగినా జరగకపోయినా అణు విద్యుత్తు కేంద్రాల వల్ల ప్రజలు పరిసరాలపై అణుధార్మికశక్తి ప్రభావాన్ని చూపిస్తునే ఉంటుంది. ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే అణుధార్మికశక్తి వెలువడి అణు కాలుష్యాన్ని సృష్టిస్తుందని అనుకోవడం పొరపాటు !. అణు విద్యుత్తు కేంద్రం సాధారణంగా పనిచేసినప్పుడు కూడా అణుధార్మిక శక్తితో మిళితమైన గాలి వాతావరణంలోకి, నీరు భూమిలోకి చేరుతుంది.

అణుధార్మిక శక్తిని క్యూరీలలో కొలుస్తారు. అణుధార్మిక శక్తిని వినియోగించి పనిచేసే 1000 పరిశోధనాశాలలు ఉన్న ఒక వైద్య కేంద్రంలో రెండు క్యూరీల అణుధార్మికశక్తి విడుదల అవుతుంది. దీనికి భిన్నంగా ఒక సాధారణ అణు విద్యుత్తు కేంద్రం దాదాపు 16 బిలియన్ క్యూరీల అణుధార్మికశక్తిని విడుదల చేస్తుంది.

యంత్రాలు సరిగ్గా పనిచేయకపోయినా, మానవ తప్పిదం జరిగినా అణుధార్మికశక్తి లీకవుతుంది. ఇంధనాన్ని తీసుకొని వెళ్లే పైపులు, రాడ్లు, ట్యాంకులు, వాల్వుల ద్వారా అణుధార్మికశక్తి లీకయి వాతావరణం ప్రవేశించే ప్రమాదం ఉంది. యంత్రాల జీవితకాలం పెరిగే కొద్దీ లీకుల సమస్య ఎక్కువ అవుతుంది. వాల్వులు, పైపులు దెబ్బతినకుండా చూడడానికి ఒకోసారి కలుషిత నీటిని రియాక్టర్ నుంచి బయటికి తీసి దానిని వదలివేయడం వల్ల కూడా అణుధార్మికశక్తి వాతావరణంలో ప్రవేశిస్తుంది. శీతలీకరణ టవర్ ఉన్న 1,000 మెగావాట్ల అణు విద్యుత్తు కేంద్రం నిమిషానికి 20,000 గ్యాలన్ల నీటిని ఉపయోగిస్తుంది. ఉత్పత్తి కార్యక్రమాలు జరిగే సమయంలో కొంత నీరు ఆవిరిరూపంలో వాతావరణంలోకి ప్రవేశిస్తుంది.

ప్రమాణాలకు లోబడి అణుధార్మికశక్తి కలిగిన నీటిని వాతావరణం లోకి వదలవచ్చునని ప్రభుత్వ నిబంధనలు చెపుతున్నాయి. అయితే, ప్రమాణాలకు లోబడి ఉండడం అంటే భద్రతా ప్రమాణాలకు లోబడి ఉన్నట్టు కాదని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. ఆగస్ట్ 2006లో ప్లానింగ్ కమిషన్‌కు నిపుణుల కమిటీ 'సమగ్ర ఇంధన విధాన నివేదిక'ను సమర్పించింది. దానిలో ప్రత్యేకంగా 'పర్యావరణంతో ముడిపడిన ఇంధనం' అన్న అధ్యాయంలో పర్యావరణంపై అణు ఇంధన ప్రభావం అనే విషయాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. 'ప్రథమంగా రేడియేషన్ విడుదలకు సంబంధించిన ప్రమాదంతో అణు విద్యుత్ ముడిపడి ఉంది'.

'పర్యావరణపరంగా అనేక స్థాయిలలో దాని ప్రభావం ఉంటుంది. మైనింగ్ చేసేటప్పుడు జరిగే ప్రమాదాలు, రాడాన్ గాస్ విడుదల, యురేనియం మైన్స్‌ను తవ్వేటప్పుడు విడుదలయ్యే రేడియేషన్‌తో కూడిన ధూళి, తవ్వకాల నుండి బయటకు వచ్చిన వ్యర్థాల నుండి, మట్టి నుండి రేడియేషన్ ఊరడమూ, ప్రోసెసింగ్‌లో ప్రమాదాలు, రవాణాలో ప్రమాదాలు, దొంగతనాలు, అణు విద్యుత్ ఉత్పత్తి క్రమంలో ప్రమాదాలు, తక్కువ స్థాయో, ఎక్కువ స్థాయో రేడియేషన్ విడుదల కావడం వంటి ప్రమాదాలన్నీ అణు విద్యుత్‌తో ముడిపడి ఉన్నాయి'.

శేషాచలం అడవుల్లో ఖాకీ రాజ్యం

ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తున్న మాఫియాను, దానికి అండగా నిలుస్తున్న రాజకీయ నాయకులను, పోలీసులను వదిలి, పొట్ట కూటి కోసం వెళ్లిన కూలీలను ఎన్‌కౌంటర్ పేరుతో చంపడం న్యాయం ఎలా అవుతుందని అంటున్నారు **ఎం.కె. కుమార్**

ఎర్రచందనం రక్షణ పేరుతో శేషాచలం అడవుల్లో అప్రకటిత నిషేధం అమలవుతోంది. ఇప్పటివరకు పోలీసులు 12 మందిని కాల్చి చంపారు. వీరందరు తమిళనాడు నుండి పొట్టచేత పట్టుకుని వలస వచ్చిన నిరుపేద వ్యవసాయ కుటుంబానికి చెందిన దళితులు. ఎర్రచందనం స్మగ్లింగ్ ద్వారా ప్రధానంగా లాభపడుతున్నది రాజకీయ నాయకులే. రాజకీయ, అధికార వర్గాల ప్రమేయం లేకుండా శేషాచలం అడవుల నుండి ఒక్క ఎర్రచందనం దుంగను తరలించలేరనేది ఇక్కడి స్థానికులందరికీ తెలిసిన విషయమే. ప్రధాన స్మగ్లర్లను, వారి వెనకున్న అధికార, రాజకీయ శక్తులను పోలీసులు ఇప్పటివరకు ఒక్కరినీ పట్టుకోలేదు. ఇప్పటివరకు పట్టుకున్న వారందరూ వారి అనుచర వర్గమే కాని, అసలు మాఫియా శక్తులు కాదు. ఇటీవలే 10 మంది అంతర్జాతీయ స్మగ్లర్లని పట్టుకున్నామని ప్రకటించిన ప్రభుత్వం ఇంతవరకు వారిపై పి.డి.యాక్టు కూడా ప్రయోగించలేదు.

ఎర్రచందనంను స్మగ్లింగ్ చేస్తున్న రాజకీయ, అధికారుల మాఫియా ఏ ప్రభుత్వం వచ్చినా తన పనిని యథేచ్ఛగా సాగిస్తోంది. ఎర్రచందనం చెట్లను నరికే కూలీలను చంపితే స్మగ్లింగ్ ఆగిపోతుందని ప్రణాళికా బద్ధంగా కూలీలను చంపి స్థానిక ప్రజానీకాన్ని భయభ్రాంతులకు గురిచేస్తున్న పోలీసులు విచ్చలవిడిగా కొనసాగుతున్న స్మగ్లింగ్‌ను ఎందుకు ఆపలేక పోయారో జవాబివ్వాలి. రాయలసీమలోని రెండు బలమైన సామాజిక వర్గాల ఆధిపత్యపోరులో భాగంగానే కూలీల హత్యలు జరుగుతున్నట్టు స్పష్టమవుతోంది. రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగిన ప్రతిసారి ఈ హత్యల పరంపర అధికమవుతోంది. ప్రస్తుతం అధికారాన్ని పొందిన సామాజికవర్గం తన పెత్తనాన్ని నెలకొల్పడానికి మరో సామాజిక వర్గానికి చెక్ పెట్టే సందర్భంలో ఈ సంఘటనలు జరుగుతున్నాయి. విషాదమేమంటే ఇందులో అధిక డబ్బుకు ఆశపడి తమిళనాడు హరిజనవాడల నుండి వస్తున్న నిరుపేద దళితులు బలికావడం.

'అణు విద్యుత్ ప్లాంట్లను తొలగించేటప్పుడు రేడియేషన్‌తో కూడిన అణువ్యర్థాలను బలహీనం చేయడంలో కొంత సాంకేతిక పరిజ్ఞానం కలిగి ఉన్నప్పటికీ ఆర్థికపరమైన సమస్యలను సంతృప్తికరమైన స్థాయిలో పరిష్కరించే స్థితిలేదు. ఇంకా దీనిని నిరూపించుకోవలసే ఉంది'.

అణు విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియ సురక్షితమైంది కూడా కాదు. ఇది నిజానికి అత్యంత ప్రమాదకరమైన శక్తి ఉత్పత్తి ప్రక్రియ. ఇది వివిధ ఉత్పత్తి స్థాయిలలో (యురేనియం తవ్వకం మొదలుకొని విద్యుత్ ఉత్పత్తి, వ్యర్థాల నిలువల వరకూ) అణుధార్మికతను విడుదల చేస్తుంది. అణుధార్మికత వల్ల జీవరాశులకు జరిగే అనారోగ్య పరిణామాలు అత్యంత ప్రమాదకరమైనవి. అవి వందల, వేల ఏండ్ల వరకు కొనసాగుతూనే ఉంటాయి. అమెరికాకు చెందిన ప్రముఖ అణుశాస్త్రవేత్త మాటల్లో చెప్పాలంటే 'అణు విద్యుత్ ప్రక్రియలో 100 శాతం సురక్షితం గురించి కేవలం అవివేకులే మాట్లాడతారు'.

ఫుకుషిమా ప్రమాదం తరువాత, అనేక దేశాలు అణు విద్యుత్ ప్రాజెక్ట్‌లను రద్దు చేసుకోవడం, తగ్గించుకోవడం చేశాయి. కాని, సామ్రాజ్యవాద దేశాల ఆదేశాలకనుగుణంగా భారతదేశం మొత్తంగా ప్రమాదకరమైన అణు విద్యుత్ ప్లాంట్లతో నింపేస్తున్నారు మన పాలకులు. అణు విద్యుత్ ప్రాజెక్టులు కొవ్వాడలోనే కాకుండా, మహారాష్ట్ర, జైతాపూర్ (6×1650 మెగావాట్లు), హర్యానా, గోరఖ్‌పూర్ (4×700), గుజరాత్, చాయామితివిర్ది (6×1000) రాజస్థాన్, మహిబన్స్‌వార్ (4×700), కర్ణాటక, కైగా (2×700), మధ్యప్రదేశ్, భూట్కా (2×700), భీమ్‌పూర్ (4×700), పశ్చిమబెంగాల్, హరిపూర్ (6×1000) లతో పాటు మరికొన్ని ప్రాంతాలలో కూడా ఏర్పాటు చేయడానికి పాలకులు సన్నాహాలు చేస్తున్నారు.

సహజ వనరులు, శ్రమించే కోట్లాదిమంది ప్రజలు అపారంగా ఉన్న దేశం మనది. మనదేశ విద్యుత్ అవసరాలను సౌరశక్తి, వాయుశక్తి, బయోమాస్ వంటి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తీర్చుకోవడానికి అన్ని అవకాశాలు ఉన్నాయి. కానీ, ప్రజల్ని చంపే, ప్రమాదకరమైన అణు విద్యుత్ ప్లాంట్లే మనకు శరణ్యమంటున్నారు మన పాలకులు. సామ్రాజ్యవాద దేశాల ఒత్తిడికి తలొగ్గి ప్రజల ప్రాణాలను బలిపెట్టయినా అణు విద్యుత్ ప్లాంట్లు నిర్మిస్తామంటున్నారు. అమెరికాలోని త్రీమైల్ ఐలాండ్, రష్యాలోని చెర్నోబిల్, జపాన్‌లోని ఫుకుషిమాలాంటి భారీ ప్రమాదాలే కాకుండా ప్రపంచ ప్రజలకు తెలియకుండా దాచేసిన వేలాది ఘటనల్లో కాన్సర్‌లాంటి భయంకరమైన వ్యాధులతో లక్ష లాదిమంది ప్రజలు చనిపోయారు. అక్కడ పుట్టే వారిలో చాలామంది ఇప్పటికీ వికలాంగులుగా పుడుతున్నారు. ప్రమాదాలు జరిగిన ప్రాంతాలన్నీ స్మశాన వాటికలుగా మారాయి. రాబోయే వందల సంవత్సరాల వరకూ ఆ ప్రాంతాల పర్యావరణం నాశనమై ఎటువంటి జీవజాలమూ నివసించడానికి పనికి రాకుండా పోయాయి. ఇన్ని భయంకరమైన సాక్ష్యాలు కళ్లెదురుగా కనిపిస్తున్నందునే, మనదేశ ప్రజలు అణు విద్యుత్ సంస్థల్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. లక్షలాది మంది ప్రజల ప్రాణాలను బలిపెట్టే అధికారం ప్రభుత్వాలకు లేదని ఐక్యప్రజా పోరాటాల ద్వారా చెప్పాల్సిన బాధ్యత అందరి మీదా ఉంది.

(రచయిత కార్మికోద్యమ నాయకుడు) వీ

రాష్ట్రంలో అధికార మార్పిడి తర్వాత వార్డు సభ్యుడి నుండి ఎంఎల్ఏ వరకు అధికార పార్టీలోకి రాయలసీమలోనే ఎక్కువగా వలసలు జరిగాయి. ఎన్నికల ముందరే కొంతమంది అధికారపార్టీలోకి వలస వెళ్లారు. రాయలసీమలో మొదటి నుండి రెండు సామాజిక వర్గాలకి మధ్య జరుగుతున్న ఆధిపత్య ఘర్షణంతా, సీమలోని సహజ వనరుల, నిక్షేపాల మీద ఆధిపత్యం కోసమే. వాటిపై పట్టును పెంచుకుంటున్న వారే సునాయాసంగా ఎన్నికల్లో గెలుస్తున్నారు. గత ఎన్నికల్లో సీమలోని 20 నియోజకవర్గాల్లో ఎర్రచందనం స్మగ్లింగ్ డబ్బే ఏరులై పారింది. తమిళనాడు ఎర్రచందన కూలీలు చిందించిన రక్తమే వారిని ఎన్నికల్లో గెలిపించింది. దీనికి భయపడే అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి ఎర్రచందనం స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం మోపమని పోలీసులను ఆదేశించారు. అప్పటివరకు అటవి అధికారులు రాజ్యమేలుతున్న అడవిలో, పోలీసులు తమ ప్రతాపాన్ని చూపడానికి సిద్ధమయ్యారు.

ముఖ్యమంత్రి మెప్పుకోసం, ఆయన పదవి చేపట్టిన 48 గంటల్లోనే తమిళనాడుకు చెందిన దళితుడు ఎ.వీరమణి (35) ని శేషాచలం అడవుల్లో పోలీసులు కాల్చి చంపేశారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుందని తెలిసిన మరుక్షణం నుండి పోలీసుల వ్యూహం మారిపోయింది. 2014 మే 29న తిరుమల గుడికి 10 కి.మీ దూరంలో ముగ్గురు కూలీలను గుడ్డెద్దుల కోన సమీపంలో చంపేశారు. వీరందరూ తమిళనాడులోని తిరువన్నామలై జిల్లా, పోరూర్ తాలుకా, దానియర్ అత్తమూర్ గ్రామానికి చెందిన వన్నియర్ (దళిత) కులానికి చెందిన నిరుపేద వ్యవసాయ కూలీలు. ఈ హత్యల పరంపర 2011లో వారాది అనే తమిళనాడు దళిత కూలీతో ప్రారంభమైంది.

అసలు స్మగ్లర్లను పట్టుకునే అవకాశం పోలీసులకు ఎప్పటికీ పాలకవర్గాలు ఇవ్వవు కాబట్టి, తమ అసహనాన్ని గిరిజన, దళిత యువకులపై పోలీసులు చూపిస్తున్నారు. దీనిపై సామాజిక బృందాలలో పెద్ద నిరసన వ్యక్తం కాకపోవడం, పోలీసుల చట్ట వ్యతిరేకమైన తీరును ప్రశ్నించేవారు లేకపోవడం, సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రోత్సాహం వీరిని ఉత్సాహపరుస్తోంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఏర్పర్చుకున్న చట్టం, న్యాయ వ్యవస్థలను వీరు అపహాస్యం చేస్తున్నా, పదుల సంఖ్యలో నిరుపేద దళిత కూలీలు చనిపోతున్నా రాజకీయ పార్టీలు కానీ, దళిత సంఘాలు కానీ ప్రశ్నించకపోవడానికి ప్రధాన కారణం వీరు తమిళనాడు రాష్ట్రానికి చెందినవారు కావడమే.

తమిళ కూలీలు సుమారు 3,000 మంది రాయలసీమలోని వివిధ జైళ్లల్లో ఎర్రచందనం అక్రమ రవాణా పేరుతో నెలల తరబడి మగ్గుతున్నారు. వీరిలో చాలామంది తిరుపతిలోని రైల్వే, బస్సు స్టేషన్లలో పట్టుబడ్డవారే. ఎర్రచందనం దుంగలను నరుకుతుండగా వీరు పట్టుబడలేదు. వీరిలో ఎవ్వరికీ తెలుగు భాష రాదు. అందరూ తమిళ తంబీలే. ఇందులో 35 శాతం మంది ఎర్రచందనం చెట్లను నరకడానికి రాలేదు. కూలీకోసం వారి స్థానిక ఊర్ల నుండి తిరుపతిలోని నిర్మాణరంగంలో పని చేయడానికి వచ్చినవారే. అరెస్టయిన వాళ్లలో తమిళనాడులోని తిరువన్నామలై, ధర్మపురి, విల్లుపురం, యార్కాడు జిల్లాలోని అటవీ ప్రాంత గ్రామాల నుండి వచ్చినవారు అధికంగా ఉన్నారు. ఈ ప్రాంతాల్లోని గ్రామీణ దళితులు వేగంగా చెట్లను కొట్టడం లోను, దుంగలను కొండలలో మోస్తూ వేరేచోటికి చేరవేయడం లోను నైపుణ్యాన్ని కలిగి ఉంటారు. వీరి జీవనాధారం కొన్ని తరాలుగా చెట్లు కొట్టడం, కట్టెలమ్మడం, కలప సేకరించడంలోనే జరుగుతోంది. వీరందరికీ బ్రోకర్లు అధిక డబ్బును ఆశచూపి ఒక చదరపు అడుగుకి రు.40 పైనే ఇస్తామని నమ్మించి, వారికి ఎటువంటి ఆపద పోలీసుల నుండి కలగదని వంచించి తీసుకువస్తున్నారు.

ఈ విధంగా ఒక్క యార్కాడులోని మారమంగళమ్ పంచాయితీ పరిధిలోని కుయ్యుదల్, అరంగం, సోనపడి, కూతమేడు లాంటి సుమారు 16 గ్రామాల్లోని ప్రజలు బ్రోకర్ల ఉచ్చులో తగులుకున్నారు. ఈ గ్రామాల్లో నుండి బయలుదేరిన సగం మంది యువత గత ఆరునెలలుగా ఇంటికి చేరనే లేదు. వీరందరూ జైళ్లలో మగ్గుతున్నవారే. అడవుల్లోని ఎర్రచందనం చెట్లను నరకకముందే అరెస్టు కాబడ్డారు కాబట్టి, వారికిచ్చిన అడ్వాన్సులతో సహా తాము నష్టపోయామని బ్రోకర్లు గ్రామస్తులతో వాదనకు దిగినట్లు ఆ గ్రామ ప్రజలు చెపుతున్నారు. జైళ్లలో ఉన్నవారి రక్తసంబంధీకులు చనిపోయినా వారి దహన క్రియలకు హాజరుకాలేని అమానవీయ పరిస్థితుల్లో వారున్నారు. కూట్టుమదల్ గ్రామానికి చెందిన వి. రామచంద్రన్ కడప జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. అతని తండ్రి చనిపోయినా అతనికి కనీసం సమాచారాన్ని అందించే ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు.

గత వారం తిరుపతి జైలుకు సుమారు 200 మంది కూలీలను వాయిదా నిమిత్తం తీసుకొచ్చినప్పుడు, వారి రక్త సంబంధీకులు, బంధువులు పెట్టిన రోదనలు పోలీసు, న్యాయస్థాన సిబ్బందిని కంటతడి పెట్టించాయి. వారందరూ తమ తరఫున ఒక న్యాయవాదిని సైతం ఏర్పాటు చేసుకోలేని అతి పేదరికంలో ఉన్నారు. పోలీసులు ఎర్రచందన స్మగ్లర్లను వదిలేసి, కూలీలపైనే వ్యక్తిగతంగా కక్ష కట్టడానికి మరో కారణం ఉంది. డిసెంబర్ 2013లో శ్రీధర్, డేవిడ్ అనే ఇద్దరు ఫారెస్టు అధికారులు అడవిలో ఎర్రచందన స్మగ్లర్లచే చంపబడ్డారు. చెట్లను నరకడానికి వచ్చిన కూలీలే ఈ ఘాతుకానికి ఒడికట్టారని అటవీశాఖ సిబ్బంది బలంగా నమ్ముతున్నారు. దానికి ప్రతీకారంగానే 2014 జనవరి 29న సంబరియన్ మణి అనే కూలీని శేషాచలం అడవుల్లో చంపేశారు. అలాగే 2014 మే 29న మరో ముగ్గురు కూలీలను చంపేశారు. 2014 జూన్ 21న మరో కూలీని పోలీసులు చంపేశారు. అన్ని ఎన్‌కౌంటర్లు కారడవిలో, చిమ్మచీకట్లో జరిగినవే. ప్రతి సంఘటనలోను అడవిలో కూంబింగ్ చేస్తున్న పోలీసులకు బృందాలుగా సంచరిస్తున్న ఎర్రకూలీలు తారసపడడం, లొంగి పొమ్మన్నా వినకుండా తమ దగ్గరున్న విల్లంబులు, రంపాలు, గొడ్డళ్లతో దాడులు చేయడం, ఆత్మరక్షణార్థం పోలీసులు కాల్పులు జరిపిన దరిమిలా కూలీలు మరణిస్తున్నారని పోలీసులు చెపుతున్నారు. ఒక్క పోలీసుకు చిన్న గాయం తగలదు.

దేశంలో ఎక్కడ ఎన్‌కౌంటర్ జరిగినా ప్రాంతీయ భేదం లేకుండా వినిపించే షరామామూలు పోలీసు కథే. స్మగ్లర్లతో లావాదేవీలు నడుపుతున్నారని అటవీ శాఖ అధికారులు, పోలీసు అధికారులను సుమారు 20 మందిని ప్రభుత్వం ఇప్పటివరకు సస్పెండ్ చేసింది. దీనివెనుకున్న పైస్థాయి అధికారులపై ఎటువంటి చర్యలను ప్రభుత్వం

తీసుకోవట్లేదనే ఆరోపణలు అటవీశాఖ నుండే వినిపిస్తున్నాయి. అటవీశాఖ అధికారులు అడవిలో చంపబడ్డ సంఘటనపై సిబిఐ విచారణ జరిపించాలని, దానివల్ల దిగ్భ్రాంతి కరమైన నిజాలు వెలికితీయ బడతాయని ప్రజాసంఘాలు ప్రకటించాయి.

చెట్లు కొట్టే కూలీకి కిలో ఎర్రచందనానికి 500 రూపాయలు దొరికితే చైనాలో అదే కిలోకి లక్ష రూపాయల వరకు వస్తాయి. ఎర్ర చందనం సుమారు 5 లక్షల హెక్టార్లలో విస్తరించినట్టు గణాంకాలు చెపుతున్నా, ఎన్ని చెట్లు ఉన్నాయనే విషయంలో అటవీశాఖ అధికారుల దగ్గర లెక్కలు లేవు. ఎక్కువగా చిత్తూరు, కడప జిల్లాలలోనే ఈ చెట్లు విస్తరించి ఉన్నాయి. 2000లో ఎర్రచందనం చెట్లను అంతరించిపోతున్న చెట్ల జాబితాలో చేర్చడంతో బ్లాక్ మార్కెట్‌లో దీని ధర అమాంతం పెరిగింది. చట్టబద్ధంగా ఎర్రచందనం దుంగలను అమ్మే, కొనే పరిస్థితి లేకపోవడంతో 2001 నుండి ఎర్రచందనం స్మగ్లింగ్ ఊపందుకుంది.

ఇప్పటివరకు స్మగ్లింగ్ అయిన ఎర్రచందనం విలువ సుమారు రు. 5 లక్షల కోట్లు ఉంటుందని ఒక అంచనా. 3 నెలల క్రితం ఒక స్మగ్లర్‌కు అనుచరురాలైన మోహనంబల్ (60) అనే మహిళను వెల్లూరులో అరెస్టు చేయగా, ఆమె దగ్గర 5 కోట్ల రూపాయలు, 80 సవరల బంగారంతో పాటు వివిధ రాష్ట్రాల్లో ఉన్న 30కి పైగా ఇళ్ల తాలుకా డాక్యుమెంట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎర్రచందనం స్మగ్లింగ్‌లో చెట్లు నరకడం, దుంగలను అడవుల నుండి సమీప రహదారులకు తరలించడం, అక్కడ నుండి రాష్ట్ర సరిహద్దులకు దాటించడం, సముద్రమార్గం ద్వారా విదేశాలకు రవాణా, అంతర్జాతీయ మార్కెట్లో అమ్మకం లాంటి ప్రధానమైన అంశాలైన ఐదు అంచెల స్థాయిలో స్మగ్లింగ్ నడుస్తోంది. పోలీసులు ఇప్పటివరకు మూడవ శ్రేణిస్థాయి వ్యక్తులనే అరెస్టు చేయగలుగుతున్నారు. వీరివెనకున్న రాజకీయ, పోలీసు అధికారుల, మాఫియా శక్తుల కూటమిని ఛేదించడం పోలీసులకు కలలో కూడా సాధ్యంకాని పని.

ఈ డబ్బంతా చెన్నై, బెంగళూరులలోని రియల్‌ఎస్టేట్, పరిశ్రమల్లోకి ప్రవహించి స్మగ్లర్లను కొద్దికాలంలోనే శత కోటీశ్వరులను చేసింది. వీరందరు అన్ని పార్టీలకు పెద్ద ఎత్తున విరాళాలు ఇవ్వడమే కాకుండా, వారే రాజకీయ నాయకులుగా చెలామణి అవుతున్నారు. వీరి అంగ, అర్థబలం చూసిన పార్టీలు వీరికి పార్టీ టిక్కెట్లు ఇవ్వడానికి ఎగబడ్డాయి. ఎర్రచందనం స్మగ్లింగ్‌లో పోగైన పెట్టుబడి రాజకీయాల్లో ప్రవహించి, సీమలో వారి పెత్తనానికి, అధికారానికి ఉపయోగపడింది. మరోవైపు ఇది తమిళనాడు ప్రాంతంలోని వందల గ్రామాల్లో సామాజిక సంక్షోభానికి తెరలేపింది. ఈ గ్రామాల్లోని ఏ కుటుంబానికి ప్రభుత్వం ఉపాధిని చూపించకపోగా, వారికి సంక్షేమ పథకాలు కూడా అందడం లేదు.

స్మగ్లర్ వీరప్పన్ సాకుతో, తమిళనాడు అడవుల్లో కఠిన నిబంధనలు అమలవుతుండడంతో వీరందరు సరిహద్దునే ఉన్న శేషాచలం అడవులలో చెట్లు నరకడానికి వలస బాట పట్టారు. వీరి సంప్రదాయక నైపుణ్యాన్ని వినియోగించుకోవాల్సిన ప్రభుత్వాలు వీరిని మిగులు మనుషులుగా తయారు చేయడంతో, స్మగ్లర్ల ఎరకు వీరు బలవుతున్నారు. ఎర్రచందనం రక్షణ పేరుతో ప్రభుత్వం, పోలీసులు అనుసరిస్తున్న వ్యక్తి నిర్మూలన (హత్యల పరంపర) గ్రామీణ ప్రాంతాలలో సామాజిక సంక్షోభానికి దారితీస్తోంది. రాయలసీమలో పెద్దఎత్తున రాజకీయ వలసలను ప్రోత్సహించడానికే ముఖ్యమంత్రి ఎర్రచందన పరిరక్షణకు నడుంకట్టారని, అందులో భాగంగానే గంగిరెడ్డి అనే గ్రామస్థాయి స్మగ్లర్ ఒక్కరాత్రికే ప్రముఖ మాఫియాడాన్‌గా చిత్రీకరించబడ్డాడనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధాన ప్రతిపక్షంలో ఇది భవిష్యత్తు రాజకీయ సంక్షోభానికి తెరలేపనుంది. ఈ నేపథ్యంలోనే స్వపక్షానికి చెందిన వ్యక్తులు పోలీసులకు పట్టుబడితే వారిపై పి.డి. యాక్టును ప్రయోగించకుండా ఒట్టి అరెస్టులు చూపిస్తున్నారని ప్రతిపక్షాలు అసెంబ్లీ సాక్షిగా ఆరోపించాయి.

ప్రస్తుతం శేషాచలం అటవీ ప్రాంతంలో 144 సెక్షను విధించి కనిపిస్తే కాల్చివేత ఉత్తర్వులున్నట్లు పోలీసులు మీడియా ద్వారా ప్రకటనలు గుప్పిస్తున్నారు. ఈ ప్రకటనలు శేషాచలం అటవీ ప్రాంతాల్లోని చిత్తూరు, కడప జిల్లాల్లోని సుమారు 500 గ్రామాల్లో తీవ్ర భయాందోళనలు రేపుతున్నాయి. ఇటీవలే కడప జిల్లాలోని నూకల పల్లెకు చెందిన 5 మంది మేకలను మేపడానికి అడవుల్లోకి వెళితే వారిపై పోలీసులు తమ విశ్వరూపం ప్రదర్శించారు. చావుతప్పి కన్నులొట్టబోయినట్టు వారు మీడియాకు తమ బాధను వెళ్లగక్కారు. యానాదులు, ఎరుకలు, గిరిజనులు అడవినే నమ్ముకుని కొన్ని తరాలుగా జీవనం సాగిస్తున్నారు. పోలీసుల విపరీత పోకడల వల్ల సుమారు 5000 కుటుంబాలు అడవి నుండి గెంటివేయబడే పరిస్థితికి నెట్టబడ్డాయి. ఈ గ్రామాల్లో పోలీసులు స్మగ్లర్ల వివరాలను చెప్పాలని, లేనిపక్షంలో ఎర్రచందనం స్మగ్లింగ్ కేసుల్లో ఇరికిస్తామని ప్రజల్ని భయపెడుతున్నారు. రాజ్యాంగం ప్రసాదించిన ఆదివాసులకున్న అడవులపై హక్కును ప్రభుత్వమే ఉల్లంఘిస్తోంది.

ఎర్రచందన వనరులను కాపాడుకోవాలనే చిత్తశుద్ధి నిజంగానే ప్రభుత్వానికుంటే స్మగ్లింగ్ వెనకున్న రాజకీయ, పోలీసు, మాఫియా శక్తులను అరెస్టు చేయాలి. ఎర్రచందనం పెంపకాన్ని కుటీర పరిశ్రమగా అభివృద్ధి చేయగలిగితే లక్షల సంఖ్యలో ప్రజలకు ఉపాధిని అందించగలుగుతారు. వీటికి మార్కెట్‌ను ప్రభుత్వమే కల్పించగలిగి విదేశాలకు రవాణా చేయగలిగితే ప్రభుత్వానికి లక్షల కోట్లలో రెవెన్యూ వస్తుంది. ప్రస్తుతం స్మగ్లింగ్‌లో పట్టుబడ్డ ఎర్రచందనం దుంగలను ప్రభుత్వం మార్కెట్ చేస్తే 40 వేల కోట్లు వస్తుందని అటవీ అధికారులు చెపుతున్నారు. శేషాచలం అడవుల్లో స్మగ్లర్లు నిల్వ ఉంచిన లక్షల కోట్ల దుంగలను వెలికితీయగలిగితే, వీటి అమ్మకంతో వచ్చే డబ్బుతో వెనుకబడిన రాయలసీమను అన్నిరంగాలలో అభివృద్ధి చేయవచ్చు.

శాస్త్రీయమైన,ఆచరణయోగ్యమైన పరిష్కారాలున్నప్పటికీ, ఆటవిక యుగం నాటి అరాచక పద్ధతులనే ప్రభుత్వం అనుసరిస్తూ, రాజ్యహింస కు, పౌరహక్కుల ఉల్లంఘనకు పాల్పడుతోంది. పదుల సంఖ్యలో చెట్లు నరికే పేద దళితులను హత్యలు చేయడం ద్వారా, వేలమంది పేద కూలీలను, జైళ్లలో కుక్కడం ద్వారా సమస్య పరిష్కారం కాదని వరుస సంఘటనలు తెలుపుతున్నాయి.

(రచయిత పౌరహక్కుల కార్యకర్త) వీ

శ్రీలంక తమిళులపై దురాగతాలు

అంతర్జాతీయ వేదికలపై ఎన్ని తీర్మానాలు చేసినా శ్రీలంకలో నివసిస్తున్న తమిళులపై అక్కడి పాలకులు క్రూరమైన అణచివేతలకు పాల్పడుతున్నారని అంటున్నారు **తోళర్ తియాగు**

తమిళ ఈలం విముక్తి పోరాటం, దాని సంఘీభావ ఉద్యమం ఇప్పుడు ఏం చేయాలి అనే ప్రశ్నను ఎదుర్కొంటున్నాయి. దీనికి జవాబు చెప్పడానికి మనం కొన్ని వాస్తవాలను పరిగణనలోకి తీసుకోవాలి.

తమిళ ఈలం ప్రజలకు వ్యతిరేకంగా జరిగిన జాతిహనన యుద్ధం 2009 మే 16,17,18 తేదీల్లో ముల్లివాయిక్కాల్ వద్ద అవాంఛనీయమైన దశకు చేరుకొన్నది. ఈ మానవ మారణహోమంలో శ్రీలంక సైనికులు వేలాది తమిళులను క్రూరంగా చంపివేశారు. ఈలం జాతి విముక్తి కోసం జరుగుతున్న సాయుధ పోరాటాన్ని పూర్తిగా అణచి వేశారు. శ్రీలంక రాజ్యాంగం ఏకశిలా సదృశమైంది. సంకుచితమైంది. దీనికి తోడుగా సింహళ ప్రజల ఆధిక్యతా భావన, తమిళ ఈలం ప్రాంతం మీద సైనికులకున్న ఆధిపత్యం అక్కడ ఒక ప్రత్యేక పరిస్థితిని తెచ్చిపెట్టాయి. తమిళ ఈలం ప్రజలు తమ సొంత గడ్డ మీద పోరాటం చేసే ప్రజాస్వామిక అవకాశాన్ని కూడా ఈ ప్రత్యేక పరిస్థితి లేకుండా చేసింది.

ముల్లివాయిక్కాల్‌లో జరిగిన క్రూరమైన హత్యాకాండ తమిళ ఈలం విముక్తి జరగవలసిన చారిత్రక అవసరాన్ని తుడిచివేయలేదు, కనీసం ఆ అవసరాన్ని కూడా తగ్గించలేదు. పైగా పెంచింది. అయితే ఈలం విముక్తి కొరకు జరిగే పోరాటానికి ఉన్న శక్తిని మాత్రం ఈ హత్యాకాండ దెబ్బ తీసింది. పోరాట అవసరం ఉండడం, పోరాట శక్తి దెబ్బ తినడం మధ్యనున్న వైరుధ్యం ఎలా పరిష్కారమవుతుందనే దాని మీద ఈలం విముక్తి పోరాటం మళ్లీ తలెత్తి అభివృద్ధి చెందుతుందా? లేదా? అనే విషయం ఆధారపడి ఉంది. మరో విధంగా చెప్పాలంటే ఈలం పోరాటం మళ్లీ తలెత్తడానికి మనం ఎలా సహాయ పడగలం? అనే ప్రశ్నకు జవాబు చెప్పుకోవాలి.

మన లక్ష్యం ఏమిటి?

తమిళ ఈలం ప్రజలు తమ పోరాటాన్ని కొనసాగించడానికి, ఆ క్రమంలో తమకు అందుబాటులోకి వచ్చిన ప్రతి సందర్భాన్నీ వాళ్లు ఉపయోగించుకోవడానికి సహకరించడం తమిళ ఈలం బయట, తమిళనాడులో, ఇతర ప్రాంతాల్లో ఉన్న మన ప్రయత్నాలకు లక్ష్యంగా ఉండాలి.

అంతిమ విశ్లేషణలో, ఈలం విముక్తి పోరాటం విజయాన్ని సాధించడం ఐరాస వంటి అంతర్జాతీయ సంస్థల మీద ఆధారపడి లేదు. అక్కడి తమిళ ప్రజల మీదనే ఆ విజయం ఆధారపడి ఉంది. అదే సమయంలో ప్రస్తుత ప్రపంచ రాజకీయ దౌత్యపరిస్థితుల నేపథ్యంలోనే ఆ పోరాటాన్ని కొనసాగించాలి. ప్రపంచ వ్యాప్తంగా అసమానతలు నిండి ఉన్న పరిస్థితుల్లో అంతర్జాతీయ పరిణామాలను పట్టించుకోకపోవడం పోరాటానికి దోహదపడదు. అంతర్జాతీయంగా ప్రతి దేశమూ స్వార్థ ప్రయోజనం కొరకు పని చేస్తుంది. తన భౌగోళిక రాజకీయ అవసరాలను బట్టే పని చేస్తుంది. అటువంటప్పుడు అంతర్జాతీయంగా తగిన చర్యలు, ప్రతి చర్యలు లేకుండా ఈలం విముక్తి పోరాటం ముందుకు పోలేదు.

మూడు ప్రధానమైన డిమాండ్లు

2009 నుండి ఇప్పటి వరకు ఐరాస మానవ హక్కుల సంఘం ఈలం సమస్య మీద చేస్తున్న చర్చలను, తీర్మానాలను అర్థం చేసుకోవడానికి ఈ మూడు ప్రధానమైన డిమాండ్లు ఒక ప్రాతిపదిక అవుతాయి. ఈ డిమాండ్ల పట్ల ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమిళుల్లో ఏకాభిప్రాయం ఉంది. ఆ డిమాండ్లు ఇవి:

1. తమిళ ఈలం ప్రజల మీద శ్రీలంక సైన్యం ఊచకోత జరిపిందనే ఆరోపణ మీద, యుద్ధ నేరాల మీద, అమానవీయ నేరాల మీద ఒక స్వతంత్ర అంతర్జాతీయ దర్యాప్తును జరపాలి.

2. శ్రీలంకలో వ్యవస్థాగతంగా కొనసాగుతున్న తమిళ జాతి హనన ప్రక్రియను నిరోధించడానికి ఒక అంతర్జాతీయ యంత్రాంగం ఏర్పడాలి.

3. తమిళ ఈలం భవిష్యత్తును నిర్ణయించడానికి శ్రీలంకలోనూ, ఇతర ప్రాంతాల్లోనూ నివసిస్తున్న తమిళ ప్రజల ప్రజాభిప్రాయ సేకరణను చేపట్టాలి.

ఐరాస సెక్రటరీ జనరల్ నిపుణులతో నియమించిన త్రిసభ్య కమిటీ తన నివేదికను సమర్పించినప్పటి నుండి తమిళ ఈలం అంతర్జాతీయ ప్రభుత్వం (ఇంటర్‌నేషనల్ గవర్నమెంట్), ప్రపంచ తమిళ ఫోరం, బ్రిటిష్ తమిళ ఫోరం, కెనడా తమిళ కాంగ్రెస్, వివిధ దేశాల్లో ఉన్న తమిళ సంస్థలు పై మూడు డిమాండ్లను ఒకే గొంతుతో ముందుకు తెస్తున్నాయి. తమిళనాడులోని తమిళ జాతి ఉద్యమాలు, తమిళ ఈలంను సమర్థించే సంస్థలు కూడా ఈ మూడు డిమాండ్లను చేస్తున్నాయి. కొన్ని తమిళ సంస్థలు ఈ మూడు డిమాండ్లకు అదనంగా మరికొన్ని డిమాండ్లను చేస్తున్నాయి. శ్రీలంక సైన్యం చేసిన యుద్ధ నేరాలకు సంబంధించిన సాక్ష్యాధారాలను ఐరాస తన వద్ద ఉన్నంత మేరకు బహిర్గతం చేయాలని తమిళ ఈలం అంతర్జాతీయ ప్రభుత్వం డిమాండ్ చేయడం ఇందుకు ఒక ఉదాహరణ. ఎవరు ఏ డిమాండ్లు చేసినప్పటికి అవన్నీ పై మూడు ప్రధాన డిమాండ్లకు వ్యతిరేకమైనవి కావు.

అంర్జాతీయ సమాజ ప్రతినిధిగా ఐరాస ఈ మూడు డిమాండ్లను వెంటనే అంగీకరించే పరిస్థితి లేదు. ఇది ఒక సుదీర్ఘమైన, కష్టతరమైన ప్రయాణం. ఎందుకంటే ప్రపంచంలో తమిళులకు ఒక సార్వభౌమ దేశం ఎక్కడా లేదు. అందువలన ఐరాసలో గాని, ఇతర అంతర్జాతీయ వేదికల మీద గాని తమిళుల గొంతును వినిపించడానికి వేరొక దారి ఏదీ లేదు.

తమిళనాడు ఏం చేయగలదు?

తమిళ ఈలంలో వలెనే తమిళనాడులో ఉన్న తమిళులు ఒక బానిస జాతి అని ఈలం తమిళుల ఊచకోత సంఘటన ప్రపంచంలోని తమిళులందరికి చాటి చెప్పింది. భారత ప్రభుత్వం తమిళుల కొరకు మాట్లాడుతుందని అనుకొన్న వారు నిరాశలో పడిపోయారు. తమిళులకు మొట్టమొదటి మాతృభూమి అయిన తమిళనాడు భారత ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి, అంతర్జాతీయ వేదిక మీద, భారత ప్రభుత్వం ఈలం తమిళుల వైపు మాట్లాడేలా చేస్తుందనే ఆశ ఉంది.

ఈలం తమిళులు సైనికంగా, రాజకీయంగా దెబ్బ తిన్నప్పటికీ, అంతర్జాతీయ వేదిక మీద ఇదివరకెప్పటి కంటె గొప్ప నైతిక బలంతో ఉన్నారు. శ్రీలంక ప్రభుత్వం ఈలం తమిళుల మీద ఇంతకు ముందు జరిపిన మారణకాండ, ఇప్పుడు జరుపుతున్న ఊచకోత తమిళ విముక్తి పోరాటానికున్న న్యాయబద్ధతను శిఖరాయమానం చేశాయి. ఆధిక్యతా భావంతో విర్రవీగుతున్న సింహళీయులు ఎంత ప్రయత్నం చేసినప్పటికీ, ఇక తమిళుల పోరాటాన్ని టెర్రరిస్టు పోరాటంగా ముద్రవేయలేరు. దాన్ని ఏకాకిని చేయలేరు. అణచివేయలేరు.

పరిహారాత్మక న్యాయం

భాష, ప్రాంతం, సంస్కృతి, ఆర్థిక వ్యవస్థ, చరిత్రలను బట్టి ఈలం తమిళులు ఒక జాతి. తమిళ ఈలం ఒక జాతి రాజ్యం. ఆ జాతికి తన భవిష్యత్తును నిర్ణయించుకునే హక్కు, సార్వభౌమాధికారం ఉన్నాయి. ఈలం తమిళులు ఊచకోతను, యుద్ధ నేరాలను, అమానవీయ నేరాలను అనుభవించిన జాతిగా ఇప్పుడు పరిహార న్యాయాన్ని, పరిహార సార్వభౌమాధికారాన్ని, తన భవిష్యత్తును తానే నిర్ణయించుకునే పరిహార హక్కును ఒక హక్కుగానే కోరవచ్చును. అంటే అంతర్జాతీయ వేదిక మీద తమిళులు చేస్తున్న పోరాటం పరిహార న్యాయం కోసం చేస్తున్న పోరాటంగా కూడా అర్థం చేసుకోవాలి. రాజకీయంగా, దౌత్యపరంగా అందుకు తగిన విధంగా వ్యవహరించాలి.

రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో ఊచకోతకు గురైన యూదులకు పరిహార న్యాయాన్ని అందించే రూపంలోనే ప్రపంచం వారికి ఇజ్రాయిల్ దేశాన్ని ఇచ్చిందనే విషయాన్ని మనం గమనంలో ఉంచుకోవాలి. ఈ ఒక్క విషయంలో తప్ప మరే విషయంలోనూ ఇజ్రాయిల్‌తో తమిళ ఈలంను పోల్చకూడదు.

పోరాట భవిష్యత్తు

ప్రపంచ తమిళులు చేసే పోరాటం మాత్రమే తమిళ ఈలంను సాధిస్తుందని అనుకోవడం లేదు. నిరంకుశ శత్రువైన సింహళీయులను ఏకాకులను చేయడానికి, వారిలోని ఆధిక్యతా భావాన్ని దెబ్బకొట్టడానికి, ఈలం తమిళులను ప్రోత్సహించడానికి ఈ పోరాటం సహాయ పడుతుంది. ఈలం తమిళుల పోరాటానికి ప్రజాస్వామిక అవకాశాన్ని కల్పించడానికి, దాన్ని పెంపొందించడానికి సహాయ పడుతుంది. ఈలం తమిళుల పోరాటం ఏ రూపాన్ని తీసుకుంటుందో, ఎలా అభివృద్ధి చెందుతుందో ఇప్పుడే చెప్పలేం. తమిళ ఈలంలో మళ్లీ ఒక వీరోచిత ప్రజాపోరాటం బద్దలు కావచ్చు. ఇజ్రాయిల్ దురాక్రమణలో ఉన్న జోర్డాన్ పశ్చిమ తీరంలో, గాజాలో పాలస్తీనా ఇంతిఫాదాలు చేస్తున్న పోరాటాల వంటి పోరాటాలు ఈలంలో తలెత్తవచ్చు. మనం వేచి చూడాలి.

ముల్లివాయిక్కాల్‌లో ఈలం విముక్తి పోరాటం పూర్తి అణచివేతకు గురైనప్పటి నుండీ అంతర్జాతీయ వేదిక మీద పరిహార న్యాయం కొరకు మన పోరాటం మొదలైంది. అప్పటి నుండి జరిగిన పోరాటాలను పూర్తిగా వివరించవలసిన అవసరం లేదు. కాని సంక్షిప్తంగానైనా కొన్ని ముఖ్యమైన విషయాలను తెలుసుకొందాం.

జెనీవా 2009

2009 మే చివరలో జెనీవాలో ఐరాస మానవ హక్కుల సంఘం సమావేశంలో ఏం జరిగిందో మనకు తెలుసు. ఈలం తమిళులకు ఏ విధంగా ఉపయోగపడని రెండు తీర్మానాలు ఈ సమావేశంలో ప్రవేశపెట్ట బడ్డాయి. మానవ హక్కుల ఉల్లంఘనలకు సంబంధించిన ఆరోపణల మీద శ్రీలంక ప్రభుత్వమే దర్యాప్తు జరపాలని అందులో ఒక తీర్మానం ప్రతిపాదించింది. కాని ఆ తీర్మానం నెగ్గలేదు. మరొక తీర్మానం 'టెర్రరిజానికి వ్యతిరేకంగా జరిగిన యుద్ధం'లో విజయాన్ని సాధించినందుకు శ్రీలంక ప్రభుత్వాన్ని అభినందించింది. శ్రీలంక ప్రభుత్వానికి సహాయపడాలని కూడా ఈ తీర్మానం కోరింది. దీన్ని సమావేశం ఆమోదించింది. ఈ రెండు తీర్మానాల మీద ఓటింగ్ జరిగినప్పుడు భారత ప్రభుత్వం శ్రీలంక ప్రభుత్వం వైపే ఉంది.

క్రూరమైన ఊచకోతకు గురైన తమిళ ప్రజలను కనీసం ఓదార్చడానికి ప్రపంచంలో ఒక్క దేశం కూడా లేని క్లిష్టమైన పరిస్థితి నుండి బయటపడాలి. ఆ క్రమంలో న్యాయం కోసం తమిళులు జరిపే పోరాటం ముందుకు పోవాలి. ఈ కర్తవ్యాలను నెరవేర్చడం కోసమే ప్రపంచంలోని వేరువేరు దేశాల్లో ఉన్న తమిళులు అనేక సంస్థలను స్థాపించారు. ఈ సంస్థల్లో అన్నింటి కంటె ముఖ్యమైనది తమిళ ఈలం అంతర్జాతీయ ప్రభుత్వం. గ్లోబల్ తమిళ్ ఫోరం, బ్రిటిష్ తమిళ్ ఫోరం, కెనడా తమిళ్ కాంగ్రెస్, ఇతర దేశాల్లో ఏర్పడిన ఇలాంటి తమిళ సంస్థలు ఈ కర్తవ్యాలను నెరవేర్చడంలో గణనీయమైన పాత్రను పోషించాయి. శ్రీలంకలో తమిళుల ఊచకోతకు సంబంధించిన నిజాలను ప్రపంచానికి వెల్లడించడానికి ఈ సంస్థలు సత్వర చర్యలను చేపట్టాయి.

ఊచకోతకు సంబంధించిన దృశ్యాలను వెల్లడించే ఫొటోలు, లండన్‌కు చెందిన ఛానల్ నాలుగు ప్రసారం చేసిన డాక్యుమెంటరీలు శ్రీలంకలో జరిగిన మారణహోమాన్ని కళ్ల ముందుంచాయి. డైరెక్టర్ కల్లం మాక్రే, భారత మీడియాకు చెందిన ప్రియంవద వంటి వ్యక్తులు మారణహోమానికి సంబంధించిన వాస్తవాలను వెల్లడించడంలో గొప్ప కృషి చేశారు. డబ్లిన్‌లో సమావేశాలను నిర్వహించిన 'శాశ్వత ప్రజా ట్రిబ్యునల్' సాక్షులను విచారించింది. సాక్ష్యాలను పరిశీలించింది. శ్రీలంక ప్రభుత్వం యుద్ధనేరాలకు, అమానవీయ నేరాలకు పాల్పడిందని తీర్పుచెప్పింది. అయితే తమిళజాతి ఊచకోత జరిగిందని చెప్పడానికి తగినంత సమాచారం తన ముందుకు రాలేదని కూడా చెప్పింది.

తాము తమిళుల మీద కొనసాగించిన ఊచకోతకు సాక్ష్యాలు ఉన్నాయని రాజపక్షే గుర్తించవలసి వచ్చింది. శ్రీలంక ప్రభుత్వం అంతర్జాతీయ మానవ హక్కుల చట్టాలను ఉల్లంఘిస్తూ యుద్ధ నేరాలకు పాల్పడిందని, అమానవీయ నేరాలకు పాల్పడిందని వచ్చిన ఆరోపణలకు విశ్వసనీయత ఉందని ఐరాస సెక్రటరీ జనరల్ నియమించిన త్రిసభ్య కమిటీ (మార్సుకి దరుస్మన్, యాస్మిన్ సూకా, స్టీవ్ రాట్నర్) తేల్చింది.

జెనీవా 2012

ఐరాస మానవ హక్కుల సంఘంలో శ్రీలంకకు వ్యతిరేకంగా అమెరికా ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టడానికి ఆలోచిస్తున్నదనే వార్త వచ్చినప్పుడు, ఆ తీర్మానాన్ని భారతదేశం బలపరచాలని తమిళనాడులో కొంతమంది

డిమాండ్ చేశారు. తొందర పడవద్దని, అమెరికా ప్రవేశపెట్టబోయే తీర్మానం ముసాయిదా బయటకు రానివ్వాలని, దాన్ని చూసిన తరువాతనే ఒక నిర్ణయానికి రావాలని మేం హెచ్చరించాం. ఆ తరువాత వెల్లడైన అమెరికా తీర్మానంలో ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని తమిళుల మూడు ప్రధానమైన డిమాండ్లు లేనే లేవు. ఆ తీర్మానం శ్రీలంక ప్రభుత్వాన్ని ఖండించలేదు. తమిళులకు మద్దతు నివ్వలేదు.

ప్రపంచాన్ని మోసం చేస్తూ రాజపక్షే ప్రభుత్వం నియమించిన లెసన్స్ లెర్నట్ అండ్ రీకన్సిలియేషన్ కమిషన్ (ఎల్ఎల్ఆర్‌సి) ను బలపరచడానికే అమెరికా తీర్మానం ప్రయత్నించింది. ఐరాసకు చెందిన త్రిసభ్య కమిటీ నివేదిక గురించి ఈ తీర్మానంలో ప్రస్తావనే లేదు. భారతదేశం చాలా కాలం సాగదీసి, తీర్మానాన్ని తన శక్తి మేరకు నీరు గార్చిన తరువాతనే, దాన్ని బలపరిచింది. శ్రీలంక ప్రభుత్వ ఆమోదంతోనే ఐరాస అధికారులు ఆ ప్రభుత్వానికి సలహాలనివ్వాలని, సాంకేతిక సహాయాన్ని అందించాలని భారతదేశం తీర్మానానికి సవరణను ప్రవేశపెట్టింది. ఈ తీర్మానం తమిళులకు ఏ విధంగానూ ఉపయోగపడదు. అయినప్పటికి తీర్మానం మీద జరిగిన వోటింగ్‌లో శ్రీలంక ప్రభుత్వం ఓడిపోవడం సంతోషించ వలసిన విషయం. అంతర్జాతీయ దౌత్య రంగంలో ఇది శ్రీలంకకు మొదటి ఓటమి.

జెనీవా – 2013

2012 తీర్మానం విషయంలో ఏం జరిగిందో 2013 తీర్మానం విషయంలో కూడా అదే జరిగింది. శ్రీలంకలో స్వతంత్ర అంతర్జాతీయ దర్యాప్తు జరగాలనే డిమాండ్‌కు 2013 తీర్మానాన్ని ప్రవేశపెట్టడానికి ముందే బలం చేకూరింది. ఐరాస మానవహక్కుల కమిషనర్ నవనీతం పిళ్లై స్వయంగా ఈ డిమాండ్ చేశారు. ఇంటర్నేషనల్ క్రైసిస్ గ్రూప్, ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్, హ్యూమన్ రైట్స్ వాచ్‌లు కూడా ఈ డిమాండ్‌ను సమర్థించాయి. అమెరికా ఈ డిమాండ్‌ను గుర్తించక తప్పలేదు. అయినప్పటికి తన తీర్మానంలో ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని ఆ డిమాండ్‌ను ప్రస్తావించలేదు.

ఇదే సమయంలో తమిళనాడులో విద్యార్థులు ఈ డిమాండ్ల మీద పోరాటం చేశారు. అమెరికా ప్రతిపాదించిన తీర్మానంలో ఈ డిమాండ్లు లేకపోవడంతో, భారతదేశమే ఒక తీర్మానాన్ని ప్రతిపాదించాలని, స్వతంత్ర అంతర్జాతీయ దర్యాప్తు, ప్రజాభిప్రాయ సేకరణ డిమాండ్లు ఆ తీర్మానంలో ఉండాలని మేం కోరాం. తమిళనాడులో జరిగిన విద్యార్థి పోరాటాల, ప్రజా పోరాటాల ప్రభావంతో తీర్మానం మీద జరిగిన తుది వోటింగ్‌లో భారతదేశం శ్రీలంకకు వ్యతిరేకంగా వోటు వేసింది. అయితే ఈ సారి కూడా అమెరికా తీర్మానాన్ని నీరుగార్చిన తరువాతనే భారతదేశం దాన్ని బలపరిచింది. ఐరాస అనుమతి పొందిన వాళ్లు, ఐరాస నిపుణులు స్వేచ్ఛగా శ్రీలంకలోకి రావడానికి ఆ దేశ ప్రభుత్వం అనుమతించాలనే సూచనను తీర్మానం నుండి తీసివేసే విధంగా భారతదేశమే చేసింది. అలాగే మావన హక్కుల కమిషన్ తన నివేదికను సమర్థించడానికి గడువును 2013 సెప్టెంబర్ నుండి 2014 మార్చ్ వరకు పొడిగించింది కూడా భారతదేశమే. ఈ తీర్మానంలో తమిళుల డిమాండ్లు ఏవీలేవు, అయినా ఓటింగ్‌లో శ్రీలంక ఓడిపోవడం సంతోషాన్ని కలిగించే విషయం.

శ్రీలంక ఒంటరి తనం

ఐరాస మానవహక్కుల సంఘం 2012లో, 2013లో ఆమోదించిన తీర్మానాలు ఒకే విధంగా ఉన్నప్పటికి, వాటి మధ్య సున్నితమైన తేడాలు ఉన్నాయి. ఆ తీర్మానాల మీద జరిగిన వోటింగ్‌లో మార్పులు వచ్చాయి. తమిళులు పరిహార న్యాయం కోసం జరుపుతున్న పోరాటంలో ఈ తేడాలకు, ఈ మార్పులకు ఎత్తుగడల రీత్యా గుర్తింపు ఉంది. ఈలం తమిళుల కొరకు మనం చేస్తున్న పోరాటాలు నిరుపయోగం కాలేదని ఇవి తెలియజేస్తాయి. మనం తదుపరి ఎత్తుగడలను రూపొందించు కోవడానికి కూడా ఇవి పనికి వస్తాయి.

తమిళుల ప్రధాన డిమాండ్ల దృష్ట్యా ఐరాస తీర్మానాలు రెండూ ఒకటిగానే కనిపిస్తాయి. అంతర్జాతీయంగా తమిళులు ఎడతెరిపి లేకుండా చేస్తున్న ప్రయత్నాల వలన శ్రీలంక క్రమ క్రమంగా ఒంటరిదై పోతున్నదని తీర్మానాల మీద జరిగిన వోటింగ్ సరళి తెలియజేస్తుంది. ఈ తీర్మానాల మీద శ్రీలంక ప్రభుత్వానికి క్రమంగా వ్యతిరేకంగా, అనుకూలంగా 2009లో 13/26, 2012లో 23/15, 2013లో 25/13 వోట్లు వచ్చాయి. ఈ నాలుగేళ్ల కాలంలో ఐరాస మానవ హక్కుల సంఘంలో సభ్యత్వ దేశాల మార్పును కూడా లెక్కలోకి తీసుకుంటే శ్రీలంక ఒంటరి తనం మరింత నగ్నంగా కనబడుతుంది.

నవనీతం పిళ్లై నివేదిక – కామన్‌వెల్త్

ఐరాస మానవ హక్కుల సంఘం 2013, 2014 సమావేశాల మధ్య కాలంలో రెండు ముఖ్యమైన పరిణామాలు జరిగాయి. ఐరాస మానవ హక్కుల కమిషనర్ నవనీతం పిళ్లై శ్రీలంకను సందర్శించడం అందులో మొదటి పరిణామం. ఆమె కొలంబోలో పత్రికా విలేకరుల సమావేశంలో శ్రీలంక ప్రభుత్వాన్ని గట్టిగా విమర్శించింది. ఆ తరువాత ఆమె ఐరాస మానవహక్కుల సంఘానికి మొదట మౌఖికం గానూ, తరువాత లిఖిత పూర్వకంగానూ నివేదికను సమర్పించింది. స్వతంత్ర అంతర్జాతీయ దర్యాప్తు జరగాలని చేస్తున్న డిమాండ్‌కు వీటన్నింటి వలన బలం చేకూరింది.

2013 నవంబర్‌లో కొలంబోలో కామన్‌వెల్త్ దేశాల ప్రభుత్వ అధినేతల సమావేశం జరిగింది. కెనడా, మారిషస్‌లు ఈ సమావేశాన్ని బహిష్కరించాయి. శ్రీలంకలో కామన్‌వెల్త్ సమావేశాలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం తరఫున, తమిళ నేషనల్ లిబరేషన్ మూవ్‌మెంట్ ప్రధాన కార్యదర్శిగా ఈ వ్యాస రచయిత 15 రోజుల పాటు నిరాహార దీక్ష చేశారు. ఈ నిరాహార దీక్షకు తోడుగా తమిళనాడు లో విద్యార్థి ఉద్యమాలు, ప్రజా ఉద్యమాలు, రాజకీయ ఉద్యమాలు జరిగాయి. తమిళనాడు శాసనసభ ఒక తీర్మానాన్ని చేసింది. ఇవన్నీ భారతప్రభుత్వం మీద బాగా ఒత్తిడిని పెంచాయి. చివరకు కొలంబోకు వెళ్లకుండా భారత ప్రధానమంత్రిని నిరోధించాయి. తమిళుల విజ్ఞప్తిని, బ్రిటన్‌లో ప్రతిపక్ష లేబర్ పార్టీ సూచనలను పెడచెవిన పెట్టి బ్రిటన్ ప్రధానమంత్రి డేవిడ్ కామెరూన్ కొలంబోకు వెళ్లినప్పటికి, ఆయన జాఫ్నాను సందర్శించడం గాని, ఆ తరువాత చేసిన వ్యాఖ్యలు గాని అంతర్జాతీయ దర్యాప్తు డిమాండ్‌కు బలాన్ని చేకూర్చాయి.

జెనీవా 2014

2014 మార్చ్‌లో జెనీవాలో జరిగిన ఐరాస మానవ హక్కుల సంఘం సమావేశంలో మరొక ముందడుగు పడింది. మా మూడు ప్రధానమైన డిమాండ్లను మానవహక్కుల సంఘం ఒకేసారి ఒప్పుకుంటుందని మేం అనుకోలేదు. ఇందుకు కారణం మానవ హక్కుల సంఘంలో ఉన్న దేశాలు అన్యాయంగా ఉండడం కాదు. ఆచరణాత్మకంగా లేకపోవడం కాదు. ఆయా దేశాల భౌగోళిక రాజకీయ ప్రయోజనాలతో మానవ హక్కుల డిమాండ్లు పెనవేసుకుని ఉన్నపుడు డిమాండ్లు ఎంతవరకు

అస్తిత్వ ఉద్యమాలు - ఇతరుల స్వేచ్ఛలు

***వామపక్ష ఉద్యమాలు బలహీనమైన క్రమంలో వచ్చిన అస్తిత్వ ఉద్యమాలు, ఇతర ఉద్యమాల హక్కులను, స్వేచ్ఛను గుర్తించక పోవడానికి అవగాహన లోపాలు, వైఫల్యాలే కారణం అంటున్నారు* టంకశాల అశోక్**

అస్తిత్వ ఉద్యమాలకు సంబంధించి ఒక విచారకరమైన పరిస్థితి కనిపిస్తున్నది. ఆ ఉద్యమాల ప్రధాన లక్ష్యం ఆయా వర్గాల హక్కులను, స్వేచ్ఛను సాధించుకోవడం. అంతవరకు అది సరియైనదే. కాని ఆ ఉద్యమాలను నిర్వహించే క్రమంలో వారు ఇతరుల హక్కులను, స్వేచ్ఛను గుర్తించడం లేదు. ఒక్కోసారి వాటికి భంగకరంగా కూడా వ్యవహరిస్తున్నారు. ఇది అంతిమ విశ్లేషణలో స్వయంగా వారి హక్కుల సాధనకు కూడా నష్టదాయకమే అవుతుంది.

దేశంలో పీడితులందరి హక్కుల సాధన కోసం సాగిన వామపక్ష ఉద్యమాలు బలహీనపడుతుండిన క్రమంలో వేర్వేరు వర్గాల అస్తిత్వ ఉద్యమాలు ముందుకు రావడం మొదలైంది. వామపక్ష ఉద్యమాలను బలహీనపరిచేందుకే కొన్ని శక్తులు ఈ ఉద్యమాలను తెరపైకి తెచ్చి ప్రోత్సహించాయనే ఆరోపణలున్నాయి. కాని ఈ ఆరోపణలను పూర్తిగా నిజమనలేం. పీడితులందరి సార్వత్రిక హక్కుల సాధనలో వామపక్షపు పురోగతి సంతృప్తికరంగా ఉన్నట్లు ఆయా పీడిత వర్గాలకు నమ్మకం కలిగినట్లయితే, ఒకవేళ లక్ష్య సాధన త్వరగా జరగకున్నా వారు పరిస్థితిని అర్థం చేసుకోగలరు. కాని పురోగతి సంతృప్తికరంగా ఉందనే నమ్మకం కలగనపుడు ఏ తరగతికి ఆ తరగతి తన భవిష్యత్తు గురించి విడిగా ఆలోచిస్తుంది. ఇది తార్కికంగా జరిగేది గనుక అందులో ఆక్షేపించ వలసింది లేదు.

ప్రస్తుత చర్చకు సంబంధించి గుర్తించ వలసిందేమంటే, వామపక్ష ఉద్యమాలను రకరకాలుగా బలహీన పరిచేందుకు ప్రయత్నించే శక్తులు ఎప్పుడూ ఉంటాయి. కాని వాటికి అనువైన పరిస్థితులు ఏర్పడడాన్ని బట్టి ఈ ఉద్యమాలు బలహీనపడడం మరింతగా ఉంటుంది. లక్ష్య సాధనలో జాప్యం లేదా వైఫల్యం కారణంగా, అప్పటి వరకు ఉద్యమాలలో భాగస్వాములుగా ఉండిన సామాజిక తరగతుల వారు స్వీయ అస్తిత్వం అనే మరొక మార్గం వైపు మళ్లడం మొదలైంది. అంతేకాదు, సార్వత్రిక ఉద్యమ సిద్ధాంతంలో, ఉద్యమాలలో తమ స్వీయమైన అంశాలకు తగిన స్థానం లేదన్న భావనలు అందుకు తోడై సాధారణ రూపంలో ఏర్పడిన

నెరవేరుతాయో కచ్చితంగా చెప్పలేం.

స్వతంత్ర అంతర్జాతీయ దర్యాప్తుకు సంబంధించిన తీర్మానం ఆమోదించబడుతుందని అనిపించింది. ఇతర రెండు డిమాండ్లు ఆమోదాన్ని పొందుతాయని అనిపించలేదు. అయితే ఏ నేరాల మీద దర్యాప్తు జరుగుతుంది? ఊచకోతకు సంబంధించిన నేరాల మీద, యుద్ధ నేరాల మీద, అమానవీయ నేరాల మీద దర్యాప్తు జరగాలనేదే మా స్థిరమైన డిమాండ్. ఐరాసకు చెందిన త్రిసభ్య కమిటీ నివేదికను ఈ దర్యాప్తు అనుసరించాలనుకుంటే మాత్రం ఊచకోత నేరాల మీద ఇప్పుడే దర్యాప్తు జరగక పోవచ్చును. అయితే యుద్ధ నేరాలను, అమానవీయ నేరాలను ఎవరు చేశారో, ఎవరికి వ్యతిరేకంగా చేశారో చెప్పగలిగితే, ఈ నేరాల చారిత్రక నేపథ్యాన్ని సోదాహరణంగా వివరించగలిగితే, నేరాలు చేసినవారు తమిళులను ఊచకోత కోయాలనే ఉద్దేశంతోనే ఆ నేరాలు చేశారని నిరూపించగలిగితే, ఈ దర్యాప్తు ఊచకోత నేరాల దర్యాప్తు కూడా విస్తరిస్తుంది.

యుద్ధనేరాలు – ఊచకోత

ఊచకోత నేరాల మీద దర్యాప్తును జరపకపోతే అసలు దర్యాప్తునే అంగీకరించలేమని చెప్పగలిగినంత బలంగా తమిళులు లేరు. త్రిసభ్య కమిటీగాని, నవనీతం పిళ్లైగాని తమ నివేదికల్లో ఊచకోతకు సంబంధించి ఏమీ చెప్పలేదు. అలాగని ఆ నివేదిక ఊచకోత జరగలేదని చెప్పినట్లు కూడా కాదు.

పర్మనెంట్ పీపుల్స్ ట్రిబ్యునల్‌కు చెందిన బ్రెమెన్ నివేదిక మాత్రమే ఊచకోత మీద తీర్పు చెప్పింది. కాని ఐరాస దృష్టిలో, దాని సభ్య దేశాల దృష్టిలో ఇది అధికారికమైన నివేదిక కాదు. బ్రెమెన్ నివేదిక ప్రాముఖ్యాన్ని తగ్గించాలని మనం అనుకోవడం లేదు. బ్రెమెన్ నివేదిక ఊచకోత మీద ఇచ్చిన తీర్పుకు, కొన్ని శక్తివంతమైన దేశాల పాత్ర మీద చెప్పిన విషయాలకు తమిళుల రాజకీయోద్యమంలో ఎంతో విలువ ఉంది. ఊచకోతనేరాల మీద, యుద్ధనేరాల మీద, అమానవీయ నేరాల మీద తమిళులు ఒక స్వతంత్ర అంతర్జాతీయ దర్యాప్తును కోరుతున్నప్పటికి, మానవహక్కుల సంఘం దర్యాప్తులో ఊచకోత నేరాల దర్యాప్తు లేకపోయినప్పటికి, ఆ దర్యాప్తు ఏమీ పనికి రానిదని అనుకోవడం లేదు. శ్రీలంకలో జరిగిన దాన్ని యుద్ధనేరాలంటే సరి పోదని, ఊచకోత నేరాలనే అనాలని కొంతమంది అంటున్నారు. ప్రతి యుద్ధనేరమూ, ప్రతి అమానవీయ నేరమూ ఊచకోత నేరం కాకపోవచ్చును. అదే సమయంలో యుద్ధనేరాలని అమానవీయ నేరాలని అంటున్నామంటే, ఊచకోత నేరాలు జరగలేదని అంటున్నట్టు కాదు.

యుద్ధనేరాలను, అమానవీయ నేరాలను దర్యాప్తులో నిరూపించాలి. ఈ నేరాల్లో దాగి ఉన్న ఊచకోత ఉద్దేశాన్ని నిరూపించాలి. ఊచకోత నేరాలను నిరూపించే మార్గం అదే. యుద్ధ నేరాలు, అమానవీయ నేరాలు ఊచకోత నేరాల్లో అంతర్భాగం.

ఊచకోత నేరాన్ని యుద్ధ నేరంగా తక్కువ చేసి చెప్పడం తప్పే. శ్రీలంకలో జరిగింది ఊచకోతే. ఈ ఊచకోతలో భాగంగానే యుద్ధ నేరాలు, అమానవీయ నేరాలు జరిగాయి. ఊచకోత నేరమూ, యుద్ధ నేరమూ, అమానవీయ నేరమూ – ప్రతి ఒక్కటీ అంతర్జాతీయ చట్టాల కింద శిక్షర్హమైన నేరమే.

(ఇంకా ఉంది)

(అనువాదం : ఎం. గంగాధర్, డిటిఎఫ్ నాయకులు, విశ్రాంత ఉపాధ్యాయులు)

వీ

అసంతృప్తిని మరింత పెంచాయి. దానితో అస్తిత్వ ఉద్యమాలు ఆ మేరకు బలం పెంచుకున్నాయి.

ఆయా వర్గాలలో 'స్వీయ' అన్న ఆలోచనలంటూ అసలు రావడానికి కారణమే శత్రువు ప్రోత్సాహం అని భావించడం పొరపాటవుతుంది. ఎందుకంటే, సర్వ సాధారణంగా జరుగుతున్న విద్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల పెరుగుదల, పట్టణీకరణ, వ్యక్తిగత స్పృహల పెరుగుదల, జ్ఞాన సముపార్జనలో కనిపిస్తున్న విస్తృతి వంటి కారణాల వల్ల ప్రజాస్వామిక ధోరణులు ఎక్కువవుతున్నాయి. ఇవి అన్ని వర్గాలకు 'స్వీయ' స్పృహను కలిగిస్తున్నాయి, పెంచుతున్నాయి. వారు ఇంతకాలం వామపక్ష ఉద్యమాలలో భాగంగా సార్వత్రిక ఉద్యమాలు నడిపి, అక్కడ కలిగిన సంతృప్తుల వల్ల ఏర్పడిన 'స్వీయ' స్పృహకు, ఈ విధంగా బహిర పరిస్థితుల కారణంగా వచ్చి చేరిన 'స్వీయ' స్పృహ అదనం. ఆ విధంగా రెండు విధాలైన స్వీయ స్పృహలు క్రమంగా ఒకటయ్యాయి. ఈ సరికి తిరుగులేనంత బలంగా మారాయి.

ఈ స్పృహలు ప్రస్తుతం ఇంకా వ్యక్తీకరణ స్థాయిలలోనే ఉన్నాయి. అవి ఏ విధంగా రూపుతీసుకుని, ఏ లక్ష్యాలను రూపొందించుకుని ఏ కార్యాచరణ ద్వారా ముందుకు సాగుతాయో ఇప్పటికీ సరైన స్పష్టత లేదు. ముందుకు సాగి లక్ష్యాలను సాధిస్తాయా, లేక స్తంభించి బలహీనపడి చెల్లా చెదురవుతాయా అనే దానిని బట్టి తర్వాత దశ ఆధారపడి ఉంటుంది.

దానినట్లుంచి, ఈ పరిణామ క్రమం అసలు ఆరంభమైంది, సాగుతున్నది కూడా వామపక్ష వ్యతిరేకుల పనుపున మాత్రమేనని నిర్ధారించలేం. వారి పాత్ర తప్పక ఉండే ఉంటుంది. కాని అది, లభించిన అవకాశాన్ని ఉపయోగించుకునే పాత్ర అనాలి గాని, స్వయంగా సృష్టించే పాత్ర అనలేం. అటువంటి తొందరపాటు నిర్ధారణలు చేయడం, స్వీయ స్పృహతో అస్తిత్వ ఉద్యమాలు చేసే వర్గాలను సరిగా అర్థం చేసుకోలేని తనం అవుతుంది. అది వామపక్ష స్వీయాత్మక ధోరణి అవుతుంది.

మనచుట్టూ కొంత కాలంగా అస్తిత్వ ఉద్యమాలు అనేకం కనిపిస్తున్నాయి. ఆ ఉద్యమాలలో కనీసం కొన్నింటిలో అసహనం, అప్రజాస్వామికత వ్యక్తమవుతుంది. పైన ఉపోద్ఘాతం వలె కొంత మాట్లాడుకున్నా, ఈ వ్యాసపు చర్చనీయాంశం ఈ అసహనాలు, అప్రజాస్వామికతలే.

అస్తిత్వ ఉద్యమాలకు మూడు విధాలైన సహనాలు, ప్రజాస్వామికతలు ఉండాలి. ఒకటి, అంతర్గతం. రెండు, ఇతర అస్తిత్వ ఉద్యమాల పట్ల. మూడు, శత్రువును మినహాయించి తక్కిన సమాజం విషయంలో చూపవలసిన సహనం, ప్రజాస్వామికత. కాని, కొన్ని అస్తిత్వ ఉద్యమాలు ఈ మూడింటిలో అన్నింటినో, కొన్నింటినో పాటించడం లేదని అందరూ గమనిస్తున్నదే. పాటించక పోవడమన్నది స్వల్ప స్థాయిలో ఉంటే విస్మరించవచ్చు. అది రకరకాల కారణాల వల్ల జరుగుతుంటుంది గనుక. కాని ఒక పరిమితికి మించడం మాత్రం ఆరోగ్యకరం కాదు, ఆమోదనీయం కూడా కాదు.

ఒక పీడిత వర్గం తన అస్తిత్వం కోసం, హక్కుల కోసం, స్వేచ్ఛ కోసం ఉద్యమించడమన్నది ఒక విలువ వంటిది. ఈ గుర్తింపు, స్పృహ సవ్యమైన రీతిలో ఏర్పడినట్లయితే, అందుకు ఆ ఉద్యమకారులు చిత్త శుద్ధితో కట్టుబడి కూడా ఉన్నట్లయితే, ఇతరుల హక్కులకు, స్వేచ్ఛలకు భంగం కలిగించడం భావ్యమేనని అనుకోగలరా? ఇతరులు అంటున్నది పై పేరాగ్రాఫ్‌లో పేర్కొన్న మూడు విధానాలైన వారి గురించి.

అట్లా భావించడం, వ్యవహరించడం తాము కోరుతున్న అస్తిత్వ సూత్రానికే మౌలికంగా విరుద్ధమైనది. అసహనాలు, అప్రజాస్వామికతలు ఏ కారణం వల్లనైనా జరుగుతుండవచ్చు గాక. అందుకు కారణం అంతర్గత లోపాలు కావచ్చు, లేదా బాహిరమైన పరిస్థితులు కావచ్చు. బహిరమైన పరిస్థితులు శత్రువు కల్పించినవి అయితే తప్ప, ఇతర అస్తిత్వ ఉద్యమాల నుంచి ఎదురైనా, లేక సాధారణ సమాజం నుంచి అయినా అది అర్థం చేసుకుని తగిన రీతిలో చక్కబెట్టుకోవలసింది అవుతుంది గాని అసహనంతో, అప్రజాస్వామికంగా ఎదుర్కోవలసింది కాబోదు. ఎందుకో బహుశ వివరించనక్కరలేదు. అటువంటి వ్యవహరణ తమను తాము బలహీన పరచుకోవడమే అవుతుంది.

వాస్తవానికి అనేక అస్తిత్వ ఉద్యమాలు ఏళ్లు, దశాబ్దాలు గడిచినా తమ లక్ష్య సాధన దిశలో ముందుకు సాగకపోవడానికి గల పలు కారణాలలో ఇది కూడా ఒకటి. ఏ అస్తిత్వ ఉద్యమానికైనా అంతర్గత ప్రజాస్వామ్యం ఉండాలి. ఇతర అస్తిత్వ ఉద్యమాలతో సంఘీభావం అవసరం. సాధారణ సమాజంతో సహకారం నెరపాలి. సాధారణ సమాజం అంటున్నది అన్ని విధాలైన అభిప్రాయాలూ కలిసి ఉండే దాని గురించి కాదు. సమాజంలో ప్రజాస్వామిక వర్గాలుంటాయి. అవి ఆ నిర్దిష్ట అస్తిత్వ ఉద్యమంతో పూర్తి ఏకీభావం లేకున్నా, ప్రజాస్వామికంగా దానికివ్వవలసిన గౌరవం దానికిస్తాయి. తమ రీతిన తాము సహకరిస్తాయి.

అస్తిత్వ ఉద్యమాలలో అనే దానికి గల లోపాలలో ఒకటి తమ స్పృహలో, ఎదుగుదలలో వామపక్ష సిద్ధాంతాలు, ఉద్యమాల చారిత్రక పాత్ర ఉందని అంగీకరించక పోవడం. వామపక్ష సిద్ధాంతాలలో, వాటి నాయకత్వాన నడిచిన ఉద్యమాలలో, ఆ నాయకత్వాలలో లోటుపాట్లు, వైఫల్యాలు ఉన్నమాట నిజమే. వాటిపై ఆశలు పెట్టుకున్న ఆశలు భంగపడడం వల్లనే తమవంటి అస్తిత్వ ఉద్యమాలు ముందుకు వచ్చి, వామపక్ష ధారలకు దూరం అయి ఉండవచ్చు. అంతవరకు అర్థం చేసుకోదగినదే. కాని అదే సమయంలో పీడిత వర్గాల చైతన్య క్రమంలో ఆ సిద్ధాంతాలు, ఉద్యమాల పాత్రను విస్మరించడం, అంతకన్న ఒక అడుగు ముందుకు వెళ్లి అందువల్ల తమకు నష్టాలు కలిగినట్లు నిందించడం, తమను 'బలి' తీసుకున్నట్లు ఆరోపించడం ఏం చెపుతుంది? అది అవగాహనా లోపం కావచ్చు, అస్తిత్వ ప్రశ్నలతో నిమిత్తం లేని ఇతరేతర సమస్యలు కావచ్చు, లేదా అన్య ప్రేరణలు ఏవైనా పనిచేస్తుండవచ్చు. అవగాహనా లోపానికి మరొక పార్శ్వం ఉంది. అది, వామపక్ష ధోరణిని అడ్డు తొలగించుకుంటే గాని తమ ఉద్యమానికి మార్గం సుగమం కాదన్నది.

ఈ అదనపు ప్రశ్నలను అట్లుంచితే, ఇంతకూ అస్తిత్వ ఉద్యమాలలో తమ హక్కులను, స్వేచ్ఛలను గుర్తించే దృష్టి తప్ప ఇతరుల హక్కులు, స్వేచ్ఛలను, పైన పేర్కొన్న ఇతర మూడు విధాలైన హక్కులను, స్వేచ్ఛలను గుర్తించే దృష్టి ఎందుకు ఏర్పడడం లేదు? అన్నింటికి కాకున్నా కొన్ని ఉద్యమాలకైనా? వాటికి స్వీయ ఆకాంక్షలు ఉండడం, తాము గతంలో భాగమైన వామపక్ష ఉద్యమాల పట్ల నిరసనను మించి ఇంకా స్పష్టతలు ఏర్పడినట్లు లేవు. తమ లక్ష్యాలు నిర్దిష్టంగా ఏమిటి? అందుకు ఏమి చేయాలి? ఎట్లా చేయాలి? ఆ క్రమంలో ఎవరితో సంబంధాలు ఏ విధంగా ఉండాలి? ఈ సరికొత్త యాత్రలో సమస్యలేమిటి? వాటిని ఎదుర్కోవడం ఎట్లా? అనే స్పష్టతలు ఉన్నట్లు కనిపించదు. అనేక అంశాలలో అయోమయం కూడా ఉంది. ఈ స్థితి తగినంత కాలంగా కొనసాగుతున్నందున నిరాశలు, నిస్పృహలు ఏర్పడుతున్నాయి. అసహనం, అప్రజాస్వామికతకు అవగాహన లోపాలు ఒక కారణమైతే ఈ వైఫల్యాలు మరొక కారణమనిపిస్తుంది.

(రచయిత సీనియర్ జర్నలిస్టు) వీ

కుల నిర్మూలనా పోరాటం - అస్తిత్వవాదం

కుల వ్యవస్థను ప్రోత్సహిస్తూ ఆధిపత్యం నిలుపుకోవాలని చూస్తున్న ఆధిపత్య వర్గాలకు వ్యతిరేకంగా అస్తిత్వ ఉద్యమాలు, సమాజంలో మౌలిక మార్పుకోరే శక్తులు కలిసి ఉద్యమించినప్పడే కుల నిర్మూలన సాధ్యమవుతుందని అంటున్నారు **పి. సూర్యం**

అధికార మార్పిడి జరిగి 67 సంవత్సరాలు అవుతోంది. ఇంత కాలం తర్వాత కూడా దేశంలో ఆర్థిక, సాంఘిక అసమానతలు, వ్యత్యాసాలు అంతరించక పోగా, ఎందుకు పెరిగిపోతున్నాయి? ఇవి దేనికి దానికే విడివిడిగా సాగుతున్నాయా? పరస్పరం ఒక దానిపై మరొకటి ఆధారపడి సాగుతున్నాయా? వీటి మధ్య ఉండే సంబంధం ఎలాంటిది? వీటికి సమాధానాలు రాబట్టుకోలేకపోతే ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉంటుంది. ఇంకా విశ్లేషించుకుంటే ఉన్న చోట ఉండకపోగా మరింత పతన స్థాయికి దిగజారిపోతుంది. సరిగ్గా నేటి భారతదేశ పరిస్థితికి ఇది అద్దం పడుతోంది.

ఆర్థిక, రాజకీయ, సాంఘిక అంశాల మధ్య సంబంధాలు రెండు రకాలు. ఈ మూడు ఒక దానిపై మరొకటి ఆధారపడి ఉంటాయి. ఇది సహజమయింది. ఇదే ప్రధానమయింది. అదే సమయంలో ఈ మూడింటిలో దేనికి దానికి ప్రత్యేకతలున్నాయి. సహజ, ప్రత్యేక అంశాలను నిర్దిష్టంగా పరిశీలించుకోలేకపోతే గుడ్డెద్దు చేలో పడ్డట్లుగా ఉంటుంది. కండ్లు మూసుకొని ఊరపిచ్చుకని పట్టుకోవడానికి ప్రయత్నించి నట్లుగా ఉంటుంది. ఇక్కడ ఆర్థిక, రాజకీయ, సాంఘిక అంశాలయిన మూడింటిని మొత్తంగా చర్చించడం ఈ వ్యాసం ఉద్దేశం కాదు. ఆర్థిక, రాజకీయ అంశాలతోపాటుగా సాగుతున్న సాంఘిక భాగాన్ని ఇక్కడ చర్చించబోతున్నాం. సాంఘిక అంశాలలో కూడా ముఖ్య భూమికని పోషిస్తున్న కులంని మాత్రమే చర్చించుకొంటున్నాం. కుల నిర్మూలనకు జ్యోతిరావు పూలే నిజాయితీగా నడుం బిగించి పోరాడినాడు. అతను నిర్మించిన సత్యశోధక్ సమాజ్ సంస్థ ఏర్పడి 143 ఏండ్లు గడిచింది. ఈ సందర్భంగా కులం ఎందుకు నిర్మూలించబడడం లేదు? దాని కోసం ఏమి చేయాలి? దీనిపై స్పష్టమయిన కసరత్తు జరగాలి.

వేల సంవత్సరాల పరిణామ క్రమంలో ఆదిమ కమ్యూనిస్టు సమాజం క్రమ క్రమంగా మార్పు చెంది వర్గాలకి, అసమానతలకి, వ్యత్యాసాలకి, వివక్షకి దారితీసి బానిస సమాజ రూపంలో వర్గ వ్యవస్థ మొట్టమొదటిగా ఏర్పడింది. ఈ వర్గ వ్యవస్థలో భాగంగా వర్ణ వ్యవస్థ ఏర్పడింది. అది కాలక్రమంలో కుల వ్యవస్థగా ఘనీభవించింది. పెల్లుబికింది. ఇది భూస్వామ్య సమాజంలో ముఖ్యంగా గుప్తుల కాలంలో మరింత సంఘటిత పడింది. ప్రజలను చీల్చడానికి, ఒకరిపై మరొకరు ఘర్షణ పడే విధంగా ఈ కులాన్ని ఒక సాధనంగా నాటి పాలకులు అభివృద్ధి పర్చారు. గర్భంలో ఉండగానే పాపాత్ములు, పుణ్యాత్ములుగా సృష్టించారు. వాళ్లకి ఏ సంబంధం లేకుండానే అదృష్టవంతులు, దురదృష్టవంతులు అని లెక్కలు కట్టారు. ఒకరు శ్రమ చేసేవారుగా, మరొకరు శ్రమ చేపించుకొనే వారుగానూ, పీడితులుగా, పీడకులుగానూ గర్భంలోని శిశువులు ఆదేశాలకి గురి చేయబడ్డారు. కొంత మంది ఉన్నత కులస్తులుగా, మరింత మంది నిమ్న కులస్తులుగా తయారు చేయబడ్డారు. క్రీ.పూ. 2-3 శతాబ్దాల్లో పాలిస్తున్న చంద్రగుప్తుని ఫ్యూడల్ రాజ్యంలో మను సృష్టించిన మను సంస్కృతి ఈ కులాన్ని భల్లూక పట్టుగా మార్చింది.

కులం ఆవిర్భవించిన నాటి నుండి నేటికి రాజ్యాలు మారుతున్నాయి. పాలనలు మారుతున్నాయి. అధికార పీఠాలు మారుతున్నాయి. అయినా కులం అంతరించడం లేదు. రాజ్యం, పాలకులందరికీ తమ పాలనకీ, అదనపు విలువ సంపాదనకీ కులం ఒక సాధనమయింది. ఈ కుల పునాదులు బలపడేట్లుగా విస్తరించేట్లుగా హిందూమతం సంకల్పించింది. హిందూ రాజుల రాజ్యంలో, వారి పాలనకి కులం తోడుగైంది. రక్షణ కవచమయింది. ముఖ్యంగా మధ్యయుగాల (క్రీ.శ. 500-1500) కాలంలో కుల పీడనకి అడ్డు, అదుపు లేకుండా వేళ్లూనికొని పోయింది.

హిందూ రాజుల పాలన అంతమై దాని స్థానంలో మహమ్మదీయులు రాజ్యాధికారాన్ని చేపట్టారు. వీరి కాలంలో కులం రద్దుగాక పోగా సజావుగా సాగింది. వీరి కాలంలో ప్రవేశించిన యూరప్ కంపెనీలు దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఆర్థిక లాభాపేక్షల వరకే పరిమితం కాలేదు. అక్కడి నుండి అధికారాన్ని స్వాధీనం చేసుకొనే వరకు ప్రయాణించాయి. వీరిపాలన కూడా కులాన్ని కాపాడింది. దేశంలో కంపెనీల పాలన నుండి బ్రిటిష్ సామ్రాజ్యవాదం సమగ్రంగా అధికారాన్ని చేపట్టాక కూడా కులాన్ని రక్షించింది. బ్రిటిష్ తెల్ల దొరల వలస రాజ్యాన్ని పారద్రోలాక దేశంలోని నల్లదొరల రాజ్యంలో సైతం కులం వికృత చేష్టలను సాగిస్తోంది. నల్లదొరల రాజ్యంలో ఏ పాలకవర్గ పార్టీలయినా, రాష్ట్రాల్లో గానీ, దేశంలోగానీ అధికారం చేపట్టినా కులపీడనని కొనసాగిస్తూనే ఉన్నాయి. గత రెండు వేల సంవత్సరాలకు పైబడిన కాలంలో అధికారం సాగించిన గుప్తుల కాలంలోనూ, మొగల్ రాజ్యంలోనూ, యూరప్ కంపెనీల పాలనలోనూ, బ్రిటిష్ సామ్రాజ్యవాదం వలస రాజ్యంలోనూ, 1947 ఆగస్టులో అధికారం చేపట్టిన భారత పాలకవర్గాల కాలంలోనూ కులం తమ దోపిడీకి గొడుగుగా వాడుకున్న చరిత్రనే కళ్లకి కట్టినట్టు కన్పిస్తోంది. దేశంలో ఎవరు అధికారంలోకి వచ్చినా, రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు, జాతీయ పార్టీలు అధికారం చేపట్టినా నిచ్చెన మెట్ల కుల సమాజాన్ని కాపాడడంలో పోటీ పడిన చరిత్రనే సృష్టించారు.

అణచివేత ఎక్కడ ఉంటుందో ప్రతిఘటన అక్కడే ఉంటుంది. కుల అణచివేత, దాని విలక్షణ పీడన ప్రారంభమైనప్పటి నుండి దాని వ్యతిరేక పోరాటాలు ఎన్నెన్నో రూపాల్లో సాగుతూనే ఉన్నాయి. అయినా కుల పీడన నిర్మూలించబడలేదని చరిత్ర రుజువు చేస్తోంది. కుల వ్యతిరేక పోరాటాలు విడివిడిగా సాగుతున్నాయి. సంఘటితశక్తి శక్తివంతంగా లేదు. పీడిత కులాల మధ్య వైరుధ్యాలు వైషమ్యాలుగా మారిపోతున్నాయి. శతృవులను, మిత్రులను నిర్ణయించుకోవడంలో వైఫల్యాలున్నాయి.

అన్నింటికీ మించి కులాన్ని నిర్మూలించే శాస్త్రీయ దృక్పథం లోపించడం నేటికి కుల పీడన సజీవంగా ఉండడానికీ, సజావుగా కొనసాగించడానికీ ముఖ్య కారణంగా ఉంది.

కులాన్ని వ్యతిరేకించే వారిలో రెండు ధోరణులున్నాయి. ఒకటి నిజాయితీగా కుల పీడనకి వ్యతిరేకంగా ఉద్యమిస్తోంది. రెండవది కులం వ్యతిరేకతను వ్యక్తం చేస్తూ దాన్ని తమ పాలనకీ, దోపిడికీ సురక్షితంగా వాడుకోవడం. ఇది కుల నిర్మూలనకి దోహద పడకపోగా దాన్ని మరింత పకడ్బందీగా కాపాడడానికే దారితీస్తుంది. ప్రజల్లో పెరుగుతున్న కుల వ్యతిరేక చైతన్యాన్ని పక్కదార్లు పట్టించడానికి సాగుతున్న పాలకుల, దళారీల, అగ్రకుల దురహంకారుల కుట్రనే ఇదంతా. ఇది కుల పీడనకి గురయ్యేవారికి, ప్రజాస్వామికవాదులకి, అభివృద్ధి కాముకులకి వ్యతిరేకమైంది. శత్రుపూరితమైంది. అన్నింటికంటే ప్రమాదకరమైంది.

కుల వ్యతిరేక పోరాటం కొన్ని రాయితీలు పొంది పాలకుల కుట్రలకి బలయిపోతోంది. దళితుల్లో ఒక చిన్న సెక్షన్ ఒక మేరకు ప్రయోజనం పొంది పునాది వర్గ దళితుల విముక్తిని వదిలేస్తోంది. దళితుల పోరాటాల ఫలితంగా సాధించుకొన్న రిజర్వేషన్లు పునాదివర్గ దళితులను విముక్తి చేయలేక పోయినాయని చరిత్ర తెలియచేస్తోంది. ఈ రిజర్వేషన్లు పరిమిత దళిత వర్గానికి పరిమిత ప్రయోజనాన్ని మాత్రమే చేకూర్చి పెట్టినాయి. దీనితో అల్ప సంతోషానికి గురికారాదు. పునాది దళిత వర్గాల సంపూర్ణ విముక్తి లక్ష్యంగా ఉండాలి. అది కుల నిర్మూలన సాధ్యమయినప్పుడే సాధ్యం. అది సాధ్యమయ్యే వరకు కుల పీడనకి వ్యతిరేకంగా ఉద్యమించాల్సిందే. పరిగెకి, శాతపోగులకి, సంతృప్తి పర్చాలనే పాలకుల, అగ్రవర్ణ భూస్వాముల పాచికలకి దళితులు బలికారాదు.

కుల వివక్షని, మహిళలు చదువుకి అనర్హులని పాటిస్తున్న ఆనాటి కుల, లింగ వివక్షకు వ్యతిరేకంగా జ్యోతిరావు ఫులే, ఆయన శ్రీమతి సావిత్రి విరోచితంగా పోరాడారు. మరో వంద సంవత్సరాలకి బాబా సాహెబ్ అంబేద్కర్ కుల వ్యవస్థపై లోతైన అధ్యయనం చేశాడు. ఫులేని తనకి మార్గదర్శకంగా ప్రకటించుకొన్నాడు. రిజర్వేషన్లను రాజ్యాంగంలో పొందుపర్చటంలో అంబేద్కర్ కీలకమైన పాత్ర నిర్వహించాడు. కాని ఈ రిజర్వేషన్లు కూడా తాత్కాలికమే అని ప్రకటించాడు. ఈ రిజర్వేషన్ల కాలం 10 సంవత్సరాలు ఉంటే సరిపోతుందన్నాడు. దేనికి అంబేద్కర్ 10 సంవత్సరాలు అన్నాడు. ఈ 10 సంవత్సరాల కాలంలో కుల నిర్మూలన సొంతం నిర్మూలించడానికి తగిన కర్తవ్యాలను రూపొందించి పూరించాలన్నాడు. ఇక్కడ టెక్నికల్‌గా 10 సంవత్సరాలు అనే అంశం ప్రాధాన్యత కాదు. కుల నిర్మూలనను సంపూర్ణంగా సాధిస్తే అప్పుడు రిజర్వేషన్ల ప్రాధాన్యత సంతరించుకోవాల్సిన ఆవశ్యకత లేదనేదే దాని అర్థం. అంటే సంపూర్ణ కుల నిర్మూలన జరిగే వరకు రిజర్వేషన్ల ఆవశ్యకత ఉంటుందనే దీని భావన. అంబేద్కర్ కోరుకున్నట్లు, అంచనా వేసినట్లు 10 సంవత్సరాలు కాదు కదా, ఏడు పదుల కాలం గడుస్తున్నా కులం వర్ధిల్లుతూనే ఉంది. దాని అగచాట్లు వర్ణనాతీతం. ఈ పాపం ఎవరిది? ఏలిన వారిది కాదా!

బ్రాహ్మణుల వ్యతిరేక పోరాటం కాదు, బ్రాహ్మణయిజం వ్యతిరేక పోరాటమే మా మార్గమని అంబేద్కర్ ప్రకటించాడు. దీన్ని గాలిలో సాము చేయడంగా కొంత మంది వ్యాఖ్యానిస్తున్నారు. అగ్రకుల దోపిడీనీ, వారి దురాహంకారాన్ని, వారి పాలనని సురక్షితంగా ఉండడానికి తోడ్పడే చర్యలను బ్రాహ్మణిజం కొనసాగిస్తోంది. ఇవి ఏ రూపంలో వెల్లడయినా, కొనసాగినా వాటిని అడ్డుకోవడానికి జరిగే పోరాటమే బ్రాహ్మణిజం వ్యతిరేక పోరాటం. బ్రాహ్మణిజం సృష్టించిన నిచ్చెన మెట్ల కుల అడ్డుగోడలను అడ్డుకోకుండా, కుల నిర్మూలనకై రకరకాలుగా పోరాడుతున్న వారు ఐక్యం కాకుండా, ప్రజాస్వామిక శక్తులను భాగస్వామ్యం చేయకుండా ముందుకు పోలేము. పీడిత కులాల, ప్రజాస్వామిక శక్తుల ఐక్యమే బ్రాహ్మణిజాన్ని ఓడిస్తుంది. అంబేద్కర్ కుల నిర్మూలన కొరకై నిజాయితీగా సంకల్పించాడు. కుల వ్యవస్థకు మూలం హిందూ మతంలోనే ఉందని అంబేద్కర్ భావించాడు. హిందూ మతాన్ని సంస్కరించడం సాధ్యం కాదని, కనుక హిందూ మతం పరిధిలో కుల నిర్మూలన సాధ్యంకాదని, దళితులు హిందూ మతాన్ని విడిచి మరో మతాన్ని స్వీకరించడమే కుల నిర్మూలనకు మరో మార్గమని ఆయన భావించాడు. చాల తర్జన, భర్జన పడిన తర్వాత, దళితులు బౌద్ధమతాన్ని స్వీకరించాలని ఆయన నిర్ణయానికి వచ్చాడు. లక్షలాది తన అనుచరులతో బౌద్ధమతాన్ని స్వీకరించాడు. ఆ విధంగా కుల నిర్మూలనను సాధించవచ్చునని ఆయన భావించాడు. కాని, ఆ తర్వాత చరిత్ర, మతమార్పిడి ద్వారా కుల నిర్మూలన సాధ్యం కాదని నిరూపించింది. ఆర్థిక వ్యవస్థలో మౌలిక మార్పును సాధించడం ద్వారానే సామాజిక సంబంధాలలోనూ మౌలిక మార్పు సాధించగలమని అనుభవం రుజువు చేస్తున్నది. కులం పునాదులపై ఆధారపడిన హిందు మతం ఎంత అభివృద్ధి నిరోధకమయిందో జీవితం అతనికి నేర్పింది.

కుల నిర్మూలన కోసం అంబేద్కర్ చేసిన పోరాటంలోని నిజాయితీని ఎవరూ ప్రశ్నించలేరు. అయితే, అంబేద్కర్ మార్గం కులాన్ని నిర్మూలించలేక పోయిందనేది చారిత్రక సత్యం. కుల నిర్మూలనకి నీతి నిజాయితీ అవసరమే. కానీ అది మాత్రమే లక్ష్యాన్ని సాధించలేదు. ఎన్నెన్నో మార్గాల్లో కుల వ్యతిరేక పోరాటాలు జరుగుతున్నా కులం రూపాలలో మార్పు వస్తున్నదే కాని, పునాదులు మౌలికంగా మారడం లేదు. దీని పునాదులను కూకటివేళ్లతో పెకిలించకుండా ఉపరితలంకే పరిమితమయి ఆలోచిస్తే పరిష్కారం కాలేదని తెలిపోయింది.

ఎక్కడున్నాయి కులం పునాదులు? ఫ్యూడల్ వ్యవస్థలోనే దాని పునాదులున్నాయి. 2 వేల సంవత్సరాల క్రితం ఆవిర్భవించిన కులం వ్యవస్థలో ఇక్కడ అనేక మార్పుల తదనంతరం కూడా సాగుతుంది కదా! ఇక కులం రద్దయ్యే అవకాశమే లేదా? అనే అనుమానం కలగడానికి ఆస్కారం ఉంది. ఇక్కడ కొంత గందరగోళాన్ని సృష్టిస్తోంది. ఇక్కడే బోల్తాపడుతున్నాం. ఫ్యూడల్ వ్యవస్థ పరిమాణాత్మక మార్పులకి, కొన్ని ప్రదేశాల్లో గణనీయమయిన మార్పులకి గురయింది. కానీ విప్లవాత్మక మార్పుకి గురికాలేదు. మధ్యయుగాల కాలానంతరం ప్రవేశించిన బ్రిటిష్ సామ్రాజ్యవాదుల విధ్వంసక చర్యల కాలంలో కులం తన అస్తిత్వాన్ని కోల్పోలేదు. ఫ్యూడలిజం స్థానంలో పెరుగుతున్న స్వయం పోషక పారిశ్రామిక రంగంపై ఆనాటి వలస పాలకులు సమ్మెట పోటు వేశారు. ప్రజల అదనపు విలువని దేశంలో పెట్టుబడిగా మార్చకుండా తమ సామ్రాజ్యం అభివృద్ధికి వాడుకొన్నారు. మన శ్రమని చౌకగా కొల్లగొట్టారు. యూరప్‌లోనే బ్రిటిష్ అత్యంత ప్రతిభావంతంగా పారిశ్రామికీరణ చెందడంలో ముందంజ ఉండడానికి భారతదేశ వనరులను తరలించడమే ముఖ్య కారణం. తత్ఫలితంగా మన దేశం కోలుకోలేని విధంగా వెనకబడి పోయింది. పూర్తిగా దివాళ ఎత్తింది. నేటికీ వెనకబడిన వ్యవసాయిక విధానాలే కొనసాగుతున్నాయి. విదేశీ పెట్టుబడిదారీ దేశాలకి, బహుళ జాతి కంపెనీలకి వారి దేశీయ దళారీలకి మాత్రమే ప్రయోజనకరంగా ఉండే ఆర్థిక, రాజకీయ వ్యవస్థని మిగిల్చి

అధికారం నుండి బ్రిటిష్ సామ్రాజ్యవాదులు తప్పుకున్నారు. ఈ మేరకు భారత ప్రజల పోరాటాల ఒత్తిడి ఫలితంగానే వారి ప్రత్యక్ష అధికారాన్ని వదులుకోవాల్సి వచ్చింది. నేటి మన పెట్టుబడి, వనరులు మన ప్రజలకి, దేశ అభివృద్ధికి సద్వినియోగపడడం లేదు. వెనకబడిన, అర్ధ భూస్వామ్య, విదేశీ లాభాల ఆర్థిక వ్యవస్థని కాపాడే లక్ష్యంగా కులం ఉంది. ఈ వ్యవస్థ పునాదులలోనే కులం ఉంది. నేటి వ్యవస్థ కూలకుండా దాని పునాదుల్లోని కులం కూలడం అసాధ్యం. కుల వ్యతిరేక పోరాటం కుల వ్యవస్థ వ్యతిరేక పోరాటంగా మారకుండా కులం నిర్మూలించబడలేదని స్పష్టమైంది.

వ్యవస్థ నిర్మూలనా పోరాటంలో కులం వ్యతిరేక పోరాటం తప్పనిసరిగా భాగస్వామ్యం కావాలి. కులం వ్యవస్థ పునాదుల్లోనే కాదు, వ్యవస్థను కాపాడే రాజకీయ వ్యవస్థలోనూ భాగమయింది. ఈ దోపిడి వ్యవస్థను కాపాడడానికి శ్రమజీవుల దోపిడిని, పీడనను మరుగు పర్చడానికి వారి చైతన్యాన్ని మొద్దుబార్చి ఈ వ్యవస్థలోని అసమానతలను వివక్షతల నుండి వారిని పక్కదారి పట్టించడానికి, మూఢ విశ్వాసాల, కర్మకాండల సంస్కృతిని పెంచి పోషిస్తున్నారు. వర్గ వ్యవస్థను కాపాడేందుకు సృష్టించిన సంస్కృతిలో కులం కీలక పాత్ర పోషిస్తోంది. అందుకే కులం పునాదుల్లోనే కాదు, దాన్ని కాపాడే ప్రజా వ్యతిరేక సంస్కృతిలోనూ, దగుల్బాజీ రాజకీయ సంస్కృతిలోనూ ముఖ్య భూమికని పోషిస్తోంది. ఆ విధంగా వ్యవస్థ పునాదుల్లోనూ, ఉపరితలం లోనూ కులం వేళ్లూనుకొని ఉంది. అందుకే ఇక్కడ విత్తుముందా? చెట్టు ముందా అన్నట్లు కులం భాగస్వామ్యంతో సాగుతున్న నేటి వర్గ వ్యవస్థ ముందా, కులం ముందా అనేది ఇక్కడ ప్రస్తావన కాదు. వ్యవస్థ, కులం పరస్పరం ఒక దానిపై మరొకటి ఆధారపడి ఉన్నాయి. విడదీసి చూడడంతోనే ఇప్పటి వరకు ఎంత గొప్పవారయినా సాగించిన కుల నిర్మూలనా పోరాటాలు వైఫల్యం చెందాయి. వ్యవస్థకి వ్యతిరేకంగా సాగుతున్న పోరాటంలో కుల వ్యతిరేక పోరాటం నిమగ్నమై ఉంటుంది. కుల వ్యతిరేక పోరాటంలో వ్యవస్థ వ్యతిరేక పోరాటం నిబిడీకృతమయి ఉంటుంది. ఈ పరస్పర సంబంధాన్ని గమనించడం గతితార్కిక దృక్పథంలో భాగం. అదే సందర్భంలో వ్యవస్థ, కులంకి సంబంధించిన ప్రత్యేకాంశాలు కూడా ఉంటాయి. కులంకి ఉన్న ప్రత్యేకతని, సమాజంలో ఇతర అంశాలతో భాగంగా ఉండే సహజత్వాన్ని, సాధారణత్వాన్ని గుర్తించడమే గతితార్కిక దృక్పథం. తద్భిన్నంగా ఆలోచించిన ఫలితంగా కుల నిర్మూలన పోరాటం విజయం సాధించలేక పోయింది.

వర్గం, కులాన్ని పూర్తిగా వేరుచేసే వైఖరి ఎంత అసంబద్ధమో, రెండూ ఒకటే అనడం అంతే అసంబద్ధం. వర్గం అంటే ఆర్థిక ప్రయోజనం మాత్రమేనని కుదిస్తున్నారు. కులం అంటే ఉపరితలంలో ఉండే సంస్కృతి విభాగంలోని ఒక భాగంగా విడమర్చి చెప్పే ధోరణి నష్టకరమయింది. ఈ రెండు ధోరణులే కుల నిర్మూలనా పోరాటాన్ని విజయవంతం చేయలేకపోతున్నాయి. ఈ రెండు ధోరణులు కలవారు ఒకరినొకరు కారణంగా విమర్శించుకొంటున్నారు. శత్రుపూరిత విమర్శలకు దిగుతున్నారు. ఈ ఆలోచన ఫలితంగా వాస్తవ కారణాలను పసిగట్టలేక పోతున్నారు. కుల వ్యవస్థను కాపాడుతున్న పాలకవర్గాలను లక్ష్యం చేయలేకపోతున్నారు. ఒక్కొక్కసారి దాని ఒడిలోకి జారిపోతున్నారు. ఈ అనైక్యతను పాలకవర్గాలు, అగ్రవర్ణ ఉన్నత వర్గాలు తమ స్వప్రయోజనాలకి వాడుకొంటున్నారు. ఉన్నత వర్ణాలు, వర్గాలు వాడుకోవడానికి వీలులేని విధానాలను, ఎత్తుగడలను కుల నిర్మూలనా దృక్పథం కలిగిన వారు అవలంభించాలి.

ఇటీవల, ఇంతకు ముందు ప్రస్తావించిన ఈ రెండు విరుద్ధ వైఖరులతోపాటు, మరోవైఖరి ముందుకొచ్చింది. వర్గ సిద్ధాంతానికి మార్క్స్ ప్రతినిధి అని కుల నిర్మూలనా సిద్ధాంతానికి అంబేద్కర్ ప్రతినిధి అని వీరు సిద్ధాంతీకరిస్తున్నారు. కుల నిర్మూలనకు అంబేద్కర్ ఆలోచనా విధానం మార్గంగా ప్రకటిస్తున్నారు. ఈ రెండింటి కలయిక సిద్ధాంతమే భారతదేశ నిర్దిష్ట పరిస్థితులకి మార్క్సిజాన్ని అన్వయించడంగా భావిస్తున్నారు. ఈ విధంగా మార్క్సిజంలోని కొరతలను అంబేద్కర్ ఆలోచనలతో పూరించాలంటారు. దీన్ని మార్క్సిజం సంపూర్ణంగా తిరస్కరిస్తుంది. మార్క్సిజం సమగ్రమయింది. సంపూర్ణమయింది. స్థల, కాలాలను బట్టి అన్వయించుకోవడమే మార్క్సిజం. దాన్నే లెనిన్, స్టాలిన్ రష్యాలో అభివృద్ధి పర్చారు. చైనాలో మావో అన్వయించాడు. వారి దేశాల్లో విప్లవాలు విజయవంతం చేశారు. పై వాదన చేసేవారు ఈ ప్రకారంగా భారతదేశంలోని కమ్యూనిస్టులు అనుసరించ లేదంటారు. ముందుగా మార్క్సిస్టు ఫిలాసఫీని అర్థం చేసుకోవాలి. అంగీకరించాలి. దాని అన్వయింపులో పార్టీల లోపమేదయినా ఉంటే చర్చ సాగించవచ్చు. అన్వయింపులో లోపం ఉందని మొదలయి మార్క్సిస్టు తాత్విక ఆలోచననే అసంపూర్ణమయిందిగా వ్యాఖ్యానించడం సరైంది కాదు. ఇది తెలిసి చేసినా, తెలియక చేసినా మార్క్సిజంపై దాడి మాత్రమే.

ఆర్థిక విప్లవం ముందా! సాంఘిక విప్లవం ముందా! అనే ప్రశ్నని లేవనెత్తుతున్నారు. ఇది యాంత్రికమయింది. ఈ రెండు విప్లవాలకి మొదటి దానికి మార్క్స్ ప్రతినిధి అని, రెండవదానికి అంబేద్కర్ ప్రతినిధి అని విచిత్రమయిన చర్చ లేవనెత్తుతున్నారు. ఇది ముందా? అది ముందా? లేదా రెండు కలిపి కొనసాగించడమా? అనే చర్చ అర్థరహిత మైంది. అన్ని దోపిడీలకి నిలయమయిన నేటి అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థకి ప్రత్యామ్నాయం నూతన ప్రజాస్వామిక విప్లవమే. దీనికి ఇరుసు లాంటిదే వ్యవసాయిక విప్లవం. ఇది, దేశంలో ఏ ఒక్క పీడనకో, దోపిడీకో, వివక్షకో, అణచివేతకో వ్యతిరేకంగా జరిగే పోరాటం మాత్రమే కాదు. ఇది వీటన్నింటికీ వ్యతిరేకంగా జరిగే పోరాటం. బహుముఖ దోపిడీలకు వ్యతిరేకంగా జరిగే పోరాటం. ఇందులో వర్గ పీడన వ్యతిరేకత ఉంటుంది. కుల పీడన వ్యతిరేకత ఉంటుంది. ఇతర పీడనల వ్యతిరేకత ఉంటుంది. దీన్నే బహుముఖ దోపిడీ అంటారు. బహుముఖ దోపిడీ వ్యతిరేక పోరాటంలో కుల వ్యతిరేక పోరాటం భాగంగా ఉంటుంది. దేనికుండే ప్రత్యేకత దానికి ఉంటుంది. అదే సమయంలో వాటన్నింటికీ మూలం ఒకటే ఉంటుంది. అది నేటి వ్యవస్థ. ఈ వ్యవస్థ వ్యతిరేక పోరాటమంటే కుల వ్యతిరేక పోరాటం, వర్గ పీడన వ్యతిరేక పోరాటం విడివిడిగా కలిమిడిగా సాగుతూనే ఉంటాయి. అందుకే ఈ విప్లవంలో ఏ పీడన వ్యతిరేక పోరాటం మినహాయింపుగా ఉండదు. దేనికి దాన్నే చూడడం మూలంగా సాంఘిక, వర్గ విప్లవాలని విడదీస్తున్నారు. ఇవి అలా సాగడం ఫలితంగానే కుల నిర్మూలన పోరాటం విజయం సాధించడం లేదు. ఈ రెండు విప్లవాల సమ్మిళితమే వ్యవసాయిక విప్లవం. ఈ విప్లవం ప్రతి దానికుండే ప్రత్యేకత్వాన్ని చూస్తోంది. సాధారణత్వాన్ని చూస్తోంది. కుల నిర్మూలనా పోరాటాలకు ఈ లక్ష్యం లేకనే విజయం సాధించలేక పోయాయి. ఈ పాఠాల నుండి కుల నిర్మూలన కుండే ప్రత్యేకత్వాన్ని, సాధారణత్వాన్ని విశ్లేషించే వ్యవసాయిక విప్లవమే మార్గంగా కుల నిర్మూలనా పోరాటాలు సాగాలి.

భారత కమ్యూనిస్టులకు కులంపై ఓనమాలే తెలువదని చరిత్ర

తెలుసుకోకుండా మాట్లాడడం సబబుకాదు. వీరోచిత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నుండి, నక్సల్‌బరి, శ్రీకాకుళం, గోదావరిలోయ ప్రతిఘటనా మొదలగు పోరాటాల సందర్భంలో అనేకానేక సామాజిక చెడులకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు విప్లవకారులు పోరాడారు. దళితుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టే పోరాటాలను నిర్మించారు. దాన్ని మరింత ఆచరించడంలో సమాజ ప్రభావాలు కమ్యూనిస్టులపై ఏమీ లేవని ఎవరు భావించరు. వాటికి వ్యతిరేకంగా బయట నుండి, లోపల నుండి విమర్శలు, పోరాటాలు సదుద్దేశంతో సాగడం వల్ల సమస్యపై మరింత పరిపక్వతని సాధించగలుగుతాం. కమ్యూనిస్టులు నేర్చుకోవడానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉంటారు. కానీ పాలకుల నోటిలో నాలుకగా అసంబద్ధ విమర్శలు, శత్రుపూరిత దాడులు ప్రజాస్వామిక ఉద్యమాలకి, కుల నిర్మూలనా పోరాటాలకు నష్టదాయకం.

కుల పీడనలకి, దాడులకి గురయ్యేవారు దళితులు. వీరిలో అసంఖ్యాకులు పేద వర్గానికి చెందిన వారు. అగ్రకుల పెత్తందారులు, దురహంకారులు ఈ కులాలలోని పేదలలో కుల దురహంకారాన్ని రెచ్చగొట్టి గుండాలుగా వాడుకోజూస్తారు. వీరిని పీడిత ప్రజల వైపు మొగ్గకుండా చూస్తుంటారు. పీడితులంతా ఏకం కావాలి. అప్పుడే శత్రువుని ఒంటరి చేయగలుగుతాం. ఆర్థిక, సాంఘిక, రాజకీయ సమానత్వం కల్గిన ప్రజల రాజ్యాన్ని నెలకొల్పుకోగలుగుతాం.

ప్రధానంగా కులంలో నిమ్న, అగ్రకులం అని రెండు భాగాలుగా చీలి ఉన్నాయి. పీడిత ప్రజలను చీల్చేందుకు ఈ వ్యవస్థ నిమ్న కులంలోనే నిచ్చెనమెట్ల కులసమాజాన్ని సృష్టించింది. ఇదే బ్రాహ్మణిజం. బ్రాహ్మణిజం ఏ రెండు కులాలను కలవనీయదు. ప్రతి రెండు కులాల మధ్య వైరుధ్యాలను, వ్యత్యాసాలను, వైషమ్యాలను సృష్టిస్తుంది. మాల, మాదిగ కులాల మధ్య ఘర్షణలను, ఇతర ఉపకులాల మధ్య సంఘర్షణలను సృష్టిస్తుంది. కింది కులాలు విడిపోవడంతో అగ్రకుల ఆధిపత్యాన్ని పాలకుల కుటిల నీతిని ఎదురులేకుండా సాగించుకోవాలని కుట్రలు, కుతంత్రాలు సాగిస్తున్నారు. కుల సంఘాలతో కుల దోపిడీ రద్దు కాదని తేలిపోయింది. బ్రాహ్మణిజం సృష్టించిన నిచ్చెన మెట్ల కుల సమాజం కులాన్ని నిర్మూలించ లేదు. సిద్ధాంతపరంగా బ్రాహ్మణిజాన్ని ఓడించకుండా కులనిర్మూలనా పోరాటాన్ని జయప్రదం చేయలేం. అదే సందర్భంలో అన్ని కులసంఘాలు ఒకటేననే ధోరణి అగ్రకులానికి దోహదం చేసేది. అగ్రకుల సంఘాలు, కింది కులాలను, కింది వర్గాలను అణిచేందుకు సంకల్పించేవి. నిమ్న కులాలు తమపై జరిగే వివక్షని ప్రశ్నిస్తాయి. అందుకే ఇందులో ప్రజాస్వామిక స్వభావం ఉంది. వీరు చేసే అగ్రవర్ణ దోపిడీ, పీడనల వ్యతిరేక పోరాటాలను కమ్యూనిస్టులు సమర్థిస్తారు. న్యాయమయిన ఉద్యమాల్లో పాల్గొంటారు. అదే సమయంలో కమ్యూనిస్టు విప్లవకారులు సాగిస్తున్న విప్లవోద్యమాలను బలపర్చాల్సిన బాధ్యత పీడిత కుల సంఘాలకూ, దళిత సంఘాలకి ఎంతయినా ఉంది. ఇవి షరతులతో కూడి ఉండవు. దృక్పథానికి సంబంధించినవి. ఈ దృక్పథం పరస్పరం కలిగి ఉండాలి. ఈ మేరకు దళిత సంఘాలు పునరాలోచన చేయాలి.

అన్నిరకాల వివక్షతలతో, అసమానతలతో కొనసాగుతున్న నేటి వ్యవస్థను సమూలంగా నిర్మూలించకుండా, కూలదోయకుండా, సమానత్వం ఏ అంశంలోనూ సాధించడం అసాధ్యం. కులపీడనకి, వర్గపీడనకి గురయ్యే వారు ఉత్పత్తి సాధనాలపై అజమాయిషీ సంపాదించకుండా తమపై సాగే పీడనలను రద్దు పర్చుకోవడం సాధ్యం కాదు. వ్యవసాయిక దేశమయిన భారతదేశంలో ప్రధాన ఉత్పత్తి సాధనమయిన భూమి దున్నే వారికి స్వాధీనం కాకుండా ఎలాంటి అసమానతలు రద్దు కావు. భూమి ఆర్థిక ప్రయోజనాన్ని తీర్చేదే కాదు. ఇది సాంఘిక సమస్య కూడా. భూమిపై అగ్రకుల భూస్వాముల యజమాన్యం ఉన్నంత కాలం కింది కులాలపై, పేద ప్రజలపై సాంఘిక అణచివేత కొనసాగుతూనే ఉంటుంది. ఈ విధానం ఉన్నంతకాలం అర్థబానిస జీవితాన్నే నిమ్న కులాలు సాగించాల్సి వస్తుంది. బాంచను కాల్మొక్తా నుండి కమ్యూనిస్టుల నాయకత్వంలో చాకలి అయిలమ్మ భూమి రక్షణ కోసం సాగిన పోరాటం పునరావృతం కావాలి. భూసేవకులే భూ యజమానులయితే ఉద్భవించే ఆత్మగౌరవమే దళితులను కాపాడుతుంది.

తెలంగాణా ముఖ్యమంత్రి దళిత కుటుంబానికి మూడు ఎకరాల చొప్పున భూమిని ఇస్తామని ప్రకటించాడు. కానీ ఎలా పంచుతారో ఇంతవరకు ఎలాంటి శ్వేతపత్రాన్ని విడుదల చేయలేదు. ప్రజల అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత తెరాస ప్రభుత్వంపై ఉంది. ఎందుకంటే గిరిజన ప్రాంతంలో ముఖ్యంగా ఇల్లెందు వగైరా ప్రదేశాల్లో 30 సంవత్సరాలపై నుండి గిరిజనులు సేద్యం చేసుకొంటున్న పోడు భూముల నుండి ఆదివాసులను ఖాళీ చేయించడానికి కె.సి.ఆర్. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అనేక అనుమానాలు లేపుతున్నాయి. తమ భూముల రక్షణ కోసం గిరిజన ప్రజలు పోరుబాట పట్టారు. దళితులు కూడా ఎక్కడికక్కడ సంఘటితమయి ప్రతి కుటుంబం 3 ఎకరాలు పొందే వరకు ప్రభుత్వంపై ఆందోళన చేయాల్సిన ఆవశ్యకత ఉంది.

ఈ నాటికీ కీలవేణ్మణి, ఖైర్లాంజి, లక్షింపేట, కారంచేడు, చుండూరు మొదలగు అనేకానేక ఘటనలకు చోటు లభిస్తూనే ఉంది. దేశంలో సాగుతున్న వర్గ దోపిడీకి, కుల పీడనలకి, మైనారిటీల అణచివేతకి, వివక్షకి, మహిళలపై పితృస్వామిక దాడులకి వ్యతిరేకంగా నిరంతరం పోరాడుదాం. గిరిజనుల పరిరక్షణకై, జాతుల సంరక్షణకై ఉద్యమిద్దాం. అన్ని సెక్షన్ల ప్రజలంతా సంఘటిత మవ్వాలి. కుల వ్యతిరేక పోరాటాలు ఇతర ప్రజాస్వామిక శక్తులతో, అలాంటి ప్రజాస్వామిక ఉద్యమాలతో విప్లవోద్యమాలతో మమేకం కావాలి. అప్పుడే ఆ ఉద్యమం రాజకీయంగా సంఘటిత పడుతుంది. ఇతర సెక్షన్ల ప్రజల ఉద్యమాలు కూడా కుల వ్యతిరేక పోరాటాలను తమ ఉద్యమంలో భాగంగా సాగించాలి. అన్ని సెక్షన్ల ప్రజలు తమపై జరిగే బహుముఖ దాడులను తిప్పికొట్టాలి. ఎలాంటి అసమానతలకి తావివ్వని, అవకాశం లేని సమసమాజాన్ని, నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని నిర్మించుకొందాం.

(రచయిత న్యూడెమోక్రసీ నాయకుడు) వీ

మరొక పత్రికకు పంపిన, మరొక పత్రిక పరిశీలనలో ఉన్న, మరొక పత్రిక ప్రచురణకు ఆమోదించిన రచనను వీక్షణంకు పంపగూడదు. - సం.

చేతివృత్తుల్లో మార్పులు

***ప్రపంచీకరణ ప్రభావంతో చేతి వృత్తులు ఎలా విధ్వంసం అయ్యాయో వివరిస్తూ, నేడు చేతి వృత్తి కార్మికులు పరిశ్రమలలో నైపుణ్యేతర కార్మికులుగా తయారవుతున్నారని అంటున్నారు* వి. వెంకట్రావు**

కుండలు తయారు చేసే మనిషి ఉన్నాడు. అతను తయారు చేసిన కుండలు బజారులో అమ్మి, తన ఇంటికి కావలసిన సరుకులు తెచ్చుకుంటాడు. అయితే తన ఇంటికి ఒక కుండ అవసరం వచ్చిందనుకుందాం. ఏం చేస్తాడు? తను తయారు చేసిన కుండల్లో ఒక కుండను ఉంచుకొని, మిగతా కుండలు అమ్ముతాడు. అంతే తప్ప, తను తయారు చేసిన కుండలు అన్నీ బయట బజారులో అమ్మేసి, తను మళ్లీ కుండ కొనుక్కుంటాడా? అలా ఏ తెలివి తక్కువ కుమ్మరీ చేయడు. కానీ, పెట్టుబడిదారీ సమాజంలో ఇలాంటి తమాషాలు కూడా జరుగుతాయి.

వస్తువుల తయారీ అంతా చేతివృత్తుల మీద జరిగినన్నాళ్లు, చాలా మామూలుగానే, మానవ సంబంధాలు ఉంటాయి. మానవ జీవితంలో, యంత్రాల రాక కొన్ని అస్తవ్యస్త పరిస్థితుల్ని మోసుకొస్తుంది. అది ఎలాగో చూడాలంటే, ఏదో ఒక వృత్తిని ఉదాహరణగా తీసుకోవాలి. ఒక వృత్తికి సంబంధించిన విషయాలే అన్నీ వృత్తులకీ వర్తిస్తాయి. వృత్తులు అంటే, ముందు చేతివృత్తులే. మార్కెట్‌లో లభిస్తున్న వస్తువులన్నీ స్వతంత్ర ఉత్పత్తిదారుల ద్వారా, పెటీ బూర్జువాల ద్వారా ఉత్పత్తి అయి మార్కెట్లోనికి వస్తాయి.

స్వతంత్ర ఉత్పత్తిదారులు అంటే, వీళ్లు ఎవరి దగ్గరా పనిచేయరు, వీళ్ల దగ్గర ఎవరూ పని చేయరు. దీని అర్థం వీరి శ్రమ వీరికే దక్కుతుంది. శ్రమ దోపిడి ఉండదు. అందుకే వీళ్లను స్వతంత్ర ఉత్పత్తి దారులు అంటారు. తర్వాత, పెటీబూర్జువాలు. వీళ్ల దగ్గర నలుగురు, అయిదుగురు పనివాళ్లు ఉంటారు. పనివాళ్లతో పాటు వీళ్లు పని చేస్తారు. వీళ్లు చేసేది కేవలం నిర్వహణ శ్రమ మాత్రమే కాదు. వస్తువు తయారీలో వీళ్లు భాగస్వాములే. అందరూ కలిసే శ్రమ చేస్తారు. తమ శ్రమను తాము అనుభవిస్తూనే, మిగతా పనివాళ్ల శ్రమను దోపిడీ చేస్తారు. అయితే, ఈ శ్రమదోపిడి చాలా తక్కువ స్థాయిలో ఉంటుంది. ఆ తర్వాత దశ పెట్టుబడిదారీ దశ. ఈ దశలో శ్రమ దోపిడి పూర్తి స్థాయిలో ఉంటుంది. వీళ్లు అస్సలు పనిచేయరు. కేవలం నిర్వహణ శ్రమ మాత్రమే చేస్తారు. అది వస్తువు తయారీలో సహజ అవసరం కాదు. నిర్వహణ శ్రమ లేకపోయినా వస్తువులు తయారవుతాయి. ఈ దశలోనే యంత్రాలు ప్రవేశిస్తాయి.

నేను ఈ వ్యాసంలో టైలరింగ్‌ని (కుట్టుపని) ఉదాహరణగా తీసుకుంటున్నాను. ఈ వృత్తినే, ఎందుకు ఉదాహరణగా తీసుకున్నానంటే, ప్రస్తుతం ఈ వృత్తిలోని, అన్ని దశలు మనదేశంలో ఉన్నాయి. చిన్న ఊర్లలో ఇంకా స్వతంత్ర ఉత్పత్తిదార్లు ఉన్నారు. ఐదు, ఆరు మిషన్లతో షాపులు నడిపే పెటీ బూర్జువా దశలో ఉన్న వాళ్లు ఉన్నారు. అలాగే పూర్తిగా యంత్రాల మీద నడిచే రెడీమేడ్ వస్త్రాలు తయారు చేసే ఫ్యాక్టరీలు, తయారయ్యే వస్త్రాలను అమ్మే షాపులు ఈనాడు ఎక్కడ చూసినా దర్శనమిస్తున్నాయి. ప్రతి ఏడు రెడీమేడ్ వస్త్రాలు అమ్మే షాపుల సంఖ్య పెరుగుతుంది. అంటే, యంత్రాల మీద తయారయ్యే వస్త్రాల వాడకం పెరుగుతోందని అర్థం. ఆ అర్థం ఇంకో అర్థాన్ని కూడా ఇస్తోంది. అది, దేశంలో స్వతంత్ర ఉత్పత్తిదారులు తగ్గిపోతున్నారని.

అది మంచి మార్పే. యంత్రాలనేవి మనిషి శ్రమ కాలాన్ని గణనీయంగా తగ్గిస్థాయి. కానీ, ఇప్పటి పరిస్థితుల్లో ఒకరకమైన అస్తవ్యస్తమైన పరిస్థితులను సృష్టిస్తున్నాయి. అవి ఎలా అంటే ఏ వస్తువులైనా, స్వతంత్ర ఉత్పత్తిదారుల చేతిలో చిన్నస్థాయిలో ఉన్నన్నాళ్లు, ఆ ఉత్పత్తులు, అవసరానికి తగినట్లే ఉంటాయి. అవసరానికి తగిన ఉత్పత్తి అనే సూత్రం సహజంగానే ఇమిడి ఉంది. అవసరానికి మించిన ఉత్పత్తి ఉండదు. అది ఎలా అంటే, ఒక వ్యక్తికి బట్టలు అవసరం అయ్యాయనుకుందాం. అతను, బట్టలు తీసుకుని వెంటనే కుట్టించుకుంటాడు. కొద్ది రోజులలోనే అవి వాడేసుకుంటాడు. అంటే, ఆ బట్టలు (వస్తువులు) వెంటనే వాడకానికి వచ్చేస్తాయి. వస్తువుల గమ్యమే అది. మనుషుల అవసరానికే వస్తువులు తయారవుతాయి. అవి వెంటనే వాడకానికి వచ్చేయాలి. వాటి ప్రయాణం సుదీర్ఘంగా ఉండకూడదు. అలా అయితే, వస్తువులు నిల్వలు ఉండి పాడయిపోతాయి. వాడుకోవడానికి పనికి రాకుండా పోతాయి. అలా, నిల్వలు ఉన్న వస్తువులు రేట్లు తగ్గించి అమ్మడం మనం నిత్యం చూస్తూనే ఉంటుంటాం. ఇలా, రేట్లు తగ్గించి అమ్మడానికి కారణం, సరుకులు కొన్నాళ్లు నిల్వలు ఉండిపోవడమే. ఏ వస్తువు అయినా అమ్మకానికి ఉంటే, ఆ వస్తువు కొనుగోలుకు ఎదురు చూడడం, అది నిల్వ ఉండడం జరుగుతుంది. వస్తువుల తయారీ స్వతంత్ర ఉత్పత్తి దారుల చేతిలో ఉన్న కాలంలోనూ,పెటీ బూర్జువాల కాలంలోనూ ఉత్పత్తికీ, వాడకానికీ మధ్య వైరుధ్యం పెద్దగా ఉండదు. అయితే, యంత్రాల ప్రవేశం శ్రమ విభజనలో కొన్ని మార్పులు తీసుకొస్తుంది. ఆ మార్పులు శ్రామికుల మధ్య కొత్త వైరుధ్యాలను సృష్టిస్తాయి.

యంత్రాలు ఒకేసారి హటాత్తుగా తయారు కావు. చేతి పనిముట్లే అనేక దశలుగా ప్రయాణించి, యంత్రాలుగా, భారీ యంత్రాలుగా, రూపాంతరం చెందుతాయి. అదంతా ఒక క్రమం. వృత్తులు కూడా అంతే. అవికూడా అనేక దశల గుండా ప్రయాణించి ఒక ఉన్నత దశకు చేరుకుంటాయి. రెడీమేడ్ వస్తువుల వలన, అవసరాన్ని బట్టే ఉత్పత్తి అనే సూత్రం దెబ్బ తింటుంది. వీళ్లకు దేశంలో ఇంత జనాభా ఉన్నారు, వీళ్లకు ఇన్ని బట్టలైతే సరిపోతాయి అనే ప్లాన్ ఏమి ఉండదు. ప్రతి కంపెనీ తమతమ లాభాపేక్ష కోసం మితిమీరిన సరుకులు ఉత్పత్తి చేస్తుంది. గుట్టలు గుట్టలుగా సరుకులు గొడౌన్లలో నిల్వలు ఉండి పోతుంటాయి. ఎవరి లాభం వాళ్లది. ఎవరి మార్కెట్ వెతుకులాట వాళ్లది.

ఎంగెల్స్ రచించిన 'ఇంగ్లండ్‌లో కార్మికవర్గ స్థితిగతులు' అనే పుస్తకంలో ఇలా అన్నారు. 'కొత్త మిల్లులను నిర్మిస్తారు. ఈ అనుకూల సమయంలో అత్యధిక లాభం పొందేలా అన్ని సాధనాలనూ వినియోగిస్తారు. సార్వత్రికమైన ఒక పద్ధతంటూ లేని, లాభాల కోసం జరిగే పరుగు పందెంలోకి, వ్యాపార జూదరులు చురుగ్గా దూకి, అసలే గందరగోళంగా ఉన్న పరిస్థితిని మరింత అస్తవ్యస్తం, వేగవంతం చేస్తారు. అడ్డూ అదుపూలేని గాఢావేశంతో, ధరలనూ, ఉత్పత్తినీ ఉన్మాద స్థాయికి తీసుకుపోతారు. ఇది ఒక ఉన్నత పోరాటం. ఇది అత్యంత

అనుభవశాలురను, ఉదాసీనులను కూడా లాగివేస్తుంది. మానవాళి కంతటికీ కొత్తగా సమకూర్చాలన్నట్లు, చంద్రునిపై 200 కోట్ల వాడకందారులను కొత్తగా కనుగొన్నట్లు వస్తువులను వదుకుతారు, నేస్తారు, సుత్తితో సాగకొడతారు. ఆగమేఘాల మీద ఉత్పత్తుల రాశుల్ని తయారు చేయిస్తారు.' (పేజీ.67) ఉన్నదేమిటి, ఉత్పత్తిలో ప్లానింగ్ లేకపోవడమే. అలాంటి, ప్లానింగ్ ఏమీ లేకపోవడం వలన మార్కెట్లో ఒకానొక దశలో అమ్మకాలు పూర్తిగా ఆగిపోతాయి. ఆగిపోయిన, సరుకుల అమ్మకాలు మార్కెట్లో ఒకరకమైన సంక్షోభం సృష్టిస్తాయనే సత్యాన్ని చరిత్ర చెపుతూనే ఉంది. రెడీమేడ్ వస్త్రాలకి ముడిసరుకు బట్ట. మరి బట్టకి ముడిసరుకు పత్తి. మరి అక్కడ మాత్రం ఈ సమస్య రాదా? వస్తుంది. ఎక్కడైనా ఈ సమస్య వస్తుంది. అమ్మకాలు ఉన్న, ఏ వస్తువుకైనా ఈ సమస్య వస్తుంది. అయితే, ఏదో ఒక పాయింట్ దగ్గర ఆగి విషయాన్ని చర్చించాలి గాబట్టి, ఇక్కడ ఆగాం.

మరొక విషయం, వస్తూత్పత్తిలో, వస్తువులు ఎక్కడ అయితే అవసరమో అక్కడే ఉత్పత్తి కావాలి. యంత్రాల మీద తయారయ్యే వస్తువులలో పారిశ్రామిక కేంద్రీకరణ ఉంటుంది. దానివలన ఒకచోట తయారయ్యే వస్తువు, ఇంకో దగ్గర ఎక్కడో వాడకంలోనికి వస్తుంది. అలాంటి, కేంద్రీకరణ వలన కొన్నిచోట్ల కార్మికులకు చేయడానికి పనులు లేకపోవడం. కొన్ని చోట్ల, చేయలేనంత పని భారం. పనులు వెతుక్కొని, పల్లెల నుండి పట్టణాలకు కార్మికులు వలసలు పోవడం జరుగుతోంది. ఈ వలసలు పోవడం అనేది ఈనాటికే ప్రారంభమై పోయింది.

ఈ వలసల వలన, పట్టణాల్లో జనాభా విపరీతంగా పెరిగి పోతుంది. జనాభా ఒకేచోట కేంద్రీకృతమైతే అన్నీ సమస్యలే. నీటి సమస్య, విద్యుత్ సమస్య, వాతావరణ కాలుష్య సమస్య, ఇళ్ల సమస్య (అపార్ట్‌మెంట్ల సంస్కృతి ఆ విధంగా పుట్టినదే), ట్రాఫిక్ సమస్య. ఇలా అన్నిరకాల సమస్యలు ఉత్పన్నం అవుతాయి. పట్టణ సంస్కృతి ఎంత భయంకరమైనదో ఈ కింది కొన్ని కొటేషన్స్ చూడండి. 'ఈ ఐరిష్ వాళ్లు నాలుగు పెన్నీలతో, ఆవిరి ఓడ మీద వలస వచ్చేస్తారు. వీళ్లు తరచూ పశువుల్లా డెక్ మీద కిక్కిరిసి వస్తారు. ప్రతిచోటా ప్రవేశిస్తారు. అత్యంత దారుణమైన ఇండ్లు అయినా వీరికి మంచివే! ఒక్క దారమైనా బట్ట పీలికలను పట్టి ఉంచినంత కాలం వారు బట్టల గురించి పట్టించుకోరు. బూట్లు వారికి తెలియవు. వారి ఆహారం బంగాళా దుంపలే'! (72)

'ఈ దౌర్భాగ్యునికి ఒక్క ఆనందం అయినా ఉండాలి కాబట్టి, సమాజం అతన్ని మిగతా అన్నింటి నుంచి దూరం చేసింది కాబట్టి, అతను తాగుడుకి అలవాటు పడతాడు. ఐరిష్ వాడి జీవితాన్ని, ఏ మాత్రమైనా జీవించతగినదిగా చేసేది తాగుడు ఒక్కటే! తాగుడు ప్రలోభం, తాగుడు కోరికా చాలా బలమైనవి. వాటినతను అదుపు చేయలేడు. తాగుబోతుగా మారడం అతనికి అవసరమయ్యే స్థితిలో అతన్ని ఉంచిన సమాజం, అతని పాపానికతన్ని వదిలేసిన సమాజం, అతన్ని అనాగరికునిగా వదిలేసిన సమాజం, అతన్ని ఎలా నిందించ గలదు?' (73) '1835లో ఇక్కడ నూలు వడికే వారు 800 మంది ఉండగా, 1843లో వారి సంఖ్య 140 మాత్రమే! ఇదేవిధమైన మార్పులు కార్డింగ్ చట్రాలలో కూడా వచ్చి, సగం మందికి పని లేకుండా పోయింది. ఒక ఫ్యాక్టరీలో మెరుగుపరచిన చట్రాలను ఏర్పాటు చేసి ఉన్న ఎనిమిది మందిలో నలుగురిని పనిలో నుండి తీసేశారు. అంతేగాక, పనిలో ఉన్న నలుగురి వేతనాల్ని యజమాని 8 నుండి 7 షిల్లింగులకు తగ్గించాడు.' (97)

'పురోగమిస్తున్న యంత్రంతో పోటీ పడవలసి వచ్చిన కార్మికుల పరిస్థితి అతి దారుణమైనది. వారు చేతి పనితో ఉత్పత్తి చేసిన వస్తువులకు, యంత్రం ద్వారా తయారైన అదే రకం వస్తువుల ధరలే వర్తిస్తాయి. యంత్రంతో పోటీపడే వానికి చాలాతక్కువ వేతనాలు లభిస్తాయి.' (100)

ఇలాంటివి ఈ పుస్తకంలో వందల సంఖ్యలో ఉన్నాయి. ఆసక్తి ఉన్న వాళ్లు ఎంగెల్స్ పుస్తకం చదవండి. పై కొటేషన్ ద్వారా ఏం తెలుస్తుంది. చేతి పనితో చేసిన వస్తువులకూ, యంత్రంతో చేసిన వస్తువులకూ ఒకే ధర వస్తుంది. ఎందుకు అలా వస్తుంది అంటే, ప్రతీ వస్తువుకీ ఒక ధర ఉంటుంది. ఆ ధర ఆ వస్తువు తయారీకి పట్టే శ్రమ కాలాన్ని బట్టి ఉంటుంది. యంత్రాలతో తయారయ్యే ఏ వస్తువులైనా సగటున శ్రమ కాలం తగ్గి, వస్తువు ధర తగ్గాలి. అదే చేతి వృత్తి ద్వారా అయితే శ్రమకాలం ఎక్కువ అయి ధర ఎక్కువ కావాలి. అందుకే, యంత్రంతో మనిషి పోటీ పడలేడు. యంత్రం ద్వారా తయారైన వస్తువు ఇచ్చిన ధరకి, స్వతంత్ర ఉత్పత్తి దారుడు గానీ, పెటీ బూర్జువా గానీ, తన వస్తువు ఇవ్వలేడు.

దానితో క్రమంగా స్వతంత్ర ఉత్పత్తిదారులూ, పెటీ బూర్జువాలూ తగ్గిపోయి, కొన్నాళ్లకు కనుమరుగై పోతారు. చెప్పుల తయారీలో స్వతంత్ర ఉత్పత్తిదారులు ఈనాడు ఎక్కడా కనిపించకపోవడానికి కారణం ఇదే. టైలర్ల పరిస్థితి కూడా ఇంతే. భవిష్యత్తులో టైలర్లు కనిపించరు.

అంతేకాకుండా, పెట్టుబడిదారీ సమాజంలో సాంస్కృతిక దిగజారుడు తనం ఉంటుంది. విద్య, వైద్యం ఇలా అన్ని రంగాల్లో కాలుష్యం ప్రవేశిస్తుంది. స్పేస్ మేనేజ్‌మెంట్ కోర్సులూ (తక్కువ స్థలాన్ని ఎక్కువగా ఉపయోగించుకోవడం), ఫేషన్ టెక్నాలజీ కోర్సులూ, ఇంటీరియర్ డెకరేషన్ కోర్సులూ, ఆఖరికి పూజారుల నియామకాలకి కూడా యూనివర్సిటీల్లో కొత్తకొత్త కోర్సులు ప్రవేశపెడుతున్నారు. వైద్యంలో కూడా కాస్మోటిక్ సర్జరీ, సరోగేట్ మదర్స్ (అద్దె తల్లులు) లాంటివి. ఇలాంటివన్నీ, పెట్టుబడిదారీ సమాజం సృష్టించిన కృత్రిమ అవసరాలు.

యంత్రాలను వ్యతిరేకించడం ఈ వ్యాసం ఉద్దేశం ఎంతమాత్రం కాదు. అలాగని స్వతంత్ర ఉత్పత్తినీ,పెటీ బూర్జువాలనూ సమర్థించడం అంతకన్నా కాదు. వాటిని సమర్థించడం అంటే, సాంకేతిక అభివృద్ధిని వదిలేసి తిరోగమించడమే. రెండిటికి తేడాలు చూసి, వాటిల్లోని మంచి చెడ్డలు గ్రహించడమే.

మార్కెట్ విషయం అలా ఉంచి, శ్రామికుడి పనితనం (వర్క్ మెన్ షిప్) గురించి ఆలోచిస్తే, శ్రామికులు రెడీమేడ్ కంపెనీల్లో పని చేయడం వలన తీవ్రంగా నష్టపోతారు.

అది ఎలా అంటే, కంపెనీల్లో ఎల్లప్పుడు (సంవత్సరాల పాటు) ఒకే రకమైన పని చేయాలి. అలా చేయడం వలన, అతడు ఆ పని తప్ప వేరొక పని చేయలేడు. షర్టులు తయారు చేసే కంపెనీల్లో పని చేసేవాళ్లకి కేవలం షర్టు మాత్రమే వస్తే కొంతైనా ఫరవాలేదు. అలా కూడా కాదు. షర్టులో ఒక ముక్క మాత్రమే. అంటే, కాలరు తయారు చేసేవారు ఎప్పుడూ కాలరే. చేతులు తయారు చేసేవాళ్లు ఎప్పుడూ చేతులే. ఒక పెద్ద హాలులో అంచెలు అంచెలుగా తయారవు తుంటాయి. ఎక్కువ సంఖ్యలోని కార్మికులు ఒకేచోట సమిష్టిగా పని చేస్తుంటారు. ఇందులో ఒకరు నెమ్మదిగా, ఒకరు వేగంగా పని చేయడం కుదరదు. అందరూ వేగంగా పని చేయాల్సిందే. యంత్రాల కదలికలకు అనుగుణంగా కార్మికుల శారీరక కదలికలు ఉండాలి. కార్మికుల రక్తమాంసాలు పీల్చి, యజమాని దగ్గర విశ్వాసంగా పని చేసే కుక్కలాంటిదట యంత్రం. ఈ రకమైన శ్రమ విభజన, కార్మికుడిని పూర్తిగా ఆలోచనా రహితుడిని చేస్తుంది. జీవితం యాంత్రికమై, మెదడు మొద్దుబారి పోతుంది. జీవిత పర్యంతం, ఆ ముక్కకే పరిమితమై పోయి, ఆ ముక్కలోనే పరిభ్రమిస్తాడు. ఆ కంపెనీలో పనిపోతే, వేరొక కంపెనీలో పని చేయాలి. అంతే తప్ప, తను స్వతంత్రంగా బతకలేడు. ఈ సందర్భంలో మార్క్స్ మాటలు ఇలా ఉన్నాయి.

'జీవితాంతమూ ఒకే రకమైన, స్వల్పమైన పనిని తిరిగి, తిరిగి చేయడం ద్వారా వికలాంగుడై (క్రిపుల్డ్) కేవలం మనిషిలోని ముక్కగా

మాత్రమే కుంచించుకుపోయిన నేటి డిటేల్డ్ కార్మికుడ్ని..' (మార్క్స్ కాపిటల్ పరిచయం రంగనాయకమ్మ పేజీ 432) ఈ రకంగా సాగి పోతున్నాయి మార్క్స్ మాటలు. నిరంతరం ఒకే రకమైన పని చేయడం వలన కార్మికులు ఎలా నష్టపోతారో ఈ మాటల ద్వారా తెలుసుకోవచ్చు.

ఈ రకమైన శ్రమ విభజన వలన పెట్టుబడిదారుడికి ఏ విధమైన లాభం అంటే, కార్మికులు అందరూ ఒకే వేగంతో పని చేయాలి. దానివలన ఉత్పత్తి పెరుగుతుంది. కొత్త యంత్రాల రాక వలన ఎలాగూ ఉత్పత్తి పెరుగుతుంది. అంతేకాకుండా అమ్మకాలు కూడా కొంతవరకు పెరుగుతాయి. అది ఎలా అంటే, గతంలో ఏ టైలర్‌కి అయినా బట్టలు అవసరం పడితే తన బట్టలు తనే కుట్టుకునేవాడు.(ఇప్పుడు కూడా). కానీ, ఈ కొత్త రకమైన శ్రమ విభజన వలన తన బట్టలు తను కుట్టుకోలేదు. ఎందుకంటే, తనకి వచ్చింది తనవృత్తిలో ఒక భాగం మాత్రమే. తన వృత్తే, తనకి పరాయిది అయిపోయి, అద్దాల బీరువాల్లో తనని వెక్కిరిస్తుంది. మనదేశంలో ఒక కోటి మంది టైలర్లు ఉన్నారని ఊహిస్తే, ఈ కోటి మంది తమ వృత్తినే తాము బయట కొనుక్కోవాలి. అలాంటి దిక్కుమాలిన పరిస్థితులు, భవిష్యత్‌లో రాబోతున్నాయి.

పెట్టుబడిదారులు ఎప్పుడూ సరుకుని ఎలా అమ్మాలనే చూస్తారు. ఈ కోటి మంది టైలర్లూ తమ బట్టలు బయట కొనుక్కుంటే అమ్మకాలు పెరుగుతాయి. సరుకుల అమ్మకాల కోసం ఇలాంటి ఎత్తుగడలు అనేకం చేస్తారు. అనేకమైన ఆఫర్లూ, డిస్కౌంట్లు, ఎక్కువ లైటింగ్స్ తో పెద్దపెద్ద మాల్స్ చాలా ఆకర్షణీయంగా, చాలా అందంగా సరుకుని అమ్మకానికి పెడతారు.

ఇంతవరకూ, యంత్రాల రాక వలన జరుగుతున్న నష్టాలు చూశాం. ఇప్పుడు ప్రయోజనాలు చూసి, రెండు అంశాలలోని, మంచిని తీసుకొని, చెడుని తిరస్కరించవచ్చు.

యంత్రాలు అనేవి మొదట చేతి పనిముట్లే. చేతి పనిముట్లే శ్రామికుడి చేతిలో అనేక ఆలోచనలతో, అనేక అనుభవాలతో యంత్రాలుగా, భారీ యంత్రాలుగా రూపాంతరం చెందాయి. భారీ యంత్రాలు కనిపెట్టిన వ్యక్తులు తమ తోటి కార్మికులకు మహోపకారమే చేశారు. కానీ, ఈనాటి సమాజ పరిస్థితుల్లో, అది మహాశాపంగా పరిణమించింది.

యంత్రాలు కనిపెట్టింది మేధావి వర్గమే. అయితే, మేధావి వర్గం కూడా కార్మికులే. కార్మికుల నిత్య జీవిత అనుభవాల్లో నుండే కొత్త ఆలోచనలు పుట్టుకొస్తాయి. అవే కొత్త యంత్రాల ఆవిష్కరణకు దారి చూపిస్తాయి.

చేతి పనిముట్లకీ, భారీయంత్రాలకీ ఉత్పత్తిలో చాలా తేడా ఉంటుంది. కళ్లముందు కనపడుతున్న, ఆ ఉత్పత్తిని చూసి, కార్మికుడు అమిత ఆశ్చర్యం పొందుతాడు. తను చూసింది, నిజమా కాదా అనే భ్రమకి లోనవుతాడు. ఈ తేడాని చూడండి. ఇప్పుడు ఒక పెద్ద వయసు మనిషి, ఒక పిల్లవాని సాయంతో, యంత్రాలపై పనిచేసి, గతంలో 200 మంది పనివాళ్లు దిమ్మలతో ముద్రించినంతగా ముద్రించ గలుగుతున్నాడు. ఒకే ఒక్క యంత్రం, నిమిషానికి 28 గజాల బట్టపై ముద్రిస్తోంది! దీనివల్ల, కాలికో అద్దకం పనివారి పరిస్థితి చాలా హీనమైపోయింది.

ఒక వంద మంది చేయాల్సిన పని, కొత్తయంత్రం సహాయంతో పదిమందితో మాత్రమే చేయగలిగేలా కొత్త యంత్రం రూపొందితే ఏమి జరగాలి? వంద మందికీ శ్రమ కాలం తగ్గాలి. కానీ, ఈ పెట్టుబడిదారీ ప్రపంచంలో అలా జరగదు. పది మందికి మాత్రమే పని ఉండి, మిగతా తొంభై మందికి పనులు పోతాయి. పెట్టుబడి దారులకు కావలసింది లాభం మాత్రమే. నూతన యంత్రాల ఆవిష్కరణ లాభాల కోసం జరుగుతుంది. ఇక్కడ తొంభై మందికి పని పోవడం పెట్టుబడిదారుడికి అక్కరలేదు. వాళ్ల ఇబ్బందులతో, వాళ్ల బాధలతో వాడికి పని లేదు. ఇక్కడ వ్యతిరేకించాల్సింది యంత్రాలని కాదు. యంత్రాలు ఎవరి అధీనంలో ఉన్నాయో వాళ్లని. అంటే, పెట్టుబడిదారుల్ని. కానీ, కార్మికులు అలా అనుకోరు. యంత్రాల రాక వలననే తమ పనులు పోయాయని, యంత్రాలపై కోపం పెంచు కుంటారు. అలా కోపంతో యంత్రాలని ధ్వంసం చేసే సంఘటనలు కూడా చరిత్రలో జరిగాయి.

'దారుణమైన ఆ పరిస్థితులకు వ్యతిరేకంగా జరిగిన తొలి కార్మిక ప్రదర్శనలు, నిస్పృహ, కోపాల కారణంగా అప్రయత్నంగా రేగిన ప్రజ్వలనలు. యంత్రాలే తమ కష్టాలకు కారణ భూతమైనవని అమాయకంగా నమ్మినట్లు, వాటిని ధ్వంసం చేశారు. 1811-12 సంవత్సరాలలో వాళ్ల ఉద్యమం గణనీయంగా పెరిగింది. నిరాశ నిస్పృహలకు గురైన ఆ బడుగుజీవులను బలపరుస్తూ, ప్రభువుల సభలో ప్రసిద్ధ కవి బైరన్, ఒంటరిగా ఎలుగెత్తి చాటాడు.' (మార్క్స్ పూర్వపు అర్థశాస్త్రం. పేజీ 190)

నిజానికి, యంత్రాలను తయారు చేసింది కూడా కార్మికులే. కార్మికులలోని ఒక సెక్షన్ అంటే, మేధా శ్రామికులే యంత్రాలను తయారు చేస్తారు. ఎంతటి భారీ యంత్రమైన నిర్జీవమైన వస్తువే. ఎంతటి భారీ యంత్రంమైనా, అందులోని ఒక చిన్న నట్టుగానీ, బోల్టుగానీ లేకపోతే ఉలుకూ, పలుకూ లేకుండా ఉండిపోతుంది. మళ్లీ టెక్నీషియన్ (సాంకేతిక కార్మికుడు) వచ్చి చేసిన తరువాతే కదుల్తుంది. ఎంతటి భారీ యంత్రమైనా సజీవమైన మానవ స్పర్శ సోకకపోతే అది నిర్జీవమైన వస్తువే. ఈ చర్యలలో యజమాని పాత్ర ఏమీలేదు. ఉండదు. అతగాడి పని లాభాలను తినడం మాత్రమే.

ఇప్పుడు రెండు పద్ధతులూ చూశాం. రెండింటిలో ఏ పద్ధతి మంచిది అని కాకుండా, రెండిటిలోని మంచి అంశాలను తీసుకొని చెడుని వదిలేయాలి. అలా ఆలోచిస్తే, యంత్రాల వలన అధిక ఉత్పత్తి, శ్రమకాలం తగ్గడం - ఈ రెండూ విస్మరించదగ్గవి కాదు. మొదటి పద్ధతిలో కూడా, అమ్మకాల మధ్య పోటీ ఉంటుంది. అయితే చాలా తక్కువ స్థాయిలో ఉంటుంది. పోటీ అనేది ఎంత తక్కువ స్థాయిలో ఉన్నా వ్యతిరేకించాల్సిందే. అలాగే శ్రమకాలం చాలా ఎక్కువ. రెండవ పద్ధతిలో వాటితో పాటుగా శ్రమ దోపిడి కూడా ఉంటుంది. పై రెండింటిలోనూ, మంచి పద్ధతుల్ని అలాగే ఉంచి, యంత్రాలని కూడా ఉపయోగించుకోవాలి. యంత్రాలను వదిలిపెట్టడం అంటే తిరోగ మించడమే. యంత్రాలని అలాగే ఉపయోగించుకొని, అవి ఎవరి అధీనంలో ఉన్నాయో ఆ యాజమాన్యాన్ని వ్యతిరేకించాలి. అంటే పెట్టుబడిదారుల్ని వ్యతిరేకించాలి. అప్పుడే సమస్యలు పరిష్కారమ వుతాయి. యంత్రాలన్నీ పూర్తిగా కార్మికుల చేతిలోనికి రావాలి. అలా వచ్చిన రోజున, మిగిలిన సమస్యలు సులువుగా పరిష్కారమవుతాయి. అప్పుడు కార్మికులూ, యజమానులూ అనే తేడా ఉండదు. అప్పుడు అందరూ శ్రమ చేస్తారు. శ్రమ విభజనలో ఒక వస్తువు తయారీలో అన్ని విభాగాలూ అందరూ చేస్తారు మేధా, శారీరక శ్రమలతో సహా. దానివలన వారి వారి శ్రమ విలువలు సమానంగా ఉంటాయి. కాబట్టి, వచ్చిన ఫలితం అందరూ సమానంగా అనుభవిస్తారు. శ్రమ దోపిడియే ఉండదు. జనాభా అవసరాల్ని బట్టే ఉత్పత్తి ఉంటుంది. కాబట్టి, వస్తువులు అమ్మకాల కోసం ఎదురు చూడడం, నిల్వలు ఉండిపోవడం జరగదు. పారిశ్రామిక వికేంద్రీకరణ జరుగుతుంది. కాబట్టి, పట్నాలకి, పల్లెలకి మధ్య వైరుధ్యం సమసిపోతుంది. శ్రమదోపిడి ఎప్పుడైతే పోతుందో, దాన్ని అంటిపెట్టుకున్న సమస్యలన్నీ చాలా సులువుగా పరిష్కారమైపోతాయి. అదే కమ్యునిజం.

ఈ వ్యాసం రాసిన నేను పెటీ బూర్జువా దశలో ఉన్నాను. నేను, రోజు పని వాళ్లతో సమానంగా పని చేస్తాను. కొన్ని రోజులలో ఇంకా ఎక్కువ కూడా. అయినప్పటికీ నేను యజమానినే. నేను కూడా శ్రమదోపిడి చేస్తూనే ఉన్నాను. కమ్యునిజమే వచ్చిన రోజున తోటి కార్మికులతో సమాన స్థాయిలో ఉండడానికి నేనే మొదట ఉంటాను. వీ

(రచయిత దర్జీ)

బ్రిక్స్ కూటమి ఏర్పాటు నేపథ్యం - 2

అభివృద్ధి చెందిన దేశాలకు పోటీగా ఏర్పడిన ఆసియా, దక్షిణాఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల కూటమి ఒకతాటిపై నిలబడి తమ దేశ ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచుకోవాలని అంటున్నారు **బి.ఎస్. రాజు**

(గత సంచిక తరువాయి)

ఐరోపా తెల్లజాతి పెట్టుబడి దిగ్గజాల కూటమికి చెందిన ప్రపంచ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) సంస్థలు అమెరికా నాయకత్వంలో ఏర్పడ్డ నాటి నుండి మూడో ప్రపంచ దేశాలన్నిటిపై తమ పెత్తనాన్ని చలాయిస్తూనే వస్తున్నాయి. ఈ మూడో ప్రపంచ దేశాలన్నీ తెల్ల జాతీయుల వలసలుగా దుర్భర బానిసత్వానికి, వనరుల దోపిడీకి లోనై ఆర్థికంగా కుదేలై పోయినవే. వీటిలో చాలా దేశాలు స్వాతంత్ర్య బావుటా ఎగరవేసినా, ఆ స్వాతంత్ర్యం కుహనా స్వాతంత్ర్యం మాత్రమే. ఇవి యూరప్, అమెరికా పెట్టుబడిదారుల కనుసన్నల్లో, వాటి ఆధ్వర్యంలో ఏర్పడ్డ దళారీ, సామ్రాజ్యవాద ఏజెంట్ వ్యవస్థలే కాని ఆర్థిక స్వతంత్రత, స్వావలంబన పునాదిగా ఏర్పడ్డ జాతీయ వ్యవస్థలు కావు.

లెనిన్ నాయకత్వంలో ఏర్పడ్డ సోవియెట్ సోషలిస్ట్ యూనియన్ (రష్యా), మావో నాయకత్వంలో ఏర్పడ్డ జనచైనా ఇటువంటి దుస్థితి నుండి బయటపడి సోషలిస్ట్ పథంలో కొన్ని దశాబ్దాల పాటు కొనసాగి తమ సొంత రాజకీయార్థిక, సామాజిక, సాంస్కృతిక వ్యవస్థలతో మనగలిగాయి.

అక్టోబర్ విప్లవానంతరం కొత్తగా ఏర్పడ్డ బోల్షివిక్ కార్మిక ప్రభుత్వం అప్పుడు ఎదుర్కొంటున్న పెనుసవాళ్లను దృష్టిలో పెట్టుకుని రష్యాలో సుహృద్భావంతో పెట్టుబడులు పెట్టమని, కొత్తగా ఏర్పడ్డ శ్రామిక రాజ్యానికి స్నేహహస్తం అందించమని అమెరికా, ఐరోపా పెట్టుబడిదారులకు లెనిన్ లేఖలు రాసి ఆహ్వానించాడు. నూతన ఆర్థిక విధానాన్ని రూపకల్పన చేసి ఒకింత ఊపిరి పీల్చుకుని, కాలు కూడదీసు కోవాల్సిన సంధి కాలమది. కొత్తగా ఏర్పడ్డ శ్రామికరాజ్యం తనంత తానుగా ఆర్థిక వ్యవస్థను నిర్వహించుకోగలిగే అవగాహన; ఉత్పత్తి, పంపిణీ, నిర్మాణ – నిర్వహణా – నియంత్రణా అనుభవం కూడగట్టు కోవాల్సిన పరిస్థితి. అయినప్పటికీ అప్పటి బోల్షివిక్ శక్తులు, కమ్యూనిస్ట్ పార్టీ సోషలిస్ట్ నిర్మాణ మహోన్నత ఆశయాన్ని విడవకుండా ముందుకు సాగాయి. సామ్రాజ్యవాద పెట్టుబడికి బానిసగా తలొగ్గక ఓ స్వతంత్ర ఆర్థిక ప్రత్యామ్నాయ ప్రజాపంథాను లెనిన్ మరణానంతరం స్టాలిన్ నాయకత్వంలో సోవియెట్ రష్యా అమోఘంగా ఆవిష్కరించింది. ప్రపంచ ప్రజల ముందు ఓ ఆదర్శవంతమైన సోషలిస్ట్ మార్గాన్ని తెరిచింది.

ఇటువంటి మార్గంలో పయనించడం శ్రేష్ఠమని ఆనాడు నమ్మిన దేశాలు చాలానే ఉన్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో ఇండియాతో పాటు అనేక ఆసియా, ఆఫ్రికా దేశాలు మిశ్రమ ఆర్థిక విధానాలను అవలంబించాయి. ప్రభుత్వరంగ ఆర్థిక వ్యవస్థను, ప్రణాళికా రచనలను రష్యా నుండి ఒకింత అరువు తెచ్చుకున్నాయి. అయితే నిజానికి ఈ దేశాలు ఆర్థిక స్వావలంబన అనే పదాన్ని ఆచరణలో కన్నా తమ దేశాల ప్రజలను మభ్యపెట్టడానికి, కొత్త జాతీయ దళారీ ఆర్థిక పెత్తందార్ల ముఠా రూపుదిద్దుకుని ఎదగడానికి వాడుకున్నాయి. ఈ కుహనా ప్రజాస్వామిక మిశ్రమ ఆర్థిక వ్యవస్థలు ఒకటొకటిగా ప్రపంచ బ్యాంక్, ఐ.ఎం.ఎఫ్.ల ముంగిట అప్పుల అభ్యర్థనలతో సాగిలపడడానికి అలవాటు పడిపోయాయి. వాటి నిబంధనలకు లోబడి, వాటి నిర్వహణ గొడుగు కిందకు చేరిపోయాయి.

ఒక అర్ధ శతాబ్ది పాటు రష్యాలోనూ, ఒక పావు శతాబ్ది పాటు చైనాలోనూ కొనసాగిన ఆర్థిక స్వతంత్ర విధానం అక్కడి పాలకుల దారి మళ్లింపు మనస్తత్వంతో, సామ్రాజ్యవాద శక్తుల పొత్తుతో స్వతంత్ర శ్రామిక ఆర్థిక విధానాన్ని పనిగట్టుకుని కూల్చివేశాయి. వీరిని అనుసరించి ఆ బాటలోనే కొంతకాలం పయనించిన మరికొన్ని తూర్పు ఐరోపా దేశాలు, వియత్నాం వగైరా దేశాలు కూడా పెట్టుబడిదారీ వ్యవస్థకై అర్రులుచాచి ప్రపంచ బ్యాంక్ ప్రవచిత ఆర్థిక నమూనా బాట పట్టాయి. ఈ పరిణామ క్రమంలో కొత్త ఆర్థిక ముఠాలు ప్రపంచ ఆర్థిక రంగంపైకి అడుగుపెట్టాయి.

అలా ప్రపంచ ఆర్థిక రంగంపైకి కొత్తగా అడుగు పెట్టిన ముఠాల్లో మొదటిది రష్యా పాలక మాఫియా ముఠా. ఈ మాఫియా ముఠా అక్కడి ప్రభుత్వ రంగ సంస్థలను, అపార ఖనిజ నిక్షేపాలను, ఇంధన, పెట్రోలియం నిలువలను హస్తగతం చేసుకొని, సైనిక ఫాసిస్టు పాలనతో రష్యన్ సమాజాన్ని తన ఉక్కు పాదాలతో అణచివేస్తోంది. ప్రజలకు దుర్భర దారిద్ర్యాన్ని మిగిల్చి పుతిన్ మాఫియా ముఠా తాను బిలియన్ల సంపద పోగేసుకుంది.

రెండవది చైనా కమ్యూనిస్ట్ పార్టీ ముసుగులో కొనసాగుతున్న ప్రజా దోపిడీ ముఠా. ఈ ముఠా అత్యంత అమానుషంగా, పాశవికంగా, ఆ దేశ ప్రజల సమస్త వనరులను, శ్రమను, ఆర్థిక సంపదలను సొంతం చేసుకుని కారు చవకగా అమెరికాకు, ఐరోపా దేశాలకు అమ్ముకుంటూ ప్రపంచపు వస్తు తయారీ అడ్డాగా మారింది. ఈ క్రమంలో అనేక ట్రిలియన్ డాలర్ల సంపదను పోగేసుకుని ఈ కుహనా కమ్యూనిస్టు పెట్టుబడిదారీ టైకూన్ల ముఠా అమెరికాకు బహిరంగ ఆర్థిక సవాలుగా మారింది.

ఇక భారత్, బ్రెజిల్, దక్షిణాఫ్రికా ఇత్యాది దేశాల్లో దళారీ పెట్టుబడి దారీ ముఠాలు కూడా చిన్న ఆర్థిక ఆధిపతులుగా ఎదిగి వచ్చారు. ఈ ముఠాలు పోగేసిన దోపిడి సంపదనంతా వాషింగ్టన్ ఖజానాలో పోయడానికి వెనుకాడడం సహజం. తమకంటూ అపార సంపదలు చేజిక్కాక డాలర్ పెత్తనం కింద, వాషింగ్టన్ మిలిటరీ బెదిరింపులను నిత్యం సహించడం వీరికి ఇబ్బందిగా మారింది. డాలర్ బలహీన పడిపోయిన తరువాత కూడా వాషింగ్టన్, మిలిటరీ మొనగాడుగా కృత్రిమంగా డాలర్‌ను ప్రపంచ కరెన్సీగా చలామణీ చేయడం ఈ ముఠాలకు భరించలేని వ్యవహారంగా మారింది.

బయటకు ఎన్ని అభ్యుదయ ప్రవచనాలు చెప్పినా ఈ ముఠాల

అసలు వ్యవహారమంతా తమ మధ్య ఆర్థిక పెత్తనం ఎలా పంచుకోవాలి? తమ తమ ధన రాశులను ఎలా కాపాడుకోవాలి? వాటిని మరింతగా ఎలా పెంచుకోవాలి? అనేదే వాటి మధ్య అసలు స్పర్ధ. బ్రెట్టన్‌వుడ్స్ కవలలకు నొప్పి తగలకుండా ప్రపంచంలో వెనుక బడ్డ దేశాల ప్రజలను నయా ఉదారవాద అభివృద్ధి పేర ఆయా దేశాలకు అప్పులిచ్చి అక్కడి వాణిజ్యాన్ని, విపణిని పంచుకోవడమే ఈ బ్రిక్స్ స్థాపన ఉద్దేశం.

బ్రిక్స్ కూటమి డాలర్ పెత్తనాన్ని రద్దుచేస్తుందని, మూడవ ప్రపంచ దేశాలు తమ అభివృద్ధి ప్రణాళికలకు చవకగా పెట్టుబడులు సంపాదించవచ్చని, బ్రిక్స్ సొమ్ముతో త్వరితగతిన అవి ఎదగవచ్చని కొంతమంది ఆర్థికవేత్తలు చెపుతున్నారు. ఈ రకమైన అభివృద్ధి ఎటువంటిదో మోడీ జపాన్, చైనాలతో కుదుర్చుకుంటున్న ఒప్పందాల తో తేటతెల్లమవుతోంది. హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్ట్ లుకలుకలు ఈ నమూనాకు ఒక సజీవ నిదర్శనం. వీరంతా బుల్లెట్ రైళ్లు, స్మార్ట్ నగరాలు, మెగా సిటీల గురించి మాట్లాడడమే, వాటిని సాకారం చేయడానికి పరుగులు తీయడమే బ్రిక్స్ ఎందుకు ఏర్పడ్డదో తెలియజేస్తుంది.

50 బిలియన్ డాలర్లతో బ్రిక్స్ కూటమి స్థాపించబోయే నూతన అభివృద్ధి బ్యాంకు (ఎన్‌డిబి), 100 బిలియన్ల డాలర్లతో ఏర్పాటు చేయదలచిన ఆపద్ధర్మ నిలువ నిధి (సిఆర్ఎ) దేశాల పాలసీలను శాసించడానికి కాదని, అవి ప్రాజెక్ట్ నిర్మాణాలను ప్రోత్సహించేందుకు ఏర్పడ్డ వ్యవస్థలని బ్రిక్స్ కూటమి ప్రకటించింది. బ్రిక్స్ సభ్య దేశాలకేగాక అనేక అభివృద్ధి చెందని దేశాలకు ఈ నూతన ఆర్థిక వ్యవస్థలు స్నేహ హస్తాన్ని అందిస్తాయని బ్రిక్స్ చెపుతోంది.

ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకులకు ఎంతో కొంత ప్రత్యామ్నాయంగా బ్రిక్స్ కూటమి ఏర్పడడం, నూతన అభివృద్ధి బ్యాంకు, ఆపద్ధర్మ నిలువ నిధిని స్థాపించే బ్రిక్స్ నిర్ణయాలు డాలర్ పెత్తనాన్ని, అమెరికా దాష్టీకాన్ని, దాని మిలిటరీ పొగరుబోతుతనాన్ని ఎదుర్కొనే దిశలో పని చేస్తే ప్రపంచ ప్రజలకు ఎంతో కొంత మేలు జరుగుతుంది కాబట్టి బ్రిక్స్ కూటమిని, అది ఏర్పాటు చేయబోయే ఆర్థిక వ్యవస్థలను ఆహ్వానించవలసినదే.

(రచయిత సామాజిక కార్యకర్త)

వీ

(...4వ పేజీ తరువాయి)

ధనాన్ని మూట కట్టి నీళ్లలో పారేయడం వృథా అని చెప్తే కూడా దానినీ తప్పేనంటారు ఈ అమాయక ప్రజలు. ఏమి చేద్దాం. ఎవరి అహగాహన వారిది. వారికి అంత వరకే అర్థమైంది. ప్రజల్ని చైతన్యపరచడం ప్రభుత్వాలకు ఎంత ఇష్టం ఉండదో, దోపిడిదారులకూ అంతే.

– హజరత్ అలీ, వేమూరు

వీక్షణం *సెప్టెంబర్ సంచికలో వరవరరావు రాసిన వ్యాసంలో సగం పార్టీ ప్రస్తావనే లేదు. మిగిలిన భాగంలో దాని నిర్దిష్ట ఆచరణ గురించి విశ్లేషణ కూడా లేదు. గొలుసు బలహీనమైన లంకె దగ్గరే తెగుతుంది అని అంగీకరిస్తే, దాదాపు ఐదు దశాబ్దాల మావోయిస్టు పార్టీ (పిడబ్లుజి, ఎంసిసి వంటి రూపాలలో) ఆచరణలో దాని లోపాలు ఎత్తి చూపిన బాలగోపాల్, మనోరంజన్ మొహంతీ, సుమంతా బెనర్జీ, అడపాదడపా పౌరస్పందన వేదిక, మానవ హక్కుల వేదిక, పియుసిఎల్ వంటి వారు లేవనెత్తిన నైతిక, రాజకీయ ప్రశ్నలకు జవాబు లేదు.*

కనీసం మూడు దశాబ్దాలుగా మావోయిస్టు పార్టీ (పిడబ్లుజి) తమతో విభేదించిన వారిపై, ఇతర సంస్థల సభ్యులపై, అమాయకులపై దాడులు, కిడ్నాప్, హత్యలు జరుపుతూనే ఉంది. కొన్ని సందర్భాల్లో మత ఛాందస వాదుల లాగా కాళ్లు, చేతులు, తలలు కూడా నరికింది, చనిపోతుంది ఎవరు అని చూడకుండా కాల్పులు, పేలుళ్లు జరిపింది. (ఉదాహరణకు ఎన్నికల సిబ్బందిని, పోలీసు ఇన్‌ఫార్మర్ అనే ఆరోపణతో గిరిజన యువకులను). అదే సమయంలో అబూజ్‌మాడ్ వంటి దట్టమైన అడవిలో నిర్మించిన సమాంతర ప్రభుత్వం, పక్కనే ఉన్న ఒడిశా, జార్ఖండ్, ఆంధ్రప్రదేశ్‌కు విస్తరించిన ఆధారాలు లేవు. మరి ఈ గెరిల్లా ఉద్యమం వర్గ సంబంధాలు బలంగా ఉన్న గ్రామీణ ప్రాంతాలకు ఎలా విస్తరించగలదు? పట్టణాలలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, యంత్ర పరికరాలతో పని చేసే కార్మికులకు, గెరిల్లా పోరాటం ఎలా సరిపడుతుంది? సైనిక, రవాణా, ఆహార, రాజకీయ, ఆర్థిక, భావజాల వనరులు కేంద్రీకరించబడి గ్రామీణ ప్రాంతాల మీదా ఆధిపత్యం వహించే పట్టణ ప్రాంతాలలోని రాజ్యాధికారం కేవలం బయట నుండి వచ్చే గెరిల్లా ఉద్యమం ఎలా కూల్చగలదు?

ఇప్పటి వరకు, భారతదేశంలో ఏ ఎంఎల్ పార్టీ కూడా ఒక తాలుకా కేంద్రాన్ని చుట్టుముట్టి తమ అధీనంలోకి తెచ్చిన సాక్ష్యాలు లేవు? మరి పట్టణాలలో రాజకీయ పునాది లేకుండా వాటి లొంగుబాటు ఎలా సాధ్యం? ఇప్పటి వరకు జరిగిన ఆచరణతో మావోయిస్టు పార్టీ, పట్టణాలలో కేంద్రీకరించబడ్డ రాజ్య, ఆర్థిక అధికారాన్ని ఎలా అధిగమించగలదు?

– నరేంద్రమోహన్, వీక్షణం బ్లాగ్‌పై

సెప్టెంబర్ 2014, వీక్షణంలో వచ్చిన 'బంగారు తెలంగాణా అనే ఫాంటసీ' వ్యాసం నేడు అందరూ తెలుసుకో దగినదిగా భావిస్తున్నాను. ప్రత్యేక తెలంగాణ రాకముందు రాజకీయ నాయకులు చెప్పిన మాటలకు ఆ తర్వాత వారి చేతలకు ఉన్న తేడాను బాగా వివరించారు. దోపిడి వర్గ రాజకీయ పార్టీల నాయకుల్ని నమ్మడం అవివేకం కాదా! వారు ప్రాతినిధ్యం వహించేది దోపిడి వర్గాలకూ అయినప్పుడు వారికే సేవ చేస్తారు తప్ప తద్విరుద్ధంగా ఎలా చేస్తారు? ఎన్నికలకు ముందు కెసిఆర్ మీద కొందరికి నమ్మకం ఉందనడం నిజం. ప్రజల్ని మోసం చేయకుండా, భ్రమల్లో ఉంచకుండా దోపిడి వర్గ ప్రభుత్వాలు మనుగడ సాగించలేవు కదా! ఇది చారిత్రక సత్యం. 'మావోయిస్టు పార్టీ పదేళ్ల పురోగమనం' అనే వ్యాసంలోని విషయాలు చాలా ముఖ్యమైనవని భావిస్తూ రాజకీయ తరగతులకు సిలబస్‌గా ఉపయోగపడుతుంది. గతంలో రష్యాలో మెన్షివిక్కులతో జరిపిన పోరాటంలో నుండి బోల్షివిక్ పార్టీ ఆవిర్భావం ఆనాటి నుండి ఈనాటి వరకు జరిపిన పోరాటాల ఫలితంగా మా.లే పార్టీ ఆవిర్భావం చివరగా విప్లవ పార్టీల ఐక్యత ఫలితంగా మావోయిస్టు పార్టీగా మన ముందున్న భారత విప్లవోద్యమం నుండి జనతన సర్కార్ రూపంలో తలెత్తిన భవిష్యత్ రూపు రేఖలు ఇవన్నీ పూసగుచ్చినట్లు ఒక వరుస క్రమంగా వరవరరావు అందించారు. ఇటువంటి సిద్ధాంతపరమైన వ్యాసాల్ని, భారత విప్లవోద్యమ అనుభవ పాఠాల్ని శ్రద్ధపెట్టి అందివ్వగలరని రచయితను ఆశిస్తున్నాను.

'ప్రజా ఉద్యమ కొత్త కెరటానికి పదేళ్లు' అనే వ్యాసం కూడా విప్లవోద్యమం గురించి బాగా వివరంగా రాశారు. పాఠకుల్ని ఆసక్తితో శ్రద్ధపెట్టి ఒకటికి రెండుసార్లు చదవమని, ఇతరుల్ని కూడా చదివించమని కోరుతున్నాను. కులం, మతం, అసమానతలు, భాషా భేదాలు, జాతుల సమస్య వంటివి భారతదేశంలో ఉన్న విధంగా ఇంక ఏ దేశంలోను లేవని చెప్పవచ్చు. వీటిని దోపిడీ పాలకులు బాగా ఉపయోగించుకుని ప్రజల కళ్లలో దుమ్ముకొట్టి విప్లవోద్యమాన్ని అణచడంలో, విప్లవానికి ప్రజల్ని దూరం చేయడంలో పాలకులు సఫలీకృతులు అవుతున్నారనేది నిర్వివాదం. ఈ సమస్యనే బాగా ఆలోచింప చేస్తున్నాయి. ఈ వ్యాసాలు ఆదివాసుల్ని చిన్న చూపు చూసిన పరిస్థితి ఆనాటి భారత కమ్యూనిస్టు ఉద్యమంలో పొడ చూపింది. అమాయకులైన ఆదివాసుల్ని విప్లవం పేరుతో బలిచేస్తున్నారని నక్సలైట్ల మీద ఆరోపణలు చేసిన సందర్భాలు ఉన్నాయి. కాని ఈనాడు మావోయిస్టు ఉద్యమంలో వీరే ప్రధాన పాత్ర వహిస్తున్నారు. నాయకత్వంలో స్థానం దక్కించుకుంటున్నారు. మావోయిస్టు ఉద్యమంలో వచ్చిన ఈ మార్పును గుర్తించాల్సిన అవసరం నేడు ఉన్నది. ఎవరైతే పునాది వర్గంలో ఉండాలో వారిని విస్మరించిన ఫలితమే సిపిఐ, సిపిఎం కమ్యూనిస్టు పార్టీలలో ఆనాటి నుంచి ఈనాటి వరకు అగ్ర వర్ణాలదే పై చేయి అయినది అనేది కూడా నిజం. కనుకనే రివిజనిస్టు ఊబిలో కూరుకొని పోవడం వలన వారికి రూపనామ క్రియలు లేకుండా పోవడం జరిగింది. ఈ వ్యాసంలోని విషయాల్ని బాగా లోతుగా తీసుకొని ఆలోచించగలరని భావిస్తూ ఎంతో అమూల్యమైన వ్యాసాల్ని అందించినందుకు ఈ రచయితల్ని అభినందిస్తున్నాను.

'విద్య కాషాయీకరణ, హిందూత్వ ఎజెండా' అనే వ్యాసం కూడా బాగుంది. విద్యార్థులకు, యువజనులకు శాస్త్రీయ జ్ఞానం అలవడకుండా వారి మైండ్‌ను హిందూ ఎజెండాకు అనుకూలంగా మార్చాలనుకున్న వారు చేసేది ఏమిటి? పిల్లలకు అందించే విద్యను కాషాయీకరించడమే కదా! పిల్లల మైండ్‌ను మార్చి విప్లవానికి దూరం చేయాలంటే విద్యా విధానాన్ని మార్చాలి కదా! అందుకే వేద మంత్రాలుండే విద్యనే అందించడానికి నడుం బిగించారు నేటి పాలకులు. రచయితకు నా అభినందనలు.

– సుబ్బనాచారి, నెల్లూరు

వీ

డాక్టర్ సత్యపాల్ తులి

జాతీయోద్యమంలో, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొని చివరిదాకా ఆదర్శవంతమైన జీవితం గడిపిన ఒక ప్రజా వైద్యుడిని సంస్మరించుకుంటున్నారు **వి. హనుమంతరావు**

డాక్టరనే వాడికి మనుసు ఉండకూడదంటూ వైద్యశాస్త్రంలో ఒక ప్రాథమిక సూత్రముంది. తన దగ్గరికొచ్చే రోగుల పట్ల మనవాడు తనవాడన్న తారతమ్యం కనిపించనివ్వకూడదన్నదే దాని పరమార్థం కావచ్చు. ఐతే అందరినీ తన వాళ్లుగా భావిస్తూ మనసు పెట్టి వైద్యం చేసే ఒక మహోన్నతమైన వైద్య ప్రముఖుడి గురించి చెప్పుకుంటే... అక్కడ గుర్తుకొచ్చే పేరు డాక్టర్ సత్యపాల్ తులి. వైద్యాన్ని వృత్తిగా కాకుండా ఒక ఉద్యమంగా చేపట్టిన మహా మనిషి. ఈ తరం వాళ్లకు పెద్దగా పరిచయం లేకపోయినా, ముప్పై సంవత్సరాలకు ముందు డాక్టర్ తులి చేతి చలవను చవి చూసిన అదృష్టవంతులు మన తెలుగు నేల మీద అనేకమంది.

మనవాడు కాకపోయినా... మనతోనే మెలిగిన సత్యపాల్ తులి పుట్టింది పంజాబ్ రాష్ట్రంలోని సియోల్ కోటలో (ఇప్పుడు పాకిస్థాన్‌లో ఉంది.) జీవన గమనంలోని అనేకానేక మలుపుల కారణంగా ఆయన మలి ప్రస్థానం ఆసాంతంగా మన హైదరాబాద్ రాష్ట్రంలోనే సాగింది. అమృత్‌సర్ వైద్య కళాశాలలో మెడిసిన్ కోర్సు పూర్తి చేసిన డాక్టర్ తులి, ఛాతి సంబంధిత వ్యాధి నివారణలో అత్యంత విశిష్టులు. విద్యార్థి దశలోనే తనకెదురు తిరిగిన పరిస్థితులు.. తనలో పోరాట తత్వం నాటుకు పోయ్యేలా వేశాయి. కలకత్తా టిబి శానిటోరియంలో ఉండగా తను రాసిన వ్యాసంపై బ్రిటిష్ పాలకులు కేసు పెట్టారు. ఆ వ్యాసంలో అభిప్రాయాలు, అంచనాలు తాను కల్పించినవి కావనీ, బ్రిటిష్ పాలకుల సొంత దేశమైన ఇంగ్లండ్‌లోని ఒక వైద్య పత్రిక ప్రకటించిన వివరాలు, గణాంకాల ఆధారంగానే తానీ వ్యాసాన్ని రాసినట్లు.. సాక్ష్యాధారాలతో రుజువు పర్చడంతో కేసు కొట్టి వేయక తప్పలేదు. ప్రాసిక్యూషన్ వారినే తెల్లమొహం వేయించిన ఇటువంటి అనాకానేక ఘటనలు సత్యపాల్‌కు కొత్త సత్తువనిచ్చేవి.

విదేశీ సామ్రాజ్యవాదుల దుష్టపాలనలో సాటి ప్రజలు పడుతున్న బాధల్ని చూసి ఆయన హృదయం తల్లడిల్లేది. నరనరాల్లో నెత్తురు ఉడుకెక్కేది. బ్రిటిష్ ప్రభుత్వ ఆంక్షలను ఎదిరించి తన సహచరుల సాయంతో సియోల్ కోటలో జాతీయ జెండాను ఎగిరేశారు. అదెలా జరిగిందంటే, తులి విద్యార్థి దశలోనే సియోల్ కోటలో ఒక చోట జాతీయ జెండా ఎగురవేయడానికి నాయకులు నిర్ణయించారు. జెండా ఎగుర వేయనివ్వకుండా బ్రిటిష్ ప్రభుత్వం పోలీసు పహార పెట్టింది. ఏమి జరుగుతుందోనని ప్రజలు పోగయ్యారు. ఈ దశలో తులి డజను మంది తోటి విద్యార్థులతో కలిసి ఒక పథకం తయారు చేశారు. ఆ స్థలాన్ని చుట్టుముట్టి ఉన్న పోలీసుల దృష్టిని మళ్లించడానికి నిర్దేశించిన స్థలానికి దగ్గరలోనే మరికొంత మంది విద్యార్థులు అల్లరి సృష్టించారు. ఇది గమనించిన పోలీసులు అటు పరుగెత్తారు. రెప్పపాటు అవకాశం చిక్కడం తోనే అనుకొన్న స్థలంలో జాతీయ జెండాను ఎగురవేసి జాతీయోద్యమ ప్రతిష్ఠను నిల్పారు. ఆ తర్వాత అరెస్టు జైలు షరామామూలే. నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజా పోరాటం జరుగుతున్న సంచలనాత్మక సమయంలో పుట్టినందునే తానొక మార్క్సిస్ట్‌గా మారానని తులి చెప్పుకుంటారు. పీడిత జనం తరఫున నిలబడి శాస్త్రీయ సామ్యవాదం కోసమే బతుకుతానంటూ ఆయన సగర్వంగా ప్రకటించుకునేవారు. వైద్య వృత్తికే పరిమితం కాకుండా ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ అభ్యుదయ ఉద్యమాల నిర్మాణంలో పాల్గొనే వారు. హైదరాబాద్ రాష్ట్రానికి వెళ్లి నిజాంకు వ్యతిరేకంగా పోరాడుతున్న రైతులకు, కూలీలకు వైద్య సహాయం అందించాల్సిందిగా 1948 ముగింపులో కమ్యూనిస్టుపార్టీ కేంద్ర నాయకత్వం కోరింది. ఇలా డా. తులి జీవితం మన తెలుగునేలతో శాశ్వతంగా ముడిపడింది. తరుచూ జరిగే హిందూ, ముస్లిం, తగాదాల్ని కళ్లారా చూసిన తులి మనసు నిలువెల్లా చలించేది. మంచికి గానీ, చెడుకి గానీ కులం, మతం మూలాలు కావని.. దేనికైనా ఆ ప్రత్యేక వ్యక్తి సంస్కారం, అతనిలోని మానవత, పరిసరాలు అతని బుద్ధిపై వేసే దుష్ప్రభావాలే కారణాలని సత్యపాల్ తులి చెపుతుండే వారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న ఉద్యమాలు, ప్రజలు అనుభవిస్తున్న కడగండ్లను ప్రత్యక్షంగా పరిశీలించిన డాక్టర్‌ని ఇక్కడ తెలంగాణ సాయుధ పోరాటం గుండె లోతుల దాకా కదిలించింది. చిట్టచివరి దాకా ఇక్కడే ఉండిపోవాలన్న నిర్ణయానికే కట్టుబడేలా చేసింది.

ఆయన క్లినికే ఆయన పోరాట కేంద్రం. తెలంగాణ పోరాట వీరులపై కేసులు పెట్టి శిక్షిస్తున్న సమయంలో వాళ్లకవసరమైన న్యాయ సహాయాన్ని, కోర్టులో వాదనలప్పుడు లాయర్లకు కావాల్సిన కీలకమైన సమాచారాన్ని తనే టైపు చేయించి పంపేవారు. ఉద్యమంలో గాయపడ్డ పోరాట యోధుల ప్రాణాలు కాపాడడం, కేసుల్లో ఇరుక్కున్న వాళ్లకు న్యాయపరమైన ఊతాన్నివ్వడం... ఇలా ఆయనకు రెండు చేతులూ ఖాళీ ఉండేవి కావు. వృత్తిరీత్యా టైపిస్టు కాకపోయినా, శరీరం సహకరించని రోజుల్లో కూడా కుప్పలుతెప్పలుగా ఉండే హైకోర్టు పిటిషన్లను స్వయంగా టైప్ చేసి డిఫెన్స్ కమిటీకి అందించేవారు. డా. తులి సత్సంకల్పం కారణంగా.. కొన్ని కేసులు కొట్టి వేయబడ్డాయి. కొన్ని ఉరి శిక్షలు రద్దయి పోయ్యాయి. కొందరి యావజ్జీవ శిక్షలు కుదించబడ్డాయి. ఆయన సేవా తత్పరతలో ఇదొక బహిరంగ పార్శ్వం అనుకుంటే.. అజ్ఞాతంలో ఉన్న ఉద్యమకారుల్ని వెతుక్కుని వెళ్లి మరీ

వైద్యం అందిస్తూ ఆయన వృత్తిపరమైన తృప్తినీ పొందేవారు.

చిరాగ్ అలీలో ఓ కిరాయిల్లు. జుమేరాత్ బజార్లో కొనుక్కున్న ఒక టేబుల్, ఒక కుర్చీ.. ఇలా పాత సామాన్లతోనే ప్రాక్టీసు ప్రారంభమైంది. అయినా డాక్టర్‌గారి క్లినిక్ మీద నిజాం సర్కార్ నిరంతర నిఘా ఉండేది. అయినా సరే ఆయన గుండె తొణకలేదు. చెయ్యి వణకలేదు. ఖాకీల కళ్లు గప్పి పుత్లీబౌలి వరకు నడిచెళ్లి, అక్కడ రిక్షా తీసుకుని రహస్యంగా కామ్రేడ్స్ ఉన్న డెన్‌లోకి వెళ్లి వైద్యం చేసేవారు. ఒక్కోసారి రాత్రి 11 గంటల దాకా తిరిగొచ్చేవారు కాదని సహచరులు చెపుతారు. తెలంగాణ సాయుధ పోరాట యోధులు నంద్యాల శ్రీనివాసరెడ్డి, బి. వెంకటాచారి, జి. రఘుపాల్, రమణారెడ్డి లాంటి వాళ్లెందరో డాక్టర్ గారిచ్చిన వైద్యభిక్ష తోనే పునర్జన్మ పొందామంటూ చెప్పుకునేవారు. ఒకేసారి జ్యోతిబసు, ప్రమోద్ దాస్‌గుప్త, ఎ.కె. గోపాలన్, రణదివే లాంటి అగ్రనాయకులు వచ్చి పలకరించారు. నిలోఫర్ ఆసుపత్రిలో సూపరింటెండెంట్‌గా పని చేసి రిటైరైన డా. శ్యామలాంబ తులి శిష్యురాలే.

ఆయన వైద్య ప్రక్రియే ఒక విచిత్రంగా అనిపిస్తుంది. ట్రీట్‌మెంట్ సమయంలో తనొక డాక్టర్‌లానే అనిపించరు. జబ్బు చేసిన పిల్లలనైతే ముందు దగ్గరికి తీసుకుంటారు. లాలిస్తారు.. అక్కడే సగం రోగం నయమై పోతుంది. డా. తులి రోగ నిర్ణయం చేశారంటే దానికి తిరుగుండేది కాదు. ముఖం చూసి గుండె జబ్బుల్ని గుర్తించడం ఆయన ప్రత్యేకత. ఉస్మానియాలోని నిష్ణాతులైన వైద్యులు సైతం ఆయన పరిశీలనాత్మక వైద్యానికి అబ్బురపడేవారు. స్తోమతున్న వాళ్లెవరైనా స్వచ్ఛందంగా ఇస్తే రెండు రూపాయలు.. ఐదు రూపాయల్లెక్కువ నామమాత్రపు ఫీజు తీసుకుంటారు. దాంతో పేదింటి రోగులకయ్యే మందుల ఖర్చులు తీరుస్తారు. అర్ధణా కూడా వృథా పోనివ్వరు. పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్య లాంటి కమ్యూనిస్టు ఉద్ధండులు తన దగ్గరికి వైద్యం కోసం వచ్చినప్పుడు తన దగ్గర మిగిలిన పైకాన్ని పార్టీ విరాళంగా ఇచ్చేశారు. మెడిసిన్, మార్క్సిజం – ఒక అరుదైన కలబోత పేరే సత్యపాల్ తులి – పేదోళ్ల డా. నార్మన్ బెతూన్, డా. కొట్నీస్‌ల తరగతికి చెందిన విప్లవకారుడైన వైద్యుడు.

అందరి జబ్బులను నయం చేసే డా. తులిని.. చికిత్సకు లొంగని ఒక జబ్బు బాధించింది. ఆయన శరీరం రోజురోజుకూ శుష్కించి పోయేది. పదిహేనేళ్ల పాటు నాలుగు గోడల మధ్యనే గడపాల్సిన పరిస్థితి దాపురించింది. కదల్లేని స్థితిలో పడకపైనే ఉంటూ కూడా రోగులకు చికిత్సనందించడం మాత్రం మానుకోలేదు. లింఫ్ సర్కోమా అనే వ్యాధితో 1976 మే 26న మరణించే చివరి నిమిషం వరకు.. ఆయన సేవ కొనసాగుతూనే ఉంది.. అందుకే ఆయన నవ్వు.. ఆయన మాట.. ఆయన చూపిన మార్గం.. ఇప్పటికీ బతికే ఉంది.

ప్రతి ఒక్కరి జీవితమూ ఏదో ఒక రోజు ముగుస్తుంది. కానీ, ప్రతి రోజూ, సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు ఇతరుల కోసం పాటుపడుతూ ఆదర్శప్రాయమైన జీవితం గడపడం అందరి వల్ల అయ్యే పని కాదు. ఎంతటి వారినైనా అలసట లక్షణాలు అవరించి ఏదో ఒక క్షణంలో నిస్సత్తువకు గురి చేస్తుంది. కొద్దిలో కొద్ది మంది మాత్రమే తొలినాటి ఉత్సాహంతోనే చివరి దాకా పని చేస్తారు. అటువంటి అరుదైన ప్రజా వైద్యుడు, విప్లవకారుడు, మానవతావాది డా. సత్యపాల్ తులి. 1976 మే 21న ఆయన జీవితం పరిసమాప్తమైంది.

వైద్య వర్గాలకే కాదు. వివిధ తరగతులకు చెందిన మేధావులకు కూడా ఉత్తేజాన్నిచ్చే డా. తులి జీవిత విశేషాలను సుందరయ్య విజ్ఞాన కేంద్రం వారు తమ తాజా చిరు సంచికతో మనకందరికి మళ్లీ గుర్తు చేశారు. డా. ఎస్‌పి తులి జీవన్‌ధార ఫార్మసీ పేరుతో సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆవరణలోనే ఆయన ఆశయ సిద్ధి కోసం ఇవాళ్టి దాకా జరుగుతున్న కృషిని కూడా అందులో ప్రస్తావించింది.

(సుందరయ్య విజ్ఞాన కేంద్రం ప్రచురించిన 'ప్రజావైద్యుడు విప్లవకారుడు డా. సత్యపాల్ తులి' పుస్తకం ఆధారంగా)

(రచయిత వీక్షణం వ్యవస్థాపక సంపాదకులు) వీ

వివిచ్ కాలమ్

- స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రద్దు చేసిన మొండి బకాయి 2013-14లో రు. 12882 కోట్లు
- నేషనల్ క్రైమ్ రికార్డు బ్యూరో 2013లో 11732 ఆత్మహత్యలు జరిగాయని ప్రకటించింది.
- 'విప్లవం, నేరాలు అనేవి పేదరికం నుంచే పుడతాయి' అరిస్టాటిల్.
- కాడ్బరీ స్పెషల్ చాకొలెట్ ప్రత్యేక ఎడిషన్ ఖరీదు రు. 2000.
- వంద రోజుల్లో అద్భుతాలు జరుగవు అంటున్నారు వెంకయ్యనాయుడు. మరి అదే వంద రోజుల్లో 24 సిట్టింగ్ స్థానాల్లో 14 సీట్లలో ఓటమి అద్భుతం కాదా?
- మోడీ గుజరాత్ ముఖ్యమంత్రి హోదాలో సర్దార్ పటేల్ విగ్రహాన్ని నిర్మిస్తానన్నారు. ఇపుడా ఖర్చు రు. 200 కోట్లు కేంద్ర ప్రభుత్వం ఖాతాలో చూపిస్తున్నారు. ఇదేమి న్యాయం?
- అప్పులు రూపాయిలో 20 పైసలైతే చెల్లిస్తున్న వడ్డీ 21 పైసలు.
- నిరుద్యోగుల జాబితాలోకి సంవత్సరంలో మరో 120 లక్షలు చేరుతారు.
- వివిపిల విమాన ప్రయాణానికి కొనుగోలు చేసిన అగస్టా వెస్ట్‌లాండే విమానాల కొనుగోలు ఖర్చు రు. 3800 కోట్లు.
- ఐక్యరాజ్య సమితి మిలీనియం అభివృద్ధి లక్ష్యం పథకం ప్రకారం ప్రపంచంలోని అత్యంత పేదరికంలో నివసిస్తున్న వారిలో మూడోవంతు భారత దేశంలోనే ఉన్నారు.
- కేంద్ర ప్రభుత్వ రెవెన్యూ ఆదాయంలో మూడో వంతుకన్నా ఎక్కువగానే వడ్డీ చెల్లింపులకు వెళ్లిపోతుంది.
- అయిదు సంవత్సరాల కాలంలో రిలయన్స్ సంస్థ లాభాలు రు. 81000 కోట్లు
- ప్రధానుల మార్పేకాని విధానాలు షరామామూలే. వీ

చెదిరిన (రైతు) కల

***ప్రభుత్వాలు మారడం వల్ల తమ జీవితాల్లో వెలుగు వస్తుందనుకున్న రైతులకు యథాతథ విధానాల వల్ల ఆశాభంగమే కలుగుతోందని అంటున్నారు* ఆశాలత**

ఉన్న నాలుగు ఎకరాలు అప్పో సొప్పో చేసి సాగు చేసి కుటుంబాన్ని గట్టెక్కిద్దామనుకుంది, ఈసారి పంట బాగాపండితే పాత అప్పు తీర్చవచ్చును కుంది బోథ్ మండలం పొచ్చర గ్రామ వాసి 40 ఏళ్ల వాంకిడి కలమ్మ. సమయానికి వర్షం కురవలేదు, నాటిన పత్తి, సోయా విత్తనాలు మొలకెత్తలేదు. ఆశ చావక రెండవ సారి, అవీ మొలకెత్తక పోతే మూడవ సారి నాటింది. బోరు ఎండిపోయింది. నెర్రెలు పెట్టిన నేల వెక్కిరించింది. పాత అప్పు, కొత్త అప్పు కలిపి మొత్తం 5 లక్షల అప్పు – కలమ్మ కన్న కల చెదిరింది. దిక్కు తోచక చేనుకు వెళ్లి పురుగుల మందు తాగేసింది. ఆత్మహత్యల జిల్లాగా పేరు తెచ్చుకుంటున్న ఆదిలాబాదు జిల్లాలో కలమ్మ మరో సమిధ అయింది.

మెదక్ జిల్లా, చిన్నకోదూరు మండలం కమ్మర్లపల్లిలో మీసం పద్మ – జిల్లా మారితేనేమి కథ ఒకటే. ఆరు ఎకరాల భూమిలో ఒంటి చేత్తో వ్యవసాయం చేసేది పద్మ, భర్త ఆటోడ్రైవరు. వరి, మక్కజొన్న సాగుచేసేది. ఈ సారి వర్షం లేక ఒక్క ఎకరం మాత్రమే మక్కజొన్న వేసింది. బావి ఎండిపోతే బోరు వేశారు, ఒకటి కాదు రెండు, నీళ్లు పడలేదు, నీళ్ల లేక పోతే సాగు ఎట్లా, పట్టు వదల లేదు, ఎండిన బావి లోతు తవ్వించారు, అయినా నీరు కానరాలేదు. అప్పు తడిసి మోపెడైంది. నాలుగు లక్షల అప్పు తీర్చే దారితోచక, కిరసనాయిలు పోసుకుని కాల్చుకుంది 27 ఏళ్ల పద్మ.

నిన్నటివరకు అందరి దృష్టిలో రైతులుగా గుర్తింపు పొందిన రైతన్నల ఆత్మహత్యల గురించే మాట్లాడుకున్నాం, మేమూ రైతులమే, సంక్షోభానికి మేమూ అతీతులం కాదు అని రైతమ్మలు ఉసురు తీసుకుంటున్నారు (ఈ విధంగా మహిళలకు రైతులుగా గుర్తింపు రావడం కంటే విచారకరం మరొకటి లేదు).

ఇలా కల చెదిరి గుండె జారిపోతున్న రైతమ్మ(న్న)ల కథలు ఎన్నెన్నో. మన రాష్ట్రం ఏర్పడితే కష్టాలు తీరుతాయని కోటి కలలు కన్న రైతులు – నీళ్లు, అప్పులు రెండూ అందని ఎండ మావులేనని తెలిసి ఎవరూ ఎటువంటి భరోసా ఇవ్వక పోవడంతో ఆత్మహత్యలే పరిష్కారమని రాలి పోతున్నారు. ఈ రైతులవి పౌర సమాజం పట్టించుకోవడం మానేసిన కథలు, పాలకులకు అవసరం లేని కథలు. గత నాలుగు నెలల్లో తెలంగాణలో 200 లకు పైగా జరిగిన రైతు ఆత్మహత్యలు ప్రతిరోజు దినపత్రికలలో ఒక మూల వార్తగా మాత్రమే మిగులుతున్నాయి. రైతు ఆత్మహత్యలు లేని తెలంగాణ రావాలని కన్న కలలు నిన్నటి నిజం అయితే ఈ పాపం మాది కాదని కొత్త పాలకులు తోసి పారేయడం నేటి వాస్తవం.

అటు ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ మొదటి నుండి రైతు ఆత్మహత్యల పట్ల కనబరచిన ఉదాసీన (అవి నిజమైన రైతు ఆత్మహత్యలు కావని) వైఖరినే కొనసాగిస్తున్నది. రుణమాఫీ విషయంలో రిజర్వ్ బ్యాంక్ గత సంవత్సరం పంట నష్టం జరగలేదని వాదించినప్పుడు మాత్రం రైతు ఆత్మహత్యలను ఒక సంక్షోభ కారణంగా చూపింది. నమోదైన రైతు ఆత్మహత్యల సంఖ్య కంటే వాస్తవానికి మూడింతలు ఎక్కువ జరిగాయని, అందుచేత రిజర్వ్ బ్యాంక్ రుణాలు రీ షెడ్యూల్ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి లేఖ పంపినట్లు వార్తలు వచ్చాయి. ఇది పచ్చి అవకాశవాదం తప్ప మరేమీ కాదు.

జాతీయ నేర నమోదు సంస్థ లెక్కల ప్రకారం గత 18 ఏళ్లలో దేశం మొత్తంలో దాదాపు 3 లక్షల మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటే అవిభాజ్య ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 37 వేల మంది రైతు ఆత్మహత్యలు నమోదయ్యాయి. అందులో 24 వేలు తెలంగాణలో జరిగాయి. ఈ పాపం అంతా రెండు దశాబ్దాల ప్రపంచీకరణ, నయా ఉదారవాద విధానాలను అమలు చేసిన ప్రభుత్వాల ఖాతాలోకే వెలుతుందనడంలో సందేహం అక్కరలేదు. వ్యవసాయం రైతులకు తప్ప మిగిలిన అందరికీ లాభకరంగా ఉందని, విధానాలు మారితే తప్ప రైతులు సంక్షోభం నుండి బయట పడరని అనేక అధ్యయనాలు, కమిషన్ల నివేదికలు పటిష్ఠమైన సూచనలు చేసినా అవి అమలుకు నోచుకోలేదు.

కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ప్రభుత్వాలు మారినా విధానాలు మారలేదు. అభివృద్ధి జపంలో వ్యవసాయ రంగాన్ని ఫణంగా పెట్టి పారిశ్రామిక రంగానికి పెద్దపీట వేయడం కాకతాళీయంగా జరగడం లేదు. ఒక పద్ధతి ప్రకారం వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేసి నీరు గార్చి సన్నకారు రైతులు వ్యవసాయం నుండి వైదొలిగే లాగ ప్రణాళికలు సిద్ధం చేశారు.(రోజుకు 350 మంది రైతులు వ్యవసాయం వీడి పోతున్నారని 2011 జనాభా గణాంకాల విశ్లేషకులు చెపుతున్నారు). 60 శాతం మందికి ప్రధాన జీవనోపాధిగా ఉండి జాతీయ ఉత్పత్తిలో 14 శాతం వాటా కలిగిన వ్యవసాయ రంగానికి నిన్నటి వరకు 2.5 శాతం బడ్జెట్ కేటాయింపులు (ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌లో 4 శాతం) జరిగాయంటే పాలకులకు వ్యవసాయం పట్ల ఉన్న శ్రద్ధ స్పష్టమవుతుంది.

(రచయిత రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర కన్వీనర్) వీ

వీక్షణంకు వచ్చే రచనలలో కొన్ని జిరాక్స్ కాపీలు వస్తున్నాయి. జిరాక్స్ నాణ్యత సరిగా ఉండడంలేదు. కొన్నిటిలో చేతి రాతలు కూడా కష్టంగా ఉంటున్నాయి. అందువల్ల అర్థం చేసుకొని టైప్ చేయడంలో చాలా ఇబ్బందులు, సమస్యలు ఎదురవుతున్నాయి. అక్షరాలు అర్థమయ్యేలా రాయండి. జిరాక్స్ మీరు ఉంచుకుని ఒరిజినల్స్ మాకు పంపి సహకరించండి. – సం.

జైళ్లలో రాజ్యాంగ ప్రాథమిక హక్కులు

జైళ్లలో రాజ్యాంగబద్ధంగా అమలు కావాల్సిన కనీస నియమాలు కూడా అమలు కావడం లేదనీ, ఖైదీల పట్ల అధికారులు మానవీయ కోణంతో ప్రవర్తించాలనీ అంటున్నారు **చిమ్మె జాన్ బర్నబాస్**

2014 సెప్టెంబర్ 14న రాజమండ్రి కేంద్ర కారాగారంలో ఖైదీలు తమకు భోజనం సరిగా ఉండడం లేదనీ, వసతులు సరిగా లేవనీ ఆందోళన చేశారు. జైలు సూపరింటెండెంట్, ఇతర అధికారులు తమను వేధిస్తున్నారని ఆరోపిస్తూ జైలు లోపల నిరాహార దీక్ష చేశారు. సాయంత్రానికి రాజమండ్రి ఆర్‌డిఓ జోక్యంతో ఆందోళన విరమించారు. వాస్తవానికి ఇది దేశంలో ప్రతి జైలులో పరిస్థితి ఈ విధంగానే ఉంది. కేవలం కోర్టులలో శిక్షలు పడిన వారు ఉండే జైళ్లలో వాస్తవానికి రాజ్యాంగ హక్కులు (ప్రాథమిక హక్కులు) మరింత పరిరక్షించబడాలి. కానీ అందుకు పూర్తిగా విరుద్ధమైన పరిస్థితి ఉంది. ఇది చాలా విచారకరం, ఆందోళనాకరం. తాము చేయని నేరాలకు కోర్టులలో సాక్ష్యాలు రుజువైన కారణం చేత (అక్రమంగా నమోదు కాబడిన కేసయినప్పటికీ) తాము కోర్టులలో నిర్దోషులుగా నిరూపించు కోలేక శిక్షలు పడడం చేత జైళ్లలో మగ్గుతున్నారు. వీరు కూడా భారత పౌరులే కాబట్టి, వీరికి అన్ని రాజ్యాంగ హక్కులు వర్తిస్తాయి. అంతేకాని, జైలు అధికారుల వేధిపులూ, పీడనలూ భరించవలెననే దురాలోచనతో చాలా మంది ఉన్నతాధికారులు శిక్ష పడిన ఖైదీలను వేధిస్తున్నారు.

ప్రాథమికంగా వారికి పడిన శిక్షా కాలాన్ని ముగించుకోవడానికి, జీవించడానికి అవసరమైన 'ఆహారాన్ని' అందివ్వడం లేదు. ఇది చాలా అమానవీయం. ప్రకటిత వివరాల పట్టిక ప్రకారం ఆహారం తయారు చేయడం లేదు. ఇందులో కూడా జైలు అధికారులకూ, కాంట్రాక్టర్లకూ మధ్య పెద్ద ఎత్తున 'అవినీతి' ఒప్పందాలున్నాయి. 'జైలులో ఉన్నాము' కాబట్టి అధికారులు తమను ఏమైనా చేయవచ్చనే భావన చాలా మందిలో ఉంటోంది. ఇది తప్పుడు భావన. జైలు అధికారులు కూడా భారత రాజ్యాంగ పరిధి లోని వారే. ఇంకా చెప్పాలంటే దేశంలోని జైళ్లన్నీ కూడా న్యాయ స్థానాల ఆదేశాలతో, ఆయా పరిధిలోని న్యాయమూర్తుల అధీనంలో పనిచేయ వలసిందే. వాస్తవానికి, జైలు అధికారులు కోర్టులకు జవాబుదారీగా ఉండాలి, ఆ విధంగా ఉండడం లేదు. కాని జడ్జీలందరూ జైళ్లను కనీసం ప్రతీనెలా ఒకటీ, రెండుసార్లు సందర్శించాలి. అక్కడే భోజనం చేయాలి. ఆ పరిస్థితులలో అవినీతిపరులైన జైలు సూపరింటెండెంట్‌లలో మార్పు వస్తుంది తప్ప, మామూలుగానయితే రాదు. ఖైదీలు ఆరోపిస్తున్న జైలు అధికారులను వెంటనే విధుల నుంచి తొలగించాలి. వారికి కఠినమైన శిక్షలు అమలు చేయాలి.

విధించబడిన శిక్షాకాలం ఎన్ని సంవత్సరాలుంటే అందులో సగభాగం పూర్తిచేసి, 'సత్ప్రవర్తన' కలిగిన ఖైదీలను విడుదల చేయవచ్చనే భావన గతంలో ఉండేది. గతంలో చాలా జిఒలు వచ్చాయి. తద్వారా ప్రభుత్వానికి కూడా వ్యయం తగ్గే అవకాశం కూడా ఉంది. కానీ ఆ విధంగా 'మానవతా' కోణంలో కాకుండా, నేడు 'రాజ్యం' కఠినంగా, చాలా అమానవీయంగా వ్యవహరిస్తుండడం విచారకరం- బాధాకరం.

జైళ్లలో ఉండే ఖైదీల భార్యా, పిల్లల పరిస్థితి కూడా చాలా దయనీయంగా ఉంటుంది. వారిని సమాజంలో ఆదరించేవారు లేరు. ఉన్నా చాలా అరుదుగా ఉంటారు. మరి భారత రాజ్యాంగ ప్రాథమిక హక్కులు ఖైదీల పిల్లలకు కూడా వర్తించాలి కదా. వారి బాగోగులు, జీవించే హక్కులు కూడా రాజ్యాంగ పరిధి లోనివే కదా. వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతున్నది. జైలులో ఉన్న ఖైదీల కుటుంబీకుల బాధలు వర్ణనాతీతం. ఒకవైపు వారి జీవనం చూసుకుంటూ, మరోవైపు జైళ్లలో ఉన్న వారి గురించి ఆలోచిస్తూ వారి ఆరోగ్యాలను ధ్వంసం చేసుకుంటున్నారు. అందరికీ విద్య-ఆరోగ్యం ఆదేశ సూత్రాలలో రాయబడింది. మరి అదెందుకు శిక్షపడిన వారి పిల్లలకూ, ఇతర కుటుంబ సభ్యులకూ వర్తింపచేయడం లేదు. ఇది అన్యాయం?

ఉదాహరణకు, గత పది సంవత్సరాల క్రితం, మహబూబ్‌నగర్ జిల్లా అలంపూర్ మండల విద్యా శాఖాధికారి (ఎంఇఓ) పెద్దారెడ్డిని, అదే మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు సద్గుణరావు హత్యచేసి, బహిరంగంగానే పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. వాస్తవానికి ఎంఇఓ పెద్దారెడ్డి ప్రస్తుత (అప్పటి) మహబూబ్‌నగర్ ఎంపి అయిన ఎ.పి. జితేందర్‌రెడ్డికి స్వయాన షడ్రకుడు. జితేందర్‌రెడ్డి బలంతో పెద్దారెడ్డి ఉపాధ్యాయులను వేధించేవాడు. సెలవులు మంజూరు చేసేవాడు కాదు. ఎంత బతిమిలాడినప్పటికినీ వినేవాడు కాదు. ఆవేశం తట్టుకోలేక హత్య చేశాడు సద్గుణరావు. సద్గుణరావుకు కనీసం రెండు సంవత్సరాల వరకూ బెయిల్ లభించలేకపోగా, ఇప్పుడు చర్లపల్లి కేంద్ర కారాగారంలో జీవిత ఖైదు అనుభవిస్తున్నాడు.

దాదాపు ఖైదీలందరిదీ ఇదే తరహా గాధలుంటాయి. కానీ న్యాయస్థానాలు సాంఘిక, ఆర్థిక దృక్పథంతో ఖైదీలను చూడడం లేదు. హత్య చేయబడిన వ్యక్తి సామాజిక స్థితిగతుల ఆధారంగా కూడా నేర స్వభావాన్ని పరిగణిస్తున్నారు. అదే కోణంలోనే సద్గుణరావుకు శిక్ష పడింది. అలంపూర్ మండలంలోని అన్ని ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులందరి సమస్య తన సమస్యగా భావించి, ఈ విధంగా వేధింపులు - అగ్రకుల దురహంకారం చూపించే అధికారులకు ఒక పరిష్కారం చూపించాలనే ఆలోచనతో, ఆ విధంగా తన చేతికి పని కల్పించుకొని అగ్రకుల దురహంకారాన్ని ఎదుర్కోవాలనే ప్రగాఢ సంకల్పంతో హత్యచేసి, నేరాన్ని ఒప్పుకుని, పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయినందుకు శిక్షకు గురయ్యాడు. మన చట్టంలో హత్య చేసిన వారికన్నా, చేయడానికి ప్రేరేపించిన వ్యక్తికి ఎక్కువ శిక్షాకాలం వర్తిస్తుంది. అనగా క్రిమినల్ కాన్స్పిరసీ (కుట్ర) ఐపిసి 120-బి ప్రకారం శిక్షార్హం అవుతుంది. కానీ ఇక్కడ కుట్రదారుడే, ప్రేరేపించిన వ్యక్తే హత్యకు గురయ్యాడు. కావున ఇక్కడ సామాజిక కోణంలో కేసును చూడాలి. ఆ విధంగా న్యాయస్థానాలు చూడలేదు. మండల స్థాయి అధికారుల నుంచి,

పరిపక్వమైన సంక్షోభం

రష్యాలో 1917 ఫిబ్రవరి విప్లవం తర్వాత అక్టోబర్ విప్లవానికి సమయం ఎలా పరిపక్వమైందో వివరిస్తూ లెనిన్ రాసిన వ్యాసాన్ని పరిచయం చేస్తున్నారు ఎన్.వి. ఎస్. నాగభూషణ్

లెనిన్ రాసిన ఈ వ్యాసానికి ప్రపంచ విప్లవ చరిత్రలో ఎనలేని ప్రాముఖ్యత ఉంది. ఆయన రాసిన అన్ని వ్యాసాలకూ ఉండే రాజకీయ పరమైన ప్రాముఖ్యతకు తోడు, ఈ వ్యాసానికి అంతకు మించిన గొప్ప ప్రాముఖ్యత చరిత్రపరంగా ఉంది. ఆయన యావత్తు రాజకీయ జీవితంలోనూ అతి క్లిష్టమనదగిన ఆయన రాజీనామా ఉదంతానికి ఈ వ్యాసం ఒక సజీవ సాక్ష్యంగా నిలిచి ఉంది. నిజానికి ఈ ఉదంతం రష్యన్ దేశ చరిత్రనే, ఆ మాటకు వస్తే ప్రపంచ రాజకీయ ముఖ చిత్రాన్నే మార్చేసిందంటే అతిశయోక్తి లేదు. అంతేగాక, నేటికీ ప్రపంచ విప్లవ రాజకీయాల్ని అత్యంత ప్రభావితం చేస్తున్న నాటి బోల్షివిక్ పార్టీ పని విధానంలోని సంక్లిష్టతకు ఈ వ్యాసం అద్దం పడుతుంది. అత్యంత ఆసక్తికరమైన ఈ అంశాల్ని చర్చించే ముందు, ఈ వ్యాసం రాసిన రాజకీయ సందర్భం గురించి, అలాగే ఈ వ్యాసంలో లెనిన్ చర్చించిన అంశాల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం.

లెనిన్ ఈ వ్యాసాన్ని 1917 సెప్టెంబర్ 29న అంటే పార్టీ (సి.సి) సెంట్రల్ కమిటీ, స్మోల్నీ ఇన్‌స్టిట్యూట్‌లో సమావేశమై సాయుధ పోరాటానికి పిలుపునిస్తూ తీర్మానించడానికి సరిగ్గా 10 రోజుల ముందు (ఈ సమావేశం 1917 అక్టోబర్ 10న జరగ్గా, లెనిన్ ఈ సమావేశానికి ముసలి మత గురువు వేషంలో రహస్యంగా వచ్చి, తీర్మానాన్ని ప్రవేశ పెట్టాడు) ఇంకా విడమరచి చెప్పాలంటే, సాయుధ తిరుగుబాటుకూ, సోషలిస్టు విప్లవానికీ పార్టీని సిద్ధం చేసేందుకు అవసరమైన తీర్మానాలను ఆమోదించిన పార్టీ ఆరో కాంగ్రెస్ (జూలై 26 – ఆగస్టు 3 తేదీల మధ్య అర్ధరహస్యంగా, పెట్రోగ్రాడ్‌లో వివిధ ప్రదేశాల్లో జరిగిన ఈ కాంగ్రెస్ లెనిన్ పరోక్ష అధ్వర్యంలో జరిగింది. అప్పుడు లెనిన్ పెట్రోగ్రాడ్ సమీపంలో రజ్లీస్టేషన్ వద్ద రహస్య జీవనంలో ఉన్నాడు) జరిగాక, సుదీర్ఘమైన 8 వారాల తర్వాత (56 రోజులకు) రాశాడు.

ఆనాటికి రష్యా రాజకీయ ముఖ చిత్రం అల్లకల్లోలంగా ఉంది. మొదటి సామ్రాజ్యవాద ప్రపంచ యుద్ధం (1914–18) లో దేశం నిండా మునిగి ఉంది. ప్రజల కష్టాల కడగండ్లకు అంతులేదు. దేశమంతా అశాంతి ప్రబలి పోయింది. దీంతో ఫిబ్రవరి బూర్జువా విప్లవం జరిగి జార్‌ను దించేసినప్పటికీ, ఇతర సామ్రాజ్యవాద దేశాల ప్రభుత్వాలతో, పెట్టుబడిదారులతో రహస్య ఒప్పందాలు చేసుకొని దేశాన్ని సామ్రాజ్యవాద యుద్ధంలోకి ఈడ్చిన జార్ విధానాల్నే, అధికారాన్ని చేపట్టిన తాత్కాలిక ప్రభుత్వం కొనసాగిస్తోంది. ప్రజలకు మాత్రం శాంతినీ, రైతాంగానికి భూమినీ, ఆకలి గొన్నవారికి రొట్టెనీ వాగ్దానమైతే చేసింది గానీ, వాటిని అమలు జరిపే ఉద్దేశం మాత్రం లేదు. సోవియట్లలో (ఇవి ఒక విధమైన ప్రజల కౌన్సిళ్ల వంటివి) అధికారంలో ఉండి, ప్రజల మద్దతు అధికంగా గల (ఎస్.ఆర్)లు సోషలిస్టు రివల్యూషనరీలు మెన్షివిక్కులూ, తాము స్వంతంగా ప్రభుత్వాన్ని ఏర్పరచడానికి భయపడి, అధికారాన్ని బూర్జువాలకు అప్పగించి, తాము కొన్ని పదవులు పొంది, బూర్జువాలకూ, భూస్వాములకూ వంతపాడుతూ, యుద్ధం కొనసాగింపును సమర్థిస్తూ, ప్రజల్ని మరికొంతకాలం ఓపిక పట్టమని మభ్యపెడుతున్నారు.

కానీ సుదీర్ఘంగా కొసాగించబడుతున్న యుద్ధం వల్ల ప్రజల్లో సహనం

రాష్ట్ర స్థాయి విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వరకు కూడా సద్గుణరావుకు అన్యాయం చేశారు. పైగా న్యాయస్థానంలో ఆయనకు శిక్ష విధించాలని జిఒ తీసుకువచ్చి, దానిని కోర్టుకు సమర్పించారు. ఈ విధంగా గత ప్రభుత్వంలోని విద్యాశాఖ అగ్రకుల దురహంకారులకు వంత పాడింది. న్యాయ తాత్వికత ప్రకారం సద్గుణరావు శిక్షార్హుడు కాదు. కాని ఇలాంటి వారెందరో నేడు జైళ్లలో మగ్గుతున్నారు. రాజకీయ ఖైదీల కథ చెప్పనక్కరలేదు. జైళ్లలో డబ్బున్న వారిదే రాజ్యం అవుతున్నది. గంజాయి, ఎర్ర చందనం స్మగ్లర్లకు రాజ లాంఛనాలు. సామాన్య ఖైదీలకు కనీస పలకరింపులు కరువు.

ఇప్పుడేం చేయాలి?

జైళ్లకు నేటి ప్రభుత్వాలు సంస్కరణాలయాలు అనే ముద్దుపేరు తగిలించారు. అక్కడ దోపిడి తప్ప ఏమాత్రం సంస్కరణ ఉండదు. బయట ఉన్న దోపిడి (రాజకీయ) నాయకుల బంధువులకూ, వారి దళారీలయిన ఉన్నతాధికారులకూ తప్ప మరొకరికి పౌర, ప్రజాస్వామిక హక్కులుండవు. కాబట్టి కనీసం బుద్ధిజీవులుగా, మన వంతు కర్తవ్యంగా, రాజ్యాంగ హక్కుల అమలు కోసం, జైళ్లలో ఉన్న వారు కూడా భారత పౌరులే కాబట్టి, రాజ్యాంగ ప్రమాణాలు, నయమ నిబంధనలూ వీరికీ వర్తిస్తాయి అనే సూత్ర బద్ధమైన నినాదాన్ని అందరికీ గుర్తు చేస్తూ, సామాన్యుల నుంచి, సుప్రీంకోర్టు జడ్జీల వరకూ దీనిని తీసుకొని పోవాలి.

జైళ్లలో రోజు రోజుకూ అనారోగ్యంతో, ఆహారం సరిగాలేక, సరియైన సమయంలో వైద్యం అందక మరణించేవారి సంఖ్య ఎక్కువవుతోంది. జిల్లా, నియోజకవర్గ స్థాయిల్లో నయితే రిమాండ్ ఖైదీలే మృతి చెందుతున్నారు. రిమాండ్ అనగా 14 రోజులకొకసారి స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచాలి. నేరం ఆరోపించబడిన ఖైదీలే కానీ, నిరూపించబడిన వారు కానీ, నేరం రుజువు చేయబడినవారు కాదు. వారి జీవితాలు సగం మధ్యలోనే ముగించబడుతున్నాయి. ఇది విచారకరం. ఒక్కసారి జైలుకు పోయినవాడు–మళ్లీ బతికి వస్తాడనే గ్యారంటీ లేదు. ఈ పరిస్థితి మారాలి. వ్యవస్థ మార్పు కోసం పోరాడే శక్తులన్నీ ఏకం కావాలి. ప్రజాస్వామ్య వ్యవస్థలో నివసిస్తున్న మనం పూర్తిగా అప్రజాస్వామికంగా పనిచేస్తున్న పోలీస్ జైళ్ల శాఖలపై పోరాడకుండా, నిజమైన ప్రజాసామ్య వ్యవస్థను సాధించలేం, ఊహించలేం. ప్రజాస్వామ్య పౌర హక్కుల కోసం నిరంతర పోరాటం కొనసాగించాలని ప్రతిన బూనుదాం. కలిసి వచ్చే అన్ని శక్తులనూ కలుపుకొని పోరాడుదాం..

(రచయిత ఒపిడిఆర్ రాష్ట్ర కమిటీ సభ్యులు) వీ

నశించి పోయింది. సామ్రాజ్యవాద యుద్ధాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ, సోషలిజం సిద్ధాంతంతో, ప్రభుత్వ దమనకాండకు గురవుతూ కూడా, శ్రామికవర్గ అభ్యున్నతికి చిత్తశుద్ధితో పనిచేస్తున్న బోల్షివిక్కులతో గొంతు కలిపేవారి సంఖ్య క్రమంగా అధికమైంది. ఇది సహించలేని ప్రభుత్వం, ప్రజల్ని రెచ్చగొట్టేందుకు జూన్ 18న కావాలనే సైనికుల చేత జర్మన్లపై విఫల దాడిని చేయించి, 60,000 మంది సైనికుల మరణానికి కారణమైంది. అంతమంది ఒక్కరోజే మరణించడంతో ప్రజాగ్రహం కట్టలు తెంచుకుంది. జూలై 3,4 తేదీలలో పెట్రోగ్రాడ్‌లో అసంకల్పితంగా బ్రహ్మాండమైన సాయుధ ప్రదర్శన జరిగింది. ప్రభుత్వ దురుద్దేశాన్ని కనిపెట్టిన బోల్షివిక్కులు, ప్రదర్శన శాంతియుతంగా జరగడానికి శాయశక్తులా కృషి చేశారు. అయినా ప్రభుత్వం రాక్షసంగా, ముందే రానించిన ప్రతీఘాతుక దళాలతో ప్రదర్శనకారులపై భీకర దాడికి పూనుకొని వందలాది మందిని చంపించింది. అంతటితో ఆగక, వారికి నాయకత్వం లేకుండా చేసేందుకు, బోల్షివిక్కుల్ని వేలాది మందిని అరెస్టు చేసింది. అలాగే లెనిన్‌పై రాజద్రోహం నేరం ఆరోపించి, ఆయని అరెస్టు పేర చంపించేందుకు ఏర్పాట్లు చేసింది. తనపై ఆరోపించిన నేరాలను విని ఉద్విగ్నుడైన లెనిన్, మొదట కోర్టులో హాజరై వాఙ్మూలం ఇవ్వాలని అనుకొని కూడా, పార్టీ ఆదేశాల మేరకు పెట్రోగ్రాడ్ సమీపంలోని, రజ్లీవ్‌స్టేషన్ వద్ద గడ్డికోత కూలీగా ఒక కార్మికుని పొలంలో రహస్య జీవితంలోకి వెళ్లాడు. దాంతో బోల్షివిక్ పార్టీ శాంతియుత మార్గాన్ని వీడి, సాయుధ పోరాట బాటపట్టి, ఆ దిశగా పార్టీ 6వ కాంగ్రెస్‌లో తీర్మానాలు చేసింది. జూలై 26 నుంచి ఆగస్టు 3 దాకా అర్ధ రహస్య పద్ధతిలో జరిగిన ఈ కాంగ్రెస్ లెనిన్ తన అజ్ఞాతవాసం నుంచే పరోక్ష పద్ధతిలో నడిపించాడు.

మరోపక్క యుద్ధం దీర్ఘకాలంగా సాగుతుండడం వల్ల దేశం తీవ్రమైన కరువుకోరల్లో చిక్కి రొట్టె రేషన్ క్రమంగా రోజుకు 1 పౌను, 1/2 పౌను, 1/4 పౌనుకి దిగజారి, ఒకవారం అసలు రొట్టెనే కనిపించ కుండాపోయింది. మరో పక్క రైతాంగం అలజడులు పెరిగిపోయాయి. ఇంకో పక్క సరిహద్దుల్లోని సైన్యం ఆయుధాలు లేక, దుస్తులు లేక, రోగాల బారిన పడి, ఆహారం లేక అల్లాడిపోతూ, బారకాసులు వదిలి పారిపోసాగారు. ఆ విధంగా సైన్యం ప్రభుత్వం మాట వినే పరిస్థితిలో లేకుండా పోయింది. దీనికి విరుగుడుగా కేడిట్ పార్టీ మద్దతుతో పెట్టుబడిదారులూ, కెరెన్స్కీ, సైన్యాధిపతి కోర్నిలోవ్‌ని శరణువేడారు. జనరల్ కోర్నిలోవ్ సైనిక తిరుగుబాటుకి పూనుకొని, క్రూరులైన 70,000 మంది సైనికుల్ని ప్రత్యేకంగా ఏరి (వీరిలో అధికంగా ముస్లింలు ఉన్నారు) వారికి నాస్తికులైన సోషలిస్టుల చేత గొప్ప మసీదును నిర్మింప చేస్తానని, లేకుంటే కాల్చివేస్తామని వారి పట్టాకత్తుల చేత ప్రమాణం చేయించి, పెట్రోగ్రాడ్‌పైకి దండయాత్రకి పూనుకున్నారు. పెట్టుబడిదారులూ, వర్తకులూ, పారిశ్రామికవేత్తలూ, బ్రిటన్, ఫ్రాన్స్ రాయబారుల మద్దతుతో, విమానాలతో బయలు దేరిన కోర్నిలోవ్, ముందుగా ఒక వదంతి వ్యాపింపజేశాడు. ఆగస్టు 27న బోల్షివిక్కులు పెట్రోగ్రాడ్‌లో సాయుధ తిరుగుబాటుకి సమాయత్తం అవుతున్నారన్నదే ఆ వదంతి. అయితే ఈ తిరుగుబాటుని ఎదుర్కొవడానికి బోల్షివిక్‌పార్టీ సన్నద్ధమైంది. ఆ సమయంలో వేలాది మందితో రెడ్‌గార్డు దళాలు ఏర్పడ్డాయి. రెడ్‌గార్డుల నాయకత్వాన శ్రామికవర్గం పెట్రాగ్రాడ్ చుట్టూ రక్షణవలయం నిర్మించింది. వీరికి విప్లవసైనికలు అండగా నిలబడ్డారు. అయితే తిరుగుబాటు వార్త వెంటనే బాల్టిక్ నౌకాసైన్యంలోని నావిలంతా తక్షణం పెట్రోగ్రాడ్ వచ్చి మార్గమధ్యంలోనే కోర్నిలోవ్ దళాలతో మాట్లాడి, తిరుగుబాటు వెనుక గల అసలు ఉద్దేశాన్ని వివరించడంతో, ఆ దళాలు ముందకు వెళ్లడానికి నిరాకరించాయి. చివరికి ఆగస్టు 30న కోర్నిలోవ్‌ని అరెస్టు చేయడంతో తిరుగుబాటు అణగారిపోయింది.

ఈ తిరుగుబాటు పరాజయం వల్ల విప్లవశక్తుల, ప్రతీఘాతుక శక్తుల బలాబలాలు బట్టబయలయ్యాయి. కాడెట్లూ (కాన్‌స్టిట్యూషనల్ డెమోక్రాట్లు, రాజరికవాదులు, బూర్జువా, భూస్వాముల సమర్థకులు) మెన్షివిక్కులు, ఎస్.ఆర్.లూ, సేనానులూ అందరు పెట్టుబడిదారీ వలయంలో చిక్కుకు పోయారన్న సంగతి అర్థమై, వారి పలుకుబడి పూర్తిగా పడిపోయింది. ఈ తిరుగుబాటులో బోల్షివిక్కులు పరాజయం పాలైతే, భూస్వాములూ, సైన్యం తమ మీద దాడి చేసి ఉండే వారనీ, ఇక తమకెన్నడూ భూములు లభించి ఉండేవి కావనీ పేద రైతాంగం గ్రహించి, తమ రక్షకులు బోల్షివిక్కులేనన్నీ వాస్తవం తెలుసుకుని, వారికి సన్నిహితం కాసాగింది. వారిని మధ్యతరగతి రైతాంగం అనుసరించింది. బోల్షివిక్ పార్టీ ఒక్కటే యుద్ధం నుండి తమను విముక్తి చేయగలదని వారంతా అర్థం చేసుకున్నారు. అప్పటి నుండి భూ ఎస్టేట్ల స్వాధీనం పెరిగిపోయింది. రైతాంగం విప్లవబాట పట్టింది. కార్మికులు యజమానుల్ని తరిమేసి, ఫాక్టరీల్ని స్వాధీనం చేసుకోవడం మొదలెట్టారు. సోవియట్లు బోల్షివిక్‌తత్వంతో నిండిపోయాయి. ఆగస్టు 31న పెట్రోగ్రాడ్ సోవియట్, సెప్టెంబర్ 5న మాస్కో సోవియట్ బోల్షివిక్కుల పక్షాల చేరిపోయాయి. విప్లవ రైతాంగం ఒత్తిడివల్ల ఎస్‌ఆర్‌లలో, మెన్షివిక్కులలో తీవ్రవాద పక్షాలు ఏర్పడి బూర్జువాలతో రాజీని తీవ్రంగా వ్యతిరేకించాయి.

అయితే కోర్నిలోవ్ తిరుగబాటు ఓటమి వల్ల బోల్షివిక్కుల బలం పెరిగిపోతుండడంతో ఖంగుతిన్న ఎస్.ఆర్.లూ మెన్షివిక్కులూ, దేశాన్ని విప్లవ మార్గం నుంచి బూర్జువా రాజ్యాంగం, పార్లమెంటుల వైపు మళ్లించేందుకు అఖిల రష్యా ప్రజాతంత్ర సమావేశాన్ని (డెమోక్రటిక్ కాన్ఫరెన్స్) ను సెప్టెంబర్ 14–22 తేదీల మధ్య పెట్రోగ్రాడ్‌లో ఏర్పాటు చేశారు. ఇందులో బోల్షివిక్కులు ఏమాత్రం పాల్గొన్నరాదనీ, అలా పాల్గొన్నట్లయితే, దాని వల్ల ఏదో ఉపయోగం ఉందని ప్రజలు భ్రమించే ఆస్కారం ఉందనీ లెనిన్ హెచ్చరించాడు. అయినా పార్టీలోని అర్ధ మెన్షివిక్కులైన కోమెనెల్, జినొవ్‌యెవ్ ప్రభృతులు పాల్గొని తీరాలని మొండిగా వాదించారు. ఆ సమయంలో లెనిన్ ఫిన్‌లాండ్ రాజధాని పొల్సింగ్‌ఫర్స్‌లో ఉన్నాడు. గూఢచారాలు తననెలాగయినా అరెస్టు చేయాలని పట్టుదలగా గాలిస్తుండడంతో, పార్టీ ఆదేశం మేరకు ఆయన తన మకాంని ఆగస్టు మధ్యలోనే రజ్లీవ్ స్టేషన్ దగ్గర నుండి దూరంగా, మొదట పొల్సింగ్ ఫర్స్ పక్కన ఉన్న ఒక గ్రామానికి, ఆపై హెల్సింగ్ ఫర్స్‌కి మార్చాడు.

ప్రజాతంత్ర సమావేశానికి విరుగుడుగా బోల్షివిక్ పార్టీ, సోవియట్ల రెండో కాంగ్రెస్ సమావేశానికి ఒత్తిడి తెస్తూ, దాని మెజారిటీకై చురుగ్గా ప్రయత్నిస్తోంది. అయితే లెనిన్ దృష్టిలో ఆ ప్రయత్నం అవసరమేగానీ, అంతకన్నా ఎక్కువగా సాయుధ పోరాటానికి తన శక్తియుక్తులన్నింటినీ కేంద్రీకరించాలని భావించాడు. ఎందుకంటే సాయుధ పోరాటానికి అనువైన వాతావరణం దేశమంతటా ఏర్పడి ఉంది. ప్రజలలో మెజారిటీ బోల్షివిక్కుల పక్షాన ఉన్నారు. రైతాంగం, ముఖ్యంగా పేదరైతులు కార్మిక వర్గానికి అండగా ఉన్నారు. ఎస్‌ఆర్‌లూ, మెన్షివిక్కులూ బలహీనస్థితిలో ఉన్నారు. విప్లవసైనికులూ, నావికులూ సాయుధ పోరాటానికి అనుకూలంగా, అందులో బోల్షివిక్కులకు మద్దతునిచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. పెట్రోగ్రాడ్ గారిసన్ (రక్షకదళం) మొత్తంగా, 60,000 మంది బోల్షివిక్కుల పక్షాన ఉన్నారు. ఇదంతా గమనిస్తున్న కేరెన్స్కీ ఈ సైన్యాన్ని యుద్ధ భూమికి తరలించి, తన అనుకూల దళాలతో నింపివేయడానికి ప్రయత్నిస్తున్నాడు. అంతేగాక రాజధాని సైతం జర్మన్ సైన్యాలకు వదిలి వేసి, రాజధానిని మాస్కోకు తరలించి, తద్వారా పెట్రోగ్రాడ్ అధికంగా ఉన్న కార్మికవర్గాన్ని, అలాగే విప్లవకారుల్ని చంపించాలని పన్నాగాలు పన్నుతున్నాడు. కనుక కేరెన్స్కి ప్రయత్నాలు ఫలించేలోగా సాయుధ పోరాటానికి పూనుకోకపోతే, ఆపై అందుకు ప్రయత్నించినా ఫలితం ఉండదు.

అందువల్ల వెంటనే సాయుధ పోరాటాన్ని ప్రారంభించాల్సిందిగా పిలుపునిస్తూ, కేంద్ర కమిటీకి, పెట్రోగ్రాడ్, మాస్కో కమిటీలకూ సెప్టెంబర్ 12-14 తేదీల్లో 'బోల్షివిక్కులు అలాగే 13,14 తేదీల మధ్య కేంద్ర కమిటీకి 'మార్క్సిజం, తిరుగుబాటు' పేరుతో మరో లేఖ రాస్తూ, తిరుగుబాటు విజయవంతం అయ్యేందుకు అది కుట్రపైనా, ఒక పార్టీ పైనా గాక, పురోగామి వర్గంపై ఆధారపడాలని, అలాగే ఆ తిరుగుబాటు ప్రజల విప్లవకర వెల్లువపై ఆధారపడాలని, దీన్ని మరింత విడమరిచి చెప్పాలంటే, ప్రజల, పురోగామి శ్రేణుల క్రియాశీలత ఉచ్ఛస్థాయిలో ఉన్నప్పుడు, శత్రు శ్రేణుల్లోనూ, దాని అనిశ్చిత మిత్రుల్లోనూ ఊగిసలాటలు తీవ్రంగా ఉన్నప్పుడు, చరిత్రలోని ఆ మలుపు మీద ఆధారపడాలని ఆయన సూత్రీకరించాడు. ఆ సూత్రీకరణకు అనుగుణంగా నేటి పరిస్థితి ఉన్నందున, వెంటనే సాయుధ పోరాటాన్ని మొదలెట్టాలని ఆయన బలంగా కోరాడు. అంతటితో సరిపుచ్చక, తిరుగుబాటు విజయవంతం అయ్యేందుకు గానూ పెట్రోగ్రాడ్‌లో బలగాల పంపిణీకి కావలసిన పథకాన్ని కూడా రూపొందించి పొందుపరిచాడు. ఏయే కీలక ప్రదేశాలను వెంటనే ఆక్రమించుకోవాలో కూడా ఆయన వివరంగా తెలిపి, చివరగా ఇదంతా ప్రస్తుత తరుణంలో తిరుగుబాటును ఒక కళగా పరిగణిస్తే తప్ప, మార్క్సిజానికీ, విప్లవానికీ కూడా విధేయంగా ఉండడం సాధ్యం కాదంటూ, అద్భుతమైన వాదనా పటిమతో లేఖను ముగించాడు.

అలాగే సెప్టెంబర్ 22న రాసిన 'పత్రికా రచయిత డైరీ నుంచి' అనే వ్యాసంలో డెమోక్రటిక్ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసిన ప్రీ పార్లమెంట్ ఏకైక లక్ష్యం కార్మికుల్నీ, రైతుల్నీ మోసగించి, నూతన విప్లవ వెల్లువ నుంచి వారిని పెడతోవ పట్టించడానికేనని ఆరోపించి, బోల్షివిక్కులు దాన్ని బహిష్కరించి ఉండాల్సిందని పునరుద్ఘాటించాడు. ఇవన్నీ రాస్తూనే ఆయన తనమకాంని హెల్సింగ్ ఫర్స్ నుంచి, సరిహద్దు పట్టనమైన 'వీబొర్గ్'కి మార్చాడు. ఎందుకంటే కేంద్ర కమిటీకి మరింత అందుబాటులో ఉండేందుకు గానూ, పెట్రోగ్రాడ్ నగరానికి ఆ పట్టణం అత్యంత సమీపంలో ఉన్నందున తిరిగి 29న కీలకమైన ప్రస్తుత వ్యాసం 'సంక్షోభం పరిణతమైంది' రాశాడు. ఈ వ్యాసం 6 భాగాలుగా విభజితమైంది గానీ, లెనిన్ సంకలిత రచనలు 5వ సంపుటంలో 4వ భాగం కేవలం చుక్కలతో చూపించబడింది. తప్ప, విషయం లేదు. ఈ భాగం సెన్సార్ల పాలైందేమో తెలియదు. ఇప్పుడు ఈ ఐదు భాగాల్లో గల విషయాన్ని క్లుప్తంగా తెలుసుకుందాం.

మొదటి భాగం

సెప్టెంబర్ నెల చివరి రోజులు రష్యన్ విప్లవ చరిత్రలోనే గాక, యావత్తు ప్రపంచ విప్లవ చరిత్రలోనే ఓ గొప్ప మలుపును తెచ్చిందంటూ, జర్మనీలో లీబ్‌క్నెక్ట్, ఆస్ట్రియాలో ఆడ్లర్, బ్రిటన్ మొదలైన మహావీరులు అమిత ధైర్యం తో ప్రపంచ కార్మికవర్గ విప్లవంలో, అధికారిక సోషలిజంలో కుళ్లిపోయింది. పోగా (అది నిజానికి సోషల్ జాతీయ దురహంకారం), మిగిలిన నిజాయితీ పరమైన దానికంతా ప్రాతినిధ్యం వహించి, ప్రపంచ విప్లవ వైతాళికులుగా మిక్కిలి కష్టభూయిష్టమైన పాత్రను నిర్వహించారంటూ, వారిని కొనియాడుతూ వ్యాసాన్ని మొదలెడుతాడు లెనిన్.

ఇక విప్లవం రెండో దశలో, సామాన్య జనంలో అసంతృప్తి తీవ్రంగా వ్యాపించడంతో, అధికార పార్టీలు కూడా చీలికలు పేలికలయ్యాయని, నిషిద్ధ సాహిత్యం, వీధి ప్రదర్శనలు తీవ్రంగా పెరిగిపోయి, వీటిని యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలు జత కలిసి, జర్మనీ, ఇటలీ, బ్రిటన్ వంటి దేశాల జైళ్లన్నీ ఖైదీలతో నిండి పోయ్యాయి అంటాడు ఆయన.

ఇప్పుడు మొదలైన మూడో దశను విప్లవ ప్రాంగణం అనవచ్చునంటూ, ఇటలీలో పార్టీల నాయకుల మూకుమ్మడి అరెస్టులు, జర్మన్ సైన్యంలో తిరుగుబాట్లు మొదలవడం, ఇవన్నీ ఓ గొప్ప మలుపు రాబోతున్నదనేందుకూ, మనమంతా ఒక ప్రపంచ వ్యాపిత విప్లవ ప్రాంగణంలో ఉన్నామనేందుకూ అసందిగ్ధమైన సూచన అని ఆయన పేర్కొంటాడు. అయితే ఇంతకన్నా ముందే జర్మనీలో కొన్ని బలహీనమైన చిన్న విడివిడి తిరుగుబాట్లు జరిగినప్పటికీ, వాటిని కప్పిపెట్టగలిగారనీ, కానీ చివరికి ఉద్యమం ఎంతగా పరిణతమైందంటే, దాన్ని కప్పి పెట్టడం అసాధ్యమైందని ఆయన అంటాడు. (4000 మంది సైనికులు సభ్యులుగా చేరిన ఈ ఉద్యమం క్రూరంగా అణచబడి, నాయకులంతా మరణ శిక్షకు, మిగిలిన వారు క్రూర దండనకు గురయ్యారు) కనుక నిస్సందేహంగా మనం ప్రపంచ కార్మికవర్గ విప్లవ ప్రాంగణంలో ఉన్నామని ఆయన నొక్కి చెపుతాడు. అయితే అన్ని దేశాల్లోనూ గల అందరు శ్రామిక వర్గ అంతర్జాతీయ వాదుల్లోనూ రష్యన్ బోల్షివిక్కులే కొంతమేరకు స్వేచ్ఛను అనుభవిస్తున్నారనీ, ఎందుకంటే, దానికో చట్టబద్ధమైన పార్టీ, 20కి పైగా పత్రికలు (రష్యన్, రష్యనేతర భాషల్లో), రెండు రాజధాని నగరాల కార్మిక, సైనిక ప్రతినిధుల సోవియట్లూ తమ పక్షాన ఉన్నాయనీ, అంతేగాక, ఈ విప్లవ కాలంలో ప్రజల్లో మెజారిటీ కూడా తమ పక్షానే ఉన్నందున - (ఎవరెక్కువ పొందుతారో, అతని నుంచి ఎక్కువ ఆశించబడుతుంద'నే నానుడికి) తమకు విధిగా అన్వయించుకోవాలనీ ఆయన వాదిస్తాడు.

రెండవ భాగం

ఏమైనా ఒక రైతాంగ దేశంలో, నిన్నటిదాకా పెటీ బూర్జువా డెమోక్రటిక్ ఉద్యమంలో ప్రాబల్యం వహించిన ఎస్.ఆర్.లూ, మెన్షివిక్కులూ బూర్జువా వర్గంతో కలిసి రోసిపోయిన మిశ్రమ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి, డెమోక్రటిక్ ఉద్యమ్యాన్నీ, విప్లవాన్నీ మోసం చేస్తూ, విప్లవ, రిపబ్లిక్ రష్యాలో, సోవియట్ల సరసన, పెట్టుబడిదారుల, భూస్వాముల ప్రయోజనాలు కాపాడుతున్న సంగతి కటువైన, ఘాతుకమైన ఒక వాస్తవమంటూ ఆక్రోశాన్ని వెళ్లబుచ్చుతాడు. వీటన్నింటితో పాటు, సామ్రాజ్యవాద యుద్ధాన్ని పొడిగించడం ద్వారా, ప్రజలపై రుద్దబడిన కష్టాలూ, కడగండ్ల వల్ల, రష్యాలో ఒక రైతాంగ తిరుగుబాటు మొదలై, వ్యాపిస్తుండడం వల్ల విప్లవం ఒక కీలక ఘట్టాన్ని చేరుకుందంటూ విశ్లేషిస్తాడాయన.

ఇక బోల్షివిక్కుల శత్రువులైన ఎస్.ఆర్.లు మిశ్రమ ప్రభుత్వంలో చేరి పాలన సాగిస్తూ, కొద్ది వారాల కిందటి దాకా మెజారిటీ ప్రజల మద్దతు పొంది కూడా, తమ ప్రభుత్వ విధానం రైతు ప్రయోజనాలకు ద్రోహం చేస్తున్నదని ఆరోపించిన కొత్త ఎస్.ఆర్.లను (ఎస్.ఆర్.లలో చీలిక వచ్చి ఏర్పడ్డ వామపక్ష ఎస్.ఆర్.లను) వేధిస్తూ, దూషిస్తున్నారు. అయితే అధికారిక ఎస్.ఆర్.ల పార్టీ పత్రిక 'దేలో నరోద' సంపాదకీయంలో వర్ణించిన దాన్ని బట్టి, ఈ ప్రభుత్వ కాలంలో భూస్వాముల కింద రైతుల దాస్యాన్ని తుదముట్టించేందుకు ఏమీ జరగలేదనీ, ఎస్.ఆర్.లు తమ సహచరుడైన కేరెన్స్కీనీ, అతని మంత్రుల్నీ స్తోలీపిన్లు (మొదటి విప్లవం 1905-07 విఫలమయ్యాక, జార్ ప్రభుత్వంలో అంతరంగిక, ప్రధానమంత్రిత్వాలను నిర్వహించిన స్తోలీపిన్ కార్మికులు, రైతులపై తీవ్ర ప్రతీకార దాడులకు పాల్పడ్డాడు. వేలాది మందిని ఉరికి, కాల్చివేతలకు గురిచేశాడు. ప్రత్యేకంగా బోల్షివిక్కుల వేట సాగించాడు. ఇతని కాలాన్ని 'స్తోలీపిన్ అభివృద్ధి నిరోధక అంధకార యుగం' అంటారు) అని పిలువకగత్యంతరం లేని స్థితిలో పడ్డారని ఆ పత్రికే చెప్పిన సంగతిని లెనిన్ ఈ సందర్భంలో గుర్తు చేస్తాడు.

కనుక మిశ్రమ ప్రభుత్వం కూలిపోక తప్పదనేందుకు, కేరెన్స్కీని సహిస్తున్న అధికారిక ఎస్.ఆర్, ఒక ప్రజా వ్యతిరేక, రైతు వ్యతిరేక, విప్లవ ప్రతీఘాత పార్టీ అయ్యిందనేందుకు, యావత్తు విప్లవం ఒక మలుపు చేరుకున్నదనేందుకు ఇంతకంటే మంచి రుజువు ఇంకేం

చర్చ

బాపు బొమ్మల్లో తెలుగుతనం

తెలుగు తనానికీ, అందమైన తెలుగు అమ్మాయికీ పర్యాయ పదంగా చెపుతున్న చిత్రకారుడు బాపు గురించి మరొక కోణంలో విశ్లేషిస్తున్నారు **పి. రామకృష్ణ**

అందమైన అమ్మాయిని చూసినప్పుడు బాపు బొమ్మజ్ఞప్తికొస్తుందనీ, ఆయన బొమ్మలో అచ్చమైన తెలుగు తనం ఉంటుందనీ అన్నప్పుడూ విన్నప్పుడూ నాకో అనుమానం కలిగేది. బాపు మరణంతో తెలుగుతనం పోయింది. తెలుగు సంస్కృతి దిక్కులేనిదైంది అని వినిపిస్తున్న మాటలతో మళ్లీ నాకదే అనుమానం కలుగుతోంది. అనుమానం మంచిదైనా, కాకపోయినా, లోపలే ఉంచుకోకుండా వ్యక్తం చేయడం మంచిదే కదా అని, ఈ చెప్పడం. అందంగా ఉండడమూ, తెలుగు తనమూ ఒకటేనని అనుకుంటున్నారా; ఒకటేనా; ఇవీ నా అనుమానాలు.

బాపు గొప్ప సృజనాత్మక కళాకారడూ, చిత్రకారుడూ అనీ, ఆయన బొమ్మలు కదిలేవైనా, కదలనివైనా అందంగా ఉంటాయనీ ఎవరైనా ఒప్పుకోవలసిందే. అందంగా ఉండడమనేది ఆయన లక్ష్యం. సినిమాలో కథానాయిక మనిషే అయినా, అందంగా కనిపించడమే ఆమె ప్రాధాన్యత. ఒక రకంగా అది బాపు ప్రత్యేకత. పరిమితి కూడా. ఏమైనా అందంగా ఉండడమనేది తెలుగు వాళ్ల సొంతమేమి కాదు. ఆ రెండూ వేరువేరు అయినప్పుడు, రెండూ బాపు బొమ్మలో ఎలా ఉన్నట్టు? అసలు తెలుగుతనం అంటే ఏమిటి? ఎక్కడ ఉన్నట్టు? ఆయన బొమ్మలో ఉండే వాలుజడలోనా, జడలో ఉండే పూలలోనా, కళ్లలోనా, చీరెకట్టులోనా, చీరెకట్టులోని వంపుల్లోనా... లేక ఈ అన్నింటి కలయికలోనా; ఇందులో దేనికో దానికో, అన్నింటి కలయికకో అనుకుంటే, అలా లేని బొమ్మల్లో తెలుగుతనం లేదనుకోవలసి వస్తుంది. అనుకోవచ్చా?

అసలు వీక్షణం పత్రిక ఈ చర్చను అనుమతిస్తుందో లేదో తేలీదు. అయితే వీక్షణం తెలుగు పత్రికే కనుక, 'తెలుగుతనం' ప్రస్తావన ఇందులో ఉంది కనుక, ప్రధాన స్రవంతి పత్రికలలో వెలువడిన వాటికి భిన్నంగా ఉన్న సామాజికాంశాన్ని ఆహ్వానిస్తోంది కనుక, చర్చను కొనసాగించడం సాధ్యం కాకపోతే, అభిప్రాయాన్నయినా ప్రకటించాలి. అది 'వీక్షణం' వీక్షణానికి వదిలి విషయానికొద్దాం. తెలంగాణ చిత్రకారులైన వైకుంఠం, రాజయ్య, శేషగిరిరావు, లక్ష్మణ్ వంటి వారి బొమ్మల్లో తెలుగుతనం కనిపించదు. వాళ్లు తెలుగు చిత్రకారులే, అందరమూ తెలుగు వాళ్లమే అంటున్నాం కూడా. అయినా వాళ్ల బొమ్మలు బాపు బొమ్మల మాదిరి లేవు. కనుక, వాటిలోను మనకు తెలుగుతనం కనిపించడం లేదు! అంటే దేన్ని తెలుగుతనం అంటున్నామో తెలుసుకోవచ్చు. ఇతరులను (తెలుగు వాళ్లే అయిన) గుర్తించకపోడమూ, మనల్ని మాత్రమే గుర్తించడమూ అన్నది స్వాతిశయ భావన. ఆ భావనకు జీవితంలో కానీ, సమాజంలో కానీ ఆధారాలూ, ప్రామాణికత ఉండనవసరం లేదు.

తెలుగు వాళ్లే అయిన ఇతర ప్రాంతాల వారిది అసలైన తెలుగు కాదు, మాది అసలైన తెలుగు అనుకోవడం లాంటిదే ఇదీ! తెలుగంటే మాదే అన్నప్పుడు, అది మాత్రమే తెలుగు ఎలా కాదో? బాపు బొమ్మలో తెలుగుతనం ఉంటుందంటే, అందులో మాత్రమే తెలుగుతనం అంతా ఉండదు. తెలుగుతనం అంటే ఏమిటి అన్న పెద్ద చర్చను వదిలేసి, బాపు బొమ్మలో ఉన్నదేమిటి అన్న అంశానికి పరిమితమవుదాం.

తెలుగు అమ్మాయంటే ఇలా ఉండాలి, ఆడవాళ్లు ఇలా ఉండాలి అని కోరుకునే ఊహాత్మక రూపం అది. ఒక్క మాటలో చెప్పాలంటే, మగతనం కోరుకునే ఆడతనం అది! మగవాళ్లు మాత్రమే అలా ఉండాలని కోరుకోవడం లేదు, ఆడవాళ్లు కూడా కోరుకుంటున్నారు. అనవచ్చు. నిజమే. అయితే, ఎందుకు?

సినిమాల్లో బాపు కథా నాయికలు రాకముందు ఆడవాళ్లు ఎలా ఉండే వాళ్లు? 'నోరుమూసుకొని వంటింట్లోకి తగలాడు' అని భర్త అంటే తలవంచుకొని వెళ్లే వాళ్లు. 'ఏమే, ఎక్కడ చచ్చావ్?' అంటే 'వస్తున్నానండీ...' అంటూ వచ్చేరకం. ఆ ధోరణిని మార్చి భర్తల్ని 'మిస్టర్ పెళ్లాం'గా చూసుకోగలిగితే, ఆ మార్పు కృత్రిమంగా ఉన్న సరే ఇష్టంగా ఉంటుంది కదా! పైగా అందులో ఉన్నది బూతుకాదు. శృంగార అభినయమే కనుక, ఆక్షేపించేదీ ఉండదు. రచయితలు తమ పుస్తకాలకు ముఖచిత్రంగా బాపు బొమ్మను కోరుకున్నారంటే వాళ్లకు బాపు బొమ్మ మీద ఉన్న నమ్మకం వాళ్ల రచన మీద లేదనుకోవాలి. అందర్నీ అలా అనుకునేట్టు చేయడం సామాన్య విషయమా అంటే, కాదనే ఒప్పుకోవాలి. ఒక్క మనిషి అంత కృషి చేయడమూ, అంత నేర్పు చూపడమూ అసాధారణమైనదే. మాట్లాడుతున్నది దాన్ని గురించి కాదు, బాపుబొమ్మలో తెలుగుతనం గురించే. బాపు బొమ్మలో ఉన్న తెలుగుతనం సాక్ష్యాత్తూ మన తెలుగుఇళ్లలో ఉండడానికి ఒప్పుకుంటామా? ఉంటే ఊరకుంటామా; ఏమిటా వయ్యారాలు ఒలక పోయడాలూ, సిగ్గు లేకుండా సిగ్గుపడటాలూ, కళ్లార్పడాలూ అని కళ్లెర్ర చేయమా? అందులో ఆడవాళ్లకూ, మగవాళ్లకూ తేడా ఉండదు. అంటే, అందరికీ ఇష్టంగా ఉన్న తెలుగుతనం వాస్తవ జీవితంలో ఉండడానికి ఎవరూ ఒప్పుకోరు. అది మన ఆత్మవంచనాభిరుచి. దాన్ని తృప్తి పరుస్తుంది బాపుబొమ్మ. అది గొప్ప విషయం కాదా అంటే, చెప్పుకున్నాం కదా గొప్పదేనని. చెప్పుకోవలసింది 'గొప్ప'లు చాలా రకాలనీ, నీకేది నచ్చుతుందో అది అన్నిటి కన్నా గొప్పదనుకుంటావనీ.

(రచయిత కథా రచయిత) వీ

ఉంటుందని ఆయన ప్రశ్నిస్తారు. పెట్టుబడిదారులకు, భూస్వాములకు ప్రాతినిధ్యం వహించే ఎస్.ఆర్.ల, మెన్షివిక్కుల ప్రభుత్వానికి వ్యతిరేకంగా, ఒక రైతు దేశంలో, రైతాంగ తిరుగుబాటు! ఈ తిరుగుబాటును ఒక రిపబ్లికన్ ప్రభుత్వం సైనిక చర్య ద్వారా అణచివేయడం, ఇలాంటి వాస్తవాల దృష్ట్యా, ఒక సంక్షోభం పరిణతమైందనీ, రైతాంగ తిరుగుబాటు మీద ప్రభుత్వ విజయం ఇప్పుడు మృత్యుగంటను మోగిస్తోందనీ, అది కొర్నీలొవ్ తిరుగుబాటుకు అంతిమ విజయం దక్కడం గానీ పరిగణించాల్సి ఉంటుందని ఆయన వాపోయాడు.

(ఇంకా ఉంది)

(రచయిత రిటైర్డ్ లెక్చరర్) వీ

మోహనరాగం - రాజ్యాంగ నైతికత

మహబూబ్‌నగర్ దుర్భర కరువు పరిస్థితుల నేపథ్యంలో అక్కినేని కుటుంబరావు రాసిన 'మోహనరాగం' నవలను విశ్లేషిస్తూ రాజ్యాంగ నైతికతను చర్చిస్తున్నారు **ఓల్గా**

(గత సంచిక తరువాయి)

పనులకెళ్లి వస్తున్న స్త్రీలను ఈ ఉద్యోగులు పిల్చి చదువు చెప్తాం రమ్మంటారు. వాళ్లు మాకు సదువెందుకు మందులివ్వండి అంటారు. వీళ్లేవో ఊరు పేర్ల గురించి ప్రశ్నలేస్తుంటే ఒక ముసలామె లేవబోయి, లేవలేక చేతులు జోడించింది. 'అప్పట్నుంది జూస్తున్న మీరు మంచోల్లు! బీమార్లున్న ఆడ మనుషులకు గోలీలిస్తరు. గింత చదువు చెప్తరు మంచిగనే. ఓయ్య అటుజూడు.. నీకాలు మొక్త పశిపోరలు అల్లల్లాడుతున్నరు. అయ్యా, నాయనే. జర్ర ఇన్ని జొన్నలిచ్చిపోండ్రి. శానదినాలాయే కూడు లేక'.

ఎక్కడికెళ్లినా ఆకలితో హాహాకారాలు చెయ్యని మనిషి లేదు.

'అయ్యా...దేవదారు కూర పీక్కచ్చి దింటున్నం. గడ్డలు తవ్వకొచ్చి తింటున్నం. జాజిరాకుల్ని నీల్లల్ల ఉడ్కపెట్టుకు తింటున్నం. చస్తమో బత్కతమో కూడా చూడకుండా ఏదంటే అద్దింటున్నం. అవ్వి కూడా దొర్కుతలేవు. నాలుగ్గింజల్చి పోండ్రి'.

ఏ మనిషి కూడా మనిషిలాగ లేడు.

మనుషుల కళ్లు మనకు కన్పించవు.

అవెక్కడో గుంటల్లో ఉంటాయి.

మనుషుల మాటలు మనకు విన్పించవు.

అవెక్కడో గోతుల్లోంచి వస్తాయి.

ఈ మనుషులు నడవడం లేదు.

తమనుతాము ఈడ్చుకుంటున్నారు.

వాళ్లకీ ప్రపంచంలో ఏమీ లేదు.

అసలీ ప్రపంచం వీళ్లది కాదు.

వీళ్లకిక్కడ తిండేలేదు. తిండిలేనివాళ్లకేం ఉంటుంది!

వాళ్లకి భవిష్యత్ లేదు.

గతం లేదు.

వర్తమానం మాత్రం ఉంది.

అది మంటలతో భగ్గుమంటూ ఒక్కొక్కరినే నెమ్మదిగా కాలుస్తూ ఉంది.

ఆ పేద గ్రామీణులను చూస్తే మోహన్, సుజాతలకు కలిగిన భావాలివి. వారి బాధను ఇంతగా గమనించినా గ్రామీణులకు కావలసిందేమిటో స్పష్టత ఇవ్వని చదువులు చదివి వాళ్లకోసం పని చేయడానికి వెళ్తున్నారు కొందరు యువతీ యువకులు. అనుభవం మీద వాళ్లు నేర్చుకున్నా , తెలుసుకున్నా చేయగలిగింది లేదు. ప్రాజెక్టు డైరెక్టర్ పంకజవల్లి 'తర తరాల వాళ్ల ఓర్పువల్లనే వాళ్లకీ ఆకలి. వాళ్లకి ఫుడ్‌లేదు. ఆహారం ఉత్పత్తి చేయడం వరకే వీళ్ల పని. దాన్ని దాచుకోవడం వేరేవాళ్ల పని. ఆహారం మీద, అది పండే భూమి మీద వీళ్లు హక్కు సంపాదించే వరకూ... ఈ ఆకలి, ఈ ఓర్పు వాళ్లని తినక తప్పదు. మనమా? ఈ ప్రాథమిక అవసరాలు తీర్చకుండా మనం ఎన్ని సంక్షేమ పథకాలు పుచ్చుకుని వాళ్ల దగ్గరికి వెళ్లినా... ఇలాగే... ఇవ్వాళ లాగే... వృథా వృథా!' అంది మోహన్ ఆవేశంతో. 'భారతదేశంలో వైద్యుడు కాని యువకుడి బతుకు వ్యర్థం. ప్రైమరీ మెడికల్ ట్రెనింగ్ నేర్చుకోవాలి. తీరిక సమయాల్లో గ్రామాల్లో వైద్యం చేయాలి' అంటే 'గ్రామాల్లో ప్రజలకు కావల్సింది తిండి. ముందు వాళ్లకి తిండి కావాలి. తిండే వాళ్లకి మందు.

వాళ్ల అన్ని రోగాలకు మూలం ఆకలే. గ్రామాల్లో ఉండే వాళ్ల రోగాలన్నిటినీ సర్వే చేస్తే అన్ని రోగాలకీ కారణం మాల్ న్యూట్రిషన్ అని తేలింది. మాల్ న్యూట్రిషన్‌కి మందు ఆహారం. తిండి. అన్నం.'

అని చాలా స్పష్టంగా చెబుతుంది పంకజవల్లి. నిజంగా అదే సంగతి. ఇది 1972 – 73 సంవత్సరాల నాటి కథ. 1988 – 89లో మరొకసారి మహబూబ్‌నగర్ జిల్లాలో భయంకరమైన కరువు వచ్చింది. స్వచ్ఛంద సంస్థలు గంజి కేంద్రాలు ఏర్పాటు చేశాయి. గత అనుభవాల నుంచి ప్రభుత్వం ఏమీ నేర్చుకోలేదని తమ అధ్యయనాలలో పౌర హక్కుల, మానవ హక్కుల సంఘాలు వెల్లడించాయి. కరువు మళ్లీ రావచ్చు. ఎక్కడైనా రావచ్చు. ఈరమ్మలు, శాంతమ్మలు చచ్చిపోతూనే ఉంటారు. అప్పటికీ, ఇప్పటికీ ఆర్థిక అసమానతలు విపరీతంగా పెరిగిపోవడం వల్ల, ఆకలి బీదరికం తీవ్రత కూడా పెరుగుతుంది. అనారోగ్యం, రోగాలు విజృంభించవచ్చు. ప్రభుత్వ విధానాలే ప్రజల జీవించే హక్కును హరించి వేస్తున్నప్పుడు రాజ్యాంగం సాధికారత ఏమిటి అనే ప్రశ్న మళ్లీ మళ్లీ తలెత్తుతుంది.

ఆదేశిక సూత్రాలలో అధికరణం 38లో ప్రజా సంక్షేమానికి అనుగుణమైన సామాజిక వ్యవస్థ ఉండాలి అని రాసుకున్న రాతలను ప్రభుత్వం పూర్తిగా మర్చిపోయింది.

'ప్రత్యేకించి ఆర్థిక అసమానతలను సాధ్యమైనంత మేరకు తగ్గించేందుకు ప్రభుత్వం కృషి చేయాలి. అంతే కాకుండా కేవలం ప్రజల మధ్య హోదా, సౌకర్యాలు, అవకాశాలలో గల తారతమ్యాలను తొలగించేందుకు ప్రయత్నించడమే కాకుండా, విభిన్న ప్రాంతాలలో లేక విభిన్న వృత్తులలో గల ప్రజల మధ్య హోదాలు, సౌకర్యాలు అవకాశాలలో గల తారతమ్యాలను తొలగించేందుకు కూడా ప్రయత్నించాలి' అని రాజ్యాంగం చెపుతుంది.

పరిపాలన చేయడంలో ప్రభుత్వాలు ఆదేశిక సూత్రములను తప్పని సరిగా ప్రామాణికంగా తీసుకోవాలి అని రాజ్యాంగం చెపుతుంటే ప్రభుత్వాలు రాజ్యాంగ ఉల్లంఘనలు ఇష్టం వచ్చినట్లు చేస్తూ పోతున్నాయి. 'ప్రజా సంక్షేమం' 'ప్రజలు' వీటి నిర్వచనాలు మారిపోతున్నాయి.

దీనికి పూర్తి విరుద్ధంగా ప్రభుత్వ పథకాలు ఉంటున్నాయి. మినరల్ వాటర్‌కు వందల రూపాయలు ఖర్చుపెట్టే ప్రణాళికా సంఘం రోజుకి 22 రూపాయలతో ఒక కుటుంబం బతకగలుగుతుందని, దానిని బీద కుటుంబం అనలేమనీ పేర్కొన్నది. ఇవన్నీ యువతరాన్ని కలవరపరుస్తున్నాయా? మోహనరాగంలో మోహన్ కలవరపడినట్లు

పెరుగుతున్న బీదరికాన్ని, ఆర్థిక అసమానతలను చూసి ఈనాటి యువతరం కలవరపడుతోందా? మోహనరాగం నవలలోకి ప్రత్యక్షంగా రాకుండా మోహన్ సామాజిక చైతన్యానికి కారణ భూతుడైన చంద్రం వంటి వాళ్ల సంఖ్య పెరిగిందా? తరిగిందా? వాళ్లేం చేస్తున్నారు? ఈ నవల చదివిన పాఠకులు ఈ ప్రశ్నలతో పాటు ఆకలి, బీదరికాల గురించి మరింత మానవీయంగా ఆలోచించగలుగుతారు. ఆ మానవీయతే వారిని రాజ్యాంగంలోని జీవించే హక్కుకున్న విస్తృత పరిధి గురించి ఆలోచించేలా చేయాలి. ఆ మానవీయతే వారిలో కేవలం ఆధ్యాత్మిక అవసరాలను తీర్చడంతో తృప్తి పడకుండా, ఓ కన్నీటి బొట్టు రాల్చడంతో సరిపెట్టకుండా రాజ్యాంగ నైతికతను పెంచుకోవడానికి దోహదం చేయాలి.

స్త్రీలకు కావలసిన ఆహారం, పోషకాహారం, ప్రసూతి సౌకర్యాలు అందించకుండా కమలకు తొలిచూలు లాంటి పాఠం చెప్పడం చూస్తుంటే 'స్త్రీలకు మరింత మెరుగైన టెక్నిక్కులు నేర్పడం, బొసెరూప్ అనుకున్నట్టుగా – అంటే కాన్సర్‌కి బాండ్ ఎయిడ్‌తో చికిత్స చేసినట్లు ఉంటుంది.' (బెనెరియా&సేన్ 1981 పుట 281) అన్న వాక్యం గుర్తొస్తుంది.

మోహనరాగం ఎంతగా అభివృద్ధికి సంబంధించిన నవలో అంతగా జండర్ వివక్షకు సంబంధించిన నవల కూడా. జండర్ సమానత్వమూ, అభివృద్ధి ఒకదానితో ఒకటి విడదీయలేని సంబంధం కలిగి ఉన్న అంశాలు. జండర్ సమానత్వం లేనిదే అభివృద్ధి లేదు. ఈ నవలలో కూడా రెండు విషయాలు విడదీయలేనట్లుగా కలగలిసిపోయాయి. గ్రామీణ స్త్రీల పరిస్థితులు, వారి అభివృద్ధి గురించిన ఆలోచనలు ఒక పక్కన ప్రధాన భాగాన్ని ఆక్రమిస్తాయి. వాటి గురించి ఇప్పటి వరకూ కొంత చర్చించాం. ఇంకోవైపు సమానత్వంలోకి అడుగుపెడుతూ, వ్యక్తి స్వేచ్ఛను అపుడపుడే రుచి చూస్తూ విద్యావంతులైన మొదటితరం యువతులు ఎదుర్కొనే సంక్లిష్ట పరిస్థితులు ఈ నవలలో ముఖ్య భాగంగా ఉన్నాయి, ఈ సంక్లిష్టత వారి కుటుంబాలలో ఉంది. పనిచేసే చోటా ఉంది. చుట్టూ సమాజంలోనూ ఉంది. ఈ మూడు చోట్ల స్త్రీలు సమానత్వం కోసం అడుగుతున్నారు. అక్కడ తమకు వివక్ష లేని, హింస లేని చోటు కోసం తమకు సాధ్యమైనన్ని రీతులలో పోరాటాలూ చేస్తున్నారు. చాలా సార్లు ఆ పోరాటాలు వ్యక్తిగత స్థాయిలోనే ఉంటాయి. ఆ పోరాటాలలో కొన్నిసార్లు బైటి సమాజం నుంచి సహాయం అందుతుంది, కొన్నిసార్లు తమంత తామే తలపడి నిలబడాల్సి వస్తుంది.

ఈ నవలలో సుజాత మోహన్ సహోద్యోగురాలు. మోహన్ లాగే లోకం అంతగా తెలియని సున్నిత మనస్కురాలు. ఆమే తండ్రి ఒక గ్రామీణ రైతు. ఆడపిల్లలను ప్రేమగా పెంచడం కొన్ని గ్రామీణ రైతు కుటుంబాలలో జరుగుతుంది. ఆడపిల్ల ప్రేమను పొందడంలోని ఆనందాన్ని తండ్రులు తమదైన భూస్వామ్య పద్ధతిలోనే అనుభవిస్తుంటారు. ఆడపిల్లలను చదివించడం వారి హోదాకు, కూతురిపై తమకు గల ప్రేమ ప్రదర్శనకు ఒక గుర్తవుతుంది. చదువున్న తెలివైన కూతురు తనను ప్రాణాధికంగ ప్రేమిస్తుందని, తన మాట జవదాటని వినయ విధేయతలు తనపట్ల కలిగి ఉంటుందనే నమ్మకం వారికెంతో గర్వాన్ని కలిగిస్తుంది. ఆ గర్వాన్ని వాళ్లు తమ చుట్టు ఉన్న వాళ్ల దగ్గర ప్రదర్శించి ఆనందిస్తూ దాని ద్వారా సమాజం నుంచి కొంత గౌరవ ప్రతిష్ఠలను పొందుతారు. అలాంటి రైతు సుజాత తండ్రి రంగయ్య. కూతిర్ని చదివించాడు. ఉద్యోగానికి పంపాడు. కూతుర్ని చూసుకుని గర్వపడుతున్నాడు. తండ్రి చూపే ప్రేమను, 'ఇచ్చిన' స్వేచ్ఛను ఒకే కోణంలో అర్థం చేసుకున్న సుజాత, తన జీవితానికి సంబంధించిన నిర్ణయాలు తను తీసుకుంటే కూడా తండ్రి సంతోషిస్తాడనుకుంది. చదివించినట్లే ఉద్యోగం చేయించినట్లే ప్రేమించిన వాడితో పెళ్లి జరిపిస్తాడనుకుంది. జరిపించేవాడే, మోహన్‌ది వేరే కులం కాకపోతే.

వేరే కులం వాడితో కూతురి పెళ్లి జరిపించడం ఆయనవల్ల కాదు. గ్రామంలో ఆయన పరువు కుల సమాజపు గుప్పిట్లోనే ఉంది. తన కుల సమాజం దాటి వెళ్లే ధైర్యం, ఇష్టం ఆయనకు లేవు. సుజాతను గదిలో బంధించారు. తల్లి, అన్నదమ్ములు, సుజాతను ప్రాణంగా అభిమానించే వారంతా ఆమెను ద్వేషించి ఒక శత్రువులా హింసించారు. కారణం కులం. వివాహంలో కులానికున్న పట్టు రోజురోజుకు పెరుగుతోందే గాని తరగడం లేదు. కుల నిర్మూలనకు కులాంతర వివాహాలొక బలమైన సాధనాలని అంబేద్కర్ భావించాడు. కుల నిర్మూలన తదితర రచనలలో ఆ వాదనను బలంగా ప్రతిపాదించాడు.

'కుల నిర్మూలనకు సరైన పద్ధతి వర్ణాంతర వివాహాలేనని నా దృఢ విశ్వాసం. రక్త సమ్మిశ్రణ ఒక్కటే మానవులలో అనోన్య అనుబంధ భావాన్ని బాంధవ్యాన్ని కలిగిస్తుంది.' (కుల నిర్మూలన, అంబేద్కర్, అనువాదం: బోయిభీమన్న, 2001, హైదరాబాద్ బుక్‌ట్రస్టు పుట 52).

'హిందువుల సాంఘిక జీవనంలో వర్ణాంతర వివాహాలు, హైందవేతరులలో శాఖాంతర వివాహాల కంటే అత్యధిక ప్రాధాన్యం వహించాలి. హైందవేతరులలో సాంఘిక సమైక్యానికి ఎన్నో శక్తులు పనిచేస్తూ ఉంటై కనుక, ఈ వివాహాలు అంత ప్రాధాన్యం వహించనక్కర లేదు. అవి ఒక సాధారణ సంఘటనలు మాత్రమే. హిందూ సమాజం కులాల వల్ల ఉప కులాల వల్ల చిన్నాభిన్నం చేయబడి ఉంది. కనుక వారందరినీ కలిపి ఒక సుసంఘటితమైన సమాజంగా తీర్చిదిద్దాలంటే అందుకు వర్ణాంతర వివాహాలు తప్పనిసరైన తక్షణ కర్తవ్యం. కుల వ్యవస్థను రద్దు చేయడానికి సరైన మందు వర్ణాంతర వివాహాలే. మరొకటేది పనికిరాదు.' (పైన చెప్పిన పుస్తకంలో పుట 52, 53)

కరడు కట్టిన కుల వ్యవస్థలో తల్లి దండ్రులు తమంత తాము పూనుకుని వర్ణాంతర వివాహాలను జరిపించరు. గనుక యువతీ యువకులు కుల, మత, వర్గ ప్రమేయం లేని ప్రేమ వివాహాలను కోరుకున్నప్పుడే అది సాధ్యమవుతుంది. ఒక వయసు వచ్చాక వివాహం తమ ఇష్ట ప్రకారం, ఇష్టమైన వారిని ఎంచుకుని చేసుకునే స్వేచ్ఛ, యువతీ యువకులకు ఉన్నప్పుడే అది సాధ్యం. ఆ స్వేచ్ఛను సహించని తల్లి దండ్రులను, కుటుంబాలను వదిలివేయడం తప్ప వారికింకో మార్గం లేదు. ఆ నిర్ణయం వారి జీవితాలలో చాలా పెద్ద నిర్ణయమే. ఆ నిర్ణయం తీసుకోవడానికి కుటుంబం, సమాజం విధించే వెలిని, బహిష్కారాన్ని, చిన్న చూపును ఎదుర్కోగల సాహసం కావాలి. సుజాత ధైర్యం, సాహసం, తెలివి ఉన్న యువతి కాబట్టి ఆ నిర్బంధం నుండి బైటపడి, రహస్యంగా ఎవరికంటా పడకుండా ఊరుదాటి మహబూబ్‌నగర్ వెళ్లి మోహన్‌ను వెంటనే పెళ్లి చేసుకుంది. ఆ ధైర్యంలేని ఎంతో మంది యువతులు పరువు హత్యలకు గురవుతున్నారు. ఈ పరువు హత్యలు సామాన్యంగా బైటికి రావు. ఆత్మహత్యలు గానో సహజ మరణాలు గానో పరిగణించబడతాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 15, ఆర్టికల్ 21 యువతీ యువకుల ప్రేమ, పెళ్లి విషయాలలో విచ్చలవిడిగా ఉల్లంఘించబడతాయి. ఖాప్ పంచాయతీలు, కుల పంచాయితీలు రాజ్యాంగ విరుద్ధంగా అధికారికంగా పనిచేస్తాయి. న్యాయ స్థానాలలో కంటే ఇక్కడ విచారణ త్వరితంగా ముగిసి నేరస్తులైన ప్రేమికులకు వెంటనే శిక్షలు పడతాయి. రాజ్యాంగ బద్ధంగా నడుచుకుంటామని శాసన సభ్యులుగా ప్రమాణం చేసి పరిపాలనలోకి వచ్చిన ప్రజా ప్రతినిధులు ఖాప్ పంచాయితీలను సమర్థిస్తూ మాట్లాడతారు. వారికి శిక్షలుండవు. వారి పదవులు రద్దుకావు. కుల బలంతో మళ్లీ మళ్లీ

ఎన్నికలలో గెలిచి ప్రజా ప్రతినిధులై కుల వ్యవస్థను, స్త్రీ పురుష అసమానత్వాన్ని బలంగా నిలబెట్టేందుకు అధికారంలోకి వస్తారు. ఇదంతా ఇలా జరుగుతుందని తెలిసే అంబేద్కర్ కుల నిర్మూలన అత్యంత ముఖ్యమైనదనీ, దానికి భావాలలో, ఆలోచనల మార్పుతో పాటు, అధికారికమైన అమలు కూడా కావాలన్నాడు. భావాలలో మార్పు ప్రాముఖ్యాన్ని అంబేద్కర్ అనేక చోట్ల గుర్తించాడు. 'కులం అనేది హిందువులను కలవకుండా చేసే ఒక ఇటుకగోడో, ముళ్లతీగో కాదు, సులభంగా తొలగించి పారవేయడానికి. హిందువులలో కులం అనేది ఒక భావన. ఒక విశ్వాసం. ఒక మనఃస్థితి. కులాన్ని తొలగించడం అంటే ఒక భౌతికమైన అడ్డంకిని తొలగించడం కాదు. మనో భావాలలోనే ఒక మార్పు సాధించడం' (కుల నిర్మూలన – అంబేద్కర్, అనువాదం బోయి భీమన్న, హైదరాబాద్ బుక్ ట్రస్టు, 2001, పుట 53) ఆ మార్పు సాధించడానికి సవర్ణ హిందూ సంప్రదాయ ప్రవర్తనకు వ్యతిరేకంగా సూటియైన చర్య ద్వారా ఒక క్లిష్ట పరిస్థితి సృష్టించాలి. ఆ క్లిష్ట పరిస్థితి వారిని ఆలోచించేలా ఒత్తిడి చేస్తుందని అంబేద్కర్ రాజ్యాంగ శాసనాల అమలు అవసరాన్ని అనేక చోట్ల ప్రస్తావించాడు. కానీ అది జరగడం లేదు. మోహనరాగం నవలలో సుజాతలాగా వ్యక్తుల సాహసంతోనే కులాన్ని అధిగమించాల్సిన పరిస్థితే ఇంకా ఉంటోంది.

మోహనరాగం నిండా పరుచుకుని ఉన్న మరొక సంక్లిష్ట విషయం పనిచేసే చోట లైంగిక వేధింపులు. ఉద్యోగాలు చేసే ఆడవాళ్లని, ఒంటరిగా ఉంటూ, పెళ్లి చేసుకోకుండా ఉద్యోగాలు చేసే ఆడవాళ్లని తోటి మగ ఉద్యోగులు ఎంత తక్కువగా చూస్తారో, ఎన్ని పుకార్లు కల్పిస్తారో నవల ప్రారంభంలోని సంఘటనలలోనే చెప్పడంతో ఆ విషయం పట్ల రచయితకున్న చైతన్యం అర్థమవుతుంది. సుందర్రావు తమ పై ఆఫీసర్ పంకజవల్లి పెళ్లి చేసుకోలేదనేది ఒక విడ్డూరంగా మోహన్‌కి చెపుతూ దానిచుట్టూ ఒక కథ అల్లుతాడు.

పరమేశం అనే అతనికైతే ఛాయ, సుజాతలు మహబూబ్‌నగర్ వచ్చి పని చేయడమంటే ఇష్టం లేదు.

'ఈ వయసులో ఆడపిల్లలు ఇంతింత దూరాలు ఒంటరిగా' అంటూ వంకరగా మాట్లాడతాడు. మోహన్ ఈ విషయంలో రచయిత భావాలకు ప్రతినిధిగా కనపడతాడు. 'ఆడపిల్ల అంత దూరం వచ్చి ఉద్యోగం చేస్తోందంటే – ఆ పిల్లకి ఎంత ఆత్మాభిమానం. ఎంత వ్యక్తిత్వం, ఎంత అవసరం, ఎంతధైర్యం ఉన్నాయో ఓవైపు తెలుస్తూనే ఉన్నా తెలుసుకోరేం.'

'ఆ పిల్ల అంత దూరం వచ్చింది ఉద్యోగం కోసం కాక శీలం పాడు చేసుకోవడం కోసమేనన్నట్లు అంతంత అజ్ఞానంతో ఎలా ఆలోచిస్తారో ఈ మనుషులు'

మోహన్ సుందర్రావు, పరమేశం లాగా ఆడపిల్లలను అవమానించే ఆలోచనలు చేయడు గానీ తనకు కనిపించిన యువతుల అందచందాల గురించి మనసులో ఒక అంచనా వేసుకునే అలవాటులో ఉన్నాడు. అది పొరపాటని తెలిసినా చాలాసార్లు అలవాటుగా ఆ పొరపాటు చేస్తుంటాడు.

'అమ్మాయి కనపడగానే ఆ అమ్మాయి అందం గురించి అర్జంటుగా ఒక అభిప్రాయానికి రావలసిందేనా? సుందర్రావు అందాన్ని గానీ, పరమేశం అందాన్ని గానీ తను గుర్తించలేదే. కనీసం వారి అనాకారితనాన్నయినా. ఆడపిల్లని ఆడపిల్లగానే చూస్తామా? ఆడపిల్ల అనగానే అందంగా ఉందా లేదా అనే చూస్తామా?

ఎందుకూ? మనిషిగా గుర్తించమా?'

ఇట్లాంటి ఆలోచనలు, ఆత్మవిమర్శలూ కూడా మోహన్ అలవాటుగా రచయిత చెప్తాడు. మోహన్ ఈ పురుష సమాజంలో, ఆ భావాలను ప్రచారం చేసే చదువులు చదివి వచ్చినవాడు. ఆ చదువులను దాటిన చైతన్యం మోహన్‌కు చంద్రం అనే వామపక్ష ప్రభావితుడైన స్నేహితుడి ద్వారా దొరికింది. ఆ చైతన్యంతో ఆత్మవిమర్శ చేసుకున్నాడు.

ఈ నవలలో మరొక సంఘటనతో పనిచేసే చోట ఆడపిల్లలు ఎంతెంత ప్రమాదాల్లోకి వెళతారో రచయిత చాలా వివరంగా చెప్పారు. సబిత అనే పాత్ర చాలా అరుదైన పాత్ర. సాహిత్యంలో సామాన్యంగా ఇలాంటి పాత్రలను మనం చూడం. సబిత పల్లెటూరి పిల్ల. పదో తరగతి అయిందనిపించింది. యవ్వనంలో ఉంది. విపరీతమైన ఆకర్షణ ఆమె ముఖంలో. ఎప్పుడూ అందరితో నవ్వుతూ మాట్లాడుతుంది. సబిత నవ్వు, అందరితో నవ్వుతూ మాట్లాడడం అందరికీ సమస్యయి పోయింది. మొత్తం ఆ 'మాతాశిశు సంక్షేమ విద్యా పథకం' ప్రాజెక్టుకే సబిత నవ్వు సవాలయింది. ఆ పిల్లకి సహజమైన నవ్వు మిగిలిన అందరికీ అసహజం అయిపోయింది. సబితని చూసి, ఆమె నవ్వు చూసి సంస్కార వంతుడనుకున్న మోహన్ 'పెదాలు తడారిపోయినై' 'సబిత ముఖంలో నవ్వు విరబూస్తూనే ఉంది. సబిత కనులు నవ్వుల గనులు' అనుకుంటాడు.

పంకజవల్లి ఆమెతో 'అయిందానికి కానిదానికీ నవ్వొద్దని చెప్పాను. నీ నవ్వే కౌన్సిల్‌కి పెద్ద సవాలయిపోయింది తెలుసా?' అంటూ కోప్పడుతుంది. తన నవ్వు అంత పెద్ద సమస్య అని సబితకు ఎంత చెప్పినా అర్థం కాదు. 'ఈ కేంద్రం ఎత్తెయ్యాల్సిన పరిస్థితి ఎప్పుడూ తీసుకురాకు. నీలో తప్పులేదు. నాకు తెలుసు. కాని నీవల్ల కౌన్సిల్‌కి చెడ్డపేరు రాగూడదు గుర్తుంచుకో' అంటుంది డైరెక్టర్ పంకజవల్లి.

ఆడపిల్లల నవ్వులు, అమాయకత్వాలు సంస్థలకు చెడ్డపేరు తెస్తాయి. ఆడవాళ్ల పట్ల సుందర్రావు, పరమేశం వంటి వారికున్న అభిప్రాయాలు, ఆడవాళ్లతో వారి మాటలు, ప్రవర్తనా సంస్థలకు చెడ్డపేరు తీసుకురావు. వారి గురించి, వారి హీన సంస్కారాల గురించి కనీసపు చర్చ కూడా జరగదు.

సబిత పనిచేసే కేంద్రం దగ్గర కుర్రకారు చేరి స్కూలుని సరిగా జరగనివ్వరు. చివరికి ఒకరోజు ఆ ఊరిపెద్ద చిన్న కొడుకు, పెళ్లయినవాడు సబితను ప్రేమిస్తున్నానని లోబరుచుకుని తన ఇంటికి తీసికెళ్తాడు, ఇంట్లో అందరూ వ్యతిరేకం. ఐనా సబితను ఒకగదిలో ఉంచి సంబంధం పెట్టుకుంటాడు. ఇదంతా ఈ ప్రాజెక్టు వల్ల, కౌన్సిల్ వల్లా జరిగిందని, వాళ్ల పని పట్టాలని ఆ కుటుంబం, ఆ గ్రామస్తులు కోపంతో రగిలిపోతారు. పంకజవల్లి నేర్పుగా సబితను ఆ ఇంట్లోంచి బైటికి తీసుకువచ్చి వేరే ఊరిలో అదే ఉద్యోగం చేయమంటుంది. ఇదంతా జరిగే క్రమంలో సబిత గురించి సుందర్రావు, పరమేశం చాలా పిచ్చి మాటలు, ఆడవాళ్లను అవమానించే మాటలు మాట్లాడతారు. అందరూ కలిసి సబిత గురించి, ఆడవాళ్లు ఉద్యోగాల కొచ్చినప్పుడు నడుచుకోవాల్సిన తీరు గురించి ఎంతో మాట్లాడతారు. అందరూ అమ్మాయిలే జాగ్రత్తగా నడుచుకోవాలంటారు. పంకజవల్లి 'సబితా నువ్వు మనకింత సమస్య అవకూడదు' అంటూనే, సుజాత, ఛాయలతో, 'అమ్మాయిలూ మీరయినా గుర్తుంచుకోవాల్సింది ఏమిటంటే, మగవాళ్లతో మరీ అంత సోషల్‌గా తిరక్కూడదు. అది చూసి ఎవరో ఏదో అనుకోవడం, అనడం సంగతలా ఉంచి, ఆ మగాడే తనకోసం వీళ్లంతా ఎగబడుతున్నారనుకుంటాడు. ఒక్కోసారి వినేవాడుంటే ప్రచారం కూడా చేస్తాడు.' లోకరీతిని పంకజవల్లి చెప్పింది. కానీ ఆ లోకరీతి మారేదెట్లా. మారడానికి సమాజంలో ఏం జరగాలి? ఏం జరుగుతోంది. సబితని ప్రేమిస్తున్నానంటూ రాంచంద్రారెడ్డి ఇంటికి తీసికెళ్లినప్పుడేం జరిగిందో సబిత చెపుతుంటే ఆమె ఎంత ప్రమాదంలోంచి తప్పించుకుని వచ్చిందో తెలుస్తుంది.

అస్తిత్వవాద ఉద్యమాలు - ప్రత్యామ్నాయ దృక్పథం

***అస్తిత్వ ఉద్యమాలు పెట్టుబడిదారీ విధానాన్ని విస్మరిస్తూ, వ్యక్తి వాదాన్ని ముందుకు తెస్తూ సమష్టి విధానాన్ని బలహీనం చేస్తున్నాయని అంటున్నారు* అనిసెట్టి శాయికుమార్**

మానవ సామాజిక జీవనంలోని అన్ని రంగాలోనూ అనేక రూపాల్లో తీవ్ర ప్రభావం చూపుతున్న అస్తిత్వవాదం; ఎగ్జిస్టెన్షియలిజం అనే పదానికి తెలుగులో భావార్థకంగా ఉంది. ఈ అస్తిత్వవాదం కానీ, దీంతో పాటు ప్రాచుర్యం పొందిన 'ఆధునికానంతరవాదం (పోస్ట్ మాడర్నిజం) కానీ 'ఇది' అని నిర్వచించలేక పోయినా, స్పష్టంగా, సమగ్రంగా వివరించడానికి కూడా చిక్కవు. దీన్ని వివరించే క్రమంలో వివరించే వారిలోనే అనేక భేదాలుండడమే దీనికి కారణం. 'అస్తిత్వవాదం' గురించి పరామర్శించే క్రమంలో జీన్‌పాల్ సాత్రే మొదలుకుని ఆల్కెమిస్టు రచయిత పాలో కోయిలో దాకా అనేక తాత్విక విశ్లేషణలు తగులుతాయి. ఈ అసందర్భాన్నంతా వదిలించుకుని వర్తమానంలో 'అస్తిత్వవాదం' పేరిట చలామణిలో ఉన్న దాన్ని, జన జీవనంపై దాని ప్రభావాన్నీ విశ్లేషించాల్సి ఉంది. తెలుగునేలలో హేతువాద, మార్క్సిస్టు, సోషలిస్టు అవగాహనతో వచ్చిన అభ్యుదయ, విప్లవ ప్రజా ఉద్యమాలున్నాయి. వీటిలో పాల్గొంటూ అర్థం చేసుకునే (పార్టిసిపేటరీ అబ్జర్వేషన్) అవగాహనతో పై ఉద్యమాలలో కొంతమేరకు నిమగ్నత, మరింత ఎక్కువ నిబద్ధతో, తెలుగునేలపై అస్తిత్వ ఉద్యమ రూపాల విశ్లేషణ కొరకు ఈ వ్యాసం.

స్త్రీ పురుష వివక్ష, కుల వివక్ష, మత వివక్ష, వృత్తి వివక్ష, ప్రాంతీయ వివక్ష తదితర వివక్షలకు వ్యతిరేకంగా అస్తిత్వ ఉద్యమాలు రెండు తెలుగు రాష్ట్రాలలోనూ కొనసాగుతున్నాయి. ఇవి జనాందోళనలు గానే కాక సాహిత్య, సాంస్కృతిక, కళా రూపాల్లోనూ వ్యక్తమై విశేష జనాదరణ పొందుతున్నాయి. ఈ ఉద్యమాల ప్రభావం విస్తృతస్థాయిలో పీడిత ప్రజానీకంపై దీర్ఘకాలికంగా ఉండే ఫలితాలెలా ఉంటాయి? ముఖ్యంగా మార్క్సిస్టు, లెనినిస్టు, మావోయిస్టు అవగాహనతో ఉద్యమకారులుగా ఉండిన వారు ఈ అస్తిత్వ ఉద్యమాల్లో ఎలాంటి పాత్ర నిర్వహిస్తున్నారనే విషయం కూడా ఆలోచించాల్సిన అవసరముంది.

'రాత్రి నల్గురు మొగోల్లు కమ్రలకి గుసాయించిర్రు. రాంచంద్రారెడ్డి కత్తి పుచ్చుకుని ఆల్ల మీద పడిండు గని నల్గురు ఆంబోతుల్లెక్కున్రు. రాంచంద్రారెడ్డిని కొట్టి బేహోష్ చేసిర్రు. నన్ను అటు లాగిర్రు. ఆల్లంత ఎప్పట్కి నన్నుజూసి నగేవాళ్లు యిస్కూలు దగ్గరకొచ్చి సీటీలు గొట్టేటోళ్లు. మల్ల అప్పుడేమయిందో ఆ నగుడు బాగ కోపంగైనరు. ఆల్లు నన్ను ఏదేందో చేద్దామని జూసిర్రు గాని నేను బైటకురికొచ్చిన, ఆ నల్గుట్లో ఒక్కాయన నా ఎంటురికిండు. నన్ను గట్టిగా పట్టుకుని ఏడికో లాక్కుపోయిండు. ఆడయితే నన్ను గొట్టేట్టు లేడుగని ఆని దమాకుల ఏందో ఉంది.'

సబిత మీద మూకుమ్మడి అత్యాచారం జరగబోయింది. చివరికి ఒకడు అత్యాచారం చేయడానికి పూనుకున్నాడు. సమయానికి సర్పంచ్ వచ్చి రక్షించాడు. ఉద్యోగం కోసం వచ్చిన ఆడపిల్ల నవ్వులు ఆమెను ఇంత ప్రమాదంలో పడేశాయి. ఇక్కడ రాజస్థాన్‌లో భవరీదేవి కేసు గుర్తొస్తుంది. ఆమె చాలా బాధ్యతగా పనిచేసి గ్రామ పెద్ద ఇంట్లో జరగబోయే బాల్య వివాహాన్ని ఆపేయడం వల్ల ఆమే గ్రామ పెద్దలవల్ల సామూహిక అత్యాచారానికి గురయింది. చైతన్యం గల ఆమె, మహిళా సంఘాలు ఎన్ని సాక్ష్యాధారాలతో అన్ని మార్గాలలో యత్నించినా దోషులకు శిక్ష పడలేదు. సుప్రీంకోర్టు ఉన్నత కులాల పురుషులు తమకంటే చిన్న కులం స్త్రీని అట్లా ఎట్లా చేస్తారని విస్తుపోయింది. ఐతే ఆ కేసు ఆధారంగా విశాఖ తీర్పు వచ్చేవరకూ మహిళా సంఘాలు పనిచేశాయి. అప్పుడే సుప్రీంకోర్టు స్త్రీలకు పనిచేసేచోట లైంగిక వేధింపులుంటాయని గుర్తించి వాటిని వ్యతిరేకిస్తూ అదుపు చేస్తూ 'విశాఖ తీర్పు'గా పేరుపడిన తీర్పుని ఇచ్చింది. ఈ మధ్య కాలంలో ఆ తీర్పు పార్లమెంటులో చట్టమై వచ్చింది. కానీ ఆ చట్టం వల్ల సబిత వంటి వారికి పెద్దగా మేలు జరగదు. సబితలు నవ్వకుండా, నలుగురితో చలాకీగా మాట్లాడకుండా, తాము సాధ్యమైనంత ఒదిగి ఉంటూ, 'సరైన దుస్తులు' వేసుకుంటూ పనిలోకి వస్తే ఈ చట్టం రక్షిస్తుందేమో గాని సబితలా నవ్వితే మాత్రం ఏ దేశీయ, అంతర్జాతీయ చట్టం ఆడపిల్లలను రక్షించలేదు. స్త్రీ పురుష సమానత్వపు కల అన్నిచోట్ల కంటే పనిచేసే చోట ఘోరంగా విఫలమవుతుంది. అక్కడ అనేక రకాలుగా స్త్రీలు పడే హింసను నిర్వచించి చట్టాలలోకి ఒదిగించినా రాజ్యాంగ నైతికత ఒంటబట్టించుకున్న పౌరులున్నప్పుడే ఆ హింస ఆగుతుంది.

ఈ సమస్యను అక్కినేని కుటుంబరావు చాలా ఆసక్తికరంగా ఈ నవలలోకి తీసుకువచ్చాడు. నవల చదివిన ఎన్నో రోజుల తర్వాత కూడా సబిత, సబిత నవ్వు మనల్ని వెంటాడుతూనే ఉంటాయి. మనుషులకే సహజమైన ప్రత్యేకమైన నవ్వు కూడా ఒకనాటికి ఒక హక్కుగా మారి, చట్ట రూపంలో రావాల్సిన దుర్గతి పడుతుందా అనిపిస్తుంది సబిత నవ్వుని చూసి నవలలోని పాత్రలు స్పందించిన విధం చదివినప్పుడు.

మొత్తానికి ఒక కౌన్సిల్‌లోని పురుష ఉద్యోగులందరికీ స్త్రీల పట్ల ఉన్న వివక్షను, పనిచేసే చోటు స్త్రీలకు ఎంత వ్యతిరేకంగా ఉంటుందో, వాళ్ల కదలికలను ఎలా నియంత్రిస్తుందో, ఉద్యోగం చేయడానికి బైటి సమాజంలోకి రావడమంటే ఏమిటో మోహనరాగం నవల చెపుతుంది. అదే సమయంలో ఉద్యోగం చేసి తమ కాళ్లమీద తాము నిలబడాలనే ఆడవాళ్ల ఆరాటాన్ని, ఆర్థిక స్వాతంత్ర్యం వాళ్లకిచ్చే ధైర్యాన్ని, తమ తెలివి తేటలను వినియోగించి పనిచేసినప్పుడు వారికి కలిగే సంతృప్తిని కూడా క్లుప్తంగానే అయినా స్పష్టంగానే చెప్పారు.

జండర్ సమానత్వం దిశగా స్త్రీలు వేస్తున్న అడుగులు, వారిని వెనక్కి నెట్టివేసే రాజ్యాంగ ఉల్లంఘనలూ రెండింటినీ మోహనరాగం సమర్థవంతంగా చెప్పగలిగింది. వీ

(రచయిత ప్రముఖ స్త్రీవాద కథా, నవల రచయిత)

స్త్రీవాదంతో ప్రాచుర్యం పొందిన ఓల్గా, రాడికల్ హ్యూమనిస్టు (నవ్య మానవతా వాదం) భావజాలపు 'హేతువాది' నుంచీ బయటకు వచ్చి, మార్క్సియన్ హేతువాదం'కు మారిన కత్తి పద్మారావు, బిసి అస్తిత్వవాదంలో మునిగిన ఉ.సా, బి.ఎస్. రాములు, ముస్లిం మత అస్తిత్వవాదంతో మమేకమైన దానీ వంటి ఎందరో వ్యక్తులను అస్తిత్వ వాద ఉద్యమాలతో అంటకాగే వ్యక్తులకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఇక మరీ ముఖ్యంగా అస్తిత్వవాద పునాదిపై రగులుకుని, జ్వలించి, రాష్ట్ర సాధనతో తిరిగి యథాతథంగా ఏ మౌలిక మార్పు లేకుండా మునిగిన తెలంగాణ ఉద్యమాన్ని చెప్పుకోవాలి. ఈ ఉద్యమంలో ప్రత్యక్షంగానో పరోక్షంగానో పాలుపంచుకోని విప్లవపార్టీ కానీ, కార్యకర్త కానీ, కళాకారుడు కానీ (వంగపండు మినహా) దాదాపు లేరంటే అతిశయోక్తి కాదు. మార్క్సిస్టు తాత్విక దృక్పథంలోకి ఈ అస్తిత్వవాదం ఎలా ప్రవేశించి, ఎటువంటి ప్రభావాన్ని చూపిందనేది ఎంతో ముఖ్యం.

గతంలో 1980 దశకాలాలో 'జాతుల పోరాటాలు' అనే అంశంపై నాటి ఎం.ఎల్. పార్టీ తీసుకున్న నిర్ణయం అస్తిత్వవాదానికి తెలుగునేలపై తొలిమెట్టుగా కొందరు సంప్రదాయిక విప్లవకారులు చెపుతుంటారు. ఇక సాహిత్యరంగంలోనైతే విప్లవ సాహిత్యకారులు ప్రధానంగా రాజ్యం పాత్రను ప్రశ్నించి ధిక్కార స్వరం వినిపించడం వరకే పరిమితం కావడం అస్తిత్వవాద ఉద్యమాలు ప్రత్యేకంగా బలపడడానికి కారణమైందనే వాదన ఉంది. ఏదేమైనా ఆర్థిక సంస్కరణ పేరిట అంతర్జాతీయ దోపిడికి మార్గాన్ని వేగవంతం చేసిన 1990 దశకం నుంచీ అస్తిత్వవాద ఉద్యమాలు తీవ్రత పెరిగిందనేది వాస్తవం. పెట్టుబడి విస్తరిస్తున్న క్రమంలో మధ్యతరగతి జనానికి పెరిగిన ఉద్యోగ అవకాశాలు, ఆర్థిక సంపత్తీ ప్రజలలో అంతర్జాతీయ పెట్టుబడి పట్ల భ్రమలు పెంచాయి. వర్గ పోరాటపు అవసరం లేదని, ఉన్న వ్యవస్థలోనే కొన్ని మార్పులు వస్తే సమస్యలు పరిష్కారమవుతాయనే భావనలు విస్తృతమయ్యాయి. ఐతే ఆర్థిక సంక్షోభాలు తలెత్తినప్పుడు వీరి అశా సౌధాలన్నీ పేక మేడల్లా కూలి పోతాయని బలంగా చెప్పడలో అభ్యుదయ శక్తులు విఫల మయ్యాయి. అనేకమంది క్రియాశీలురు అందులో కొట్టుకుపోయారు.

ఐతే ఈ అస్తిత్వవాదంతో కలిసి ఉన్న సమస్యలను పరిష్కరించే విధానంలో గత పోరాటాలు నేర్పిన పాఠాలు నేర్చుకోలేదు. గతంలో ఉద్యమకారులు, కళాకారులు, అస్తిత్వవాద సమస్యలతో, అస్తిత్వ వాదంతో కలిసిన వాటితో మమేకమై, ఆయా రూపాలను, సమస్యలనూ విప్లవీకరించిన చారిత్రక సందర్భాలున్నాయి. బుర్ర కథ కళాకారుడు షేక్‌నాజర్, బొడ్డపాడు గుడి పూజారిగా పని చేసిన, 'అర్చకత్వం వదిలి ఆయుధంబును బట్టి సమరానికేగిన సవ్యసాచి'గా ప్రసిద్ధుడైన సబ్బారావు పాణిగ్రాహి, తామాడ గణపతి, వెంపటాపు వంటి వారు కుల సమస్యల వంటి అస్తిత్వ సమస్యలను విప్లవీకరించారు. శ్రీకాకుళ పోరాటంలోనే కాక, ఉత్తర తెలంగాణ జనంపోరు జైత్రయాత్రల పోరాటాల సందర్భంలోనూ కుల, మత, వృత్తి, ప్రాంతీయ సమస్యలలో కూడా నిమగ్నలై వాటిని విప్లవీకరించిన నిన్నటి చరిత్ర మన కళ్ల ముందు ఉంది. ఐతే వర్తమానంలో పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా ఉంది. విప్లవ మేధావులు అనేక మంది అస్తిత్వవాదంలో నిండా మునిగిపోయారు.

స్త్రీల కోసం, గిరిజనులలో వర్గీకరణ కోసం, బిసిలలో అత్యంత వెనెకబడిన కులాల కోసం (ఇవి ప్రస్తుతం బిసి–ఎ గ్రూపులో ఉన్నాయి) ముస్లిం రిజర్వేషన్‌లపై, అందులోనూ నూర్‌భాషాల హక్కుల కోసం వివిధ రూపాలలో ప్రజా సంచలనం ఉంది. ఇక ఉత్తరాంధ్ర రాయలసీమ, కోనసీమ హక్కుల పోరాట సంస్థల వంటి సంస్థలూ చైతన్యవంతంగా పెరుగుతూ ఉన్నాయి. ఇవన్నీ అస్తిత్వ ఉద్యమాల కిందికీ వస్తాయని అంతా అంగీకరిస్తున్నారు.

ఈ ఉద్యమాలన్నీ వివక్షను ప్రశ్నించి, ప్రజల తక్షణ సమస్యలను లేవనెత్తి, ప్రజలను తేలికగా ఆకర్షించి తేలికగా ఉద్యమించడం జరుగుతూ ఉంది. వాటిని ఉపేక్షించకుండా, వాటి భావజాల పరిధిని మరింతగా విస్తృతంగా చేయాల్సిన అవసరం సరిగా గుర్తింపుకు నోచుకోవడం లేదు. అలా గుర్తించి సరైన చర్యలు తీసుకోని పక్షంలో, విశాల ప్రజానీకపు విముక్తికై జరిపే ఉద్యమాలకు భవిష్యత్తులో గొడ్డలిపెట్టుగా మారే ప్రమాదముంది.

సిద్ధాంతపరంగా ఈ అస్తిత్వవాదమనేది వ్యక్తివాదానికి దగ్గరగానూ, సమిష్టివాదానికి దూరంగానూ ఉన్న భావజాలం. అందువల్ల న్యాయమైన కోరికలతో ఉండే ఈ అస్తిత్వవాద ఉద్యమాల పట్ల సానుకూలతతో సన్నిహితంగా మెలుగుతూనే ఆ ఆందోళనలో పాలు పంచుకునే జనాల అవగాహన పెంచాలి. వ్యక్తిని సమిష్టిలో భాగంగా, అందరి సమస్యల మూలకారణాలపై విశాల దృక్పథపు అవగాహన పెంచే చర్యలు చేపట్టాలి. ఈ అవసరాన్ని మార్క్సిస్టు అవగాహనతో ఉండే పార్టీలూ, నాయకులూ పరిపూర్తి చేయడంలో విఫలమయ్యారు. అందువల్లనే లెక్కకు మించిన కార్యకర్తలు అస్తిత్వవాదానికే పరిమితమై అందులోనే కూరుకుపోతున్నారు. ఇది ఎంతదాకా వెళ్లిందంటే వీరంతా తాము ఎంచుకున్న రంగమే ప్రధానమైనదిగానూ, అదే ప్రధాన వైరుధ్యంగానూ భావించేంతగా అందులో నిమగ్నమైపోయారు. ఈ భావన వల్ల, ప్రాంతీయ సమస్యలు, స్త్రీల సమస్యలు, కుల సమస్యలు, మైనారిటీల సమస్యల వంటివన్నీ తలెత్తేందుకు గల మూలకారణాలు మరుగున పడిపోతున్నాయి. నిజానికి ఇవన్నీ పెట్టుబడిదారీ, భూస్వామ్య సమాజపు ఆర్థిక దోపిడి కారణంగా ఉత్పన్నమై, ఉపరితలంలో వివిధ సామాజిక, ఆర్థిక, రాజకీయ రుగ్మతలుగా విడివిడి రూపాలలో కనబడుతూ, అణచివేతకు, దోపిడికీ కారణం అవుతున్నాయన్న నిజం నివురు కింద దాగిన నిప్పై పోతున్నది. ఫలితంగా పీడిత ప్రజల మధ్య అనైక్యత మరింతగా పెరిగిపోతున్నది.

ఈ ఉద్యమాలేవీ పెట్టుబడి దోపిడీని ప్రశ్నించవు. ఈ అసమాన వ్యవస్థలోనే పరిష్కారాలు దొరుకుతాయనే భ్రమలు కల్పిస్తోంది. ఈ భ్రమలు ఈ విధంగానే ఉండి, వర్గస్పృహ లోపించడం వలన అంతిమంగా ఈ అస్తిత్వ ఉద్యమాలు అన్నీ భూస్వామ్య పెట్టుబడి దారులకు ఉపయోగమవుతున్నాయి. వారు ప్రజలంతా చిన్న చిన్న సమూహాలుగా, గ్రూపులుగా ఉండాలని కోరుకుంటారు. అందువల్లనే పెట్టుబడిదారీ భావజాలం కూడా ఈ రకమైన అస్తిత్వవాద ఉద్యమాలను ప్రోత్సహించడమే కాకుండా, అక్కడక్కడా ఉద్యమాలను పెంచి పోషించి, ఏదోక మేర తాత్కాలిక ఉపశమనానికి దోహదం చేయడం ద్వారా తన పట్టు కొనసాగిస్తోంది.

ఈ నేపథ్యంలో అస్తిత్వవాద ఉద్యమాలపై అభ్యుదయవాదులు తీసుకోవలసిన వైఖరి, అవలంబించాల్సిన పంథా, వ్యూహాలను గురించి చర్చ జరగాలి. నిజమైన ప్రజాస్వామ్య, విప్లవకర శక్తులన్నీ మేధో మథనం జరిపే యత్నం చేయాలి.

(రచయిత రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి) వీ

చారిత్రక భౌతిక వాదంలోనే చరిత్ర విజ్ఞాన శాస్త్రం

- సత్యం

వీక్షణం ఏప్రిల్ 2009 సంచికలో డా. కొడవటిగంటి రోహిణీప్రసాద్ రాసిన 'చరిత్ర కూడా విజ్ఞాన శాస్త్రమా'? వ్యాసంలో ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాలు సరియైనవి కావు. ఆ వ్యాసంలో 'హిస్టరీకీ మూలకారణం జాగ్రఫీ' జనాభా పెరిగి అంతకంతకు పరిమితమైపోతున్న వనరుల కోసం యుద్ధాలు జరుగుతుండేవి'. 'అలెగ్జాండర్, చెంఘిజ్‌ఖాన్, నెపోలియన్, హిట్లర్ తదితరుల సాహసం, స్వభావం, శక్తి సామర్థ్యాలు మొదలైనవి చరిత్రను తీవ్రంగా ప్రభావితం చేసిన మాట నిజమే' అని ఆయన అభిప్రాయాలను వెలిబుచ్చాడు. ఈ భావనలు ఊరికే ఏర్పడినవి కావు. ఇవి అఫిషియల్ సైన్స్‌కు సంబంధించిన అభిప్రాయాలు. వర్గ సమాజంలో విజ్ఞాన శాస్త్రం కూడా అఫిషియల్ సైన్స్ స్వభావానికి గురవుతుంది. అందుకే ఈ విషయాల పట్ల స్పష్టత అవసరం.

స్టాలిన్ మహాశయుడు చారిత్రక భౌతికవాదం గురించి ఇలా రాశారు – 'ఇక ఇప్పుడు ఈ కింది ప్రశ్నను విశదీకరించవలసిన అవసరం ఉంది. సమాజ ఆకృతిని, దీని భావాల, దృక్పథాల రాజకీయ వ్యవస్థను అంతిమంగా నిర్ణయించేటటువంటి 'సమాజ భౌతిక జీవన పరిస్థితులు' అంటే చారిత్రక భౌతికవాద దృక్పథంలో ఏమిటి?

అసలు సమాజ భౌతిక జీవన పరిస్థితులు అంటే ఏమిటి వాటి విశిష్ట లక్షణాలు ఏమిటి?

'సమాజ భౌతిక జీవన పరిస్థితులు' అన్నిటి కన్నా మొదటిది – సమాజాన్ని చుట్టుకుని ఉన్న ప్రకృతి ఒకటి అనే దానిలో సందేహమేమీ లేదు. సమాజ భౌతిక జీవితానికి అత్యవసరమైన నిరంతర పరిస్థితి భౌగోళిక పరిసరం. ఈ భౌగోళిక పరిసరం సమాజ అభివృద్ధిపై ప్రభావాన్ని కలిగి ఉంటుంది. సమాజ అభివృద్ధిలో భౌగోళిక పరిసరం ఎలాంటి పాత్రను వహిస్తుంది? ఒక విధానం నుండి మరొక విధానానికి పరివర్తనను మానవ సామాజిక విధాన స్వభావాన్ని, సమాజ ఆకృతిని నిర్ణయించే ముఖ్య శక్తి భౌగోళిక పరిసరమేనా?

కాదు–అని చారిత్రక భౌతికవాదం ఈ ప్రశ్నకు సమాధానం చెపుతుంది.

కాని భౌగోళిక పరిసరం సమాజాభివృద్ధికి అత్యవసరమైన నిరంతర పరిస్థితులలో ఒకటి అని నిస్సందేహంగా చెప్పవచ్చు. సమాజాభివృద్ధిపై భౌగోళిక పరిసర ప్రభావం ఉంటుంది. సమాజాభివృద్ధిని అది వేగిర పరుస్తుంది. లేక వెనక్కి నెడుతుంది. కాని దానిది నిర్ణయాత్మక ప్రభావం కాదు. భౌగోళిక పరిసరాలలోని అభివృద్ధి మార్పుల కంటే, సమాజాభివృద్ధి మార్పులు పోల్చరానంత త్వరితగతిన జరుగుతాయి. మూడువేల సంవత్సరాల కాలంలో యూరప్‌లో, మూడు వేర్వేరు సామాజిక పద్ధతులు ఒకదాని తర్వాత ఒకటిగా రద్దు గావించబడ్డాయి. ఈ మూడు – ఆదిమ సమాజ విధానం, బానిస విధానం, భూస్వామ్య విధానం. యూరప్‌లోని తూర్పు భాగంలో, అనగా సోవియట్ రష్యాలో నాలుగు సామాజిక పద్ధతులు ఒకదాని వెనక ఒకటి రద్దు గావించబడ్డాయి. అయినప్పటికీ ఈ మధ్య కాలంలో యూరప్ భౌగోళిక పరిస్థితులు మారనే లేదు. ఒకవేళ స్వల్పంగా మారినా భూగోళ శాస్త్రం గమనించదగినంత మార్పులు జరగలేదు. అది పూర్తిగా సహజం కూడా. భౌగోళిక పరిసరంలో ఏమైనా ప్రాముఖ్యమైన మార్పులు రావాలంటే, లక్షలాది సంవత్సరాలు అవసరం. కాని మానవ సామాజిక పద్ధతిలో ముఖ్యమైన మార్పులు రావాలంటే, ఏ రెండు వేల సంవత్సరాలో లేక ఏ కొద్ది వందల సంవత్సరాలో చాలు.

దీనిని బట్టి సమాజాభివృద్ధిని నిర్ణయించే ముఖ్య కారణం భౌగోళిక పరిసరం కాజాలదని తేలుతుంది. ఎందువల్లనంటే అనేక వేల సంవత్సరాల వరకు దాదాపు ఎట్టి మార్పు లేనటువంటిది, కొన్ని వందల సంవత్సరాల్లోనే ప్రధానమగు మార్పులకు లోనగునటువంటి దాని అభివృద్ధికి ప్రధాన కారణం కాజాలదు.

అంతేగాక, 'సమాజ భౌతిక జీవన పరిస్థితులు' అన్న భావంలో జనాభా పెరుగుదల, తరతమ భేదాలలో కూడిన జనాభా ఒత్తిడి కూడా ఇమిడి ఉంది. ఎందుచేతనంటే సమాజ భౌతిక జీవిత పరిస్థితులలో జనాభా కూడా ఒక అవసరమైన శక్తి. ఒక నిశ్చిత కనీస జనాభా లేనిదే సమాజ భౌతిక జీవితమంటూ ఒకటి లేనే లేదు. మానవుని సామాజిక విధాన స్వభావాన్ని నిర్ణయించే ప్రధాన శక్తి జనాభా పెరుగుదల కాదా!

ఈ ప్రశ్నకు కూడా చారిత్రక భౌతికవాదం కాదనే సమాధానం వస్తుంది. సమాజాభివృద్ధిపై, జనాభా పెరుగుదల ప్రభావం కలిగి ఉండుట నిజమే. అది సమాజాభివృద్ధిని వేగిర పరుస్తుంది. లేదా వెనక్కి నెడుతుంది అనుట నిజమే. కాని సమాజాభివృద్ధికి అది ముఖ్యమైన శక్తి కాజాలదు. సమాజాభివృద్ధిపైన దాని ప్రభావం నిర్ణయాత్మక ప్రభావం కాదు. ఎందువల్లనంటే, ఒక ప్రత్యేక సామాజిక విధానం స్థానే ఫలానా ఫలానా కొత్త విధానమూ ఎందుకు రావాలి? ఇంకో విధానం ఎందుకు రాకూడదు? ఆదిమ సమాజ విధానం స్థానే కచ్చితంగా బానిస విధానమే ఎందుకు రావాలి? బానిస విధానం స్థానే భూస్వామ్య విధానం ఎందుకు రావాలి? భూస్వామ్య విధానం స్థానే బూర్జువా విధానం ఎందుకు రావాలి? మరొకటి ఎందుకు రాకూడదు? పై ప్రశ్నలకు జనాభా పెరుగుదల ఒక్కటే సమాధానం ఇవ్వలేదు.

సామాజికాభివృద్ధిని నిర్ణయించే శక్తి జనాభా పెంపుదల అయినట్లయితే, జనాభా ఎక్కువ ఒత్తిడిగా ఉన్నచోట, తదనుగుణ్యమైన ఉన్నతమైన సామాజిక విధానాన్ని సృష్టించి ఉండవలసింది. కాని ఇలా ఎక్కడా జరగడం లేదు.

దీనిని బట్టి సమాజాభివృద్ధికి ముఖ్యమైన శక్తి జనాభా పెంపుదల కాదు. కాజాలదు. సమాజ ఆకృతిని సమాజ విధాన స్వభావాన్ని నిర్ణయించే ముఖ్య శక్తి జనాభా పెరుగుదల కాజాలదు.

క్లిష్టమైన సమాజ భౌతిక జీవిత పరిస్థితులలో–సమాజ ఆకృతిని సమాజ విధాన స్వభావాన్ని, ఒక విధానం నుండి మరొక విధానానికి మారే సామాజికాభివృద్ధిని, నిర్ణయించేటటువంటి ప్రధాన శక్తి ఏది?

ఈ విషయంపై చారిత్రక భౌతికవాద అభిప్రాయం, ఇది మానవుడి ఉనికికి అవసరమైన జీవితావసరాలను సంపాదించే విధానమే జీవితానికి సమాజాభివృద్ధికి అత్యంత అవసరమైన – ఆహారం, బట్టలు, చెప్పులు, ఇండ్లు, వంట చెరకు, ఉత్పత్తి సాధనాలు మొదలైన భౌతిక వస్తువులను ఉత్పత్తి చేసే విధానమే – ఆ ప్రధాన శక్తి.

'కాని ఉత్పత్తిలో, ఉత్పత్తి విధానంలో ఉత్పత్తి శక్తులు ఒక భాగం మాత్రమే'. ఉత్పత్తి, ఉత్పత్తి విధానం మరోభాగం ఏమంటే మానవుల ఉత్పత్తి సంబంధాలు. అంటే ఉత్పత్తి క్రమంలో మనుషులకు పరస్పరం ఏర్పడే సంబంధాలు. భౌతిక వస్తువుల ఉత్పత్తికి, ప్రకృతిలో పోరాటం సాగించి, ప్రకృతిని మానవులు ఉపయోగించుకుంటారు. ఈ పోరాటం ఒకరితో ఒకరికి సంబంధం లేకుండా జరగదు. ప్రత్యేకంగా వ్యక్తులు సాగించే పోరాటం కాదిది. సమిష్టిగా, గుంపులుగా, సమాజాలుగా ఈ పోరాటాన్ని సాగిస్తారు.

స్టాలిన్ రాసిన 'చారిత్రక భౌతికవాదం' కరపత్రం నుండి ఈ విషయాలను సుదీర్ఘంగా పేర్కొనవలసి వచ్చినందుకు క్షంతవ్యుడుకి ఈ తరానికి రోహిణీ ప్రసాద్ ముందుకు తీసుకువచ్చిన వాదనలు కొత్తగా కనపడవచ్చు గాని, దశాబ్దాల కిందటే ఆ వాదనలను శాస్త్రీయ దృష్టితో ఖండించారు. మాల్థస్ సిద్ధాంతం కూడా ఖండించబడిందే. ప్రజలే చరిత్ర నిర్మాతలనీ, వ్యక్తుల పాత్ర కీలకమైంది కాదనేది తేలిపోయిన సత్యమే. చారిత్రక భౌతికవాద దృక్పథంతో సమాజం ముందు ముందు ఏ విధానానికి ఏ దిశలో ప్రయాణించగలదో శాస్త్రీయంగా చెప్పగలం. చారిత్రక భౌతికవాద దృక్పథంతోనే చరిత్ర విజ్ఞాన శాస్త్ర స్థాయికి చేరుకున్నది.

(రచయిత చరిత్ర పరిశోధకులు)

వీ

మీలో ఎవరు తెలివిలేని బిచ్చగాడు?

- మారుతి

(వీక్షణం సెప్టెంబర్ 2014 సంచికలో 'మీలో ఎవరు కోటీశ్వరుడు' మీద వచ్చిన వ్యాఖ్యకు స్పందన)

ఈ మధ్య టివిల్లో కొన్ని డబ్బులు గెలిచి పెట్టే క్విజ్ ప్రోగ్రాంలు ప్రసారమవుతున్నాయి. ఈ మార్గం ద్వారా ఉచితంగా, కష్టపడకుండా లక్షల్లో డబ్బు సంపాదించడానికి కొందరు ప్రజలు ఎగబడుతున్నారు. ఈక్రమంలోనే ప్రజలు తమ ఆత్మగౌరవాన్ని సైతం ప్రోగ్రాంలు నిర్వహించే పెట్టుబడిదారుల కాళ్ల దగ్గర తాకట్టు పెడుతున్నామనే విషయం మరచిపోతున్నారు. ఎవ్వరూ (పెట్టుబడీదారులు), ఎవ్వరికీ ఈ ప్రపంచంలో ఉచితంగా డబ్బు ఇవ్వరు. ప్రజల్ని ఉపయోగించుకుని పెట్టుబడిదారుడు ఎంతో సంపాదిస్తే, అలా సంపాదించి పెట్టినందుకుగానూ, అందులో కొంత, తిరిగి ఆ ప్రజలకే భిక్షంగా వేస్తున్నారనే విషయం ప్రజలు తెలుసుకోవాలి. ఎంత సంపాదిస్తున్నాడు అనే విషయం ఇప్పుడు మనం చూద్దాం.

అడిగిన ప్రశ్నలకు జవాబు చెప్పగానే లక్షల్లో డబ్బు ఇచ్చేందుకు అనే పెట్టుబడిదారుడు, జవాబు చెబితే కోటి రూపాయలు అనే ప్రోగ్రాం మొదలు పెట్టాడనుకుందాం. ఆ ప్రోగ్రాంలో రిజిస్టర్ చేసుకునేందుకుగానూ తప్పనిసరిగా అనే కంపెనీ సిమ్ కార్డ్ ద్వారానే మెసేజ్ (ఎస్ఎంఎస్) పంపించాలి. మెసేజ్ పంపినందుకు మామూలుగా అయ్యే రూపాయి చార్జీ కాకుండా ఆ మెసేజ్ కి ఐదు రూపాయలు చార్జి చేయబడతాయి. ఇక ఇతర కంపెనీల సిమ్ కార్డులు వాడే ప్రజలు, తప్పనిసరిగా యాభై రూపాయలు పెట్టి ఆ కంపెనీ సిమ్ కార్డు కొనాల్సి వస్తుంది. అప్పటికప్పుడు ఆ కంపెనీ సిమ్ ఒక్కొక్కటీ యాభై రూపాయలకు అమ్మడం మొదలు పెడుతుంది. ఈ రకంగా టెలిఫోన్ కంపెనీల ఆదాయం లెక్క కింది విధంగా చూస్తే,

1 రాష్ట్రంలో ఉన్న మొత్తం టివిలు - 1,23,58,093 (రిజిస్ట్రార్ ఆఫ్ సెన్సస్, భారత ప్రభుత్వం వారి లెక్క ప్రకారం)

2 రాష్ట్రంలో మొత్తం టివి చూసే ప్రజలు - 6,24,00,000 (వోటర్ల సంఖ్య ఆధారంగా తీసుకోబడ్డది)

3 అందులో, లక్షాధికార్ల ప్రోగ్రాం చూసే వాళ్లూ, అందులో పాల్గోనాలనుకునే వాళ్లు - 3,12,00,000 అతి తక్కువగా 50 శాతం అనుకుంటే (టివిఆర్, టీఆర్పీ లను లెక్కలోకి తీసుకోకుండా)

4 రాష్ట్రంలో కంపెనీ సిమ్ కార్డు గల వాళ్లు - 1,80,96,000 బోన్ లెస్ సర్వే డేటా ప్రకారం(58 శాతం)

5 మిగతా 42 శాతం మంది (కంపెనీ సిమ్‌లేని వాళ్లు) - 1,31,04,000 ఇంచుమించుగా 42 శాతం కంపెనీ సిమ్‌కార్డ్ గలవారి నుండి ఎస్ఎంఎస్ పంపించేందుకు అయ్యే ఖర్చు (ఒక్కొక్క ఎస్సెమ్మెస్ కు ఐదు రూపాయలు)

1,80,96,000 × 5 = 9,04,80,000 (దాదాపు 9 కోట్లు)

కంపెనీ సిమ్‌కార్డ్ లేనివారి నుండి సిమ్ కొని ఎస్ఎంఎస్ పంపించేందుకు అయ్యే ఖర్చు (సిమ్ కార్డ్ ధర యాభై రూపాయలు + ఒక్కొక్క ఎస్ఎంఎస్‌కు ఐదు రూపాయలు) 1,31,04,000 × 55 = 72,07,20,000 (దాదాపు 72 కోట్లు)

మొత్తం రు. 81,12,00,000 (దాదాపు 81 కోట్లు)

పైనున్న వివరాల ప్రకారం ఒక్కసారిగా ఈ కోటీశ్వరుల ప్రోగ్రాం ద్వారా టెలిఫోన్ కంపెనీలకు రు. 81 కోట్లు ఆదాయం వస్తోంది.

ఇక్కడ పరిగణనలోకి తీసుకోనివి:

1) ఒకే సిమ్ నుంచి నాలుగైదు ఎస్ఎంఎస్‌లు పంపిన వారు

2) రెండుమూడు సిమ్ కార్డులుకొని ఎస్ఎంఎస్ పంపిన వారు

3) టివి చూసే జనాభా మొత్తం (టిఆర్పి, టివిఆర్ ల ప్రకారం కాకుండా)

ఈ ఎనభై ఒక్క కోట్ల రూపాయలు ఎవరి సొమ్ము? ఎక్కడ నుంచి వచ్చిన సొమ్ము? అనే విషయాలు ప్రజలు ఆలోచించాలి. ఇక ఈ ఎనభై ఒక్క కోట్లలో అడ్వర్టైజ్మెంట్ల ద్వారా వచ్చే ఆదాయం లెక్కించలేదు. డైరక్టరేట్ ఆఫ్ అడ్వర్టైజింగ్ అండ్ విజువల్ పబ్లిసిటీ వారి లెక్కల ప్రకారం కింద ఇవ్వబడిన అడ్వర్టైజ్మెంట్ టారిఫ్ రెట్లు ఒకసారి చూడాలి.

ఈరేట్లు పది సెకన్ల అడ్వర్టైజ్మెంట్ ప్రసారానికి

రాత్రి 10-10:30	రు. 6000
ఉదయం 7-9	రు. 1000
రాత్రి 8-10	రు. 6000
మధ్యాహ్నం 12 నుండి - సాయంత్రం 7	రు. 4000
సాయంత్రం 7- రాత్రి 8	రు. 6000
ఉదయం 9- మధ్యాహ్నం 12	రు. 3000

పైనున్న రేట్ల ప్రకారం, ప్రోగ్రాంలు ప్రసారమయ్యే సమయం ప్రకారం:

మొత్తం ఎపిసోడ్ల సంఖ్య (ఇంచుమించుగా)	50
ఒక్కొక్క ఎపిసోడ్ ప్రసార సమయం (నిముషాలలో)	90
మొత్తం ప్రసార సమయం (నిముషాలలో)	4500
ప్రకటనల సమయం (30 శాతం) (నిముషాలలో)	1350
1350 నిముషాలను సెకన్లలో మారిస్తే	81000
మొత్తం యూనిట్లు (మొత్తం సెకన్లను పదితో భాగించాలి)	8100
యూనిట్ రేట్ (రు.)	6000
మొత్తం ఆదాయం (రు.)	4,86,00,000

ఒక్కో ప్రోగ్రాం రెండుసార్లు ప్రసారం అవుతుంది కాబట్టి, 4,86,00,000 × 2 = మొత్తం ఆదాయం: రు. 9,72,00,000

పై వివరాల ప్రకారం అడ్వర్టైజ్‌మెంట్ల ద్వారా వచ్చే ఆదాయం దాదాపుగా పది కోట్లు. ప్రకటనలు ఇచ్చే కంపెనీలు, ఆ ఖర్చును ప్రజల నుంచే రాబట్టుకుంటారని వేరే చెప్పనవసరం లేదు. ఇక ఈ లక్షాదికార్ల లేదా కోటీశ్వరుల ప్రోగ్రాంల ద్వారా వచ్చే మొత్తం ఆదాయం చూస్తే తొంభై కోట్లు. ఇదంతా ఎవడి సొమ్ము? టివి ఛానెళ్ల యజమానులదా? ప్రోగ్రాం నడిపే యాంకర్లదా? టెలిఫోన్ ఆపరేటర్లదా? లేక అడ్వర్టైజ్‌మెంట్ల కంపెనీలదా? వీరేవ్వరిదీ కాదు. ఇదంతా ప్రజలది. ప్రజల సొమ్ము దోచుకోవడానికి పెట్టుబడీదార్లు కనిపెట్టే కొత్త మార్గాలలో ఇదొకటి.

ప్రోగ్రాంలో పాల్గొన్న వాళ్లెవ్వరూ పన్నెండు లక్షలకు పైగా గెలువలేక పోతున్నారు. ప్రోగ్రాం నిర్వాహకులడిగే ప్రశ్నలు అలా ఉంటున్నాయి. ఇక ప్రోగ్రాంలో పాల్గొనే ప్రజలు, ప్రోగ్రాం వ్యాఖ్యాతల్ని పొగిడే వ్యాఖ్యల గురించి అయితే చెప్పవలసిన అవసరమే లేదు. విద్యావంతులు, తెలివైన వాళ్లు కూడా ప్రోగ్రాం వ్యాఖ్యాతల్ని మీరు సినిమా ఆర్టిస్టు కావడం తెలుగుజాతి చేసుకున్న పుణ్యమని, మిమ్మల్ని చూడడానికే వచ్చాం, మా జన్మ ధన్యమయ్యిందనీ, అసలు రాయలంటేనే సిగ్గుగా అనిపించే మితిమీరిన పొగడ్తలూ చూస్తుంటే, ఇంతగా మతిలేని స్థితిలో మన సమాజం ఉందా అని ఆశ్చర్యం వేస్తుంది. ఉచిత డబ్బు కోసం లేదా ఒక్కసారి టివిలో కనబడ్డం కోసం ఒక మనిషి తన ఆత్మగౌరవాన్ని ఇంకో మనిషి కాళ్లదగ్గర తాకట్టు పెట్టడం ఎంతవరకు కరెక్టు.

ఇంటింటికీ వెళ్లి పదో, యాభయ్యో, వందో డబ్బు అడుక్కోవడానికి ఈ ప్రోగ్రాం నడిపేవాళ్లు ఏమైనా బిచ్చగాళ్లా? ప్రజల సొమ్ముతో, ప్రజలనే అడుక్కు తినేవాళ్లుగా లేదా ఆత్మగౌరవం లేనివాళ్లుగా తయారు చేసే ఇలాంటి ప్రోగ్రాంల పేర్లు మీలో ఎవడు లక్షాధికారో, కోటీశ్వరుడో లాంటివి కాకుండా మీలో ఎవడు తెలివిలేని బిచ్చగాడు అని పెడితే బాగుంటుంది. అప్పుడైనా ప్రజలు కొంత ఆలోచిస్తారేమో చూడాలి! వీ

ప్రముఖ చిత్రకారులు బాపు మృతి

ప్రముఖ కార్టూనిస్టు, చిత్రకారుడు, దర్శకుడు బాపు (80) (సత్తిరాజు లక్ష్మీనారాయణ) ఆగస్టు 31న శ్వాసకోస వ్యాధితో బాధపడుతూ, గుండె నొప్పితో చెన్నైలోని ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో చనిపోయారు. ఆయన పశ్చిమ గోదావరి జిల్లా, నరసాపురం మండలం, కంతేరు గ్రామంలో 1933 డిసెంబర్ 15న జన్మించారు. ఆయన ఆంధ్రపత్రికలో కార్టూనిస్టుగా పని చేశారు. ఆయన తెలుగు, తమిళం, హిందీ భాషల్లో సినిమాలకు దర్శకత్వం వహించారు. 1991లో ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి కళా ప్రపూర్ణ డాక్టరేట్ పొందారు.

ఆంధ్రప్రదేశ్ రాజధాని విజయవాడ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా విజయవాడను సెప్టెంబర్ 4న శాసనసభ సమావేశాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఈ సమావేశాల్లో ముఖ్యమంత్రి రాజధాని అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందించాలని, రాష్ట్ర పునర్విభజన చట్టం - 2014లో పొందుపరచిన ప్రతిపాదనలను, హామీలను నెరవేర్చాలని, నాలుగేళ్లలో పోలవరం ప్రాజెక్టు పూర్తికి తగు చర్యలు తీసుకోవాలని, శాసనమండలి సీట్లను 58కి పెంచాలని తీర్మానించారు.

నంబర్ ప్లేట్లపై తీర్పు

ఉమ్మడి రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వాహనాలకు తిరిగి తెలంగాణ రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలంగాణ ప్రభుత్వం జిఒ3ను జారీచేసింది. దీన్ని వ్యతిరేకిస్తూ హైకోర్టులో వేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కళ్యాణజ్యోతిసేన్ గుప్త సెప్టెంబర్ 22న తీర్పు ఇచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ అయిన వాహనాలకు తిరిగి రిజిస్ట్రేషన్ చేయించాల్సిన అవసరం లేదని చెప్పారు.

గుత్తికోయల గుడిసెల తొలగింపు

చత్తీస్‌గడ్ రాష్ట్రం, సుకుమా జిల్లా, కుంట గ్రామానికి చెందిన 25 కుటుంబాలకు చెందిన గుత్తికోయలు వరంగల్ జిల్లా, ఏటూరు నాగారం మండలం, చింతలపాడు గ్రామంలో నాలుగేళ్ల క్రితం నివాసం ఏర్పర్చుకున్నారు. వీరికి మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయని కారణంతో, వీరి నివాసాలను సెప్టెంబర్ 10న అటవి అధికారులు తొలగించారు. అడ్డుకున్న వారిపై విచక్షణారహితంగా దాడి చేశారు.

ఆదర్శ రైతు వ్యవస్థ రద్దు

ఆదర్శ రైతు వ్యవస్థను రద్దు చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సెప్టెంబర్ 19న ఉత్తర్వులు జారీచేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2007లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఇందులో 49,161 మందిని ఆదర్శ రైతులుగా నియమించారు. వీరిలో 29,439 మందిని ఆంధ్రప్రదేశ్‌లో నియమించారు. వీరి స్థానంలో బహుళ ప్రయోజన విస్తరణ అధికారుల (మల్టీపర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్స్) ను నియమించనున్నట్లు తెలిపారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో కూడా ఆదర్శ రైతు వ్యవస్థను రద్దు చేస్తూ ప్రభుత్వం సెప్టెంబర్ 24న ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 16,841 మంది ఆదర్శ రైతులున్నారు. వీరిని తొలిగించి వారి స్థానంలో సాంకేతిక పరిజ్ఞానం కలిగిన వ్యవసాయ అధికారులను నియమిస్తారని వ్యవసాయ ముఖ్యకార్యదర్శి పూనం మాలకొండయ్య పేర్కొన్నారు.

ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక సభ భగ్నం

మావోయిస్టు పార్టీ ఆవిర్భవించి పదేళ్లు అయిన సందర్భంగా హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక' ఆధ్వర్యంలో సెప్టెంబర్ 21న జరగవలసిన సభకు అనుమతి నిరాకరించి, సభ ప్రాంగణాన్ని పోలీసులు అధీనంలోకి తీసుకున్నారు. సభకు ఒక రోజు ముందే కొంతమంది ఉద్యమకారులను అరెస్టు చేశారు. అలాగే మరి కొంతమందిని సభ జరిగే రోజు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో అమరుల బంధుమిత్రుల సంఘం నాయకురాలు పద్మ, విరసం కార్యదర్శి వరలక్ష్మి, పాణి, కళ్యాణరావు, వరవరరావు, కోల్‌కతా ప్రొ. అమిత్ భట్టాచార్య, జార్ఖండ్ కళాకారుడు జీతన్‌మరాండీలతో పాటు అనేక మంది ఉద్యమాకారులూ, పౌరహక్కుల కార్యకర్తలూ, విద్యార్థులూ ఉన్నారు.

అఖిల పక్ష సదస్సు

ఎబిఎన్ ఆంధ్రజ్యోతి, టివి9 న్యూస్ ఛానళ్లను నిషేధించి 100 రోజులు అయిన సందర్భంగా హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సెప్టెంబర్ 22న 'మీడియా స్వేచ్ఛ - పరిరక్షణ'పై అఖిల పక్ష సదస్సు జరిగింది. ఈ సదస్సులో పాల్గొన్న వక్తలు నిషేధించిన ఛానళ్లను తిరిగి ప్రసారం చేయాలనీ, మీడియాపై ఆంక్షలు, నిషేధాలు విధించడం అప్రజాస్వామికమనీ అన్నారు. ఈ సదస్సుకు ప్రొ. హరగోపాల్, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్, పిఒడబ్ల్యు అధ్యక్షురాలు సంధ్య, సిఎల్‌సి సభ్యులు లక్ష్మణ్, ఐజెయు సభ్యులు శ్రీనివాసరెడ్డి, విరసం సభ్యులు వరవరరావు, జయరాజులతో పాటు వివిధ పార్టీల నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు, జర్నలిస్టులు హాజరయ్యారు.

సాహితీ వేత్త కె. చిరంజీవి మృతి

ప్రముఖ సాహితీవేత్త, నటుడు, రేడియో ప్రయోక్త కె. చిరంజీవి (80) సెప్టెంబర్ 22న హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ చనిపోయారు. ఆయన 1935 మార్చ్ 18న ప్రకాశం జిల్లా, వైదవలో జన్మించారు. ఆయన హైదరాబాద్ ఆకాశవాణిలో 32 సంవత్సరాలు పని చేశారు. అనేక రేడియో నాటకాలు రాశారు. అవి వివిధ భాషల్లోకి కూడా అనువాదం అయ్యాయి.

ఫాస్ట్ పథకంపై హైకోర్టు తీర్పు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జూలై 30న జారీ చేసిన ఫాస్ట్ (ఫైనాన్సియల్ అసిస్టెన్స్ టు స్టూడెంట్స్ ఆఫ్ తెలంగాణ) జిఒ పథకం చట్ట విరుద్ధమని కోరుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రులు పితాని సత్యనారాయణ, డొక్కా మాణిక్ వరప్రసాద్‌రావులు హైకోర్టులో వేర్వేరు పిటిషన్స్ దాఖలు చేశారు. ఈ పిటిషన్స్‌పై సెప్టెంబర్ 22న హైకోర్టు విచారించి ఈ జిఒ రాజ్యాంగ విరుద్ధమని, ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం-2014లోని సెక్షన్ 95కూ, రాజ్యాంగంలోని 371(డి) కీ వ్యతిరేకమని తీర్పు నిచ్చింది. వీ

బిపిన్ చంద్ర కన్నుమూత

ప్రముఖ చరిత్రకారుడు బిపిన్ చంద్ర (86) ఆగస్టు 30న హర్యానాలోని గుర్గావ్‌లో అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన 1928 మే 27న హిమాచల్‌ప్రదేశ్‌లోని కాంగ్రాలో జన్మించారు. లాహోర్‌లోని క్రిస్టియన్ కళాశాలలో, అమెరికాలోని స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీలో ఉన్నత విద్యను పూర్తిచేశారు. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో చరిత్ర ఆచార్యునిగాచేరి వైస్ చాన్సలర్‌గా పనిచేశారు. తారీఖులు, దస్తావేజుల ఆధారంగా చరిత్రని రచించే విధానానికి స్వస్తి పలికి, సామాజిక రాజకీయ పరిణామాల నేపథ్యంగా వలస పాలన పూర్వ అనంతర భారతదేశ ముఖచిత్రాన్ని అందించారు. ఈ క్రమంలో 'ద రైజ్ అండ్ గ్రోత్ ఆఫ్ ఎకనామిక్ నేషనలిజం', 'ఇన్ ద నేమ్ ఆఫ్ డెమోక్రసీ', 'ద జెపి మూవ్‌మెంట్ అండ్ ద ఎమర్జెన్సీ', 'నేషనల్ అండ్ కలోనియలిజమ్ ఇన్ మోడ్రన్ ఇండియా', 'ద మేకింగ్ ఆఫ్ మోడ్రన్ ఇండియా', 'ఫ్రమ్ గాంధీ టు మార్క్స్' తదితర గ్రంథాలను రచించారు.

ఎన్‌కౌంటర్లపై హత్యానేరం నమోదు చేయాలి

ఎన్‌కౌంటర్లపై హత్యానేరం నమోదు చేయాలని సుప్రీంకోర్టు సెప్టెంబర్ 23న ఆదేశించింది. ఎన్‌కౌంటర్లలో పాల్గొన్న పోలీసు అధికారులకు అవార్డులు, రివార్డులు ఇవ్వొద్దని సూచించింది. ఎన్‌కౌంటర్ ఘటనపై సిఐడి లేదా స్వతంత్ర సంస్థ ద్వారా న్యాయవిచారణ జరపాలని వెల్లడించింది. ఎన్‌కౌంటర్లో పాల్గొన్న అధికారులు విధిగా ఆయుధాలను సరెండర్ చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. ఎన్‌కౌంటర్లో వినియోగించిన మందుగుండు సామాగ్రిని పరీక్షలకు పంపించాలని సూచించింది.

అక్రమ బొగ్గు క్షేత్రాల రద్దు

1990 నుండి 2010 వరకు వివిధ బొగ్గు కంపెనీలకు కేటాయించిన మొత్తం 218 కంపెనీల్లో 214 కంపెనీలను సుప్రీంకోర్టు రద్దుచేసింది. అక్రమ కేటాయింపుల వల్ల ప్రభుత్వానికి జరిగిన నష్టానికి టన్నుకు రు. 295 చొప్పున పరిహారం చెల్లించాలని ఆదేశించింది. ఈ మొత్తం రు. 7,900 కోట్లని అంచనా. సెయిల్, ఎన్‌టిపిసి, అల్ట్రా మెగాపవర్ ప్రాజెక్ట్ (రిలయన్స్ పవర్) లకు కేటాయించిన రెండింటితో కలిపి మొత్తం నాలుగింటిని సుప్రీంకోర్టు మినహాయించింది. ఇప్పటికే పనులు ప్రారంభించిన 42 బొగ్గు క్షేత్రాలను స్వాధీనం చేసుకోవడానికి కేంద్రానికి సుప్రీం కోర్టు అనుమతిచ్చింది. మిగిలిన కంపెనీల్లో కార్యకలాపాలను నిలిపివేయడానికి ఆయా కంపెనీ లకు ప్రధాన న్యాయమూర్తి లోథా నేతృత్వంలోని ధర్మాసనం ఆరు నెలల గడువు మంజూరు చేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆర్.ఎం. లోథా నేతృత్వంలోని ధర్మాసనం బొగ్గు క్షేత్రాల కేటాయింపులను రద్దుచేస్తూ తుది తీర్పును సెప్టెంబర్ 24న వెల్లడించింది.

మీడియా ప్రసారాల నిలిపివేత ఎత్తివేయాలి

ఎబిఎన్ ఆంధ్రజ్యోతి, టివి9 ఛానళ్ల ప్రసారాలపై నిషేధం ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ, ఢిల్లీలోని తుగ్లక్ రోడ్‌లోగల తెలంగాణ ముఖ్యమంత్రి కె.సి.ఆర్ ఇంటి ముందు విలేకరులు సెప్టెంబర్ 6న ధర్నా చేశారు. తెలంగాణలో మీడియాపై నిషేధం ఎత్తివేయాలని, ప్రజాస్వామ్యాన్ని రక్షించండని, మీడియా గొంతు నొక్కొద్దు, మీడియా స్వేచ్ఛను హరించొద్దు అంటూ విలేకరులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ప్రభుత్వం స్పందించి ఛానళ్ల ప్రసారాలను పునరుద్దరించాలని డిమాండ్ చేశారు.

మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికలు

మహారాష్ట్రలోని 288, హర్యానాలోని 90 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల కమిషన్ సెప్టెంబర్ 12న షెడ్యూల్ విడుదల చేసింది. రెండు రాష్ట్రాల్లోను అక్టోబర్ 15న ఒకే దశలో ఎన్నికలు జరుగుతాయని ప్రధాన ఎన్నికల కమిషనర్ వి.ఎస్. సంపత్ తెలిపారు. అక్టోబర్ 19న ఎన్నికల ఫలితాలను విడుదల చేస్తామన్నారు. ఈ రెండు రాష్ట్రాలతో పాటు, మరో ఐదు రాష్ట్రాల్లోని ఐదు అసెంబ్లీ స్థానాలకు, రెండు ఎంపి స్థానాలకు అదేరోజు ఉప ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా దత్తు

సుప్రీంకోర్టు 42వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ హంద్యాల లక్ష్మీనారాయణస్వామి దత్తు నియమితులయ్యారు. సెప్టెంబర్ 28 నుంచి ఆయన నియామకం అమలులోకి వచ్చేలా రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ సెప్టెంబర్ 5న ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఆయన చేత సెప్టెంబర్ 28న ప్రమాణ సీకారం చేయించారు. 2015 డిసెంబర్ 2 వరకు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు.

మహారాష్ట్ర, కేరళకు కొత్త గవర్నర్లు

మహారాష్ట్ర గవర్నర్‌గా బిజెపి నేత చెన్నమనేని విద్యాసాగర్‌రావును నియమిస్తూ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఉత్తర్వులు జారీచేశారు. ముంబైలోని రాజ్‌భవన్‌లో ముంబై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి మోహిత్ షా ఆయన చేత ఆగస్టు 30న ప్రమాణ స్వీకారం చేయించారు. కేరళ గవర్నర్‌గా సుప్రీం కోర్టు మాజీ చీఫ్ జస్టిస్ సదాశివంను నియమించింది. ఈ మేరకు రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ సెప్టెంబర్ 3న ఉత్తర్వులు జారీచేశారు.

షేర్ల అమ్మకాలు

నవరత్న, మహారత్నాలుగా పిలుచుకుంటున్న సంస్థల నుంచి కొంత వాటా అమ్మివేయాలని బిజెపి ప్రభుత్వం సెప్టెంబర్ 10న నిర్ణయించింది. కోల్ ఇండియా నుంచి 5 శాతం, ఒఎన్‌జిసి నుంచి 10 శాతం , ఎన్‌హెచ్‌పిసిఎల్ నుంచి 11.36 శాతం వాటా అమ్మేయడం ద్వారా రు. 43,800 కోట్లు రాబట్టవచ్చని ప్రభుత్వ అంచనా. ద్రవ్యలోటు పూడ్చుకోవడానికి తన వద్ద ఉన్న కంపెనీల్లో వాటాలు అమ్మి రు. 43.425 కోట్లు సంపాదించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇంత పెద్ద ఎత్తున వాటాలు ఉపసంహరించడం ఇదే మొదటిసారి.

కశ్మీర్‌ను ముంచెత్తిన వరదలు

జమ్మూ కశ్మీర్‌లో సెప్టెంబర్ మొదటి వారంలో ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలు రాష్ట్రాన్ని అతలాకుతలం చేశాయి. రాష్ట్రంలోని నదులన్నీ పొంగి పొరలాయి. భారీ వర్షాల కారణంగా రెండు వేలకు పైగా గ్రామాలు అతలాకుతలం అయ్యాయి. 450 గ్రామాలు పూర్తిగా నీట మునిగాయి. ఈ కారణంగా సెప్టెంబర్ 8 నాటికి దాదాపు రెండు వందల మందికి పైగా మరణించారు. వందలాది మంది గాయపడ్డారు. 43,000 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వీ

ఇరాక్ స్కూళ్లలో ఐఎస్ఐఎస్ పెత్తనం

ఇరాక్‌లోని రెండవ పెద్ద నగరమైన మాసుల్ ప్రస్తుతం ఇస్లామిక్ స్టేట్ గ్రూప్ ఇరాక్ అండ్ సిరియా (ఐఎస్ఐఎస్) ఆధీనంలో ఉంది. ఇక్కడి స్కూళ్లలో తాము చెప్పిన పాఠ్యాంశాలనే నేర్పించాలని ఐఎస్ఐఎస్ ఆంక్షలు విధించింది. గతంలో బోధించిన చరిత్ర, సాహిత్యం, క్రైస్తవానికి సంబంధించిన అన్ని క్లాసులను రద్దుచేశారు. వీటితో చిత్రలేఖనం, సంగీతం వంటికి కూడా లేకుండా చేశారు. కొత్త విద్యా సంవత్సరం సెప్టెంబర్ 9న నుంచి ప్రారంభమైనా తల్లిదండ్రులు ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా తమ పిల్లలను బడికి పంపించడం లేదు.

స్వీడన్ ప్రధాని రాజీనామా

స్వీడన్‌లో ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కన్జర్వేటివ్ మోడరేట్ పార్టీ నాయకుడు, ప్రధాని ఫ్రెడరిక్ రీన్ ఫెల్డ్ ఓటమి పొందడంతో సెప్టెంబర్ 14న ప్రధాని పదవికి రాజీనామా చేశారు. ఈ ఎన్నికల్లో సోషల్ డెమోక్రాట్స్ నేతృత్వంలోని వామపక్ష కూటమి విజయం సాధించింది. మొత్తం పోలయిన ఓట్లలో సోషల్ డెమోక్రాటిక్ పార్టీ నేత స్టీఫాన్ లోఫెన్ నేతృత్వంలోని ప్రతిపక్ష కూటమి 47.3 శాతం దక్కించుకుంది. ప్రధాని రీన్ ఫెల్డ్ నేతృత్వంలోని అధికార కూటమికి కేవలం 39.4 శాతం ఓట్లు వచ్చాయి. రీన్ ఫెర్డ్ నేతృత్వంలోని కన్జర్వేటివ్ మోడరేట్ కూటమి స్వీడన్‌లో గత ఎనిమిదేళ్లుగా అధికారంలో ఉంది.

పాకిస్తాన్‌లో ముదురుతున్న రాజకీయాలు

పాకిస్తాన్ ప్రధానమంత్రి నవాజ్ షరీఫ్ ఎన్నికల్లో రిగ్గింగ్‌కు పాల్పడి అధికారంలోకి వచ్చారనీ, ఆయన వెంటనే తన పదవికి రాజీనామా చేయాలనీ ప్రతిపక్ష తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ పార్టీ అధ్యక్షుడు ఇమ్రాన్‌ఖాన్, ఆయన మద్దతుదారులు గత నెల రోజులుగా ఆందోళన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాజధాని ఇస్లామాబాద్‌లో 144 సెక్షన్ నిషేధాజ్ఞలను విధించారు. వేలాది మంది కార్యకర్తలతో రాజధానికి తరలవచ్చిన ఇమ్రాన్ ఖాన్‌పై ఈ నిషేధాజ్ఞలను ఉల్లంఘించారంటూ పాకిస్తాన్ పోలీసులు కేసు నమోదు చేశారు. దాదాపు పదిహేను మంది ఇమ్రాన్‌ఖాన్ మద్దతుదారులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో ఇమ్రాన్‌ఖాన్ పోలీసులు అరెస్ట్ చేసి తీసుకెళ్తున్న తన మద్దతుదారులను బలవంతంగా విడిపించుకుపోయారు. తమ విధి నిర్వహణలో ఇమ్రాన్ ఖాన్ జోక్యం చేసుకోవడాన్ని పోలీసులు ఖండిస్తూ ఆయనపై కేసు నమోదు చేశారు. ఈ పరిస్థితులలో పాకిస్తాన్ ప్రధాని నవాజ్ షరీఫ్ ఆందోళనకారులను ఉద్దేశించి వారు తక్షణమే రాజధానిలోని ప్రభుత్వ కార్యాలయాల ముందు వేసుకున్న నిరసన శిబిరాలను తొలగించి వెంటనే నగరం నుండి వెళ్లిపోవాలనీ, లేని పక్షంలో తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందనీ హెచ్చరించారు.

అఫ్ఘనిస్తాన్‌లో జాతీయ ప్రభుత్వం ఏర్పాటు

అఫ్ఘనిస్తాన్ అధ్యక్ష పదవికి పోటీ పడుతున్న అభ్యర్థులు అష్రఫ్‌ఘనీ, అబ్దుల్లా అబ్దుల్లా ఎన్నికల ఫలితాలతో సంబంధం లేకుండా దేశంలో జాతీయ ప్రభుత్వ ఏర్పాటుకు అంగీకరించారు. సెప్టెంబర్ 19న జరిగిన కాబూల్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఇరువురు నేతలు ఒక ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం అర్షఫ్‌ఘనీ అఫ్ఘన్ దేశాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తారు. అధ్యక్ష ఎన్నికల్లో వెనుకబడిన అబ్దుల్లా అబ్దుల్లా దేశ ప్రధానితో సమానమైన అధికారాలున్న నియమితులయ్యారు.

ఫ్రెంచ్ రైతుల ఆగ్రహం

ఉక్రెయిన్ సంక్షోభం నేపథ్యంలో ఐరోపా దేశాలు ఆంక్షలు విధించడంతో తమ సరకులకు ప్రధాన మార్కెట్ అయిన రష్యాకు ఎగుమతి నిలిచిపోయాయి. దీంతో ఫ్రాన్స్‌లో రైతుల వద్ద సరకులు మిగిలిపోయి తీవ్ర నష్టాలు అనుభవిస్తున్నారు. ఆగ్రహం చెందిన రైతులు ఫ్రాన్స్‌లోని బ్రిట్టనీ రాష్ట్రంలో ఉన్న మోర్లయిక్స్ పట్టణంలో ఉన్న పన్ను, బీమా కార్యాలయాలను దగ్ధం చేశారు. తమ వద్ద మిగిలిపోయిన కూరగాయలు, ఎరువుల బస్తాలను ట్రాక్టర్లలో తీసుకువచ్చి ఈ కార్యాలయాల ముందు గుమ్మరించి నిప్పంటించారు. దీంతో ఆ భవనాలు మంటల్లో కాలిపోయాయి. నానాటికీ పతనమవుతున్న ధరలతో రైతులు నష్టాల నుండి కోలుకోలేకపోతున్నారు. ఈ చర్యను ప్రధాని మాన్యువల్ వాల్స్ ఖండిరచారు.

టర్కీకి పెరుగుతున్న శరణార్థులు

ఇరాక్, సిరియాలలో ఇస్లామిక్ స్టేట్ గ్రూప్ ఇరాక్ అండ్ సిరియా (ఐఎస్ఐఎస్) దాడుల నేపథ్యంలో పొరుగున ఉన్న టర్కీకి శరణార్థుల తాకిడి పెరిగిపోతోంది. సెప్టెంబర్ 21న ఒక్కరోజే సిరియాలోని కుర్దిష్ పట్టణం కోబానే నుండి దాదాపు అరవై ఆరు వేల మందికి పైగా ప్రజలు శరణార్థులుగా టర్కీకి చేరుకున్నారు. సిరియా అధ్యక్షుడు బషర్ అల్ అసద్‌కు వ్యతిరేకంగా మూడేళ్ల క్రితం తిరుగుబాటు ప్రారంభమైన నాటి నుండి టర్కీకి ఇప్పటి వరకు దాదాపు పది లక్షల మంది శరణార్థులుగా వచ్చారని టర్కీ అధికారులు వివరిస్తున్నారు. ఇదిలా ఉండగా శరణాల్థుల ముసుగులో ఐఎస్ఐఎస్ ఉగ్రవాదులు దేశంలో చొరబడే అనుమానంతో సిరియాతో ఉన్న తమ సరిహద్దులను మూసివేస్తున్నట్లు సెప్టెంబర్ 22న టర్కీ ప్రభుత్వం ప్రకటించింది.

రష్యాపై జపాన్ ఆంక్షలు

క్రిమియా భూభాగాన్ని తమ దేశంలో కలుపుకునేందుకు ప్రయత్నించిందన్న అభియోగంపై ఐరోపా కూటమి దేశాలతో పాటు అమెరికా గత మార్చిలో రష్యాపై ఆంక్షలు విధించింది. తాజాగా జపాన్ రష్యాపై కొన్ని అదనపు ఆంక్షలు విధించింది. జపాన్‌లో సెక్యూరిటీలను జారీచేసే అంశంలో రష్యాలోని కొన్ని బ్యాంకులపై నిషేధం విధించడంతో పాటు రష్యాకు ఆయుధ ఎగుమతులను నిరోధించేందుకు వీలుగా తనిఖీలు ముమ్మరం చేసింది.

బ్రిటన్‌తోనే స్కాట్లండ్

మూడు శతాబ్దాలుగా యూనైటెడ్ కింగ్‌డమ్ నుంచి వేరుపడి స్కాట్లండ్ స్వాతంత్ర్య దేశంగా విడిపోవాలనే ఆకాంక్ష నెరవేలేదు. సెప్టెంబర్ 18న జరిగిన రెఫరెండంలో స్కాట్లండ్ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. 'స్కాట్లండ్ స్వాతంత్ర్య దేశంగా ఉండాలని కోరుకుంటున్నారా?' అన్న ప్రశ్నకు 'నో' లేదా 'ఎస్' పద్ధతిలో ఓటింగ్ నిర్వహించారు. ఈ ఓటింగ్‌లో దాదాపు నలభై రెండు లక్షల మంది స్కాట్లండ్ ప్రజలు పాల్గొన్నారు. వేర్పాటుకు వ్యతిరేకంగా 55.3 శాతం ప్రజలు ఓటు వేశారు. దీంతో స్కాట్లండ్ యూనైటెడ్ కింగ్‌డమ్‌లో భాగంగానే ఉండిపోయింది.

పశ్చిమాఫ్రికాను వణికిస్తున్న ఎబోలా

పశ్చిమాఫ్రికా దేశాలలో ప్రజలను ఇప్పుడు ఎబోలా వ్యాధి తీవ్ర భయకంపితులను చేస్తోంది. ఇప్పటి వరకు దాదాపు ఐదున్నర లక్షల మంది ఈ వ్యాధి బారినపడ్డారని అమెరికా అంచనా వేస్తోంది. వచ్చే జనవరి వరకు మరో పద్నాలుగు లక్షల మంది ఈ వ్యాధికి గురయ్యే ప్రమాదం ఉందని తెలిపింది. ఇప్పటి వరకు ఎబోలా బారినపడి దాదాపు మూడువేల మంది మరణించినట్లు అధికారిక లెక్కలు తెలుపుతున్నాయి. సియెర్రా, లియోన్, గినియా, లైబీరియా దేశాలలో గత మార్చిలో వెలుగు చూసిన ఈ వ్యాధి ఇప్పుడు నైజీరియా, సెనెగల్ దేశాలలో విస్తరిస్తోంది. ఈ వ్యాధి విస్తరణ భయంతో పొరుగు దేశాలు తమ సరిహద్దులను మూసివేయడంతో ఈ వ్యాధిని అదుపు చేసేందుకు విఘాతం కలుగుతోందని ఆరోగ్య సంస్థలు ఆందోళన తెలిపాయి. వీ

అసహజ మరణాల సూచి

సంకలనం : వై.రామచంద్రం, ఎస్. వెంకటేష్

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్ధాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషులకోసం ఇంకాస్త బాధ్యతగాను, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(1 నుండి 31 2014 వరకు తెలంగాణలోని 5 జిల్లాలు, ఆంధ్రప్రదేశ్‌లోని 6 జిల్లాలలో అసహజ మరణాల పాలైన వారి సంఖ్య 1236)

జిల్లా	ఆకలి	ఆత్మహత్యలు				చికిత్స అందక, అనారోగ్యం			గుర్తు తెలియని		హత్యలు		ప్రమాదాలు				పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
		వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు									పనిచేసే స్థలంలో	కరెంట్	రహదారి	ఇతరాలు	ఉద్యమ కారులు	ఇతరులు			
				స్త్రీ	పు.	స్త్రీ	పు.	పి.	స్త్రీ	పు.	స్త్రీ	పు.									
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)	(13)	(14)	(15)	(16)	(17)	(18)	(19)	(20)	(21)	(22)
ఆదిలాబాద్	1	3	-	4	23	18	22	12	2	1	1	1	-	1	22	27	-	-	-	1	-
హైదరాబాద్		వివరాలు అందలేదు																			
కరీంనగర్	-	4	2	-	-	2	-	1	-	-	2	5	3	6	18	10	-	-	-	1	-
ఖమ్మం	-	2	1	4	9	6	16	9	-	1	4	4	-	6	10	15	-	-	-	-	2
మహబూబ్‌నగర్	-	8	-	12	14	1	8	10	7	7	13	15	17	13	65	25	-	-	-	-	-
మెదక్	3	19	2	12	9	19	11	-	14	13	4	9	1	9	26	4	-	-	-	4	1
నల్గొండ		వివరాలు అందలేదు																			
నిజామాబాద్	-	-	-	8	13	-	1	-	5	3	4	-	-	7	18	-	-	10	-	-	-
వరంగల్		వివరాలు అందలేదు																			
తెలంగాణ	**4**	**36**	**5**	**40**	**68**	**46**	**58**	**32**	**28**	**25**	**28**	**34**	**21**	**42**	**159**	**81**	**-**	**10**	**-**	**6**	**3**
అనంతపురం	-	3	-	11	8	4	1	2	-	1	-	3	5	3	32	1	-	-	-	-	-
చిత్తూరు	-	-	-	11	8	7	3	-	-	-	12	9	11	6	24	2	-	-	-	-	-
కడప	-	1	-	8	9	1	-	-	-	-	6	2	-	6	7	-	-	-	-	-	1
కర్నూలు	వివరాలు అందలేదు																				
ప్రకాశం	-	-	-	8	6	-	2	2	3	6	1	2	5	3	27	16	-	-	-	3	-
శ్రీకాకుళం	-	-	-	9	8	4	3	1	2	6	3	1	5	2	41	22	-	-	-	-	2
విశాఖపట్నం	-	-	-	8	9	5	6	-	1	6	-	2	4	7	22	23	-	-	-	16	1
ఆంధ్రప్రదేశ్	**-**	**4**	**-**	**55**	**48**	**21**	**14**	**5**	**6**	**19**	**22**	**19**	**30**	**27**	**153**	**64**	**-**	**-**	**-**	**19**	**4**

వీక్షణం దగ్గర అమ్మకానికి ఉన్న పుస్తకాలు

ఆర్థిక వ్యవస్థ – సామ్రాజ్యవాదం

ఒక దళారీ పశ్చాత్తాపం	జాన్ పెర్కిన్స్	రు. 75
కుట్రాజకీయం	స్టీఫెన్ కింజర్	40
అభివృద్ధిని ఇలా చూద్దాం	ముదునూరి భారతి	80
కొత్తచూపు	ఆర్.ఎస్. రావు	120
ఊరి దారి	ఎన్. వేణుగోపాల్	60
రాబందు వాలిన నేల	ఎన్. వేణుగోపాల్	180
వ్యవసాయం – ప్రపంచీకరణ	కె.ఆర్. చౌదరి	100
సామాజిక విద్య – ఒకమిథ్య	ఎ. నర్సింహారెడ్డి	100
ప్రజా ఎజెండా లేని		
పార్లమెంటరీ రాజకీయాలు	ఎ. నర్సింహారెడ్డి	40
ఒక ప్రేతాత్మక కథ	అరుంధతీ రాయ్	25
సమాధిలోకి సామ్రాజ్యవాదం	డి. పాపారావు	200
కొత్తకోణం	ఎనిశెట్టి శంకర్	80
ఫారన్‌హీట్ **451**	ఎనిశెట్టి శంకర్	90
నిత్యజీవితంలో సోషలిజం	భూసారం శివన్న	100

తెలంగాణ

లేచినిలిచిన తెలంగాణ	ఎన్. వేణుగోపాల్	120
తిరగబడ్డ తెలంగాణ	ఇనుకొండ తిరుమలి	100
తెలంగాణ రాజకీయాలు	దాగ్మార్ బెర్న్‌స్టార్ఫ్, హ్యూగ్ గ్రే	80
కొత్త వంతెన	కె. శ్రీనివాస్	120

శాస్త్రవిజ్ఞానం

విశ్వాంతరాళం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
మానవ పరిణామం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
జీవకణాలూ నాడీకణాలూ	కొడవటిగంటి రోహిణీప్రసాద్	80
ప్రకృతీ – పర్యావరణం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
జీవశాస్త్ర విజ్ఞానం – సమాజం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
మనుషులు చేసిన దేవుళ్లు	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
విజ్ఞాన శాస్త్రం మనిషి విస్తరణ	జెడి బెర్నాల్	80

కులం–మతం

శూద్రవర్ణం ఎలా పుట్టింది	ఆర్.ఎస్. శర్మ	80
కులం వర్గం	బొజ్జా తారకం	30
ఎస్‌సి, ఎస్‌టి నిధులు, విధిలింపు - మళ్లింపు	బొజ్జా తారకం	40
ఎస్‌సి, ఎస్‌టిలపై అత్యాచారాలు	బొజ్జా తారకం	50
ఖైర్లాంజి	ఆనంద్ తేల్‌తుంబ్డే	100
గులాంగిరి	జోతిబా ఫూలే	40
కుల నిర్మూలన	అంబేద్కర్	30
రాముని కృష్ణుని రహస్యాలు	అంబేద్కర్	20
దళితులు – రాజ్యం	అంబేద్కర్	25
శూద్రులు – ఆర్యులు	అంబేద్కర్	8
ఆధునిక భారతదేశంలో అంటరానితనం	అంబేద్కర్	25
దాస్య విముక్తి కోసం	అంబేద్కర్	15
భారతదేశం ప్రజాస్వామ్యం	అంబేద్కర్	12
ఆంగ్లేయపాలకులు – అంటరానివాళ్లు	అంబేద్కర్	20
రాష్ట్రాలు – మైనారిటీలు	అంబేద్కర్	40
రాముని కృష్ణుని రహస్యాలు	అంబేద్కర్	20
మతతత్వంపై బాలగోపాల్	కె. బాలగోపాల్	150
దేవుని రాజకీయతత్వం	కంచె ఐలయ్య	70
నేను హిందూవు నెట్లయిత?	కంచె ఐలయ్య	80

సాహిత్య విమర్శ – వ్యాసాలు

గురజాడ దేశభక్తి	ఎన్. వేణుగోపాల్	20
మహోదయం	కె.వి.ఆర్.	200
పరామర్శ	నల్లూరి రుక్మిణి	80
సాహిత్యంపై బాలగోపాల్	కె. బాలగోపాల్	150
విరసం సాహిత్య విమర్శ	విరసం ప్రచురణ	150
కెవిఆర్ సాహిత్య వ్యాసాలు–**1**	శారదాంబ స్మారక కమిటీ	300
కెవిఆర్ సాహిత్య వ్యాసాలు–**2**	శారదాంబ స్మారక కమిటీ	250
కెవిఆర్ సాహిత్య వ్యాసాలు–**3**	శారదాంబ స్మారక కమిటీ	250
సాహిత్య సమాలోచన	కృష్ణాబాయి	300
సందిగ్ధ సందర్భం	సి.వి. సుబ్బారావు	40
సామాజికం	వి. చెంచయ్య	30
స్త్రీవాద సాహిత్యం	డా. నళిని	70
రియాలిటీ చెక్	పూడూరి రాజిరెడ్డి	250
మన ప్రపంచం	దుప్పల రవికుమార్	75

చరిత్ర–జీవిత చరిత్ర

భారత చరిత్ర పరిచయ వ్యాసాలు	డి.డి. కొశాంబి	రు. 40
ప్రాచీన భారత దేశ చరిత్ర	కె. బాలగోపాల్	50
చరిత్రలో ఏం జరిగింది?	గార్డన్ చైల్డ్	80
తరతరాల భారతదేశ చరిత్ర	రొమిల్లా థాపర్	80
ఆధునిక భారతదేశ చరిత్ర	బిపిన్ చంద్ర	100
బాబాసాహెబ్ అంబేద్కర్	బి. విజయభారతి	70
చేగువేరా	కాత్యాయని	80
ఒక సెక్స్ వర్కర్ ఆత్మ కథ	నళినీ జమీలా	50
పరాయి పాలనను ఎదిరించిన ఝూన్సీ	మహాశ్వేతాదేవి	150
నిర్జన వారధి	కొండపల్లి కోటేశ్వరమ్మ	100
ఇంట్లో ప్రేమ్‌చంద్	శివరాణీ దేవి	120
పరిచయాలు	ఎన్. వేణుగోపాల్	50
నా ప్రజాజీవితం	పెండ్యాల రాఘవరావు	50
ఆర్.ఎస్.రావు స్మృతిలో	వ్యాస సంకలనం	50
ఛత్రపతి సాహూ మహరాజ్	కాత్యాయని	40
నూరేళ్ల కాళోజీ	వరవరరావు	60
ఆకుల భూమయ్య రచనలు	తెలంగాణ విద్యార్థి గళం	40

తత్వశాస్త్రం

మార్క్సిస్ట్ సాహిత్య విమర్శ	డా. శ్రీనివాస్	100
మార్క్సిస్ట్ తత్వశాస్త్రం	న్యూవిస్టా పబ్లికేషన్స్	80
మార్క్సిజం-లెనినిజం-మావోయిజం	న్యూవిస్టా పబ్లికేషన్స్	125
లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్ ప్రచురణలు అన్ని		

విప్లవోద్యమం

పోలీసులు అరెస్ట్ చేస్తే	బొజ్జా తారకం	30
భారత్‌పై అరుణతార	యాన్ మిర్డాల్	100
జంగల్‌నామా	సత్నామ్	100
జనహృదయం జనార్దన్	సూరపనేని మోహనరావు	60
కోటి జ్ఞాపకాలు	విరసం ప్రచురణ	50
మంద్రస్థాయి యుద్ధం	విరసం ప్రచురణ	100
జగిత్యాల జంగల్‌మహల్–**1**	విరసం ప్రచురణ	75
జగిత్యాల జంగల్‌మహల్–**2**	విరసం ప్రచురణ	100
నేటి రాయలసీమ	విరసం ప్రచురణ	100
దండకారణ్యంలో గ్రీన్‌హంట్	విరసం ప్రచురణ	60
రివిజనిజం	విరసం ప్రచురణ	75
జనతన జైత్రయాత్ర	విరసం ప్రచురణ	20
అంతర్యుద్ధంలో ఆదివాసులు	విరసం ప్రచురణ	20
ఆదర్శ జీవులు అమరులు	విరసం ప్రచురణ	30
మావో రచనలు – **1**	విరసం ప్రచురణ	170
మావో రచనలు – **2**	విరసం ప్రచురణ	220

కథ – నవల

దండకారణ్యంలో కథలు(**2005–2012**)	విరసం ప్రచురణ	100
రేపు కథ	వెర్నన్ గొంజాల్విస్	20
మిగిలేటోళ్లు	బాసిత్	50
కాంత పున్నం వెన్నెల	పద్మకుమారి	20
గంగానమ్మ	విజయ	15
ఏడుతరాలు	అలెక్స్ హేలీ	80
కథలగూడు	దేవులపల్లి కృష్ణమూర్తి	60
పథేర్ పాంచాలి	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	100
చంద్రగిరి శిఖరం	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	50
అపరాజితుడు	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	100
నేల నాగలి – మూడెద్దులు	బొజ్జా తారకం	25
పంచతంత్రం	బొజ్జాతారకం	100
ఇస్మత్ చుగ్తాయి కథలు	ఇస్మత్ చుగ్తాయి	100
స్పార్టకస్	హోవార్డ్ ఫాస్ట్	80
రేపటి కల	రిచర్డ్ రైట్	50
ఒంద్రుమట్టి	నల్లూరి రుక్మిణి	170

డివిడి

వీక్షణం (2003 – 2012)	200
సృజన (1966–1992)	240
అరుణతార (1970–2013)	125
ఓ యుద్ధకాండ	100

వీక్షణం, మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3,
హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029.
ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com, www.veekshanam.wordpress.com

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 159 - October 2014 ● ISSN 2231-6892
● RNI Regn.No.APTEL/2003/11482 ● Published on 27/09/2014 ● Postal Regn. No. L II/RNP/HD/1100/2014-16

వేలాది మంది అభిమానుల కోరిక
వీక్షణంను కాపాడుకుందాం
ఎందరో శ్రేయోభిలాషులు చాస్తున్న స్నేహహస్తం
వీక్షణం మనుగడ కోసం శాయశక్తులా కృషి చేద్దాం,
మూలనిధి ఏర్పాటు చేద్దాం

వీక్షణం ఆర్థిక సమస్యల నుంచి గట్టెక్కి చిరకాలం కొనసాగాలంటే చందాదారులు, పాఠకులు పెరగాలి. ప్రతినెలా కనీసం మూడు పేజీల ప్రకటనలు రావాలి. శక్తి ఉన్న దాతలు ఇతరులకు కానుకగా చందాలు, విరాళాలు ఇవ్వాలి. వీక్షణం చిరకాలం మనుగడ సాగించడానికి వీలుగా మూలనిధి ఏర్పడాలి. ఈ విశాల సహాయ చర్యలలో భాగంగా:

- **వీక్షణం పాఠకులలో ప్రతి ఒక్కరమూ కనీసం మరొక చందా చేర్పించవచ్చు**
- **వీక్షణం పాఠకులలో ప్రతి ఒక్కరమూ మన చందాతో పాటు కనీసం రు. 100 వీక్షణం మూలనిధికి విరాళంగా ఇవ్వవచ్చు**
- **కళాశాలలను, విద్యాసంస్థలను, ప్రభుత్వ, ప్రైవేటు గ్రంథాలయాలను వీక్షణం చందాదారులుగా చేర్పించి వీక్షణం మరింత మంది పాఠకులకు చేరువయ్యేలా చూద్దాం**
- **ప్రతి న్యూస్ ఏజెంట్ దగ్గరా వీక్షణం విడిప్రతులు అమ్మకానికి ఉండే ఏర్పాట్లు చేయవచ్చు**
- **ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉన్న వీక్షణం పాఠకులు తమ బాధ్యతగా వారి సంవత్సరాదాయంలో కనీసం ఒక శాతం వీక్షణం మూలనిధికి విరాళంగా ఇవ్వవచ్చు**
- **సామాజిక జీవితంలో క్రియాశీలంగా ఉన్న, విస్తృత పరిచయాలు ఉన్న వీక్షణం అభిమానులు తమకు తెలిసిన దాతల నుంచి వీక్షణం మూలనిధికి విరాళాలు సేకరించవచ్చు**
- **విద్యాసంస్థల, ఆరోగ్య సంస్థల, సాధారణ వ్యాపార సంస్థల నిర్వాహకులతో పరిచయాలు ఉన్న అధ్యాపకులు, మిత్రులు, సామాజిక కార్యకర్తలు వీక్షణం కోసం ఆయా సంస్థల వ్యాపార ప్రకటనలు సేకరించవచ్చు**
- **వీక్షణం ప్రచారం కోసం, ఆర్థిక సహాయం అర్థించడం కోసం మీ ప్రాంతాలలో సమావేశాలు ఏర్పాటు చేయవచ్చు**

వివరాలకు

వీక్షణం, మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3,
హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029. ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com, www.veekshanam.wordpress.com

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Deccan Press for Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020 and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao